వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 8 హైదరాబాద్ 109 ఆగస్ట్ 2010 పేజీలు : 60 రు. 10

✱ ఫోకస్ : వ్యవసాయ రంగం - నేటి పరిస్థితి

✱ సోంపేట ప్రజా ప్రతిఘటన ఆదర్శం

✱ బాబ్లీ - తెలంగాణ ఉప ఎన్నికలు

✱ మావోయిస్టులు కోరేదేమిటి?

✱ మైనింగ్ దోపిడీకి పాలకుల వత్తాసు

✱ ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు నిరాధార్

✱ కుల పంచాయితీలు - పరువు హత్యలు

వీక్షణంలో వ్యాపార ప్రకటనల గురించి....

వీక్షణంలో అచ్చవుతున్న ప్రభుత్వ ప్రకటన గురించి, ఇటీవల అచ్చయిన కొన్ని వ్యాపార ప్రకటనల గురించి కొందరు గౌరవనీయ మిత్రులు తమ అభ్యంతరాలను, సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. అటువంటి అభ్యంతరాలే, సందేహాలే మరికొందరు మిత్రులలో, అభిమానులలో కూడ ఉండవచ్చు.

ఏ పత్రిక అయినా అచ్చువేసే వ్యాపార ప్రకటనలతో ఆ పత్రికకు ఏకీభావం ఉండాలనే నియమమేమీలేదు. ఆ వ్యాపార ప్రకటనలను స్వీకరించడమా లేకపోతే, నడపడానికి తగిన ఆర్థిక వనరులు లేక పత్రిక మూసివేయడమా అనే సవాలు వచ్చినప్పుడు చాలా పత్రికలు ప్రకటనలు స్వీకరిస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం అమ్మకాల ఆదాయం మీద మాత్రమే ఆధారపడి ఏ పత్రికా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పత్రిక ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మాత్రమే పూరించగలుగుతుంది. అందువల్లనే చాలా పత్రికలు సాధారణంగా వ్యాపార ప్రకటనల ద్వారా ఆ లోటును పూరించుకోవడం మాత్రమే గాక లాభాలు కూడ చేసుకుంటాయి. వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలకు లాభాలేమీ అవసరం లేదు. పత్రిక ఉత్పత్తి వ్యయం, సిబ్బంది కనీస జీతభత్యాలు లాంటి మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులయినా కావాలి. అందుకోసం కొన్ని వ్యాపార ప్రకటనలనయినా అంగీకరించకతప్పడం లేదు.

ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలన్నిటినీ పెద్ద పత్రికలు, పాలకపార్టీ ఆశ్రిత పత్రికలు, పైరవీకారులు కబ్జా చేస్తున్నారని, ఆ ప్రకటనల విధానంలో పారదర్శకత ఉండాలని, చిన్న పత్రికలకు ప్రాధాన్యత ఉండాలని ఎంతో కాలంగా ఆందోళన జరిగిన ఫలితంగా కొన్ని సంవత్సరాల కింద ప్రభుత్వ ప్రకటనలలో చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంతభాగం కేటాయించాలనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. అందువల్ల వీక్షణంకు వస్తున్న ప్రభుత్వ ప్రకటన చిన్న పత్రికల హక్కుగా వస్తున్నదే తప్ప వీక్షణంలో అచ్చయ్యే రచనల మీద ప్రభావం వేయగలిగినది కాదు. నిజానికి ఆ ప్రకటన వల్ల వీక్షణం తన వైఖరిలో ఎప్పుడయినా ఏ మెతకవైఖరినయినా ప్రదర్శించి ఉంటే ఎవరయినా దాన్ని ఎత్తిచూపి సరిదిద్దవచ్చు. ఆ ఇచ్చే ఒక్క ప్రకటన కూడా ప్రతి సంచికకూ ఇవ్వడం లేదు. ఆ ప్రకటన ఉన్నప్పుడు కూడా వీక్షణం లోటులో మూడోవంతు మాత్రమే పూరించ గలుగుతుంది. ప్రతి నెలా కనీసం మరి రెండు ప్రకటనలు వేస్తే గానీ వీక్షణం ఆదాయ వ్యయాలు సమానం కావు.

పత్రిక నిర్వహణ కొరకు వ్యాపార ప్రకటనలను స్వీకరించకతప్పని దుస్థితిలో అవి రచనల మీద ప్రభావం వేయకుండా జాగ్రత్త పడడం తప్ప ప్రస్తుతానికి మరేమీ చేయగల అవకాశం లేదు. వ్యాపార ప్రకటనలను ఎంతమాత్రం స్వీకరించబోమని ప్రకటించాలంటే పత్రికకు విస్తారమైన ప్రజాసంఘీభావం ఉండాలి. అది ఆర్థిక స్వావలంబనగా మారగలిగిన స్థితి ఉండాలి. లేకపోతే కొంతకాలం విరాళాల మీదనో, అప్పుల మీదనో నడిపి ఆ తర్వాత పత్రికను ఆపివేయడం మినహా మరోమార్గం లేదు. ఈ అంశాలను పాఠకుల, అభిమానుల దృష్టికి తీసుకురావడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040-66843495, సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www:veekshanam.wordpress.com

109

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

ఆగస్ట్ 2010
సంపుటి : 8
సంచిక : 8

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
3 సంవత్సరాల చందా	రు.	350
5 సంవత్సరాల చందా	రు.	550
10 సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం అకౌంట్ నెంబర్ –
013911011002175
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్,
హైదరాబాద్

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
92468 26191

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

సోంపేట ప్రజా ప్రతిఘటన నేర్పే పాఠం

సోంపేట ప్రజలు చూపిన ప్రతిఘటన ఆదర్శప్రాయమైనది, అనుసరణీయమైనది. అభివృద్ధి పేరుతో పాలకవర్గాలు తమ జీవితాల మీద, జీవనోపాధుల మీద, ప్రకృతి వనరుల మీద అత్యంత దుర్మార్గంగా దాడి చేస్తున్నప్పుడు ప్రజల ప్రతిస్పందన, ప్రతిఘటన ఎంత విస్తృతంగా, తీవ్రంగా, పట్టుదలతో ఉండాలో సోంపేట ప్రజలు, ముఖ్యంగా మహిళలు, చూపారు. రాష్ట్రంలో గత కొద్ది సంవత్సరాలుగా ప్రపంచీకరణ విధానాలతో ప్రభుత్వాలు ప్రజలమీద నిర్విరామంగా దాడులు చేస్తూ ఉంటే ప్రజాప్రతిఘటన అందుకు దీటుగా ఉండడం లేదని చాలమందిలో ఉన్న నిరాశను, సందేహాలను సోంపేట ప్రజలు తమ వీరోచిత ప్రతిఘటన ద్వారా తుత్తునియలు చేశారు. పోలీసుకాల్పులలో ఇద్దరు మరణించడం విచారకరమే అయినప్పటికీ సోంపేట ప్రజాపోరాటం ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. నందిగ్రామ్, సింగూరు, కళింగనగర్‌ల వరుసలో సోంపేట ఒక దిక్సూచిగా మిగులుతుంది. సోంపేట ప్రజా ప్రతిఘటన ఇవాళ్టి రాజకీయార్థిక విధానాల గురించి, పాలన గురించి, ప్రజల ప్రతిస్పందన గురించి తెలుసుకోవలసిన విషయాలెన్నో నేర్పుతున్నది. సోంపేటలో కొట్టవచ్చినట్టు కనిపించే దృశ్యం ఏమంటే పాలకులు మొదటినుంచీ అబద్ధాల మీద, మోసం మీద, వంచన మీద, తమ బొక్కసాలు నింపుకోవడం మీద ఆధారపడ్డారు. ప్రజల మీద దుర్మార్గమైన అణచివేతకు దిగారు. మరొకవైపు ప్రజలేమో నిజాల మీద ఆధారపడ్డారు. సంఘటితశక్తి మీద ఆధారపడ్డారు. తమ జీవనోపాధిని, ప్రకృతిని కాపాడుకోవడం కోసం ప్రాణాలకు తెగించి పోరాడారు. అన్నిరకాల నిరసన, పోరాట రూపాలను ప్రయోగించారు. వీర గున్నమ్మ నాటినుంచి శ్రీకాకుళ పోరాటం దాకా ప్రాంతీయ చారిత్రక వారసత్వంగా అందిన పోరాట సంప్రదాయాన్ని కొనసాగించారు. అంటే సోంపేటలో స్పష్టంగా ఒకవైపు అధర్మం, అక్రమం, దుర్మార్గం ఉండగా మరొకవైపు ధర్మం, న్యాయం, ప్రతిఘటన నిలిచాయి. ప్రభుత్వం, అధికార పీఠాల మీద ఉన్నవాళ్లు, ప్రస్తుత అభివృద్ధి విధానాల వల్ల లాభాలు పొందేవాళ్లు పచ్చి అబద్ధాలు చెపుతూనే ఉంటారు. కాని ప్రజలు ఆ అబద్ధాల లోగుట్టు తెలుసుకోవలసి ఉంది. విప్పి చెప్పవలసి ఉంది. మొట్టమొదటి అబద్ధం విద్యుత్తే అభివృద్ధికి సూచిక అనేది. ఆధునిక మానవ జీవితంలో విద్యుత్తు ప్రధాన పాత్ర వహిస్తుందన్న మాట నిజమే గాని, ఒక విద్యుత్ ప్రాజెక్టు దానికదిగా అభివృద్ధీ కాదు, అవసరమూ కాదు. ఉత్తరాంధ్రలోనూ, సరిహద్దు అవతలి ఒడిషాలోనూ ఖనిజాల తవ్వకానికీ, వాటి శుద్ధికీ లెక్కలేనంత విద్యుత్తు కావాలి. ఈ విద్యుత్ ప్రాజెక్టులన్నీ అందుకోసమే కాని స్థానిక ప్రజావసరాల కోసం కాదు. గనుల నుంచి అతి తక్కువ దూరంలో ఉండి, సముద్ర తీరానికి దగ్గరగా ఉండే శ్రీకాకుళం జిల్లాను ఎంచుకున్నది అందువల్లనే. ఆ తర్వాత కూడ అబద్ధాల మీద అబద్ధాలు. ఉన్న చిత్తడినేల బీల లేదన్నారు. పంటపొలాలు లేవన్నారు. మనుషులు లేరన్నారు. ఒకరో ఇద్దరో ఉన్నా వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఇదంతా పారిశ్రామికాభివృద్ధికేనని నమ్మబలికారు. ప్రజల అభివృద్ధికేనన్నారు. కాని ప్రజలు తమ అద్భుతమైన, సహజమైన వివేకంతో, విజ్ఞానంతో ఈ ప్రతి ఒక్క తప్పునూ అబద్ధాన్నీ బద్దలు కొట్టారు. ఇది అసలు అభివృద్ధే కాదన్నారు. ఈ అభివృద్ధి తమకు అవసరం లేదన్నారు. తరతరాలుగా తమ సాగునీటి, తాగునీటి అవసరాలు తీరుస్తున్న, మత్స్యసంపదను ఇస్తున్న బీలనూ తంపరనూ చూపారు. పంటపొలాలను చూపారు. ఈ ప్రాజెక్టులవల్ల లక్షలాది ప్రజల జీవనం ఎలా బుగ్గి అయిపోతుందో చూపారు. ప్రాజెక్టులు కల్పించే ఉపాధి ఎంత బూటకమో చూపారు. తమ మానాన తమను బతకనివ్వమన్నారు. పాలకుల అబద్ధాల వెనుక దాగిన స్వార్థ ప్రయోజనాలను విప్పిచెప్పారు. స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులనబడేవాళ్లు, రెవెన్యూ, పోలీసు అధికారులు నాగార్జున కన్ స్ట్రక్షన్స్ అనే ప్రైవేటు వ్యాపారసంస్థ చేతిలో ఎట్లా బానిసలుగా మారిపోయారో చూపారు. ఇదంతా కేవలం మేధో కసరత్తు మాత్రమే కూడ కాదు. నిత్య జీవిత ఆచరణగా మార్చుకున్నారు. ఎనిమిది నెలలుగా శిబిరం నిర్వహిస్తున్నారు, ప్రచారాలు చేస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలనూ, ప్రజాసంఘాలనూ కలిశారు. విన్నవాళ్లదగ్గరా, విననివాళ్లదగ్గరా తమ గోడు వెళ్లబోసుకున్నారు. అన్ని రకాల నిరసన రూపాలు చేపట్టారు. ఎనిమిది నెలల అహింసాయుత పోరాటపు వైఫల్యాన్ని చెప్పకనే చెప్పారు. ఇంత చేసినా అధర్మం ఇంకా ముందుకు దూసుకువస్తుంటే ఏం చేయాలి? ప్రాజెక్టు నిర్మాణం కూడ ప్రారంభమైపోతుంటే, అదికూడ, చట్టబద్ధంగా రావలసిన అనుమతులు రాకుండానే జరిగిపోతుంటే, పోలీసులూ, కంపెనీ గూండాలూ పక్కన నిలబడి ఈ చట్టవ్యతిరేక నిర్మాణానికి బందోబస్తు కల్పిస్తుంటే మరేం చేయాలి? ఇక ఆ బీలలో అడుగుపెట్టనిచ్చేది లేదని అడ్డుపడ్డారు. లాఠీలనూ, బాష్పవాయువునూ ఎదుర్కొన్నారు. ఒకరిని కాల్చి చంపితే ఆ మృతదేహంతో మళ్లీ నిరసన తెలిపారు. మరొకరిని చంపి నిషేధాజ్ఞలు విధిస్తే, వాటిని కూడ ధిక్కరించి నిరసన కొనసాగించారు. పాలకుల ఆస్తులను ధ్వంసం చేశారు. ఇప్పటికీ తమ నేలలోకి ప్రాజెక్టును రానిచ్చేది లేదని దృఢంగా, స్థిరంగా ప్రకటిస్తున్నారు. సోంపేట నుంచి నేర్చుకోవలసిన పాఠం ఇదే. దుర్మార్గమైన పాలక విధానాలకు వ్యతిరేకంగా దృఢమైన, స్థిరమైన, విస్తృతమైన ప్రతిఘటన మాత్రమే ఇవాళ ప్రజల ముందున్న ఏకైక మార్గం. వీ

మావోయిస్టులతో చర్చలు - ఆజాద్ హత్య

'దేశంలో అతి ప్రధానమైన అంతర్గత భద్రతా సమస్య' అని ప్రధాని మన్మోహన్ సింగ్ మావోయిస్టుల గురించి 2007లో వ్యాఖ్యానించిన తర్వాత అన్ని రాజకీయ పక్షాలకూ, ప్రధాన స్రవంతి ప్రచారసాధనాలకూ కూడ మావోయిస్టుల గురించి మాట్లాడక తప్పని స్థితి వచ్చింది. నలభై సంవత్సరాలుగా ప్రజల అధికారం కోసం, ప్రత్యామ్నాయ రాజకీయార్థిక విధానాల కోసం పోరాడుతున్న నక్సల్బరీ పంథా ప్రజా ఉద్యమం గురించి దేశమంతా ఆలోచించక, చర్చించక తప్పని స్థితి వచ్చింది. ప్రభుత్వాలు ఏమనుకున్నా, ఎంత దమననీతిని ప్రదర్శించినా ఆ ప్రజా ఉద్యమం నానాటికీ విస్తరించింది. ఆ ఉద్యమానికి విభిన్న ప్రజా సమూహాల్లో ఆదరణ పెరుగుతోంది. అందువల్లనే కేంద్రప్రభుత్వం కూడ ఒకవైపు ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఏకీకృత కమాండ్, పారామిలిటరీ బలగాల మోహరింపు, మానవ రహిత విమానాల వాడకం, సైన్యాన్ని మోహరించడం వంటి దమనకాండకు సన్నాహాలు చేస్తూనే మరొకవైపు మధ్యతరగతిని, పౌర సమాజాన్ని భ్రమల్లో ముంచడానికి మావోయిస్టులతో చర్చలకు సిద్ధమేనని ప్రకటిస్తోంది. ఆ మాటలు నిజమేనని నమ్మిన పౌరసమాజ ప్రముఖులు కొందరు చర్చల ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆ ప్రక్రియలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అధికార ప్రతినిధి ఆజాద్ భాగం పంచుకున్నారు. ఆ విషయంలో తమ పార్టీ అభిప్రాయాలను వివిధ పత్రికల ఇంటర్వ్యూలలో తెలియజేయడమే కాక, ఆ ప్రయత్నాలు చేస్తున్న స్వామి అగ్నివేష్‌కు లేఖ కూడ రాశారు. ఆ లేఖ రాసిన నెల రోజులకే ఆజాద్‌ను, ఒక స్వతంత్ర పత్రికా రచయితను పట్టుకుని, కాల్చిచంపి, ఎన్‌కౌంటర్‌గా ప్రకటించడం జరిగింది. అంటే ప్రభుత్వానికి ఈ చర్చల పట్ల చిత్తశుద్ధి లేదని స్పష్టంగా కనబడుతున్నది. చర్చల వల్ల ఏదో జరిగిపోతుందని మావోయిస్టు పార్టీ కూడ భావించలేదని ఆజాద్ లేఖ ద్వారా తెలుస్తున్నది. కాని ఆ లేఖలో ఆయన రాసిన ఒక వాక్యం ('మనదేశపు ఆదివాసీ సమాజ జీవితం ఎదుర్కొంటున్న ఇటువంటి కీలకస్థితిలో ఏ ఒక్కరూ జయాపజయాల గురించి ఆలోచించగూడదు. ఆదివాసుల మనుగడకు హామీపడే పరిస్థితులను సృష్టించడమే ఇప్పుడు చేయవలసిన పని') ఈ దేశంలో ప్రజల పట్ల ఆ పార్టీకి ఉన్న ప్రేమకు నిదర్శనంగా ఉన్నది. మరొకవంక ప్రజల మీద, ముఖ్యంగా ఆదివాసుల మీద బాంబులు వేసి అయినా సరే ఆ ప్రాంతాలను ఖాళీ చేసి బహుళజాతి సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. వార్తల, విశ్లేషణల ప్రకారం ఆజాద్ అత్యంత ప్రతిభావంతుడైన మేధావి అని, అతి సునిశితమైన విశ్లేషకుడని తెలుస్తున్నది. అంటే ఆయన భారత ప్రజల సంపదలో భాగమన్నమాట. భారత ప్రజల ఖనిజ సంపదను, సహజవనరులను, శ్రమఫలితాన్ని దోచుకుంటున్న శక్తులే భారత ప్రజల మేధోసంపదను కూడ నిర్మూలిస్తున్నాయని ఈ ఉదంతంతో అర్థమవుతున్నది. నాయకుల మరణం ప్రజా ఉద్యమాలకు తాత్కాలిక లోటు కావచ్చు గాని, ప్రజలు ఆ లోటును పూరించుకుని కొత్త నాయకులను సృష్టించుకుంటారనీ, మరింత ముందుకు సాగి అంతిమ విజయం సాధిస్తారనీ చరిత్ర చూపుతున్నది.

భారత్ - పాకిస్తాన్ శత్రుత్వం ప్రజలకు ప్రమాదకరం

భారత దేశానికీ పాకిస్తాన్‌కూ మధ్య శత్రుత్వం రెండు దేశాలకూ మంచిది కాదు. నిజానికి ఈ రెండు దేశాల మధ్య, ఈ రెండు దేశాల ప్రజల మధ్య శత్రుత్వం లేదు, ఉండనవసరం లేదు. తమ ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి పక్కకు తప్పించడానికి రెండు దేశాల పాలకులకూ ఒక ఊహాజనిత శత్రువు, ఒక దిష్టిబొమ్మ అవసరమైన నేపథ్యంలోనే ఈ శత్రుత్వాన్ని పెంచి పోషించడం జరుగుతోంది. అరవై సంవత్సరాలుగా ఈ శత్రుత్వ చిచ్చును ఆరిపోకుండా రెండువైపులా రగిలిస్తున్నారు. ఈ శత్రుత్వాన్ని బలపరచడానికి కాశ్మీర్ వంటి చారిత్రక కారణాలు ఉండనే ఉన్నాయి. పాలకులకు అవసరమైన పని చేసిపెట్టడానికి, కవ్వింపు చర్యలు చేయడానికి మత ఛాందస శక్తుల నుంచి ఆయుధ వ్యాపారుల దాకా ఎందరెందరో పొంచి కూచున్నారు. పాలకులు ఉద్దేశపూర్వకంగానే ఈ శత్రుత్వాన్ని రెచ్చగొడుతున్నప్పుడు, పైకి చూడడానికి శత్రుత్వాన్ని తగ్గించే చర్చల ప్రక్రియగా కనబడేదానికి అర్థం లేదు. ముంబాయి మీద దాడి జరిగిన నవంబర్ 26, 2008 తర్వాత దాదాపు ఆగిపోయిన ఈ సంభాషణల ప్రహసన ప్రక్రియను ప్రస్తుతం మళ్లీ ప్రారంభించారు. ఏడాదిన్నర తర్వాత మళ్లీ ఒకసారి ఇస్లామాబాద్‌లో చర్చలు మొదలయ్యాయి. ఇరు దేశాల విదేశాంగ శాఖ మంత్రుల స్థాయిలో జూలై 15-16ల్లో జరిగిన చర్చలు మళ్లీ పరస్పర ఆరోపణలు - ప్రత్యారోపణలతో, ఆకుకు అందని పోకకు పొందని వాదనలతో ముగిసిపోయాయి. వాస్తవికంగా, ఆచరణాత్మకంగా ఉద్రిక్తతలు తగ్గించే ప్రయత్నమేదీ జరగలేదు. భారత పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తత పాకిస్తాన్‌కు ఏమి మేలు కీడు చేస్తుందో తెలియదు గాని, భారత ప్రజలకు మాత్రం చాల ప్రమాదకరమైనది. అది భారత ప్రజల ఖజానా నుంచి సంక్షేమంకోసం ఖర్చు కావలసిన వేల కోట్ల రూపాయలను రక్షణ వ్యయంగా మార్చి అంతర్జాతీయ ఆయుధ బేహారుల బొక్కసాలు నింపుతుంది. ఆ ఆయుధ కాంట్రాక్టుల నుంచి ఎంగిలి మెతుకులకు ఆశ పడుతున్న రాజకీయ నాయకులకు ఆర్థిక బలాన్ని సమకూర్చి పెడుతుంది. దేశంలో పాకిస్తాన్ వ్యతిరేకతను, ఆ పేరుతో ముస్లింల పట్ల వ్యతిరేకతను పెంచి పోషిస్తూ సామాజిక జీవనాన్ని అల్లకల్లోలం చేస్తుంది. దేశవ్యాప్తంగా కల్పిస్తున్న సమస్యలు అలా ఉంచి, ప్రత్యేకించి, కాశ్మీరీ సమాజానికి ఈ పాకిస్తాన్ - భారత శత్రుత్వం కల్పిస్తున్న సమస్యలకు అంతూ పొంతూ లేదు. వేలాది మంది కాశ్మీరీ యువకులను భారత పాలకులు నిష్పూచీగా ఊచకోత కోయడానికి, కనీసం ముప్పై సంవత్సరాలుగా అక్కడ సైనిక పాలన నెలకొల్పి, మొత్తం లోయను నిర్బంధ శిబిరంగా మార్చడానికి, కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వ గద్దెమీద కీలుబొమ్మ పాలకులను కూచోబెట్టడానికి భారత పాలకులకు అవకాశం ఇస్తున్నది ఈ శత్రుత్వమే. ఈ శత్రుత్వం వెంటనే సమసిపోవాలని, అలా సమసిపోయే దిశగా భారత పాకిస్తాన్ చర్చలు జరగాలని, దక్షిణాసియాలో అర్థవంతమైన శాంతి నెలకొనాలని ప్రజా ఉద్యమం నిర్మించవలసిన బాధ్యత భారత ప్రజల మీద ఉంది. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : వ్యవసాయరంగం - నేటి స్థితి

ఆధునిక పరిజ్ఞానం, అధికోత్పత్తి, ప్రపంచీకరణల పేరిట అమలవుతున్న విధానాల వల్ల ఒకప్పుడు స్వయం పోషక సమాజాల్ని నిర్మించుకున్న వ్యవసాయ రంగం నేడు పరాధీనమై ఆ రంగం నుండి దూరం చేస్తున్న పరిస్థితి. ప్రత్యామ్నాయ రంగం కనిపించక నమ్ముకున్న వ్యవసాయం దెబ్బతీస్తున్నందున ఎటూ దిక్కు తోచని పరిస్థితిని నేటి రైతాంగం ఎదుర్కొంటుంది. ఒకప్పుడు భద్రతనిచ్చిన రంగం నేడు అభద్రతనిస్తుంది. అలాంటి వ్యవసాయరంగంలో రైతులు నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటూ చివరికి ఆత్మార్పణలకు సిద్ధపడాల్సిన పరిస్థితి వచ్చింది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028








- **కారడివిలో కామ్రేడ్స్‌తో** – అరుంధతీరాయ్ – (తెలుగు అనువాదం : పి. వరలక్ష్మి) – మలుపు ప్రచురణ – 40 పేజీలు, 1/5 క్రౌన్, రు. 25, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్

- **లక్ష్మణరేఖ** – సాహిత్య విమర్శపై వ్యాసాలు – డా. లక్ష్మణ చక్రవర్తి, 184 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : శ్రీమతి సి.ఎచ్. గోదాదేవి, ఇ.నెం. 2–3–402, కృష్ణానగర్ కాలనీ, మచ్చబొల్లారం, అల్వాల్, సికిందరాబాద్ – 500 010, ప్రముఖ పుస్తక షాపుల్లో

- **మార్కెట్ స్మార్ట్ శ్రీమతి** – దీర్ఘ కవిత – అనిశెట్టి రజిత – 24 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: అనిశెట్టి రజిత, ఇ.నెం. 3–12–60, కుమార్‌పల్లి, హనుమకొండ; సెల్ : 9849482462; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

- **తుఫానులకెదురు నడవరా...** – ఎస్.ఎం. ప్రాణ్‌రావు – రమణ పబ్లికేషన్స్, 60 పేజీలు, 1/8 డెమీ, రు. 10

- **అందం** – ఎస్.ఎం. ప్రాణ్‌రావు – రమణ పబ్లికేషన్స్, 108 పేజీలు, 1/8 డెమీ, రు. 30

  పై రెండు ప్రతులకు : ఎస్.ఎం. ప్రాణ్‌రావు, 9–14/1, రవీంద్రనగర్ కాలనీ, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007; ఫోన్ : 9885679096; 040 – 27170319, ప్రముఖ పుస్తక షాపుల్లో

- **శ్రీశ్రీ అన్వేషణ** – ఎన్. వేణుగోపాల్ – శ్రీశ్రీ సాహిత్య నిధి, 31 పేజీలు, 1/8 డెమీ, రు.20, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతినగర్, విజయవాడ – 520004; ఫోన్ : 0866–6640595, ఫ్యాక్స్ : 0866–6697375, సెల్ : 9848504649, 9246277375; ఇ–మెయిల్ : srisri_sahityanidhi@yahoo.com

- **దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర (1980–2009)** – శబరి కూర్పు – విరసం ప్రచురణ – 293 పేజీలు, 1/8 డెమీ, రు. 50,


- **ప్రజాయుద్ధంలో నేలకొరిగిన ఉత్తర తెలంగాణ మహిళా అమరుల జీవిత చరిత్రలు** – విరసం ప్రచురణ, 149 పేజీలు, 1/8 డెమీ, రు. 35

- **కొ.కు. సమకాలీనత** – విరసం ప్రచురణ, 156 పేజీలు, 1/8 డెమీ, రు. 50

  పై మూడు ప్రతులకు : సహచర బుక్‌షాప్, దిశ పుస్తక కేంద్రం, నవోదయ పబ్లిషింగ్ హౌస్, నవయుగ పబ్లిషింగ్ హౌస్

- **తెలుగువారి చరిత్ర (క్రీ.పూ. 300 – క్రీ. శ. 2010) వేర్పాటువాదం** – డా. దగ్గుబాటి వెంకటేశ్వరరావు – నివేదిత పబ్లికేషన్స్ – 191 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు






వీక్షణంలో వస్తున్న విషయాలు ప్రజా దృక్పథంతో ఉండడం వలన విజ్ఞానదాయకంగా ఉన్నాయి. కాని పత్రిక వెనుక అట్టపై రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటన, దానిలో సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, రాజశేఖర రెడ్డి, రోశయ్యల ముఖచిత్రాలు, రాజీవ్‌గాంధీ ముఖచిత్రంను వీక్షణం లాంటి పత్రికలు ముద్రించి పాఠకుల ముందు పెట్టడం అంత భావ్యం కాదేమో ఆలోచించగలరు. ఒకపక్క ఈ ప్రభుత్వమే ప్రజల రక్త మాంసాలను పిండుకొని తమ పబ్బం గడుపుకొని ప్రజలను నిలువునా మద్యపానీయాల్లోను, గుట్కా, జర్దా, పాన్ పరాగ్, గంజాయి, పొగాకు వంటి మత్తు పదార్థాల అమ్మకాలకు లైసెన్సులిచ్చి ఆ మత్తు పదార్థాల అమ్మకాలపై ఆధారపడి ప్రజల ఆరోగ్యాలతో, జీవితాలతో చెలగాటమాడుతూ, మరో పక్క సంక్షేమ పథకాలను ఊదరగొట్టి ప్రచారం చేసుకోవడం, దానికి వీక్షణం లాంటి పత్రిక సహకరించడం, పత్రిక నిజాయితీకి కాసింత దెబ్బ తగులుతుందేమో ఆలోచించగలరు. ఇది ఒక సహృదయ స్పందనే తప్ప ఇంకా వేరే ఏమీ కాదు. ఎన్‌కౌంటర్ హత్యలతో, లాకప్ హత్యలతో, గిరిజన స్త్రీలను అత్యాచారాలు చేయించి, గ్రీన్‌హంట్ పేరుతో ఆదివాసులకు నిలువ నీడ లేకుండా చేసే ఈ రాజకీయ ప్రభుత్వ నేతల ముఖచిత్రాలను వీక్షణం పత్రిక ప్రచురించకుండా ఉంటే బాగుంటుందేమో ఆలోచించండి. వీక్షణం పత్రిక విలక్షణంగానే ఉంచండి. ప్రజా వ్యతిరేక ప్రజా హంతక చరిత్ర గలవాళ్ల ముఖ చిత్రాలు వీక్షణం పత్రికలో రాకుండా చూడగలరని మరోసారి విజ్ఞప్తి చేస్తూన్నాను.

– *ఒక పాఠకుడు*
విశాఖపట్టణం

భోపాల్ దుర్ఘటన తీర్పు నేపథ్యంలో జూలై సంచికలో 'భోపాల్ బయటపెడుతున్న అసలు సంగతి' వ్యాసం అసలు నిజాల్ని బయట పెట్టింది. ఈ దేశంలోని పాలకులకు, న్యాయమూర్తులకు అల్పప్రాణుల ప్రాణాలంటే చీమకుట్టినట్లయినా లేదని ఈ తీర్పు బయటపెట్టింది. జస్టిస్ కృష్ణ అయ్యర్ ఒక వ్యాసంలో ఈ దురంతాన్ని హిరోషిమాతో పోలుస్తూ 'భోపోషిమా' అన్నాడంటే ఎంతటి విషాదాన్ని ఈ దుర్ఘటన మిగిలించిందో తెలుస్తుంది. అరుంధతీ రాయ్ స్వానుభవం ఆపరేషన్ గ్రీన్‌హంట్ పట్నపు అవతారం పాలకుల పైచికపు పోకడలకు, అబద్ధపు రాతలకు అద్దం పడుతుంది. ఆమె లాంటి ధైర్యమున్న సామాజిక కార్యకర్తలు నేటి సమాజానికి చాలా అవసరం. పర్యావరణ సంక్షోభం పై రాసిన వ్యాసాలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి.

– *పి. నారాయణరెడ్డి*
గురుకుల డిగ్రీ కళాశాల, నాగార్జునసాగర్

ఫోకస్‌లో మంచి మంచి అంశాల్ని, సమస్యల్ని పరిష్కరించి, ఆలోచించే దిశగా ప్రచురించే చర్యలు చేపట్టడం అభినందనీయం.

– *ఎన్. భగవాన్ రెడ్డి*
సిద్దిపేట్, మెదక్

సి.ఐ.ఐ. అనేది బడా పెట్టుబడిదారులు, ధనికులు, పారిశ్రామికులు, వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న ఒక 'ఉన్నవారి క్లబ్బు' అని మామూలుగా తెలిసిన సంగతి. అటువంటి సంస్థకు యూరప్‌లో ఉన్నత స్థానంలో పనిచేసిన ఒక వ్యక్తికి ఈ దేశంలో పరిశ్రమలు గానీ, వ్యాపారం గానీ, రాజకీయాలు గానీ ఎట్లా నడుస్తున్నాయో బాగా తెలిసి ఉంటుంది. అంటే ఆయన మాట్లాడిన దాంట్లో నూటికి డెబ్భై పాళ్లైనా నిజాలు ఉంటాయని అనుకోవాలి. జూలై సంచికలో 'ఈ జాతి అచేతనంగా ఉందా?' అని అటువంటి సి.ఐ.ఐ. మాజీ అధికారి మోహన్‌మూర్తి రాసిన వ్యాసం కళ్లు తెరిపించేలా ఉంది. అటువంటి వ్యక్తి భారతదేశంలోని లంచగొండితనం గురించి వ్యాసం రాయడమంటే స్వయంగా తాను చేసిన పనులను కూడా చెప్పుకుంటున్నట్టే. ప్రస్తుతం యూరప్‌లో స్థిరపడినప్పటికీ యూరప్‌లో మన అధికారుల మీద, రాజకీయ నాయకుల మీద, వ్యాపారుల మీద ఎటువంటి అభిప్రాయాలు ఉన్నాయో ఆయన వివరించారు. సిగ్గు కలిగిందని ఆయన చెప్పారు గానీ, నిజానికి సిగ్గుపడవలసింది మనందరమూ. ఇటువంటి లంచగొండులయిన దేశ సంపదలను మెక్కి తెగబలిసిన రాజకీయ, పారిశ్రామిక, వ్యాపార, అధికార యంత్రాంగాన్ని సహిస్తున్న మనలో ప్రతి ఒక్కరం మనను మనం ప్రశ్నించుకోవాలి. ఈ కుళ్లును కడగడానికి మనం మన బాధ్యతగా ఏం చేస్తున్నాం?

– *కె. రాజమల్లు*
వేములవాడ, కరీంనగర్

కొన్ని సంవత్సరాల కింద ఒక నవల రాసి, బుకర్ ప్రైజ్ అనే కోట్లాది రూపాయల బహుమతి గెలుచుకొని, ఆ నవలలో కమ్యూనిస్టు వ్యతిరేక అభిప్రాయాలు రాసినందుకు విమర్శలకు గురయిన అరుంధతీ రాయ్ ఇటీవలి కాలంలో ప్రజల సమస్యల మీద స్పందిస్తున్నారు. సంతోషం. ప్రజల కొరకు చిన్నపాటి పనిచేసినా, సర్కారుకు ఎంత కోపం వస్తుందో ఆమెకు అర్థం అవుతున్నట్టు ఉంది. వీక్షణం జూలై సంచికలో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్ పట్నపు అవతారం' లో ఆమె తనకు ఎదురైన వేధింపులను చెప్పారు. అందులోనే 'నా అంత ప్రముఖులు కాని కార్యకర్తలకూ, రాజకీయ వాదులకూ ఏం జరుగుతున్నదో ఊహించండి. జైళ్లలో కుక్కబడిన, చిత్రహింసలకు గురైన, చంపివేయబడిన వందలాది మందికి ఏం జరిగిందో ఊహించండి' అని రాశారు. నిజంగానే న్యూఢిల్లీలో బతికే మేధావికి ఇది మొదటిసారి అనుభవం కావచ్చు. కాని, మన రాష్ట్రంలో, జిల్లా కేంద్రాలలో, గ్రామాలలో, అడవిలో ఇటువంటి అనుభవాలు ఉన్నవారు ఎంత మందో?

– *కె. కొండల్‌రెడ్డి*
ఖమ్మం

ఆకాశవాణికి అవకాశ వాణి అని, ప్రభుత్వ బాకా అని ఎన్ని పేర్లు ఉన్నా, అది మనం కట్టే పన్నులతో అరవై సంవత్సరాలుగా పెరుగుతూ వస్తున్నది. ఒక కార్ఖానానో, మరో ప్రభుత్వ సంస్థనో ప్రైవేట్‌పరం చేసినట్టుగా, మూసివేసినట్టుగా ఆకాశవాణిని మూసేయడం గానీ, క్రమక్రమంగా నిర్వీర్యం చేయడం గానీ పాలకుల కుటిలత్వానికి నిదర్శనం. గద్దెల మీద ఉన్నవారికి తమకు ప్రచారం చేసి పెట్టే సంస్థను కూడా మూసి పారేసేంత నిర్లక్ష్యమయిన వైఖరి ఉందన్నమాట. కాని, ఇప్పటికీ మారుమూల పల్లెటూర్లలో పాటలు వినడానికో, వార్తలు వినడానికో అబద్దాలైనా సరే కొంత వినోద, విజ్ఞాన సాధనంగా ఉన్న రేడియోను ఇట్లా ధ్వంసం చేయడం తప్పు. వి. గోపీచంద్‌గారు (వీక్షణం జూలై సంచిక) రాసినట్టు ఇప్పటికైనా ప్రసార భారతిని ప్రజలు రక్షించుకోవాలి.

– *కె. రామకృష్ణ*
జంగారెడ్డిగూడెం, పశ్చిమ గోదావరి

ఓటర్లు 5.82 కోట్లు

రాష్ట్రంలోని మొత్తం 282 నియోజవర్గాల్లో 5.82 ఓటర్లు ఉన్నారు. ఇందులో 2.89 కోట్లు మంది పురుషులు, 2.93 కోట్ల మంది మహిళలున్నారు. గత ఏడాది ఎన్నికల కన్నా ఇప్పుడు 15.8 లక్షల మంది ఓటర్లు పరిగారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చేపట్టిన సమ్మరీ రివిజన్ అనంతరం ఈ గణన చేపట్టారు.

మన్యంలో మలేరియా మరణాలు

ప్రభుత్వ నిర్లక్ష్యంతో మన్యంలో విషజ్వరాలు ప్రబలి వందలాది మంది గిరిజనులు మరణిస్తున్నారు. వేలాది మంది అస్వస్థులవుతున్నారు. ఇప్పటి వరకు విశాఖ మన్యంలో 25 మంది చనిపోయారు. ప్రతి రోజూ వందల సంఖ్య ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు నివారించతగ్గ రోగాలతో కూడా చనిపోతున్నారని మాజీ ఎం.ఎల్.ఎ. రాజారావు మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ బి. సుభాషణ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో గిరిజనులకు చేస్తున్న చికిత్సలేంటి, ఎంత మంది చనిపోయారు వంటి వివరాలతో పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని విశాఖ కలెక్టర్, వైద్యాధికారులను చైర్మన్ ఆదేశించారు. గిరిజనుల జీవించే హక్కును కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్

విద్యార్థుల ఫీజుల రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలకు తక్షణమే ప్రభుత్వం నిధులు విడుదల చేయాలంటూ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య జూన్ 25న ఆమరణ దీక్ష ప్రారంభించారు. ఇదే సమస్యపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యలయంలో ఆమరణ దీక్ష చేపట్టారు, ప్రతిపక్షాలు జూన్ 29న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో ప్రభుత్వం ఫీజుల బకాయిల కోసం మొదట వెయ్యి కోట్లు విడుదల చేస్తున్నామనీ, మిగిలిన బకాయిల్ని కూడా చెల్లిస్తామనీ చెప్పింది. 300 వందల కొత్త హాస్టళ్లని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై ప్రభుత్వ ఉత్తర్వులు సిద్ధమయ్యాయన్నారు. దీంతో కృష్ణయ్య, కిషన్‌రెడ్డిలతో రాష్ట్ర మంత్రులు నిరహార దీక్షను విరమింప చేశారు.

ఆదిలాబాద్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు సెంట్రల్ కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మీడియా అధికార ప్రతినిధి చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్ (53), ఆయనతో పాటు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ హేమచంద్రపాండె జూలై 2న ఆదిలాబాద్ జిల్లా జోగాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో మరణించారని కాగజ్‌నగర్ డిఎస్‌పి తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ పై ప్రజలు, పౌరహక్కుల సంఘాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

బాక్సైట్ తవ్వకాలు బంద్

బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ జూన్ 25 తెల్లవారుజాము నుంచి 48 గంటలపాటు విశాఖ ఏజెన్సీ బంద్‌కు సిపిఐ పిలుపు నిచ్చింది. బాక్సైట్ తవ్వకాలపై గిరిజనుల వ్యతిరేకతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తామని సిపిఐ నాయకులు చెబుతున్నారు. ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో అత్యవసర సర్వీసులు మినహా మిగతా వాహనాల రాకపోకలను అనుమతించేది లేదని నాయకులు ప్రకటించారు.

వికారుద్దీన్ అహ్మద్ అరెస్ట్

నగర పోలీసులపై అనేకసార్లు కాల్పులు జరిపి తప్పించుకు తిరుగుతున్న వికారుద్దీన్‌ను సికింద్రాబాద్‌లోని షాబాద్‌గూడలో జూలై 13న కౌంటర్ ఇంటలిజెన్స్ సెల్ చెందిన పోలీసులు అరెస్టుచేశారు. వికారుద్దీన్‌తో పాటు అతని అనుచరులు సులేమాన్, జకీర్, హనీఫ్, రియాజ్, సయీద్‌లను కూడా అరెస్ట్ చేశారు. వికారుద్దీన్‌పై రాష్ట్రంతో పాటు, గుజరాత్‌లో కూడా అనేక కేసులున్నాయని తెలిపారు.

సోంపేట ప్రజా ప్రతిఘటన

సోంపేట మండలం బీలలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జూలై 14న ప్రయత్నాలు మొదలుపెట్టింది. దీంతో ఎంతో కాలంగా ఈ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు సమీప గ్రామాల నుంచి వేలాదిగా తరలి వచ్చి పనులను అడ్డుకున్నారు. అక్కడ కాపలాగా ఉన్న రెండు వేల మంది పోలీసులు, ఎన్.సి.సి. కాపలాదారులు నిరసన తెలుపుతున్న ప్రజలపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ప్రజలు వారిపై తిరగబడడంతో పోలీసులు కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరు మరణించారు. వందల సంఖ్యలో ప్రజలు, పోలీసులు, మీడియా సిబ్బంది గాయపడ్డారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు గతంలో ఇచ్చిన అనుమతులను రద్దుచేస్తూ జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథారిటీ (ఎన్ఇఏఏ) తీర్పునిచ్చింది. తప్పుడు సమాచారంతో అనుమతిచ్చినందుకే రద్దుచేస్తున్నామని, ప్రాజెక్ట్‌పై అక్కడి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు.

ఓదార్పు యాత్ర

కడప ఎం.పి వై. ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండో విడత ఓదార్పు యాత్రను జూలై 7 నుండి మళ్లీ ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించిన యాత్ర, తూర్పుగోదావరి జిల్లా గుండా యాత్ర కొనసాగు తోంది. దారిపొడుగున రాజశేఖరరెడ్డి మరణవార్త విని కలతచెంది చనిపోయిన వారిని ఓదారుస్తు, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ, విగ్రహాల ఆవిష్కరణలు చేస్తూ ఓదార్పు యాత్ర చేస్తున్నారు.

బాబు బాబ్లీ యాత్ర

బాబ్లీ ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి నీరు రాకుండాపోతుందని, దాన్ని పరిశీలించడానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పార్టీ నాయకులతో కలిసి జూలై 16న వెళ్లారు. యాత్ర ధర్మాబాద్ పరిసరాలకు చేరుకోగానే మహరాష్ట్ర పోలీసులు వారిని అడ్డుకుని అక్కడే నిలిపివేశారు. మహరాష్ట్ర ప్రభుత్వం బాబ్లీతో సహ మరో 13 ప్రాజెక్టులను నిర్మించటాన్ని నిరసిస్తూ అక్కడే ధర్నా చేశారు. దీంతో బాబ్లీ ప్రాజెక్ట్ చూపిస్తామని చెప్పి వ్యాన్‌లు ఎక్కించి అరెస్ట్‌చేశారు. చివరికి మహరాష్ట్ర ప్రభుత్వం జూలై 20న వారిపై ఉన్న కేసులను వెనక్కి తీసుకొని వారిని విడుదల చేశారు.

కమిషనర్‌గా జన్నత్ హుస్సేన్

రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా సీనియర్ ఐఎఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ నియమితులయ్యారు. కమిషనర్ నియామకాన్ని గవర్నర్ ఆమోదించారు. దీనికి సంబంధించిన ఫైలుపై గవర్నర్ సంతకం చేయడంతో జూలై 15న ప్రధాన కమిషనర్ బాధ్యతలు స్వీకరించారు. ❖

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలకులపై ప్రజలు ఏకమై పోరాడితే విజయం సాధించుకోవచ్చుననే నమ్మకాన్ని మళ్లీ ఒకసారి సోంపేట ప్రజా ప్రతిఘటన చూపెట్టిందని అంటున్నారు **వై. రామచంద్రం**

సోంపేట ప్రజా పోరాటం ఆదర్శం

మన దేశ గ్రామీణ జనాభాలో ఇప్పటికీ నూటికి డెబ్భైమంది భూమి మీద ఆధారపడి బతుకుతున్నారు. 1991 తరువాత ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో సరళీకృత నూతన ఆర్థిక విధానాలు అమలు చేయడం ప్రారంభించాయి. దేశీయ ప్రైవేట్ పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు ప్రభుత్వం ప్రజల భూముల్ని బలవంతంగా తీసుకొని అప్పగించడం మొదలు పెట్టింది. సింగూరు, నందిగ్రాం, కళింగనగర్ లలో ప్రభుత్వం భూముల్ని బలవంతంగా లాక్కుంటుంటే ప్రజలు తమ ప్రాణాలకు తెగించి భూముల్ని కాపాడుకున్నారు.

సోంపేటలో తమ పంట భూముల్ని బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఇవ్వం అన్నందుకు వారిపై కాల్పులు జరిపి అణిచివేయాలని చూసింది ప్రభుత్వం. ప్రజల నుండి పెద్ద ఎత్తున వచ్చిన తిరుగుబాటును గ్రహించి తాత్కాలికంగా ఈ ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

సోంపేట ఘటన పూర్వాపరాలను పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తుంది, సోంపేట మండలంలోని బీలలో. బీల సంవత్సరం పొడుగున నీరు ఉండే జలవనరు. ఇది సోంపేట చుట్టు ప్రక్కల ప్రజలకు, పశువులకు, పక్షులకు నీటిని అందించి జీవనాధారంగా నిలుస్తుంది. బీల నీటితో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. ఈ బీల మీద 1989లో రుస్కుద్ద, బెంకిలి, కుత్తుమ ప్రాంతాల్లో మూడు ఎత్తిపోతల పథకాల ద్వారా 750 ఎకరాలకు నీరు అందుతోంది. అక్కడి ప్రజలకు సాగు నీరు, తాగు నీరు కొరతను తీరుస్తుంది. మాణిక్యపురంలోని 500 మత్స్యకారుల కుటుంబాలు బీలలో చేపలు పట్టి బతుకుతున్నాయి. ఇక్కడే పంట భూములు, జీడితోటలూ, మామిడి తోటలు, కొబ్బరి తోటలు ఉన్నాయి. ఇక్కడికి దగ్గరలోని తేలినీలాపురం ప్రాంతానికి సైబీరియా నుండి వచ్చే 123 రకాల వలస పక్షుల వచ్చి ఇక్కడ దొరికే చేపలను ఆహారంగా తిని 6 నెలలు ఉండి మళ్లీ వెళ్లిపోతుంటాయి. ఇలాంటి జీవ వైవిధ్యంతో కూడిన ప్రాంతం ఇది.

ఇవేవి పట్టని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఈ ప్రాంతంలో పవర్ ప్లాంట్ నిర్మాణానికి 9 డిసెంబర్, 2009న నాగార్జున కంపెనీకి పర్యావరణ అనుమతి ఇచ్చింది. ఈ కంపెనీ 2640 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్లాంటు ఏర్పాటుకు 5000 ఎకరాల భూమి కంపెనీ అడగగా, ప్రస్తుతానికి రెండు వేల ఎకరాల భూమి సేకరించారు. ప్రభుత్వం బంజరు భూమి పేరుతో 900 ఎకరాల భూమిని కంపెనీకి ఇచ్చింది. మిగత 1200 వందల ఎకరాల భూమిని ప్రభుత్వ ప్రోద్బలంతో, ప్రైవేటు వ్యక్తులు చాపల చెరువులు నిర్మిస్తామని నమ్మబలికి కంపెనీకి అమ్ముకున్నారు. 12000 వేల కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ కింద 45 గ్రామాలు తుడిచిపెట్టుకుపోయే ప్రామాదం ఉంది. ఒక లక్షా యాబయివేల మంది ప్రజలు నిర్వాసితులు కాబోతున్నారు.

ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 130 విద్యుత్ కేంద్రాలను తెస్తోంది. అందులో ఉత్తరాంధ్రలోనే 17 థర్మల్ విద్యుత్ కేంద్రాలు, 2 అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపడుతున్నారు.

ప్రభుత్వం అభివృద్ధి పేరుతో తెస్తున్న బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల వచ్చే ప్రమాదాలపై సోంపేట చుట్టు పక్కల గ్రామాల ప్రజలు విశాఖలోని పరవాడకు సమీపంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాని(ఎన్‌టిపిసి)కి ప్రత్యక్షంగా వెళ్లి చూసారు. విద్యుత్ కేంద్రం నుండి వచ్చే పొల్యూషన్ వల్ల అక్కడి చుట్టు పక్కల ప్రజల జీవితాలు ఏలా చిద్రమౌతున్నాయో ప్రత్యక్షంగా చూశారు. అక్కడున్న ఇల్లు, ఇంట్లోని వస్తువులు మసిబారి ఉన్నాయి. పుట్టే పిల్లలు అంగ వైకల్యంతో పుట్టడం, వివిధ రకాల చర్మ వ్యాధులతో బాధపడుతున్నారు. అందుకే మా బతుకుల్ని ఈ ప్రభుత్వం కోసం, ఎన్‌సిసి కంపెనీకోసం నాశనం చేసుకోము. మా పిల్లల భవిష్యత్తు కోసం ఈ నేలను మేము రక్షించుకోవాల్సిందే, మాకు వేరే దారిలేదని పోరాడడానికి సిద్ధమయ్యారు.

రాబోతున్న ప్రమాదాన్ని గ్రహించిన ప్రజలు తమ భూముల్ని కాపాడుకోవడానికి, కంపెనీని అడ్డుకోవడానికి చేయని ప్రయత్నమంటూలేదు. స్థానిక రాజకీయ నాయకుల నుండి మొదలుకుంటే, ప్రభుత్వ పర్యావరణ అధికారులకు, కలెక్టర్‌కు, ప్రతిపక్షనాయకులకు, రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రాల ద్వారా తమ సమస్యను తెలియచేశారు. ధర్నాలు, రాస్తారోకోలు, నిరహార దీక్షలు ఇలా వాళ్లు చేయని ప్రయత్నమంటూ లేదు.

పవర్‌ప్లాంట్‌ను ఆపాలని పర్యావరణ పరిరక్షణ సమితి, మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇప్పటికీ కూడా నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. దీక్ష శిబిరం ప్రారంభించి ఈ వ్యాసం రాసేనాటికి 228 రోజులకు చేరింది. సంవత్సరంన్నర కాలంగా ప్రజలు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ వివిధ రూపాలలో తమ నిరసనను తెలియచేస్తున్నారు. ఈ క్రమంలో ఎంతో మందిని కేసుల్లో ఇరికించి తీవ్ర నిర్బంధానికి గురిచేసింది ప్రభుత్వం. నిజంగా మా అభివృద్ధిని ఈ ప్రభుత్వాలు కోరుకుంటే వంశధార నీటిని మా ప్రాంతానికి మళ్లించమని కోరుతున్నాం అంటున్నారు ఆ ప్రాంత ప్రజలు.

నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ జూలై 14న ఎట్లాగైనా నిర్మాణ పనులు ప్రారంభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, పోలీసుల అండతో ప్రయత్నాలు ప్రారంభించింది. పోలీసులు చుట్టు పక్కల గ్రామాల్లో జూలై 11 నుండి 13 వరకు బీల ప్రాంతానికి రావద్దంటూ రోజుకు 5సార్లు మైక్‌ల ద్వారా ప్రచారంచేసి అక్కడి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారు. ప్రజలు ఎన్‌సిసి వారు వస్తే మేము తప్పకుండా వస్తామని పోలీసులకు చెప్పారు. అది గమనించిన పోలీసులు మీరు వస్తే ఎటువంటి కర్రలు తీసుకు రావద్దని చెప్పి వెళ్లారు. సోంపేట చుట్టుపక్కల గ్రామాల్లో పేలాది మంది పోలీసులు మొహరించి ప్రజలను బీల ప్రాంతానికి రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు.

జూలై 14 ఉదయం సోంపేట చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వేలాది మంది ఎటువంటి కర్రలు లేకుండా బీల ప్రాంతానికి వెళ్లారు. మా భూముల్లో కంపెనీ పెట్టోద్దు మా జీవితాలు బుగ్గిపాలవుతాయని, రెండు చేతులు జోడించి మా భూముల్ని వదలండన్నారు. దండం పెట్టుకుంటూ వెళ్లి అక్కడున్న పోలీసులను నిలదీసారు. అసహనానికి గురైన పోలీసులు, వారికి తోడుగా ఉన్న కంపెనీ గూండాలు వేలాది మంది కలిసి ప్రజలపై దాడి చేశారు. మహిళలు, వృద్ధులు అని చూడకుండా విచక్షణ కోల్పోయి బూతులు తిడుతూ ప్రజలపై లాఠీలతో కొట్టి, బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ప్రజలు అన్యాయంగా తమని కొట్టడానికి కారణమై కంపెనీలు కార్యాలయాన్ని తగులబెట్టి, దానికి వత్తాసు పలుకుతున్న రాజకీయ నాయకుల ఇళ్లపై దాడి చేశారు.

ఆ తరువాత సమీప తోటల్లోంచి కొంతమంది కర్రలు పట్టుకొని మా భూమి వదిలిపోండని నినాదాలు చేస్తూ ఆ ప్రాంతానికి తిరిగి వచ్చారు. వారి మీద పోలీసులు లాఠీఛార్జి చేశారు. పోలీసులపై ప్రజలు ఎదురు తిరిగి రాళ్ల విసరడం ప్రారంభించారు. అలా ఎదురుబొదురుగా పోలీసులకు, ప్రజలకు మధ్య జరిగిన ఘర్షణను ఆ సమయంలో కూడా నివారించడానికి, ప్రజలను శాంతింపజేయడానికి అవకాశం ఉండింది. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణ పనులను ఆపివేసి, ప్రజలను శాంతింప జేసి ఉండవచ్చు. ఆ కంపెనీకి ఇంకా అప్పటికి తగిన అనుమతులు రాలేదు కనుక, వాళ్ల నిర్మాణ కార్యక్రమాలు చట్టవ్యతిరేకమైనవని గుర్తించి, ఆ పనులలో ఉన్నవాళ్లను అరెస్ట్ చేసి, ప్రజలను శాంతింపజేసి ఉండవచ్చు. ప్రజలకు నమ్మకం ఉన్న ప్రజాసంఘాల నాయకులను గానీ, రాజకీయ నాయకులను గానీ అక్కడికి తీసుకువచ్చి ఘర్షణను ఆపి ఉండవచ్చు. కాని ప్రభుత్వాధికారులు, పోలీసులు ఈ పనులేవీ చేయలేదు.

ఒక ఆందోళనకారుల గుంపును చెదరగొట్టడానికి ముందుగా నలుగురికన్నా ఎక్కువ మంది గుమిగూడదని సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు విధించాలి. అలా గుమిగూడితే వారిని చెదిరిపొమ్మని మైకులలో, బహిరంగంగా హెచ్చరించాలి. అప్పటికీ చెదిరిపోకపోతే తక్కువ స్థాయిలో లాఠీఛార్జి చేయాలి. అది కూడా పనిచేయలేదనుకుంటే హెచ్చు స్థాయిలో లాఠీఛార్జి చేయాలి. అప్పటికీ గుంపు చెదరకపోతే, భాష్పవాయు ప్రయోగం చేయాలి. అది కూడా పనిచేయకపోతే జిల్లా మేజిస్ట్రేటును ఆ ప్రాంతానికి రప్పించి, లేదా ఆ మేజిస్ట్రేటుకు ఆ ప్రాంతపు పరిస్థితిని యథాతథంగా తెలియజేసి, ఆ మేజిస్ట్రేటు అనుమతితో మాత్రమే కాల్పులు ప్రారంభించాలి. ఆ కాల్పులు కూడా మొదట కాల్పుల జరపబోతున్నామని హెచ్చరించాలి. తరువాత గాలిలోకి కాల్పులు జరపాలి. అప్పటికీ గుంపు చెదరకపోతే తుపాకులను నలభై ఐదు డిగ్రీల కన్న తక్కువకు వంచి అంటే, ఆందోళనకారుల మోకాళ్ల కింద మాత్రమే తగిలే జాగ్రత్త తీసుకొని కాల్పులు జరపాలి. ఎట్టి పరిస్థితిలోనూ నడుముకు పై భాగంలో తగిలేలా కాల్పులు జరపకూడదు. ఇవన్నీ చట్టబద్ధమైన జాగ్రత్తలు. ఇటీవల రబ్బర్ బులెట్ల సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన తరువాత, అవి మనుషులను గాయపరుస్తాయి గానీ, చంపవు గనుక రబ్బరు బులెట్లు మాత్రమే వాడాలని నిబంధన కూడా వచ్చింది. కాని, సోంపేటలో ఈ చట్టబద్ధమైన నిబంధనలలో ఏ ఒక్కదాన్ని పోలీసులు పాటించలేదు. మూడు వేల మంది పోలీసులతో పాటు, రెండు వేల మంది కంపెనీ గూండాలను కూడా అక్కడ మోహరించారు. యూనిఫారాలలో ఉన్న పోలీసులు, జీన్‌ప్యాంట్‌లు, టీషర్ట్‌లలో ఉన్న కంపెనీ గూండాలు లాఠీలు పట్టుకొని, ప్రజలను ఎలా చితకబాదారో అన్ని టెలివిజన్ ఛానెళ్లలోనూ స్పష్టంగానే కనబడింది. స్థానికులు చెబుతున్న ప్రకారం సోంపేట పోలీసులు జీపులో వెళుతూ జీపులో నుంచి తుపాకి బయటికి పెట్టి ప్రజల మీద కాల్పులు జరిపారు. అంటే, గుంపును చెదరగొట్టే ఉద్దేశంతో మాత్రమే కాల్పులు జరపాలని చట్టం చెబుతుండగా, చంపే ఉద్దేశంతోనే కాల్పులు జరిపారని అర్థమవుతున్నది.

ప్రజలపై పోలీసులు అలా విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. ఎంతోమంది గాయపడ్డారు. తమ కళ్లముందే తమ సహచరులు కూలిపోవడంతో కోపోద్రిక్తులైన ప్రజలు పోలీసులను, ఎన్‌సిసి గూండాలను దొరికివారిని దొరికినట్లు కొట్టారు. వాళ్ల వాహనాలను తగులబెట్టారు. ప్రజలు ఎదురు తిరిగేసరికి పోలీసులు, కంపెనీ గూండాలు చెల్లాచెదురుగా పారిపోయారు. ఇదంతా ఉదయం 9 గంటలకు మొదలై సాయంత్రం 4 గంటల వరకు నడిచింది.

ఈ ఘటనలో వందలాది మంది గాయాల పాలయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు కొందరైతే, ఆసుపత్రుల్లో ఉంటే గుర్తించి మళ్లీ ఎక్కడ కొడతారోనని భయపడి కొంతమంది ఎటువంటి వైద్య సహాయం తీసుకోకుండానే ఉన్నారు. అక్కడక్కడ మెడికల్ క్యాంపులు పెట్టి మందులు ఇస్తున్నారు.

కంపెనీని భద్రంగా కాపాడాలని ప్రయత్నించిన పోలీసులు, ఎన్‌సిసి గూండాలు, పెట్టుబడికి అనుకూలంగా, ప్రజలకు వ్యతిరేకంగా రాస్తున్న కొందరు మీడియా ప్రతినిధులు ప్రజల కోపానికి గురికాక తప్పలేదు. ఈ కంపెనీని ఇక్కడికి తీసుకువచ్చి ఇప్పటికీ కొనసాగిస్తానని చెపుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, మొత్తంగా కాంగ్రెస్ నాయకులు, కంపెనీ యాజమాన్యం, వారికి అనుకూలంగా పనిచేసిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం, కంపెనీకి అనుకూలంగానూ, నిరసిస్తున్న ప్రజలకు వ్యతిరేకంగానూ వార్తలు రాసిన పత్రికల, ఛానళ్ల ప్రతినిధులు అందరూ తమను తాము ప్రజా వ్యతిరేకులమని చూపుకున్నారు. ఏడాదిన్నరగా ఈ సమస్య రగులుతున్నప్పటికీ ఆ ప్రజావ్యతిరేకుల మీద తమ ఆగ్రహం ప్రకటించే అవకాశం ప్రజలకు మొదటిసారిగా ఇప్పుడు వచ్చింది. ఆ ఆగ్రహాన్ని ముట్టించినది పోలీసు కాల్పులు కావడం, అందులో ఇద్దరు మరణించడం విచారకరమే అయినప్పటికీ, ప్రజాశక్తి ఎంత బలోపేతమైనదో ఈ సంఘటన రుజువు చేసింది.

థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఇంతకాలంగా జరిగిన ప్రయత్నాలన్నీ తప్పుల తడకలుగా, అబద్ధాల కుప్పలుగా ఉన్నాయి. చట్ట ప్రకారం జరగవలసిన ప్రజాభిప్రాయ సేకరణ 2009 ఆగస్ట్‌లో

గొల్లగండిలో జరిగింది. అప్పటికే ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు తమ నిరసనను ప్రకటించారు. హాజరైన ప్రజలలో 90 శాతం పవర్ ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకించారు. అయినా జిల్లా యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ ప్లాంటుకు అనుకూలంగా ఉందని రాసింది.

ఇటువంటి ఏ పథకం వస్తున్నా ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ (పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక) తయారు చేయవలసి ఉంటుంది. అందులో ప్రజా జీవనానికీ, ప్రకృతికీ, జీవజాతులకూ జరగనున్న మేలునూ, కీడునూ ఉన్నది ఉన్నట్టుగా చెప్పవలసి ఉంటుంది. కాని, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ ఈ నివేదిక పనిని మరొక దొంగ సంస్థ అయిన విమతా లాబరేటరీస్ చేత చేయించింది. ఆ నివేదికలో నష్టపోయే భూమి లేదని, పంట భూమి లేదని, జీవజాతులు లేవని, ప్రజలకేమీ నష్టమేమి జరగదని పచ్చి అబద్ధాలు రాశారు. ఈ అబద్ధాల మీద ఆధారపడి కొన్ని అనుమతులు తెచ్చుకొన్నారు. కొన్ని అనుమతి పత్రాలున్నాయని తప్పుడు కాగితాలు సృష్టించుకున్నారు. బాధ్యత వహించవలసిన ప్రభుత్వ శాఖలేవీ ఈ తప్పులను ఎత్తి చూపలేదు. ప్రజానుకూలంగా పనిచేయలేదు. కంపెనీ గులాములుగా పనిచేశారు. సోంపేటలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రానికి అనుమతులు ఇచ్చే ముందు ప్రజల జీవితాలపై అది ఎటువంటి ప్రభావాన్ని చూపుతుంది అని పరిశీలించే కనీస బాధ్యతను నెరవేర్చలేదు.

సోంపేటలో సామాన్య ప్రజలపై కాల్పులు జరిపిన రోజే ఆ తప్పులు కొంతవరకైనా బయటపడ్డాయి. జూలై 14న ఢిల్లీలో జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథారిటీ గతంలో ఇచ్చిన అనుమతులను రద్దుచేస్తూ తీర్మానించింది. గతంలో పర్యావరణ శాఖ అనుమతి కోసం కంపెనీ ఇచ్చిన సమాచారం, ప్రభుత్వం ఇచ్చిన వివరాలు తప్పుల తడకలగా ఉన్నాయని తన విచారణలో నిర్ధారించింది.

జూన్ 29న చిత్తడి నేలల నిపుణులు, జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథార్టీ ప్రతినిధులు ఆ ప్రాంతానికి స్వయంగా వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన భూమి పర్యావరణం దృష్ట్యా ప్రాధాన్యత ఉన్న స్థలంగా గుర్తించారు. అక్కడి చుట్టుపక్కల గ్రామాలకు జీవనాధారమైన బీల నీటిని, చిత్తడి నేలలను, కొబ్బరి తోటలు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిని, ప్రకృతి సంపదను ప్రత్యక్షంగా గమనించారు. సైబీరియా పక్షుల వలస గురించి తెలుసుకున్నారు. కంపెనీ, ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం ఇచ్చిన నివేదికలు ప్రజలకు వ్యతిరేకమైనవిగా, కంపెనీకి అనుకూలమైనవిగా ఉన్నాయని తేల్చారు.

భూగోళం మొత్తం మీదనే చిత్తడి భూములు విశిష్టమైనవి. అతి తక్కువ చోట్ల ఉన్నవి. అందుకే పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాటిని కాపాడాలని అంతర్జాతీయ ఒప్పందాలు జరిగాయి. చిత్తడి భూముల్లో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు ఆమోదించడమంటే, 1971 రామ్‌సర్ అంతర్జాతీయ ఒప్పందాన్ని తుంగలో తొక్కినట్లే అవుతుంది. చిత్తడి నేలల పరిరక్షణకు ఉద్దేశించిన ఈ ఒప్పందంపై భారత్ 1982లో సంతకం చేసింది. ఈ నేలలను కాపాడడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధి. ప్రభుత్వాలు రూపొందించుకొని అమలు చేస్తానన్న చట్టాలను ప్రభుత్వాలే అమలు చేయడం లేదనడానికి సోంపేట ఒక ఉదాహరణ.

ప్రభుత్వం, బహుళజాతి సంస్థలు కూడబలుక్కొని 1991 నుండి ప్రపంచీకరణ పేరుతో సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నాయి. అభివృద్ధి చేస్తామన్న పేరుతో పెట్టుబడులు పెట్టి లాభాలను ఆర్జించడమే వీటి లక్ష్యం. ఇక్కడ చవకగా దొరికే సహజ వనరులు, చెప్పినట్టు వినే కమిషన్ ఏజెంట్లతో కూడిన ప్రభుత్వం సహకారం పుష్కలంగా ఉంది, కాబట్టే ఎక్కడలేని ప్రాజెక్టులు కుప్పలు తెప్పలుగా ఇక్కడికి వస్తున్నాయి.

శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురంలో ఏకంగా ఆరు థర్మల్ పవర్ ప్లాంట్లు రానున్నాయి. వీటి నుంచి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ సుమారు 10 వేల మెగావాట్లు. ఇవన్నీ కేవలం 90 కిలోమీటర్ల పరిధిలో ప్రతిపాదించినవి. ఇవి కాక రెండు అణువిద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదలున్నాయి.

ఈ పవర్ ప్లాంట్లు, అణువిద్యుత్ కేంద్రాలు పెట్టమని ప్రజలు అడిగినవీ కావు. ప్రజల ప్రయోజనాల కోసం వస్తున్నవీ కాదు. వీటి ప్రధాన లక్ష్యం లాభాలు. బాక్సైట్‌ను శుద్ధిచేయడానికి, పొరుగున ఉన్న ఒడిషా, ఛత్తీస్‌ఘడ్‌లలో ఇనుప ఖనిజం తవ్వకాలకూ, రవాణాకూ విద్యుత్ చాలా అవసరం కాబట్టి వాటి కోసమే రెండు అణువిద్యుత్ కేంద్రాలు, ఆరు పవర్ ప్లాంట్లు.

జూలై 14న పోలీసు కాల్పుల్లో మరణించిన పలాసపురం గ్రామ వాసి గున్న జోగారావు (45) (రైతు కూలీ), లక్కవరం గ్రామానికి చెందిన గోపన కృష్ణమూర్తి (57) (రైతు కూలీ) కుటుంబాలకు స్థానిక ప్రజలు బాసటగా నిలిచి మనోధైర్యాన్నిస్తున్నారు. వారిని జీవావరణానికే పెను ప్రమాదం కాబోతున్న థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిలువరించడంలో విలువైన ప్రాణాల్ని వదిలిన అమరులుగా భావిస్తున్నారు. 'మనందరి బాగుకోసం వాళ్లు ప్రాణాలిచ్చారు. మీకు మేము అండగా ఉంటామ'ని మనోధైర్యాన్నిస్తున్నారు.

మాకు బతుకునిచ్చే పచ్చటి మా పంట పొలాలు బలవంతంగా తీసుకొని ఉద్యోగలిస్తామని అంటున్నారు. చదువులేని మాకేం ఉద్యోగాలిస్తారు. ఎంతమందికి ఇస్తారు? భూమిని నమ్ముకుని బతుకుతున్న భూముల్లేని వ్యవసాయ కూలీలకు ఏమిస్తారు? భూముంటే ఇంట్లో అందరం అందులో పనిచేస్తాం. అందరం దానివల్ల బతుకుతాం. మాకు బతుకునిచ్చే నేలను పోగొట్టుకుంటే మేము బతకలేం. అందుకే మా బతుకుల్ని, మా పిల్లల భవిష్యత్తును ఈ ప్రభుత్వం కోసం, ఎన్‌సిసి కంపెనీకోసం నాశనం చేసుకోలేం. మా పిల్లల భవిష్యత్తు కోసం ఈ నేలను మేము రక్షించుకోవాల్సిందే మాకు వేరే దారిలేదు అంటున్నారు పలాసపురం గ్రామస్తులు.

ఇంత జరిగినా ప్రభుత్వం బహుళజాతి కంపెనీకి అండగా నిలిచి పోలీసులను, కంపెనీ గుండాలను పంపుతే చావడానికైనా సిద్ధంగా ఉన్నామని ప్రజలు అంటున్నారు. మేము ఓట్లేసి గెలిపించినందుకు మమ్మల్నే చంపి, కంపెనీ పెట్టాలనుకుంటున్నారా అని ప్రశ్నిస్తున్నారు.

ఈ ప్రభుత్వాలు మమ్మల్ని ఇప్పటికే సగం చంపాయి. మమ్మల్ని పూర్తిగా చంపి మా పునాదుల మీదే కంపెనీ నిర్మించాలి తప్ప, మేం బతికుండగా కంపెనీని కట్టనివ్వం అని కాల్పుల్లో తీవ్రగాయాల పాలై సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాళ్లు అంటున్నారు. మేము ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకోకపోతే మా పిల్లలకు భవిష్యత్తు లేదు. కాబట్టి కంపెనీని అడ్డుకునే క్రమంలో చనిపోవడానికైనా మేము సిద్ధంగా ఉన్నామని అంటున్నారు.

(రచయిత వీక్షణం కరస్పాండెంట్, సర్క్యులేషన్ మేనేజర్) వీ

చర్చించి పరిష్కరించుకోవాల్సిన నీటి సమస్యలను తెలుగుదేశం పార్టీ తెలంగాణ ఉప ఎన్నికలలో లబ్ధి పొందడానికి, తెలంగాణ వాదాన్ని నీరు గార్చడానికి ఎక్కుపెట్టిందంటున్నారు **శ్రీధరరావు దేశ్‌పాండే**

బాబ్లీ ప్రజాస్వామిక పరిష్కారం

తొమ్మిదేండ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ఈ రాష్ట్రానికి విజన్ 2020ని రూపొందించిన వ్యక్తిగా కీర్తి గడించిన వ్యక్తి. రాష్ట్ర ప్రయోజనాల గురించి అతనికి దీర్ఘకాలిక ముందుచూపు ఉంటుందని ఆశించడం సహజమే అయినా తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సమయాన్ని ఎంచుకొని మహారాష్ట్రతో ఘర్షణకు తావిచ్చే కార్యక్రమాలకు పూనుకోవడాన్ని చూస్తే అతనిలో దీర్ఘకాలిక ముందుచూపుని ఆశించడం అత్యాశే అవుతుంది. సాగునీటి ప్రాజెక్టులపై తెలుగుదేశం పార్టీ మొదటి నుండి పొరుగు రాష్ట్రాలతో ఘర్షణ వైఖరిని అవలంబిస్తుంది. ప్రజాస్వామిక పరిష్కారాలు సాధ్యమయ్యే పరిస్థితులు ఉన్నా ఘర్షణకే ప్రాధాన్యతనిస్తూ వస్తున్నది. దీని ద్వారా తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కాపాడడంలో తనని మించిన వారు లేరని ప్రజల ముందు నిలబడాలనుకున్నది. కాని తెలుగుదేశం అవలంబించిన ఘర్షణ వైఖరి ఆల్మట్టి విషయంలో ఫలితాన్ని ఇవ్వలేదు. ఇవాళ బాబ్లీ విషయంలోనూ అది రుజువైంది.

తెలంగాణలో ఇవాళ కీలకమైన ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. రాజీనామాలు చేసిన త్యాగ ధనులనే గెలిపించుకోవాలన్న కృత నిశ్చయంతో తెలంగాణ ప్రజలున్నారు. తెలుగుదేశం, కాంగ్రెస్ అభ్యర్థులు ఓట్లకోసం గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి తెలంగాణలో నెలకొని ఉంది. చంద్రబాబు 'రెండు కండ్లు – మూడు నివేదికలు' సిద్ధాంతాన్ని ప్రజలు తిరస్కరిస్తున్న వేళ చంద్రబాబుకు ఒక సంకట స్థితి దాపురించింది. పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారానికి వెళ్లకుండా ఉండలేని పరిస్థితి. వెళితే ప్రజల నిరసనని ఎదుర్కోక తప్పదు. ఈ సంకట స్థితి నుండి ఎట్లా తప్పించుకోవాలన్న కుట్రలోంచే బాబ్లీ పర్యటన రూపు దాల్చింది. బాబ్లీని సందర్శించి అందరి దృష్టిని ముఖ్యంగా పత్రికలు, మీడియా దృష్టిని ఎన్నికల నుండి తనవైపుకు మళ్లించుకునే తాపత్రయం తప్ప మరొకటి కనిపించదు. ఇపుడు బాబ్లీ యాత్ర వల్ల సాధించేది ఏమీలేదని చంద్రబాబుకు తెలియంది కాదు. బాబ్లీ పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయింది. ఇపుడు సమస్య పరిష్కారం సుప్రీంకోర్టులో, కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని అందరికీ తెలుసు. ఈ నెల 23న ప్రధానమంత్రితో అఖిలపక్షం భేటీ కూడా ఏర్పాటై ఉంది. బాబ్లీపై పోరాటక్షేత్రం ఢిల్లీకి మారిన సందర్భంలో చంద్రబాబు దీన్ని మహారాష్ట్ర సరిహద్దులోకి మార్చడంలో ఔచిత్యం ఏమన్నా ఉన్నదా? ఎన్నికల్లో మైలేజి పొందడం తప్ప.

ఘర్షణ వైఖరి అవలంబిస్తున్న చంద్రబాబుకు ప్రజాస్వామిక పరిష్కారం తోచకపోవచ్చు. అయితే తెలంగాణ ప్రజలు ప్రజాస్వామిక పరిష్కారం సాధ్యమేనని నమ్ముతున్నారు. బాబ్లీని ఆపడం మనవైపు చూసినపుడు ఒక అనివార్యమైన చర్యే. అయితే మహారాష్ట్ర ప్రభుత్వం మన డిమాండ్స్‌ని, సి.డబ్ల్యు.సి. సూచనల్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి ప్రాజెక్టును గేట్లతో సహా పూర్తిచేసుకున్నది. ఈ పరిస్థితుల్లో బాబ్లీని కూల్చమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగలదా? కేంద్రం ఆదేశాలను ఇవ్వగలదా?

బాబ్లీ ఇవాళ మనకెంతటి సున్నిత సమస్యనో, ఎంతటి భావోద్వేగ సమస్యనో వారికీ అంతే. చంద్రబాబు బాబ్లీ పర్యటన రెండు రాష్ట్రాల మధ్య, ముఖ్యంగా సరిహద్దులో శాంతియుత సహజీవనం చేస్తున్న ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చింది. అయితే ఇప్పటికీ బాబ్లీకి ప్రజాస్వామిక పరిష్కారానికి ద్వారాలు మూసుకుపోలేదు. అయితే మనం భావోద్వేగాలను, రాగద్వేషాలను పక్కనపెట్టి ఆలోచించవలసి ఉంది.

బాబ్లీ ప్రాజెక్టు ఉన్న ధర్మాబాద్ తాలూకా తెలంగాణలో ఉన్న కరువు పీడిత ప్రాంతాన్ని పోల్చి చూసినపుడు ఏ తేడా లేదు. తరతరాలుగా గోదావరి తీరాన బతుకుతున్న ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. తలాపున గోదారి పారుతున్నా ప్రజలకు తాగునీరు అందని దుస్థితి. ఒప్పందం ప్రకారం గోదావరి నది శ్రీరాంసాగర్ జలాశయంలో భాగమైంది. వారికి ఆ నీళ్ల మీద హక్కు లేకుండా పోయింది. అక్కడి నుండి ఎగువన మరో నలభై కిలోమీటర్ల దాకా గోదావరి నీళ్లను ముట్టడానికి వీల్లేదు. చిరకాలంగా ప్రజల ఒత్తిడికి తలొగ్గి బాబ్లీ వద్ద ప్రాజెక్టు నిర్మాణాన్ని తలపెట్టింది మహారాష్ట్ర ప్రభుత్వం. ఇది కచ్చితంగా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే. అయితే ఈ పరిస్థితికి మూలకారణం ఒప్పందంలోని లోపమేనని తేలుతున్నది.

సాధారణంగా ఏదేని జలాశయంలో ముంపుకు గురి అయిన ఎగువ రాష్ట్రాలకు ఆ జలాశయం నుండి నీటిని ఎత్తిపోసుకోవడానికి అనుమతించడం ఒక రివాజుగా ఉంది. నదిపై ఆ ప్రాంత ప్రజలకు ఉన్న హక్కులను అట్లాగైనా కాపాడడం జరుగుతున్నది. ఈ సంప్రదాయం దేశవ్యాప్తంగా ఉన్నదే. మన రాష్ట్రంలోనే గోదావరి నదిపైనే ఇచ్చంపల్లి జలాశయం నుండి మధ్యప్రదేశ్ (ఇపుడు ఛత్తీస్‌ఘడ్) 3 టి.ఎం.సి.లు, మహారాష్ట్ర 4 టి.ఎం.సి.లు, ఆంధ్రప్రదేశ్ 5 టి.ఎం.సి.ల నీటిని ఎత్తిపోసుకోవడానికి 15 డిసెంబర్ 1975 నాటి ఒప్పందం అనుమతిస్తుంది. అట్లానే పోలవరం జలాశయం నుండి ఒరిస్సాకు 5 టి.ఎం.సి. నీటిని ఎత్తిపోసుకోవడానికి 15 డిసెంబర్ 1978 నాటి ఒప్పందంలో అంగీకరించాం. ఇలాంటి అనుమతి శ్రీరాంసాగర్ జలాశయంలో ఉండి ఉంటే ఇవాళ బాబ్లీ సమస్య ఉత్పన్నం అయి ఉండేది కాదు. ఇది ఒప్పందంలోని లోపం. ఈ లోపం వల్ల పాతికేండ్ల కాలంగా ధర్మాబాద్ ప్రాంతం కరువు పీడిత ప్రాంతంగా బతుకీడ్చింది.

పాతికేండ్ల అనంతరం ఈ లోపం బాబ్లీ రూపంలో ముందుకు వచ్చి రెండు ప్రాంతాల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. చంద్రబాబు లాంటివారు అగ్నికి ఆజ్యం పోస్తున్నారు.

మహారాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నదేమిటంటే, బాబ్లీని నిర్మిస్తున్నది ప్రధానంగా తాగునీటిని అందించడానికే. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన దాని ప్రకారం వారికి కావల్సింది తాగునీటి అవసరాల కోసం 1.09 టి.ఎం.సి.లు మాత్రమే. 1.09 టి.ఎం.సి.ల నీటిని లేదా 2 టి.ఎం.సి.ల నీటినైనా సరే ఎత్తిపోసుకోవడానికి మనం అంగీకారం తెలియజేస్తూ వెంటనే బాబ్లీ పనులను నిలిపివేయమని కోరితే బాబ్లీ సమస్య పరిష్కారం అయి ఉండేదని మూడేండ్ల కిందనే తెలంగాణ ఇంజనీర్లు సూచించారు. ఇప్పటికీ అటువంటి ప్రతిపాదనని మహారాష్ట్ర ముందుపెట్టి బాబ్లీ గేట్లను శాశ్వతంగా తొలగించమని కోరవచ్చు. రెండు రాష్ట్రాల ఇంజనీర్లతో ఏర్పాటైన కమిటీ ఈ అంశాన్ని పర్యవేక్షిస్తోంది. ఇటువంటి పరిష్కారానికి ఉత్తర తెలంగాణ ప్రజలు అనుకూలంగానే ఉంటారు. ఎందుకంటే కరువంటే ఏమిటో వారికి అనుభవమే. ధర్మాబాద్ తాలూకా ప్రజలకు ఈ మాత్రం తాగునీటిని అందించే ఔదార్యం ప్రదర్శించడం వారికి ఎరుకే. ఇంటి దొంగలను పట్టుకోలేని రాజకీయ నాయకత్వం వారి భావోద్వేగాలను రెచ్చగొట్టకుండా ఉంటే చాలు.

తెలంగాణ ప్రజలకు, మహారాష్ట్ర ప్రజలతో భవిష్యత్తులో మరిన్ని ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంది. ప్రాణహిత నుండి 160 టి.ఎం.సి.ల నీటిని 12 లక్షల ఎకరాల తెలంగాణ కరువుపీడిత ప్రాంతాలకు తరలించే బృహత్తర కార్యక్రమం తయారయి ఉంది. పెన్‌గంగ నది నుండి ఆదిలాబాద్ జిల్లాలో యాభై వేల ఎకరాలకు 5.12 టి.ఎం.సి.ల నీటిని అందించడానికి ప్రణాళిక తయారయింది. వీటిపై మహారాష్ట్రతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. బాబ్లీ విషయంలో ఘర్షణ వైఖరి వల్ల ప్రాణహిత, పెన్‌గంగ ప్రాజెక్టుల్లో వారి నుండి సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకోసమైనా బాబ్లీ సామరస్యంగా పరిష్కారం కావల్సి ఉంది. శ్రీరాంసాగర్ జలాశయం నుండి మహారాష్ట్ర 1 లేదా 2 టి.ఎం.సి.ల నీటిని ఎత్తిపోసుకోవడానికి అనుమతించడం వలన మూడు ప్రయోజనాలు ఉన్నాయి.

1) సమస్యకు శాంతియుత పరిష్కారం లభిస్తుంది. 2) భవిష్యత్తులో ప్రాణహితపై, పెన్‌గంగపై మహారాష్ట్ర సానుకూలంగా ఉండే అవకాశాన్ని మెరుగుపరచుకుంటాం. 3) ధర్మాబాద్ ప్రాంత ప్రజల పట్ల మన సంఘీభావాన్ని, ఆర్తిని ప్రకటించిన వాళ్లం అవుతాం. తెలంగాణ ప్రజల ఉదార, ప్రజాస్వామిక స్వభావం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.

ఎన్నికల్లో తెలంగాణ వాదాన్ని గెలిపించుకునే కృత నిశ్చయంతో ఉన్న ఉత్తర తెలంగాణ ప్రజలు ఇటువంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండక తప్పదు. భవిష్యత్తులో రాబోయే ప్రాజెక్టుల కోసమే కాదు శతాబ్దాలుగా మరాఠీ ప్రజలతో ఉన్న సామాజిక, సాంస్కృతిక సంబంధాల దృష్ట్యా కూడా భావోద్వేగాలకు లోనుకాకుండా ఉండాలి. తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం వచ్చినపుడు ప్రజలు బతుకు దెరువు వెదుక్కుంటూ వెళ్లింది బొంబాయి, భివాండీ, షోలాపూర్ తదితర మహారాష్ట్ర నగరాలకే. తెలంగాణలో చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు చేనేత కార్మికులకు ఆశ్రయం ఇచ్చింది మహారాష్ట్రలోని బట్టల మిల్లులే. మహబూబ్‌నగర్ వలస ప్రజలు లక్షలాదిగా బొంబాయిలో బతుకుదెరువు వెదుక్కుంటున్నారు. తెలంగాణ యాభై లక్షల మంది ప్రజలకు ఆకలైనపుడు అన్నం పెట్టింది మహారాష్ట్ర నగరాలే అన్న సంగతి చంద్రబాబుకు తెలవకపోయినా తెలంగాణ ప్రజలకు తెలుసు. మహారాష్ట్రతో సరిహద్దు కలిగిన ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ప్రజలకు శతాబ్దాలుగా సీమాంధ్రుల కన్నా ఎక్కువ సామాజిక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. హైదరాబాద్ రాష్ట్రం నుండి విడిపోయిన తరువాత కూడా ఆ సంబంధాలు కొనసాగుతున్నాయి. ఇవాళ చంద్రబాబు బాబ్లీ యాత్రవల్ల సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు నెలకొనడమే కాదు, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు రగిలించేందుకు దోహదంచేసింది. ఒకరిపై ఒకరికి అనుమానాలు తలెత్తే పరిస్థితులు ఏర్పడినాయి. విజన్ లేని మాజీ ముఖ్యమంత్రికి, చరిత్రను చెత్తబుట్టలోకి విసిరేసిన మాజీ హైటెక్ ముఖ్యమంత్రికి తెలంగాణ సాంఘిక, సాంస్కృతిక చరిత్రను గుర్తు చేయాల్సి రావడం ఒక విషాదం.

బాబ్లీపై మాట్లాడే నైతిక అర్హత చంద్రబాబుకు ఉందా, ఇది కీలకంగా విశ్లేషించుకోవాల్సిన ప్రశ్న. బాబ్లీ వల్ల శ్రీరాంసాగర్ ఎండిపోయి ఉత్తర తెలంగాణ ఎడారిగా మారనున్నదని ఇవాళ మొసలి కన్నీరు కారుస్తున్న చంద్రబాబు తన హయాంలోనే బాబ్లీ నిర్మాణం ప్రారంభం అయిందన్న సంగతి మర్చిపోతున్నాడు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి వ్యవసాయ సంక్షోభం, తద్వారా వేలాది మంది రైతుల ఆత్మహత్యలకు కారకుడు చంద్రబాబు. అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని ఉచ్చరించడం నిషేధించిన వ్యక్తి. ఏనాడూ 610 జి.ఒ. అమలుపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. తన హయాంలో తన పార్టీ శాసనసభ్యుడే రాజోలి బండ తూములను బాంబులతో పేల్చేసి నీళ్లను తరలించుకు పోతుంటే గుడ్లప్పగించి చూసారే తప్ప ఏ చర్యలూ తీసుకోలేదు. శ్రీశైలం ఎడమగట్టు కాల్వను పండబెట్టి శ్రీరాంసాగర్ నిధులను శ్రీశైలం రైట్ బ్యాంక్ కాలువ నిర్మాణానికి తరలించిన సీమాంధ్ర పక్షపాతి. డిసెంబర్ 9 నాటి తెలంగాణ ఏర్పాటు ప్రకటనను సాకారం చెందకుండా చక్రం తిప్పి నోటికాడి బుక్కను నేలపాలు చేసిన వ్యక్తి. ఎన్నికలకు ముందు తెలంగాణ పాటపాడి ఎన్నికలు అవగానే 'రెండు కండ్లు – మూడు నివేదికలు' సిద్ధాంతాన్ని ప్రజల మీదికి వదిలిన ఈ సీమాంధ్ర పక్షపాతికి ఇవాళ ఎన్నికల సమయంలో ఉత్తర తెలంగాణ ఎడారి కాబోతుందన్న స్పృహ కలగడం కుట్ర కాక మరేమిటి?

బహుశా ఈ కుట్రలో చంద్రబాబుతో పాటు అజ్ఞాత కుట్రదారులూ ఉండి ఉండవచ్చు. ఈ కుట్ర ద్వారా వారు సాధించే ప్రయోజనాలు ఏమిటంటే – మొదటిది ప్రజల దృష్టి ఎన్నికల మీద నుండి పక్కకి మళ్లించి, సానుభూతితో ఓట్లను కొల్లగొట్టి 12 సెగ్మెంట్లలో ఒకటో రెండో ఎగరేసుకుపోయి తెలంగాణ వాదాన్ని భూస్థాపితం చెయ్యడం. తెలంగాణ ఏర్పాటుకు మరింత దూరం జరపడం లేదా శాశ్వతంగానే వాయిదా వెయ్యడం. ఇక రెండవది, జగన్ ఓదార్పు యాత్రను మీడియాలో మార్జినలైజ్ చేసి దాని మీద ఉన్న ఫోకస్‌ని పక్కదారి పట్టించడం. అందుకే కుట్రదారు చంద్రబాబు ఒక్కడే కాదు అనడం. అయితే అంతిమంగా ఉప ఎన్నికల్లో తెలంగాణ వాదాన్ని దెబ్బ కొట్టడమే బాబ్లీ యాత్ర లక్ష్యంగా కనబడుతుంది. పైకి చూస్తే చంద్రబాబు ప్రయోజనాలు, పాలకుల ప్రయోజనాలు భిన్నంగా కనిపించినప్పటికీ సారాంశంలో రెండింటి లక్ష్యం ఉప ఎన్నికల్లో తెలంగాణ ఆకాంక్షని లేవకుండా దెబ్బకొట్టడం. విషాదం ఏమిటంటే ఈ కుట్రలో పాత్రధారులు తెలంగాణ దళారీ నాయకత్వం కావడమే.

అయితే ఇవాళ తెలంగాణ ప్రజలు ఎడ్డి ప్రజలు కారు. ఈ కుట్రలను సరిగ్గానే అర్థం చేసుకొని తమదైన పద్ధతిలో తిప్పికొట్టి కుట్రదారులకు బుద్ధి చెబుతారు.

(రచయిత నీటి పారుదల శాఖలో ఇంజనీరు, తెలంగాణ రచయితల వేదిక నాయకులు)

రైతులను వ్యవసాయం నుంచి బయటకు నెట్టేయడం, తిండి గింజలను లాభసాటి వ్యాపారంగా మార్చేయడం, పెట్టుబడి అనుకూల మార్కెట్ విధానాల్లో భాగమేనని అంటున్నారు **వి. హనుమంతరావు**

లాభాలు వ్యాపారులకు - కష్టాలు ప్రజలకు

దేశం మాంద్యం నుంచి బయటపడిందని, పారిశ్రామిక రంగం పుంజుకొందని పాలకులు సంతోషిస్తున్న సమయంలో ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం రెండంకెలు దాటి అటు ప్రణబ్ ముఖర్జీకి ఇటు రిజర్వు బ్యాంకుకు నిద్రలేకుండా చేస్తోంది. అసలు మాంద్యం నుంచి బయటపడిందా? అమెరికాలో గృహనిర్మాణ రుణాల ఫలితంగా ఏర్పడిన మాంద్యం నుండి బయటపడి ఉండవచ్చు కాని గట్టెక్కిన భావన కలగడం లేదని గ్రీస్, యూరప్ దేశాల్లో ఏర్పడిన సంక్షోభాలు ఆ సంతోషాన్ని హరించవా అనే భయం ఇంకా వెంటాడుతూనే ఉంది. ఇదేమీ మన ఆర్థిక పరిస్థితిని ప్రభావితం చేయబోదని పాలకులు అంటున్నారు. 2008లో మాంద్యం ఏర్పడినపుడు కూడా మన ఫండమెంటల్స్‌కేమీ డోకాలేదని దబాయించి తర్వాత నాలుక కరుచుకున్నారు. ఇప్పుడు కూడా అలాంటిదేమి ఉండబోదని పాలకులు అంటూంటే, తలలూపకుండా కాస్త హోషియార్‌గా ఉండడం అవసరం. అంతర్జాతీయ వేదికల మీద వివిధ దేశాల ప్రతినిధులు, ప్రపంచ ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్తలు చేస్తున్న ఉపన్యాసాలు, ప్రకటనలు చూస్తే ఆ భయం తొంగి చూస్తూనే ఉందని అనిపిస్తుంది.

నిజమే పారిశ్రామిక రంగం ముఖ్యంగా తయారీ రంగం పుంజుకుంది. లాభాల బాటలో పడ్డాయి. దేశంలోని కార్పొరేట్ సంస్థలు విదేశాల్లో పరిశ్రమలను కొనేస్తున్నాయి. ఇవి బహుళజాతి సంస్థలవుతున్నాయి. ఉద్దీపన పథకాల అవసరం తీరిపోయింది. అయినా వాటిని ఇంకా కొనసాగిస్తున్న ప్రభుత్వ నిజస్వరూపం బహిర్గతమైంది. పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలను నిలుపుచేయమని దేశం అంతటా ఘోషిస్తుంటే, ప్రతిపక్షాల పిలుపు మేరకు దేశ వ్యాపితంగా లక్షలాది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలను తెలియచేస్తుంటే, ఈ ఉత్పత్తుల ధరలో సింహభాగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులే కాబట్టి ఆ ఆదాయాన్ని కాస్త తగ్గించుకొని ప్రజలకు కాస్త వెసులుబాటు కల్పించమంటే ససేమిరా అంటున్న ప్రభుత్వం మూడు లక్షల కోట్ల రూపాయల మేరకు ఉద్దీపన పథకాల ద్వారా కార్పొరేట్లకు వెసులుబాటు కల్గించిందంటే, ఇదెవరి ప్రభుత్వమో తెలిసిపోతుంది. ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తుందని నెత్తి నోరు కొట్టుకుంటూపోతే, దానిని మరింత తీవ్రతరం చేసే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను తగ్గిస్తే పోలా? అలా తగ్గించ లేదంటే ద్రవ్యోల్బణం పెరుగుదల గురించి ప్రభుత్వం మొసలికన్నీరు కారుస్తోందనే భావించాలి.

ఈ ఉత్పత్తుల ధరలు దశాబ్ద కాలంగా దఫ దఫాలుగా పెరుగుతూనే వస్తున్నాయి. కాని ఇప్పుడు పెరిగిన ధర అలాంటిది కాదు. ఈ పెరుగుదలకు ఒక శాశ్వత ప్రాతిపదికనేర్పరిచారు. దేశం ఇప్పుడు పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో 90శాతం మేరకు దిగుమతుల మీద ఆధారపడుతుంది. ఈ ఉత్పత్తుల ధరలు అంతర్జాతీయ మార్కెట్స్, ముఖ్యంగా అరబ్ దేశాల్లో పెరిగే, తరిగే ధరవరల మీద ఆధారపడి ఉంది. ఇప్పటి వరకు అంతర్జాతీయ మార్కెట్లో ధర పెరిగినపుడల్లా మన దేశంలో ధరలు కూడా పెరిగేవి; తగ్గితే తగ్గేవి. ఉదాహరణకు బారెల్‌కు 40 డాలర్లు పలికిన రోజులున్నాయి. కాని ఆ మేరకు దేశంలో ధరలు తగ్గలేదు. ఇప్పుడు జరగబోయేదేమంటే మార్కెట్ ధర పెరిగినపుడల్లా ప్రజల మీద ధరల భారం పెరుగుతుంది. ఇంత వరకూ అలా మార్కెట్‌లో ధర పెరిగినప్పుడల్లా, ప్రభుత్వం రాజకీయ, తదితర విషయాలను దృష్టిలో ఉంచుకొని, సబ్సిడీలు ఇచ్చి, ప్రజల మీద ధరల భారం మొత్తంగా పడకుండా చూస్తూ వచ్చింది. ఇక ముందు అలా జరగదు. మార్కెట్ ధర పెరిగినపుడల్లా ప్రజలు చెల్లించాల్సిన ధరలు కూడా ఆటోమెటిక్‌గా పెరుగుతాయి. అంటే ప్రభుత్వానికి సబ్సిడీ భారం తగ్గుతుంది; ప్రజల జేబుల చిల్లులు పెద్దవవుతాయి. ఈ భారం ప్రజల మీద పడకుండా ఈ ఉత్పత్తుల మీద ప్రభుత్వం విధిస్తున్న పన్నులను తగ్గించవచ్చు. కాని ప్రజల మీద భారాలు తగ్గించే ఆనవాయితీ ప్రభుత్వానికి లేదు. పైనే చెప్పినట్లు, మాంద్యం భారం పారిశ్రామికవేత్తల మీద పడకుండా లక్షల కోట్ల రూపాయలు ఉద్దీపన పథకాల ద్వారా ఇచ్చే ఆనవాయితీ మాత్రం ఉంది.

గత సంవత్సర కాలంగా ధరలు మరీ పెట్రేగిపోతున్నాయి. జనం గొల్లున గోల చేస్తున్నారు. ఈ సంవత్సరం ఆఖరుకు ధరలు నేలచూపు చూస్తాయని ప్రభుత్వ నేతలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాని ఆచరణలో, అలా ధరలు పడిపోయి ప్రజలు ఎక్కడ ఊపిరి పీల్చుకుంటారోనని పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచేశారు. పెరుగుట విరుగుట కొరకేనని అంటారు గాని కాంగ్రెస్ జమానాలో పెరుగుట ఇంకా పెరుగుట కొరకే అనే విధంగా తయారైంది.

ఈ ధరల పెరుగుదల ఇప్పుడంటే పెట్రోలియం ఉత్పత్తుల అంతర్జాతీయ ధరలు పెరుగుదలకు స్పందనకావచ్చు. కాని అసలు సిసలు కారణం వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం. ఇది 1991లో ప్రపంచ బ్యాంకు ప్రేరేపిత సరళీకృత ఆర్థిక విధానంతో ప్రారంభమైంది. ఆవుకు మేత వేస్తే పాలిస్తుంది. వ్యవసాయంలో పెట్టుబడులు పెడితే, పంటలు

బాగా పండితే తిండి గింజల సరఫరా సక్రమంగా జరిగివుంటే, రైతాంగం చేతుల్లో డబ్బుండేది; వారి కొనుగోలు శక్తి పెరిగేది; పారిశ్రామిక ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడేది. పారిశ్రామిక రంగం 40శాతం మేరకు వ్యవసాయ ఉత్పత్తుల మీద (ఉదా: పంచదార, నూలు వస్త్రాలు వగైరా) ఆధారపడి ఉంది కాబట్టి పంటలు సమృద్ధిగా ఉన్నప్పుడు పారిశ్రామి కోత్పత్తుల ధరలు అదుపులో ఉండేవి. అందరికీ అందుబాటులో ఉండేవి. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థను సమంగా ప్రభావితం చేసివుండేది. ఇది జరగకపోవడం వల్ల పుష్పం, ఫలం పరిశ్రమలకు, ఆకు అలం రైతాంగానికి అయింది. దీనికి తోడు రుతుపవనాలు ప్రతికూలంగా ప్రభావితం చేసాయి. ఒకసారి వరదలు, తుపానులు, సునామీలు, రెండో పక్కనే రుతుపరిస్థితి తోడయ్యాయి. ఉత్పత్తి తరిగితే ధరలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి ఎంత వక్రమార్గం పట్టిందంటే, బిజెపి హయాంలో ఆహారధాన్యాల నిల్వలు ఆరుకోట్ల టన్నులున్నా, ఎగుమతి చేయడానికి మొగ్గు చూపిందేకాని, తగ్గింపు ధరకు పేద ప్రజలకు సరఫరా చేయడానికి సంసిద్ధం కాలేదు. ఈ రోజున కాంగ్రెస్ పాలనలో సరిగ్గా అదే పరిస్థితి ఏర్పడింది. ఎన్ని ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నాయంటే గోదాములు చాలక ఆరుబయట కుప్పలు పోయాల్సి వచ్చింది. అయినా ధరలు నషాలానికి అంటుతున్నాయి. వాటిని విడుదల చేస్తే మార్కెట్లో ధరలు తగ్గుతాయి. అలా తగ్గితే ఆహార ధాన్యాల టోకు వ్యాపారస్తులకు ప్రభుత్వం మీద కోపం వస్తుంది. వాళ్లకు కోపం వస్తే ఈ ప్రభుత్వాలు నిలుస్తాయా? ప్రజలకూ కోపంవస్తుంది. కాని పేదవాని కోపం పెదవికి చేటు అంటారు.

అన్ని ఆహార ధాన్యాలుంటే, అవి మేటలువేసి పోతుంటే, ముక్కిపోయి పశువుల మేతకు కూడా పనికిరావు కాబట్టి వెంటనే ఎగుమతులకు అనుమతిస్తే సమస్య పరిష్కారమవుతుందని బడా వ్యాపారస్తుల కొమ్ము భుజాన వేసుకున్న కొంత మంది ఆర్థిక శాస్త్రవేత్తలు సలహా ఇస్తున్నారు. కాని అలో లక్ష్మణా అంటూ ఆకలితో అలమటించే పేదరికపు రేఖ కింద బతుకులు వెళ్లదీసే వారికి పంపకం చేస్తే నిల్వలు తరుగుతాయని ఎందుకు చెప్పరు? నూరు రూపాయల ఉపాధి పథకం కింద కొంత వేతనం తిండి గింజల రూపంలో ఇవ్వొచ్చు కాని ప్రభుత్వం అలా చేయదు. పేదల కడుపులు నకనకలాడుతుంటేనే చెప్పిన మాట వింటారు. వెయ్యమన్న పెట్టెలో ఓటు వేస్తారు. ఈ విషయంలో అప్పటి బిజెపి ప్రభుత్వానికీ, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికీ తేడా ఏమీలేదు. అపుడు కూడా 2002లో ఇలాగే ధాన్యాలున్నాయి. ఆరుకోట్ల టన్నులకు పేరుకపోతే, ధర మరీ తెగ్గోసి ఎగుమతి చేసింది; నష్టాన్నైనా భరించింది కాని, పేదలకు అందచేయడానికి అంగీకరించలేదు. కాంగ్రెస్‌కు, బిజెపికి ఎంత సారూప్యత!

ధరల పెరుగుదలపై ప్రభుత్వ చర్యలు చూస్తుంటే, ధరలు పెరుగుతుండడమే ప్రభుత్వ లక్ష్యమా అని అనిపిస్తుంది. ఎపుడో నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వం ప్రచురించిన ఎకనామిక్ సర్వే ప్రకారం జూన్ 2006 లోనే ధరల పెరుగుదల ప్రారంభమైందని; ఈ పెరుగుదలకు కారణం గోధుమ పప్పుదినుసులు, వంట నూనెలు, మినరల్ ఆయిల్ ధరలు పెరగడమేనని ప్రభుత్వమే అంగీకరించింది. అంటే అప్పటి నుంచి ధరలు పెరుగుతూనే వచ్చి ఆహార ద్రవ్యోల్బణం సుమారు 20 శాతం పెరిగే పరిస్థితి ఏర్పడిన తర్వాతనే ప్రభుత్వం 'దొంగ' నిద్రలేచి, అయ్యో ధరలు పెరిగాయా మాకు ఆందోళనగా ఉందని మొసలి కన్నీరు కారుస్తోంది. మామూలుగా ఆర్థికశాస్త్రం ప్రకారం ఉత్పత్తి తగ్గితే ధరలు పెరుగుతాయి. కాని ఇపుడు నాలుగు కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు గోదాముల్లో, ఆరుబయట మేటలు వేసిన పరిస్థితిలో కూడా ధరలు పెరగడం. దేశంలో కనీస నిల్వలు ఎంత ఉండాలో ప్రభుత్వం నిర్దేశించింది కాని ప్రస్తుత నిల్వలు గోధుమ విషయంలో ఉండాల్సిన కనీస నిల్వలకన్నా నాలుగు రెట్లు, బియ్యం రెండున్నర రెట్లు నిల్వలు పేరుకొనిపోయాయి. అయితే, అప్పటి బిజెపి పాలనలో నిల్వలు పేరుకుపోయినా, ధరలు అదుపులో ఉండగా, ఇపుడు ధరలు పరుగులు తీస్తున్నాయి. కాగా ప్రభుత్వం దృష్టిలో ఆహార భద్రత సాధించినట్లే కాని ప్రజలకు సంబంధించినంతవరకు ఆహార అభద్రత కొనసాగుతోంది. ఈ ఆహార అభద్రతకు మరో కోణం ఉంది. ధరలు అందుబాటులో ఉండడమేకాదు, పంపిణీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండడంతో చవక ధరల దుకాణాల నుంచి రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోవడం, దీంతో ప్రజలు మార్కెట్‌కు పోయి అధిక ధరలకు కొనుక్కోవడం. ఇన్ని లొసుగుల మధ్య ఆహార భద్రతా చట్టం అమల్లోకి వస్తే, అది ప్రజలకు ఒరగబెట్టేదేమిటి? ఏతావాతా చట్టం అమల్లోకి వచ్చినా, కుటుంబానికి దక్కేది కిలో మూడు రూపాయల చొప్పున 25 కిలోలు మాత్రమే. సోనియాగాంధీ సూచించిన 35 కిలోలు కూడా కాదు. కాగా వీరంతా మార్కెట్ ఎకానమీ బాధితులుగానే కొనసాగుతారు. ఈ ధరల పెరుగుదల నుంచి ప్రజలకు విముక్తి లభించాలంటే వ్యవసాయ సంస్కరణలపై దృష్టిని కేంద్రీకరించాలి. ప్రభుత్వమే నియమించిన స్వామినాథన్ కమిటీ సూచనలను అమలు పరచాలి. భూసంస్కరణల అమలు, రైతులకు అధికంగా వ్యవస్థాగత రుణాలు, ప్రోత్సాహక ధరలు, సబ్సిడీతో ఉత్పత్తి కారకాల సరఫరా, ఫ్యూచర్ ట్రేడింగ్‌పై నిషేధం, ఫుడ్ కార్పొరేషన్ పునరుద్ధరణ, దిగుమతుల మీద ఆంక్షలు, అంతర్జాతీయ సంస్థలు, కార్పొరేట్లు, మాల్స్ నేరుగా రైతువద్ద నుంచి ఆహార ధాన్యాల కొనుగోలు మీద ఆంక్షల్లాంటి చర్యలు చేపడితే, ఆహార ధాన్యాల ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ఆహార ఉత్పత్తి పెరిగి ధరల స్థిరత్వం సాధించవచ్చు. అపుడు ఆహార భద్రతాచట్టం అవసరమే ఉండదు.

ధరల పెరుగుదలకు మనమే వోటు వేస్తున్నామని నేనంటే కోప్పడకండి. మనను పాలిస్తున్నది పెట్టుబడిదారీ ప్రభుత్వం. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలొచ్చాయని అనుకోవడం ఎలాంటిదో, పెట్టుబడిదారీ విధానాన్ని అవలంబిస్తున్న పార్టీకి వోటువేసి అధికారంలో కూర్చోబెట్టి, ధరలు పెరుగుతున్నాయని, తగ్గించాలని అరవడమేమిటి? లాభం, మరింత లాభం అది పెట్టుబడిదారీ విధానం ఏకైక లక్ష్యం. ఎంతగా ధరలు పెరిగితే, అంతగా లాభం. అందుచేత ధరలు పెరగడానికి, పెంచడానికి అవకాశం ఇచ్చే విధానాన్ని పాలకులు బాగానే రక్షించుకొంటున్నారు. ఎటొచ్చీ ఆ విధానం దుష్ఫలితాలను పాలకులు మన నెత్తిన రుద్దుతుంటె, మనం ఆ విధానాల మోసపు వలలో పడి మనలను మనమే రక్షించుకోలేకపోతున్నాం. తిండి గింజలను వారు వ్యాపార వస్తువుగా మార్చేశారు. ప్రభుత్వం ప్రపంచీకరణతో మమేకమైపోయింది. మంచినీటి వద్దనుంచి ఆహారధాన్యాల వరకూ ప్రజల నిత్యజీవనంతో సంబంధంవున్న అన్ని ఉత్పత్తులూ బహుళజాతి సంస్థల గుప్పిట్లో ఉంచుకొని ప్రపంచ వ్యాప్తంగా ధరలను శాసిస్తున్నాయి. ఉదాహరణకు ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల మూలంగా పంట తగ్గితే, ధరలు పెంచేస్తాయి. దేశంలో కూడా ధరలు పెరుగుతాయి లేదూ, ఆ దేశాల్లో పంట బాగా పండితే, వారి అవసరాలు తీర్చుకొని

ఖనిజాలు వెలికితీసే నిర్ణయాధికారం, భాగస్వామ్యం, మొత్తంగా ఖనిజ ఉత్పత్తి పై హక్కులు స్థానికులకే ఉండేలా విధానాలను సమీక్షించాలని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

మైనింగ్ దోపిడీకి పాలకుల వత్తాసు

మన దేశంలో 1956 నాటి పారిశ్రామిక విధానం ప్రకారం ప్రధాన ఖనిజాలైన బొగ్గు, లిగ్నైట్, ఖనిజ నూనెలు, ముడి ఇనుము, రాగి, జింక్ వంటివి పూర్తిగా ప్రభుత్వ రంగంలో ఉండేవి. సాధారణ ఖనిజాలు మాత్రమే ప్రైవేట్ రంగంలో ఉండేవి. నేటికీ కొన్ని ఖనిజాల తవ్వకం ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతోంది. ఖనిజ సంపద పునరుత్పత్తి అయ్యేది కాదు. అందువలన భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని వాటిని పొదుపుగా వాడుకోవలసి వుంది. 1990లలో ఉదారవాద ఆర్థిక విధానాలు చేపట్టిన తర్వాతి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఖనిజాల కోసం డిమాండ్ బాగా పెరిగింది. ఫలితంగా గనుల తవ్వకం ప్రైవేట్ రంగంలో విచక్షణా రహితంగా పెరిగింది. అనుమతులు లేకుండానే అక్రమంగా ఖనిజ తవ్వకాలు జరుగుతున్నాయి, నిబంధనలు పాటించడం లేదు. ఖనిజాలను తవ్వే క్రమంలో భూమిని డొల్ల చేస్తున్నారు. ఫలితంగా భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయి. గనులు తవ్వే క్రమంలో వెలువడుతున్న వ్యర్థ, విష పదార్థాల వల్ల పర్యావరణానికే కాక పరిసర ఆవాసాల ప్రజలకు హాని జరుగుతోంది. అడవులను హరించివేస్తున్నారు. ప్రజలను నిర్వాసితులను చేసి సొంత భూములపైనే వారిని కాందిశీకులుగా మారుస్తున్నారు. స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు పరిశ్రమ అవసరాల కోసం ఖాళీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం గనుల యాజమాన్యాన్ని అదుపు చేసే తీవ్రమైన చర్యలను చేపట్టలేదు.

1993లో రూపొందించిన జాతీయ ఖనిజ విధానం గనుల రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించే సాకుతో ముడి ఇనుము, మాంగనీసు, బాక్సైట్, నికెల్ తదితర ఉత్పత్తుల్లోకి ప్రైవేట్ పెట్టుబడులకు ప్రవేశాన్ని కల్పించింది. అంతేకాక, గనుల తవ్వకంలో విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి, అదే విధంగా విదేశీ సంస్థల భాగస్వామ్యానికి వెసులుబాటు కల్పించింది. ఆరంభంలో 50 శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రభుత్వం అనుమతించింది. క్రమంగా 2006 నాటికి 100 శాతానికి అనుమతించింది. తొలుత విదేశీ పెట్టుబడులు అంతగా రాలేదు. ఈ శతాబ్దారంభం నుండి పెట్టుబడులు ప్రవాహంలా వస్తున్నాయి. రానున్న కొద్ది సంవత్సరాలలో తూర్పు భారతదేశంలో లోహ, గనుల రంగంలోకి ముప్పై వేల కోట్ల డాలర్లు (దాదాపు రు.14 లక్షల కోట్లు) పెట్టుబడులు రాగలవని భారతీయ లోహ సంస్థ 2009లో అంచనా వేసింది. ఈ పెట్టుబడులు ప్రధానంగా ఖనిజ సంపద అధికంగా ఉన్న ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు ఆ తర్వాత ఛత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు వస్తున్నాయి.

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సి.ఎస్.ఇ) 2008 అధ్యయనంలో దేశవ్యాప్తంగా పర్యావరణ విధ్వంసం, పేద ప్రజలు విస్థాపనకు గురైనట్లు తెలిపింది. స్వాతంత్ర్యానంతరం గనుల తవ్వకం వలన రెండున్నర కోట్ల మంది నిర్వాసితులైతే 25 శాతానికి మాత్రమే పునరావాసం లభించినట్లు పేర్కొంది. నిర్వాసితుల్లో 60 శాతం ప్రజలు ఆదివాసులేనని ఆ అధ్యయనం తెలిపింది. ఇతర ప్రాజెక్టుల ద్వారా నిర్వాసితులైన దాని కంటే గనుల తవ్వకం వలన నాలుగు రెట్లు అధికంగా నిర్వాసితులవుతున్నట్లు పేర్కొంది. ప్రభుత్వం గనుల రంగంలోకి ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలనుకున్నప్పుడు తదనుగుణ్యమైన నిబంధనలను రూపొందించి అమలు చేయవల్సిన బాధ్యత ఉంటుంది. గనుల తవ్వకం వలన నిర్వాసితులవుతున్న పేదలకు ముఖ్యంగా ఆదివాసీలకు పునరావాస

మిగులును అభివృద్ధి చెందుతున్న దేశాలకు అమ్మచూపుతారు. అదే సమయంలో ఆ దేశాల్లో కూడా బాగా పంటలు పండితే, ప్రపంచ బ్యాంకు ద్వారా మీరు తిండి గింజల పంట తగ్గించి వ్యాపార పంటలు పండించండి అని సలహా ఇస్తుంది. బ్యాంకు దేశానికి రుణం ఇచ్చేటపుడు మీరు ఫలానా పంట పండిస్తేనే రుణం ఇస్తామని మెలిక పెడుతుంది. చంద్రబాబు హయంలో రైతుల సంఖ్యను ప్రస్తుతమున్న 60 శాతం నుండి 30 శాతానికి పిలుపిచ్చారంటే అది ప్రపంచ బ్యాంకు ఆదేశమే. మనం ఆహార ధాన్యాల పంట తగ్గిస్తే దిగుమతుల మీద ఆధారపడాల్సి వస్తుంది. అది అవకాశంగా తీసుకొని ధర పెంచేస్తాయి. ఆ భారం మన ప్రజల నెత్తిన పడుతుంది. ధరలు పెరగడానికి మరో కారణం మన ప్రజా పంపిణీ వ్యవస్థ. అదెంత అధ్వాన్నంగా నడుస్తుందో మనందరికీ తెలుసు. నిరుపేదలు, పేదలు, పేదరికపు రేఖకు కింద ఉన్నవారని, పైన ఉన్నవారని అనేక విభాగాలు సృష్టించి, ఫుడ్ కార్పొరేషన్‌ను నామ మాత్ర ఉనికికి దిగజార్చి, ప్రజలను మార్కెట్ మీద ఆధారపడేలా చేసింది. వ్యాపారస్తులకు, మీరు సొమ్ముచేసుకోండని ప్రభుత్వం వారికి పచ్చజండా ఊపింది. చవక దుకాణాల ద్వారా సరఫరా 25 కిలోలకు తగ్గించమంటే, పేదలు మరింతగా మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తుంది.

ధరల తాచుపాము పడగవిప్పింది; కాటేస్తుంది. రక్షించడానికి పాముల నర్సయ్యలేదు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలోపునే ప్రాణాలు గాలిలో కలిసి పోతాయి. ప్రజలు ఉద్యమించడమే దీనికి విరుగుడు.

(రచయిత సీనియర్ పాత్రికేయులు, వీక్షణం గౌరవ సంపాదకులు) వీ

సౌకర్యం కల్పించవలసివుంది. పచ్చని పంట పొలాల్లో, అడవి ప్రాంతంలో గనుల తవ్వకాన్ని నిషేధించవలసి ఉంది. అదేవిధంగా కాలుష్యాన్ని కనీస స్థాయికి తగ్గించవలసి ఉంది. చాలా రాష్ట్రాల్లో లీజు కాలం ముగిసినా, లీజు కాలం పొడిగించాలని కోరిన వారికి ప్రభుత్వాలు అనుమతించక పోయినా తవ్వకాలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. ఇలాంటివి అత్యధికంగా ఒడిశాలో ఉన్నాయి. లీజు కాలం పెంచడంలో ప్రభుత్వపరంగా జాప్యం జరిగితే గడువు పొడిగించినట్లు భావించే (డీమ్డ్ ఎక్స్‌టెన్షన్) నిబంధన 24 (6) ఎం.సి.ఆర్., 1960 లోని లొసుగు ఆధారంగా తవ్వకాలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

1997లో సుప్రీం కోర్టు ఇచ్చిన సమత తీర్పులో ఆదివాసీ ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలు ఖనిజ తవ్వకాలు జరుపకూడదని, గిరిజన సంఘాలు, లేదా సహకార సంఘాలు లేదా ప్రభుత్వం మాత్రమే తవ్వకాలు జరపాలని పేర్కొంది. గనుల దోపిడీకి పగ్గాలు వేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు ఒడిశా, ఆంధ్రాలో బినామీగా వ్యవహరించి గనుల కంపెనీలకు విలువైన వనరులను ధారాదత్తం చేస్తూ పరమోన్నత న్యాయస్థానపు తీర్పునకు సైతం వక్ర భాష్యం చెబుతున్నాయి. గనుల దోపిడీని అడ్డుకోవాల్సిన ప్రభుత్వాలు నిబంధనలకు పాతరేసి ఆదివాసీ ప్రాంతాలలో అశాంతి పరిస్థితులకు కారణమవుతున్నాయి. అధికార పీఠంపై నున్న శక్తి సంపన్నమైన రాజకీయ నేతలతో ప్రభావశీల గనుల వ్యాపారవేత్తలు చేతులు కలిపి ఇష్టారాజ్యం చెలాయించడం ప్రజాస్వామ్య సంస్థల నిష్క్రియాత్మకతను తెలియజేస్తుంది. జార్ఖండ్, ఛత్తీస్‌ఘఢ్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో ఈ నిజం తిరుగులేని విధంగా రుజువైంది.

గనుల, ఖనిజాల (నియంత్రణ – అభివృద్ధి చట్టం) 2010 పేరిట రూపొందించిన ముసాయిదా బిల్లు చుట్టూ అనేక వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. బిల్లును గత మార్చ్ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల లోనే ఆమోదిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ బిల్లును ఆమోదించడంలో సఫలం కాలేదు. గనుల తవ్వకం ద్వారా లభించే లాభాలలో 26 శాతం స్థానిక ప్రజలకు, రాష్ట్రానికి చెందాలన్న గనుల మంత్రిత్వశాఖ ప్రతిపాదనను న్యాయ మంత్రిత్వశాఖ తిరస్కరించింది. ముసాయిదా చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్న గనులశాఖ మంత్రి ప్రయత్నాలకు ఇతర మంత్రుల నుండి ఎలాంటి తోడ్పాటు లభించడం లేదు. బిల్లులోని కీలకమైన గనుల లీజు నిబంధనల విషయంలో కేంద్ర న్యాయశాఖ, గనుల మంత్రిత్వ శాఖల మధ్య అభిప్రాయ భేదాలు రావడంతో చివరకు ఈ బిల్లును సమీక్ష కోసం ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలోని మంత్రివర్గ బృందానికి అప్పగించారు. ఈ నూతన చట్టమైనా ప్రజల ఆకాంక్షలు, పర్యావరణ పరిరక్షణ, పునరావాసం, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుంటుందా? అక్రమాలకు పాల్పడుతున్నవారికి శిక్ష పడేలా చర్యలుంటాయా? గనుల తవ్వకాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు మేలు జరుగుతుందా? అన్ని విధాలా నష్టపోయే ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడే చర్యలుంటాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చట్టంలో చోటు చేసుకోలేదు. ప్రజాక్షేమం, జాతికి తోడ్పడే విధంగా గనుల, ఖనిజాల (నియంత్రణ – అభివృద్ధి) చట్టాన్ని రూపొందించి అమలు చేసేందుకు మన పాలకులు మల్లగుల్లాలు పడడం శోచనీయం. గనుల (నియంత్రణ, అభివృద్ధి) చట్టం 2010 ముసాయిదాలోని చాలా అంశాలు పెట్టుబడుల ఆకర్షణ కోసమే ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయని 'మైన్స్, మినరల్స్ అండ్ పీపుల్ (ఎం.ఎం.పి)' వంటి జాతీయస్థాయి గనుల తవ్వకాల వ్యతిరేక పోరాట సంస్థ ఆరోపించింది. గనుల తవ్వకాలపై కొంతకాలం నిషేధం విధించాలని, పంట పొలాల్లో, అడవిలో గనుల తవ్వకాలకు అనుమతి ఇవ్వద్దని, ఎర్ర నేలల్లో జనవాసాలు లేనిచోట మాత్రమే గనుల తవ్వకాలకు అనుమతించాలని డిమాండ్ చేసింది. అక్రమ ఖనిజ తవ్వకాల బాధితుల విషయంలో వివాదాలను విచారించేందుకు, లీజుల అక్రమాలను పరిష్కరించేందుకు స్వతంత్ర ట్రిబ్యునల్ వంటి ప్రతిపాదనలు బిల్లులో ఉన్నా వాటి అమల్లో చిత్తశుద్ధి ప్రశ్నార్థకమని, అలాగే మైనింగ్ కంపెనీ తన లాభాల్లో 26 శాతం స్థానిక అభివృద్ధికి కేటాయించాలని ప్రతిపాదించడం ఏ ప్రాతిపదికన నిర్ధారించారో అర్థం కాని విషయమని ఎం.ఎం.పి. అభిప్రాయపడింది.

దేశ వ్యాప్తంగా విలువైన ఖనిజ వనరులు ఆదివాసులు నివసించే అడవుల్లోనే ఉన్నాయి. ఆ వనరులే వారి జీవితాల విధ్వంసానికి, ప్రమాదానికి కారణమవుతున్నాయి. అధికారిక వివరాలననుసరించి మన దేశంలో 86 రకాల ఖనిజాలు లభిస్తున్నాయి. బొగ్గు, లిగ్నైట్ ఖనిజ ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. ముడి ఇనుము ఉత్పత్తిలో నాల్గవ స్థానం, మాంగనీసు ఉత్పత్తిలో ఐదవ స్థానంలో ఉంది. 90 శాతం బొగ్గు గనులు, 80 శాతం ఇతర ఖనిజ నిల్వలు ఆదివాసీ ప్రాంతాల్లోనే నిక్షిప్తమై ఉన్నాయి. దేశంలో మొత్తం బాక్సైట్ నిక్షేపాలు దాదాపు 90 శాతం ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలోని ఆదివాసులు నివాసముండే ప్రాంతాల్లోనే లభ్యమవుతున్నాయి. అందువలన గనుల యాజమాన్యాల దృష్టి అంతా ఈ ఆదివాసీ ప్రాంతాల పైనే పడింది. కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 8704 గనులను చట్టబద్ధంగా లీజుకు ఇచ్చారు. ఇవికాకుండా లెక్కలేనన్ని చిన్న తరహా ఇసుక క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. దేశంలో ఇప్పటి వరకు అధికారికంగా 1.64 లక్షల హెక్టార్ల అటవీ భూమిలో మైనింగ్ జరుగుతోంది. ఇనుప ఖనిజ పరిశ్రమ అవసరాలకు ప్రతి సంవత్సరం 7.7 కోట్ల టన్నుల (టన్ను 1000 లీటర్లు) నీరు అవసరమవుతుంది. ఈ నీటితో 30 లక్షల మంది దైనందిక అవసరాలు తీర్చవచ్చు.

అక్రమ ఖనిజ తవ్వకాలపై 2005లో ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ 14,504 చోట్ల అక్రమ ఖనిజాల తవ్వకాలు జరుగుతున్నాయని గుర్తించింది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ ఖనిజ తవ్వకాలు సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా తీరని నష్టాన్ని కలుగజేస్తున్నాయని కమిటీ తన నివేదికలో తెలిపింది. ఖనిజ నిల్వలు అధికంగా ఉన్న 11 రాష్ట్రాల్లో 2009 నాటికి 42 వేల కేసులు నమోదయ్యాయని న్యాయ శాఖ ఇటీవల వెల్లడించింది. గనుల అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించడానికి సుప్రీం కోర్టు 'కేంద్ర సాధికారిక కమిటీ' (సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ) ని నియమించింది. కేంద్ర గనుల శాఖామాత్యులు దేశ వ్యాప్తంగా 2,496 భారీ, 28,055 చిన్నస్థాయి ఖనిజ తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయని ఇటీవలనే ప్రకటించాడు.

ఈ గణాంకాలు గమనిస్తే గనుల తవ్వకాలలో అక్రమాల పరంపర ఏ స్థాయిలో కొనసాగుతుందో మనం సులభంగానే అర్థం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర పాలకులు అక్రమాలను సంవత్సరాల తరబడి చూసీ చూడనట్లు ఉండడం మినహా నియంత్రించిన దాఖలాలు మాత్రం లేవు. ఫలితంగా జాతి సంపద అక్రమ దోపిడీదారుల పరమైపోతుంది. ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా అక్రమాల గనుల ఘనులతో

పెనవేసుకున్న రాజకీయ బంధమే ఈ దుస్థితికి మూలకారణం. ఇందుకు తాజా ఉదాహరణలు జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా 4,300 కోట్ల రూపాయల అక్రమ గనుల కుంభకోణంలో ఇరుక్కోవడం, కర్ణాటకలో గాలి జనార్ధనరెడ్డి, కరుణాకరరెడ్డి, సోమశేఖరరెడ్డిల అక్రమాలు వెలుగులోకి రావడం.

రాంచీ కేంద్రంగా ఏర్పడిన బృందారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ స్టడీ అండ్ యాక్షన్ (బి.ఐ.ఆర్.ఎస్.ఎ), జార్ఖండ్ మైనింగ్ ఏరియా కోఆర్డినేషన్ కమిటీ (జె.ఎం.ఎ.సి.సి)లు విధ్వంసకరమైన అభివృద్ధి నమూనా వలన సహజ వనరులు దోపిడీకి గురవడంతోనే జార్ఖండ్ ప్రజల నుండి ప్రతిఘటన మొదలైందని పేర్కొనడం గమనార్హం. మైనింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న అక్రమాలన్నీ అత్యధిక ఖనిజ సంపద కలిగివున్న జార్ఖండ్‌లో బట్టబయలయ్యాయి. ప్రకృతి వనరుల విచక్షణారహిత దోపిడీ, అత్యధికంగా విస్థాపన చెందిన ఆదివాసీలు, మైనింగ్ ముఠా రాజకీయ ముఠాగా పరిణామం చెందడం జార్ఖండ్‌లో మనం గమనించవచ్చు. జార్ఖండ్ ప్రభుత్వం 2000–2006 మధ్యకాలంలో బహుళజాతి సంస్థలైన మిట్టల్, టాటా, జిందాల్ లాంటి కంపెనీలతో 2 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 44 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. మధు కోడా ముఖ్యమంత్రి కాగానే వీటన్నింటిని పునః సమీక్షిస్తామన్నారు. కాలానుక్రమంలో బహుళ జాతి సంస్థలతో ఆయన కుమ్మక్కయి పీకల లోతు అవినీతిలో కూరుకుపోయాడు.

ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం ఏప్రిల్ 2005లో సమీకృత ఉక్కు కర్మాగారాల నిర్మాణానికి ఎస్సార్ స్టీల్, టాటా స్టీల్‌తో పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు చేసింది. ఒప్పందాలు రహస్యంగా ఉన్నాయి. మొదటిది 70 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు బైలదిల్లాలో, రెండవది 10వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు లోహండిగూడలో ఏర్పాటు చేస్తున్నారు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వార్షిక పుస్తకంలో ప్రచురించిన వివరాల ప్రకారం 28 రకాల విలువైన ఖనిజాలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిక్షిప్తమై ఉన్నాయి. బొగ్గు, ఇనుప ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సైన్స్ ప్రచురించిన 'సంపన్నమైన నేలలు – పేద ప్రజలు' (రిచ్ లాండ్స్ – పూర్ పీపుల్) అనే పుస్తకంలో లభ్యమవుతున్న వివరాల ప్రకారం దేశంలోని ఖనిజ సంపదలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో 10 శాతం ఇనుప ఖనిజం, 5 శాతం సున్నపురాయి, 5 శాతం బాక్సైట్, 88 శాతం తగరం, 33 శాతం డైమండ్స్ నిక్షిప్తమై ఉన్నాయి. ఈ కారణంగానే అంతర్జాతీయ సంస్థలైన వేదాంత, జిందాల్ లాంటివి ఛత్తీస్‌ఘడ్‌లోని వనరులను కబళించాలని చూస్తున్నాయి. ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ దేశీయ విదేశీయ కార్పొరేట్లతో 102 ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందాలన్నీ వాస్తవరూపంలో డబ్బుగా మారడానికి అడవి నుండి ఆదివాసుల్ని గెంటివేయాలి. మావోయిస్టుల అణచివేత పేరుతో జరుగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ అసలు లక్ష్యం బహుళజాతి సంస్థలకు ఖనిజ సంపదను దోచిపెట్టడానికే నన్నది సుస్పష్టం.

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ మన్యంలో బాక్సైట్ ఖనిజ వెలికితీత ఒప్పందాల విషయంలో ప్రజాభిప్రాయాన్ని గాని, హక్కుల సంఘాల అభిప్రాయాన్ని గాని, ప్రజా సంఘాల అభిప్రాయాన్ని గాని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. వేలకోట్ల రూపాయల జాతిసంపదను అన్‌రాక్, జిందాల్ వంటి బహుళజాతి సంస్థలకు అడ్డగోలుగా దోచి పెట్టేందుకు ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాసింది. రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాలలో సముద్ర ఇసుకలో ఖనిజ తవ్వకాల కోసం గ్లోబల్ టెండర్లను ఆహ్వానించిన ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, లక్షల కోట్ల రూపాయల విలువైన బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించక పోవడంలోని అంతరార్థం ప్రభుత్వంలోని కీలక నేతల అండదండలేనన్నది బహిరంగ రహస్యమే. వై.ఎస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒ.ఎం.సి. అక్రమాలు, బ్రాహ్మణి స్టీల్స్ తతంగం, ఇప్పుడు ఖమ్మం జిల్లాలోని బయ్యారం బండారం వెలుగులోకి వచ్చాయి.

కర్నాటక రాష్ట్రంలో రెండేళ్ల క్రితం బళ్లారి జిల్లాలో ఇనుప ఖనిజ తవ్వకాల అక్రమాలపై లోకాయుక్త జస్టిస్ కె. సంతోష్ హెగ్డే విచారణ చేసి ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఇనుప ఖనిజ తవ్వకాల అక్రమాల్లో అధికారుల, ప్రజా ప్రతినిధుల ప్రమేయముందని తేల్చి చెప్పాడు. అటవీ, పోలీసు, రవాణా శాఖల పాత్ర ప్రముఖంగా ఉందని నిర్ధారించారు. గనుల అక్రమ వ్యాపారంతో సంబంధమున్న వారి జాబితా ఇచ్చినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోగా ప్రోత్సాహకాలు ఇస్తున్నారని అంటూ లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే రాజీనామా సమర్పించారు. అరుంధతీరాయ్ ఫ్రంట్‌లైన్ పత్రికలో రాసిన వ్యాసంలో ఒక టన్ను ఇనుప ఖనిజాన్ని వెలికి తీస్తే ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో వచ్చేది 27 రూపాయలు కాగా కంపెనీకి మాత్రం 4500 నుండి 5000 రూపాయల వరకు లాభం వస్తుందని పేర్కొంది. ఇక బాక్సైట్ గనుల్లో ఈ లెక్కలు ఇంకా దారుణంగా ఉంటాయని పేర్కొంది. ఒడిశాలోని బాక్సైట్ నిక్షేపాల మొత్తం విలువ 2004 నాటి ధరలతో చూస్తే 2.27 ట్రిలియన్ డాలర్లు. ఇది మన దేశ జాతీయోత్పత్తి కంటే రెండు రెట్లు ఎక్కువ. ఇవ్వాల్టి ధరలతో చూస్తే 4 ట్రిలియన్ డాలర్లు. ఇలా పోగేసే వేల కోట్ల రూపాయలతో కార్పొరేట్ శక్తులు ఎన్నికలను, ప్రభుత్వాలను, అధికారులను, న్యాయమూర్తులను, పత్రికలను కొనెయ్యగలరని అభిప్రాయపడింది.

రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆదివాసులకు రక్షణ కల్పిస్తోంది. వారి భూమి అన్యాక్రాంతం కాకుండా నిరోధిస్తోంది. అయినా దానిని కాసింతైనా పట్టించుకున్న దాఖలాలు లేవు. దేశీయ, విదేశీయ బడా కంపెనీలు ఆదివాసీల మాతృభూమిని ఆక్రమించుకునేందుకు పోటీపడుతున్నాయి. వాటిలో మిట్టల్, జిందాల్, పోస్కో, ఎస్సార్, టాటా, రియోటింటో, బి.హెచ్.సి. బిల్టిన్, వేదాంత, సలీం వంటివి ఉన్నాయి. ఆదివాసీల భూములు ఆదివాసీలకే చెందాలని ఒడిశాలో 2/56 చట్టం ఉన్నా దాని అమలు చేసిన దాఖలాలు లేవు. 2002లో ఈ చట్టాన్ని పూర్తిగా మార్చివేసి కలెక్టర్‌కే పూర్తి అధికారం ఇచ్చి ఆదివాసీలకు ఎటువంటి హక్కులు లేకుండా చేసింది ఒడిశా ప్రభుత్వం. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను మొత్తం 341 గనుల్లో 215 గనులల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమంగా ఎలా తవ్వకాలు కొనసాగుతున్నాయో వివరణ ఇవ్వవల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫణికాంత్ మిశ్రా అధ్యయనం ఒడిశాలో 1993–1994 నుంచి 2003–2004 వరకు ఖనిజాల తవ్వకం సంవత్సరానికి 10.3 శాతం చొప్పున పెరుగుతుంటే కార్మికుల సంఖ్య మాత్రం ఇదే కాలంలో ఏడాదికి 4 శాతం చొప్పున తగ్గిందని తెలిపింది. అధిక భాగం ఖనిజాలు ఎగుమతుల కోసం ఉద్దేశించినవే. ఒరిస్సాలో ఖనిజ సంపద అపారంగా వెలికి తీస్తున్నప్పటికీ దాని ద్వారా ఆ రాష్ట్ర అభివృద్ధికి నామ మాత్రపు తోడ్పాటే ఉంది.

ఒడిశాకు చెందిన కొందరు సామాజిక కార్యకర్తలు 'వేదాంత' కంపెనీ ప్రభుత్వ మార్గదర్శకాలను అతిక్రమిస్తోందనీ, పర్యావరణానికి తీరని హాని చేస్తోందనీ, మానవ హక్కులను ఉల్లంఘిస్తోందనీ సుప్రీంకోర్టు లో కేసు ఫైలు చేసినపుడు జస్టిస్ కపాడియా వేదాంత కంపెనీ స్థానంలో దాని సోదర సంస్థ అయిన 'స్టెర్‌లైట్'కు స్థానం కల్పించాలని సూచించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అంతేకాకుండా న్యాయస్థానం లోనే తనకు 'స్టెర్‌లైట్' కంపెనీలో వాటాలున్నాయని నిస్సిగ్గుగా చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సుప్రీంకోర్టు స్వంత నిపుణుల కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి జస్టిస్ కపాడియా అటవీ అనుమతులు ఇచ్చేశారు. అమ్నెస్టీ ఇంటర్‌నేషనల్ ఇటీవలి అధ్యయనంలో ఒడిశాలోని వేదాంత గ్రూపుకు చెందిన లాంజీగర్ అల్యూమినియం రిఫైనరీ, నియమగిరి కొండల్లో చేపట్టిన బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ డోంగ్రియా ఖోండు జాతి ఆదివాసుల మానవ హక్కులను హరించాయని తెలిపింది. గాలి, నీరు, భూమి విషతుల్యం గాకుండా నిరోధించడంలో విఫలం చెందాయని అభిప్రాయపడింది. 1957 నాటి గనుల, ఖనిజాల (అభివృద్ధి - నియంత్రణ) చట్టం స్థానంలో మరో ప్రత్యామ్నాయ చట్టం రూపొందించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించింది.

కర్ణాటక లోకాయుక్త జస్టిస్ కె.ఎస్. హెగ్డే అక్రమ గనుల తవ్వకాన్ని, రాష్ట్రం నుంచి ఇనుప ఖనిజ అక్రమ రవాణాను అరికట్ట లేకపోతున్న కర్ణాటక ముఖ్యమంత్రి ఎడ్యూరప్ప నిస్సహాయ స్థితిని తెలుపుతూ ఇనుప ఖనిజ ఎగుమతిని నిషేధించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయడం ఈ సందర్భంగా గుర్తించాల్సిన అంశం. గత మార్చిలో లోకాయుక్త చేపట్టిన విచారణతో అటవీ శాఖ అధికారులలో కదలిక వచ్చి అనుమతి లేకుండా అక్రమంగా రవాణా అవుతున్న ఖనిజాన్ని మార్చ్ 15న స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఖనిజాన్ని కార్వార్, బెలెకెరి రేవుకు తరలించారు. అంకోలా న్యాయస్థానం తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు జప్తు చేసిన ఖనిజాన్ని రేవు సంరక్షకుడి వద్ద భద్రపరచినట్లు అటవీ అధికారులు తెలిపారు. కస్టమ్స్ అధికారులు బెలెకెరి రేవులో 8 లక్షల టన్నులు, కార్వార్ రేవులో 1.15 లక్షల టన్నుల మేరకు ఇనుప ఖనిజం ఉన్నట్లు వారి లేఖలో పేర్కొన్నారు. తొలుత అటవీ శాఖ అధికారులు వేసిన అంచనాకు ఇది సుమారు రెట్టింపుగా ఉంది. జూన్ మొదటి వారంలో దాదాపు 5 లక్షల టన్నుల ఇనుప ఖనిజం మాయమైందన్న సమాచారం సంచలనం సృష్టించింది. రేవు అధికారుల సంరక్షణలో ఉంచిన ఇనుప ఖనిజం, వారికి తెలియకుండా మాయమవుతుందా? ఈ వ్యవహారంలో కస్టమ్స్ అధికారుల అవినీతి, రేవు అధికారుల సహాయ సహకారాలు లేకుండా ఇదంతా ఎలా జరుగుతుంది? లోకాయుక్త సూచనలను, అవినీతి నిరోధక శాఖ అధికారులు అక్రమంగా రవాణా అవుతున్న ఖనిజాన్ని పట్టుకొని జప్తు చేసినప్పటికీ, రేవునుంచి ఇనుప ఖనిజం ఎగుమతి అయిందంటే కర్ణాటక ప్రభుత్వం గనుల యజమానులతో కుమ్మక్కయినట్లు కాదా?

లోకాయుక్త పదవికి కె.ఎస్.హెగ్డే రాజీనామాతో ప్రజా ఒత్తిడి పెరగడంతో జూలై 9న అసెంబ్లీలో కర్ణాటక ముఖ్యమంత్రి గత రెండేళ్లలో కోటి ఐదు వేల టన్నుల ఇనుప ఖనిజం అక్రమంగా విదేశాలకు తరలిపోయిందని అంగీకరించవలసి వచ్చింది. 2003 నుంచి 12 వేల కోట్ల విలువైన ముడి ఇనుము అక్రమంగా ఎగుమతి జరిగిందని తెలిపాడు. 2009-2010 సంవత్సరంలోనే 7.1 లక్షల టన్నుల ముడి ఇనుము అక్రమంగా ఎగుమతి అయిందన్నారు. దొడ్డిదారిన అనుమతులు పొందడం, అటవీ భూములను ఆక్రమించుకోవడం తదితర పద్ధతుల్లో అక్రమ మైనింగ్ కొనసాగుతోందన్నారు. బెలెకెరి, కర్వార్, మంగళూర్ పోర్టులతో పాటు పొరుగు రాష్ట్రాల పోర్టుల నుంచి (చెన్నై, గోవా, కృష్ణపట్నం, కాకినాడ, విశాఖ) కూడా అక్రమ రవాణా జరుగు తోందన్నారు. అటవీ, పర్యావరణ, పోర్టు అధికారులు మైనింగ్ ముఠాతో కుమ్మక్కయ్యారని తెలిపాడు. లోకాయుక్త నివేదిక ప్రకారం 2000-2006 మధ్యకాలంలో ఇనుప ఖనిజం వెలికి తీయడం కర్ణాటకలో 12 మిలియన్ టన్నుల నుంచి 184 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇదే కాలంలో ఎగుమతులు 6 మిలియన్ టన్నుల నుంచి 91 మిలియన్ టన్నులకు పెరిగాయి. ఒక టన్ను ఇనుప ఖనిజం ధర రు. 274 నుంచి రు.1061కు పెరిగింది. అయినా గనుల, క్వారీల ద్వారా వచ్చే ఆదాయం జాతీయాదాయంలో 2 శాతం మాత్రమే.

ఉదారవాద ఆర్థిక విధానాల ప్రవేశంతో గనుల్లో అక్రమార్జన జోరందుకుంది. దీనితోపాటే గిరిజనులు తమ సాంప్రదాయ బతుకు తెరువును కోల్పోవడం, నిరాశ్రయులు కావడంతోపాటు, పర్యావరణ నష్టాలు సంభవిస్తున్నాయి. తమ ప్రాబల్యాన్ని నిలుపుకోవడం కోసం గనుల యజమానులు ప్రైవేట్ సైన్యాలను పోషిస్తున్నారు. పార్లమెంటరీ రాజకీయాల్లో చొరబడి ప్రజా ప్రతినిధులుగా అవతారమెత్తుతున్నారు. డబ్బు లేదా అధికారాన్ని చూపి అధికార యంత్రాంగాన్ని శాసిస్తున్నారు. ఖనిజాలు విస్తారంగా ఉన్న ప్రాంతాల్లోకి బయటి వ్యక్తులు చొరబడి స్థానిక ప్రజల జీవితాలను, ప్రయోజనాలను పణంగా పెట్టి, వారి సాంప్రదాయక జీవనాన్ని భగ్నం చేస్తూ అపారంగా సంపదను పోగేసుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం గనుల యాజమాన్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టడం లేదు.

పాలకులు ఖనిజ తవ్వకాల అంశాన్ని వాణిజ్య దృక్పథంతోనే చూస్తున్నారు. ప్రైవేట్ రంగానికీ, బడా కంపెనీల లాభాలకూ ప్రాధాన్యత ఇచ్చే ఉదారవాద విధానాలు ప్రత్యామ్నాయ చట్టాన్ని రూపొందించడానికి అవరోధంగా ఉన్నాయన్నది సుస్పష్టం. తాము అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయల సొమ్ములో గనుల వ్యాపారులు అవినీతిపరులను పెంచి పోషిస్తూ రాజకీయాలను శాసిస్తున్నారు. అధికార వర్గాన్ని, ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. పర్యావరణం, భవిష్యత్ తరాల అవసరాలు వంటి కోణాల్లో పాలకులు ఆలోచించడం లేదు. ప్రస్తుత విధానం వల్ల కోట్లాది ప్రజలు తమ జీవనోపాధి కోల్పోతున్నారు. లక్షలాది ఎకరాల పచ్చని భూములు పనికిరాకుండా పోతున్నాయి. పర్యావరణం నాశనమవుతుంది. అయినా నష్టపోయే ప్రజల కంటే లాభార్జన కోసం వచ్చే విదేశీ కంపెనీల లాభాల కొరకే పాలకులు ఆరాటపడుతున్నట్లు స్పష్టమవుతుంది. ఖనిజ తవ్వకాలు కావాలో, వద్దో నిర్ణయించుకునే పూర్తి అధికారం స్థానికప్రజలకే ఇవ్వాలి. ఖనిజ తవ్వకాలకు స్థానికులు ఒకవేళ అనుమతిస్తే ఆ ఖనిజ సంపదపై హక్కు వారికే ఇండాలి. ఆ తవ్వకాలలో వారిని భాగస్వాములను చేయాలి. ఈ తరహా స్పష్టమైన నిబంధనలు రూపొందించడంతో పాటు ఇప్పటికే దేశ వ్యాప్తంగా మంజూరైన ఖనిజ లీజులను పునఃసమీక్షించాలి. దేశ వ్యాప్తంగా గనులను జాతీయం చేసి ఈ వనరులను జాతీయ అవసరాల కోసం మాత్రమే పొదుపుగా ఉపయోగించుకోవాలి. అక్రమాలను నిరోధించాలి. అప్పుడే జాతి సంపదను దోచుకుంటున్న దోపిడీదార్లకు అడ్డుకట్ట వేసే వీలుంటుంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

దేశ భవిష్యత్తు కోసమూ, తమ అస్తిత్వం కోసమూ పోరాడే ఆదివాసులపై పాలకులు సాగిస్తున్న దమనకాండను నిరసిస్తూ, పోరాట మార్గమే ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయగలుగుతుందని అంటున్నారు **బి.డి. దమయంతి**

తాకిలోడులో గ్రీన్‌హంట్ దురాగతం

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఫిబ్రవరి 3న మాడ్ డివిజన్‌లోని తాకిలోడు గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయినట్లు పోలీసు అధికారులు చేసిన పచ్చిఅబద్ధాల ప్రకటనను ప్రసార మాధ్యమాలు ప్రచారం చేశాయి. కానీ కొంతకాలంగా దండకారణ్యంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలెవ్వరూ జరిగింది ఎన్‌కౌంటరనీ, చనిపోయింది సాయుధ మావోయిస్టు గెరిల్లాలనీ విశ్వసించలేదు. సింగారం, సింగనమడుగు, గొంపాడు, కోకవాడ అమానుష హత్యాకాండల పరంపరలో జరిగిన మరొక హత్యాకాండగా అనుమానించారు. ఆ అనుమానం అక్షరాలా నిజం.

సింగారం తదితర హత్యాకాండల పరంపరలోనే ప్రభుత్వ సాయుధ బలగాలు తాకిలోడు గ్రామంలోనూ నిరాయుధ ప్రజలను పట్టుకొని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించి, కాల్చి చంపి తమకు అలవాటయిన ఎన్‌కౌంటర్ కట్టుకథను నిస్సిగ్గుగా అల్లారు.

దండకారణ్యంలో అంకురించిన ప్రజా రాజ్యాధికారాన్ని చిదిమెయ్యడానికి సామ్రాజ్యవాదుల దన్నుతో దేశ పాలకవర్గాలు సాగిస్తున్న దమనకాండకు ముద్దుపేరు మొన్న జనజాగరణ్ అభియాన్, నిన్న సల్వాజుడుం, నేడు గ్రీన్‌హంట్. ఈ దమనకాండలో పార్టీపై, ప్రజలపై విచ్చలవిడి హింస కొనసాగుతోంది. అందులో భాగమే తాకిలోడు హత్యాకాండ.

భైరంగఢ్ నుండి వంద మందికి పైగా వచ్చిన సి.ఆర్.పి.ఎఫ్., ఎస్.పి.ఒ. తదితర సాయుధ మూకలు 2010 ఫిబ్రవరి 3న ఉదయం ఆరు గంటల సమయంలో తాకిలోడు గ్రామాన్ని చుట్టుముట్టాయి. తాకిలోడు గ్రామానికే చెందిన రాము అనే జనతన సర్కార్ (ప్రజా ప్రభుత్వం) పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడిని పోలీసులు గత నవంబర్‌లో ఎస్.పి.ఒ.గా మార్చుకున్నారు. విప్లవోద్యమాన్ని అణచడంలో భాగంగా పోలీసులు ప్రజలనూ, కుటుంబాలనూ చీల్చి కొందరిని నయానా భయానా తమ వైపుకు తిప్పుకొని మొత్తం ప్రజలకే కాక స్వయాన తమ తల్లిదండ్రులకూ, తోబుట్టువులకూ, భార్యా పిల్లలకూ శత్రువులుగా మార్చుతున్నారు. పాలకవర్గాలు పన్నుతున్న నీచమైన ఎత్తుగడల్లో ఇదొకటి. ఇందులో భాగంగా కొన్నాళ్ల క్రితం రాము తమ్ముడిని ఎస్.పి.ఒ.గా మార్చుకుని అతడి ద్వారా రామును రహస్యంగా ఎస్.పి.ఒ.గా మలిచారు. రాము ద్రోహిగా మారి గ్రామం నుండి పారిపోయేంత దాకా ఇక్కడి ప్రజా ప్రభుత్వం గుర్తించలేకపోయింది. ఈ ద్రోహి సహా మరికొందరు ఇన్ఫార్మర్ల సహాయంతో పోలీసులు తాకిలోడు గ్రామంపై దాడి చేశారు. ఇదే సమయంలో దాని సమీప గ్రామాలైన ధర్మ, మర్రమెట్ట, జాడ్కపారలపై మరికొన్ని సాయుధ మూకలు దాడి చేశాయి.

ఈ మూకలు ఈ గ్రామాల్లోకి ప్రవేశిస్తూనే విచక్షణా రహితంగా కాల్పులు జరిపాయి. టియర్‌గ్యాస్ వదిలారు. కనబడ్డవాళ్లను దుడ్డుకర్రలతో బాదారు. భీతావహులై పారిపోతున్న ప్రజలను వెంటాడి వెంటాడి కొందర్ని పట్టుకున్నారు. ఇలా తాకిలోడులో 14 మందినీ, జాడ్కపారలో ఒకరినీ, మర్రమెట్టలో ఇద్దర్నీ పట్టుకోగలిగారు. ఇలా పట్టుబడిన వారిలో తాకిలోడు గ్రామానికి చెందిన మోటు, మోటు కూతురు పద్నాలుగేళ్ల అమ్మాయి, జైరాం, ఆశారాం అనే ఇద్దరు అన్నదమ్ములు, కల్మం అనంతరాం, అతని తమ్ముడు శిశు, వేకో అనంతరాం, రాజు, రాము సహా మరికొందరూ, జాడ్కపార గ్రామానికి చెందిన ఇర్పాల్, మర్రమట్ట గ్రామానికి చెందిన కుయేర్, మరొక వ్యక్తి ఉన్నారు. పోలీసులు మొదట పాఠశాల ఉండిన చోటికి వెళ్లి అంతా వెతికారు. కానీ ప్రజా ద్రోహి రాము ఊళ్లో నుండి పారిపోయి ఎస్.పి.ఒ.గా మారిన తర్వాత పాఠశాలను ఇంకొక చోటుకు మార్చడం వల్ల ఆ పాఠశాలా, అందులో చదువుకునే చిన్నారులూ పోలీసుల చేతికి చిక్కకుండా తప్పుకోగలిగారు. పట్టుబడిన వాళ్లందర్నీ పోలీసులు విచక్షణా రహితంగా కొడుతూ తీసుకువెళ్తూ ఉంటే తాకిలోడు గ్రామ మహిళలు, వృద్ధులు అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అలా అడ్డగించిన వారందరినీ వృద్ధులనే విచక్షణ సైతం లేకుండా దారుణంగా కొట్టారు. పోలీసుల ఈ అమానుష కృత్యం ఫలితంగా పలువురు మహిళలు, వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. వాళ్ల శరీరాలు కదుములు తేలాయి. అలా చాలాసేపు పోలీసులను వెంబడిస్తూ తమ ఆప్తులను విడిపించుకోవడానికి తీవ్రంగా పెనుగులాడిన వాళ్లందరినీ పోలీసులు తమ పాశవిక బలాన్ని, విచక్షణారహిత హింసను ప్రయోగించి తరిమి కొట్టారు.

ఇంద్రావతి నది సమీపిస్తుండగా పి.ఎల్.జి.ఎ.కు చెందిన ఒక ప్లటూన్ ఎదురుపడి పోలీసుల పైకి కాల్పులు జరిపింది. దీని వలన బందీలుగా పట్టుబడిన కొందరికి పోలీసుల కబంధహస్తాల నుండి తప్పించుకునే అవకాశం దొరికింది. పారిపోగా మిగిలిన వాళ్లను ఇంద్రావతి నది దాటించి పోలీసులు వారికి యూనిఫారాలు తొడిగారు. పోలీసులు యూనిఫారాలు తొడుగుతున్నారంటే తర్వాత జరగబోయేదేంటో ఉద్యమ ప్రాంతాల్లోని పసిపిల్లలకు కూడా బాగానే తెలుసు కనుక, తన తండ్రికి యూనిఫాం తొడుగుతున్నప్పుడు మోటు కూతురు ఏడుస్తూ అడ్డుకోవడానికి పెనుగులాడింది. ఆమె తమకు బంధువే అయిన ద్రోహి రాముతో 'మాకు బంధువు అయి ఉండి మా నాన్నను ఎందుకు

చంపిస్తున్నావు? మా నాన్న ఏం నేరం చేశాడు?' అని దీనంగా వేడుకుంది, కోపంతో తిట్టిపోసింది. అన్నదమ్ములైన జైరాం, ఆశారాంలు తమకు యూనిఫారాలు తొడుగుతున్నప్పుడు ఒకర్నొకరు కౌగిలించుకొని భోరుభోరున ఏడ్చారు. 'ఒకర్నొకరు పట్టుకొనే చనిపోదాం' అని ఒకరితో ఒకరు చెప్పుకున్నారు. కానీ ఇటువంటి హృదయవిదారక దృశ్యాలు హృదయం లేని పోలీసులను ఎలా కదిలించగలవు? అందుకే కూతురు ముందే తండ్రిని చెట్టుకు తలకిందులుగా వేలాడదీశారు. అన్నదమ్ములిద్దరినీ క్రూరంగా కొట్టి విడదీసి చెట్లకు వేలాడదీశారు. వీరితో పాటు రాము, రాజు, వేకో, అనంతరాం, కల్మం అనంతరాంలను చెట్లకు వేలాడదీసి అత్యంత ఘోరంగా, మానవత్వం సిగ్గుతో తలదించుకునేలా చిత్రహింసలు పెట్టారు. వాళ్ల కండరాలను కత్తులతో కోసివేశారు. కొందరి కళ్లు పెకిలించారు. నాలుకలు కోసేశారు. ఆ చిత్రహింసలకు తాళలేక వాళ్లు చేసిన గుండెల్ని పిండేసే ఆర్తనాదాలకు మోటు కూతురు, కల్మం అనంతరాం తమ్ముడు కల్మం శిశులు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. ఆ తర్వాత పోలీసులు ఈ ఏడుగురినీ కాల్చి చంపి శవాలను తాముతెచ్చిన వాహనంలో వేసుకొని వెళ్లిపోయారు. వాళ్లను కాల్చి చంపుతున్నప్పుడు మోటు కూతురు, కల్మం శిశులు తప్పించుకోగల్గారు.

ఇలా పోలీసులు పొట్టన పెట్టుకున్న వారిలో బార్స మోటు (35)కు భార్య, అయిదుగురు పిల్లలు ఉన్నారు. అందర్లోకి చిన్నవాడికి రెండు నెలల వయసు మాత్రమే. కల్మం అనంత్‌రాం (23)కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మరొక మృతుడు వేకో అనంత్‌రాం (30). 2007లో ఈ గ్రామంపై సల్వాజుడుం దాడి చేసినపుడు ఇతని భార్య ఐతేను జుడుం మూక పట్టుకొని ముక్కలు ముక్కలు చేసి చంపారు. అప్పటికి ఆమె చంటి బిడ్డ తల్లి. (ఆమెతో పాటు సిలుక్ అనే మరొక మహిళను కూడా కాల్చి చంపారు.) ఆ తర్వాత అనంతరాం తిరిగి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వారికి ఏడాది నిండని ఒక బాబు ఉన్నాడు. ఏముల జైరాం (30)కు భార్యా, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. ఏముల ఆశారాం (25)కు భార్యా, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉంది. కల్మామి రాము (22)కు భార్యా, రెండేళ్ల పాపాయి ఉన్నారు. మురామి రాజు (20)కు ఇటీవలే పెళ్లయింది. ప్రస్తుతం భార్య గర్భవతి. ఈ ఏడుగురిని పొట్టన పెట్టుకోవడం మూలంగా ఈ కుటుంబాలన్నీ చిన్నాభిన్నమయ్యాయి.

పోలీసులు చెప్పినట్టు వీళ్లెవరూ మావోయిస్టు పార్టీకి చెందిన సాయుధ గెరిల్లాలు కాదు. తమ భార్యా పిల్లలతో పాటు తమ ఇండ్లల్లో తాముగా, తమ బతుకులు తమవిగా జీవిస్తున్నారు. ప్రభుత్వం మావోయిస్టులను దేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద శత్రువులుగా బహిరంగంగా ప్రకటిస్తోంది. కానీ నిజానికి అది తమ ఇండ్లల్లో తాముగా, తమ బతుకులు తమవిగా జీవిస్తున్న సాధారణ పౌరులను కూడా శత్రువులుగానే పరిగణిస్తోంది. ఇందులో ఆశ్చర్యపోవాల్సిందేమీలేదు. అర్థం కానిది కూడా ఏం లేదు. పాలకవర్గాలు దండకారణ్యాన్ని, ఆ మాటకొస్తే మొత్తం దేశాన్ని సమూలంగా దోచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న నేటి సందర్భంలో ఈ అడవి నాది, ఈ ఇల్లు నాది, నేను ఈ గాలినే పీల్చుకుంటాను, ఈ మట్టిలోనే కలిసిపోతాను అని మాట్లాడినా శత్రువులుగానే పరిగణిస్తోంది. ప్రభుత్వమూ, పోలీసులూ ఎంత భయపెట్టినా, భ్రమ పెట్టినా 'రాహత్ శిబిరాల్లో' బందీలు కాకపోవడమూ, ఎస్.పి.ఒ.లుగానో, ప్రజా ద్రోహులుగానో మారకపోవడమూ, తమ కంటిని తమ వేలుతో పొడుచుకోవడానికి నిరాకరించడమూ – ఇవి కూడా పాలకుల దృష్టిలో నేరాలయ్యాయి. సామూహికంగా హత్యలకు పాల్పడి మావోయిస్టులనే ముద్ర వేసే ఘోరాలయ్యాయి.

పట్టుకుపోయిన తమ వారిని పోలీసులు దారుణంగా చంపేశారని తెలిసిన కుటుంబీకులూ, బంధువులూ, గ్రామస్తులూ భోరున విలపించారు. ఆగ్రహించారు. తమ వాళ్లను కాపాడుకోలేకపోయినా, వారి మృతదేహాలనైనా తీసుకువచ్చి తమ గడ్డమీద వారికి సగౌరవంగా అంత్యక్రియలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడి జనతన సర్కార్ కూడా మృతదేహాల స్వాధీనానికి కదలాలని ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు పిలుపునిచ్చింది. అందుకోసం మృతుల తల్లులూ, భార్యలూ సహా 150 మంది మహిళలు, వృద్ధులు కదిలి అదేరోజు రాత్రికిరాత్రే భైరంగఢ్‌కు వెళ్లారు. కానీ మనుషులను చంపి కనీసం శవాలను సైతం ఇవ్వనిరాకరిస్తున్న అత్యంత అప్రజాస్వామిక పరిస్థితుల్లో శవాల స్వాధీనానికి వాళ్లు తీవ్ర పోరాటమే చేయాల్సి వచ్చింది. వాళ్లేమీ హరించిన తమ వాళ్ల ప్రాణాలను తిరిగి ఇవ్వమని అడగలేదు. పొట్టన పెట్టుకున్న తమ వాళ్లను తిరిగి బతికించమనీ అడుగలేదు. కనీసం నిర్జీవంగానైనా తమ వాళ్లను తమకు ఇవ్వమని అడిగారు. కానీ ఫాసిస్టు పాలకులూ, వాళ్ల కాపలా కుక్కలైన పోలీసులూ దాన్ని కూడా సహించలేకపోయారు. శవాల కోసం వచ్చిన వారందరినీ పచ్చిబూతులు తిట్టారు. విచక్షణా రహితంగా లాఠీలతో కొట్టారు. బెదిరించారు. మృతుల తల్లులను సైతం విచక్షణా రహితంగా కొట్టారు. మృతుడు జైరాం తల్లి ఇందులో తీవ్రంగా గాయపడింది. అయినా వాళ్లెవరూ వట్టి చేతులతో తిరిగి రాదల్చుకోలేదు. 'చంపితే చంపండి. శవాలను వదిలి మేం వెళ్లం' అన్నారు. వాళ్లను శారీరకంగా హింసించడమే కాదు వాళ్ల మనోభావాలను తీవ్రంగా గాయపడేలా శవాల మీదికి ఎక్కి తొక్కడం, ఎగరడం చేస్తూ వికృతానందాన్ని చాటుకుంటూ కేరింతలు కొట్టారు. దీన్ని భరించలేని మహిళలు పోలీసులను తిట్టారు. ఒక మృతుని తల్లి ఒక ఎస్.పి.ఒ.ను కొట్టింది కూడా. ఇలా మహిళలు పట్టుదలగా పోరాడడం వల్ల తప్పనిసరై పోలీసులు 4న మధ్యాహ్నానికి మృతదేహాలను అప్పగించారు. మహిళలే ఆ మృతదేహాలను తమ గ్రామం వరకూ మోసుకువచ్చారు. అదే రోజు రాత్రి జనతన సర్కార్ ఆధ్వర్యంలో, చుట్టుపక్కల నుండి తరలివచ్చిన వందలాది మంది ప్రజానీకం రాజ్యహింసకు వ్యతిరేకంగా చేసిన నినాదాల నడుమ సగౌరవంగా ఆ ఏడుగురికి అంత్యక్రియలు జరిగాయి. ఫిబ్రవరి 7న తాకిలోడులో మృతుల స్మారక సభ జరిగింది. ఈ సభకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ హాజరై నివాళి అర్పించారు. ఈ అమానుష హత్యాకాండను ముక్త కంఠంతో ఖండించారు. ఇటువంటి హత్యాకాండలకు పాల్పడుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేసేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాల్సిందిగా దేశ ప్రజానీకానికీ, ప్రజాస్వామ్యవాదులకూ విజ్ఞప్తి చేశారు.

అయితే పోలీసుల చేతిలో బందీలుగాఉండి వారి అమానుషత్వాన్ని ఆ రోజు కళ్లారా చూసిన వారు మాత్రం చాలా రోజుల వరకు మానసికంగా కోలుకోలేకపోయారు. మోటు కూతురుకు పిచ్చెక్కింది. చాలా రోజుల వరకు ఆ అమ్మాయి మాటా మంతీ తిండీ నిద్రా లేకుండా గడిపింది.

మృతుల కుటుంబ సభ్యుల్లో మనోధైర్యాన్ని కల్పించడానికీ, ప్రజలూ, పార్టీ, జనతన సర్కార్ వారికి అండగా ఉంటుందనే హామీనివ్వడానికి స్థానిక పార్టీ, మృతుల కుటుంబ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసింది. వారి సాధక బాధకాలు తెలుసుకొని వారికి అవసరమైన ఆర్థిక సహాయం చేసింది.

విశిష్ట గుర్తింపు కార్డు పేరిట ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, వారి ప్రతి కదలికపై నిఘా వేస్తూ, ప్రజలను ప్రతిక్షణం అనుమానం, భయానికి గురిచేసే ఆధార్‌ను విశ్లేషిస్తున్నారు **ఎస్. సరళా వందనం**

ఆధార్ - వ్యక్తిగత స్వేచ్ఛ నిరాధార్

'ఎనిమీ ఆఫ్ ది స్టేట్' హాలీవుడ్ సినిమా చూశారా? చూడకపోతే తప్పక చూడండి. ఈ సినిమా ఒక మంచి కుటుంబ జీవితం గడిపే మధ్యతరగతి వ్యక్తి (హీరో విల్‌స్మిత్)కి, అతని ప్రస్తుత జీవితంతో ఎలాంటి సంబంధం లేని అతని మాజీ ప్రియురాలు తన దృష్టికి వచ్చిన, ఒక అత్యున్నత ఉద్యోగి చేసిన హత్య గురించి తెలిసిన సమాచారాన్ని చెప్పడం కోసం చేసిన ఫోన్‌తో మొదలవుతుంది. ఆ తరువాత వాళ్లు రహస్యంగా ఒక ప్రదేశంలో కలుసుకోవాలనుకుంటారు. ఈ విషయాన్ని ఆ హంతక అధికారి ఫోన్ సంభాషణల టాపింగ్ ద్వారా, వారి గుర్తింపు కార్డులలో సమాచారం ద్వారా తెలుసుకుంటాడు. ఆ తరువాత హీరో చేసే ప్రతి పనినీ, వెళ్లే ప్రతి చోటకూ, అతని ప్రతి కదలికనూ వెంబడిస్తూ, ఆర్థిక లావాదేవీలు స్తంభింపజేయడం (బ్యాంక్, క్రెడిట్ కార్డుల) దగ్గర మొదలయి, అతన్ని చేసే ఉద్యోగం నుంచీ, కుటుంబ జీవితం నుంచీ దూరమయ్యే పరిస్థితులు పత్రికల ద్వారా, టివి లాంటి ప్రచార సాధనాల ద్వారా కల్పించి, జీవించడానికే అతన్నో అనర్హుడిగా చేస్తాడు. ఈ దుస్థితిలోనే 'దేశానికే శత్రువు' అని ప్రభుత్వంతో కేసులు పెట్టించి పత్రికా ముఖంగా ప్రజలందరూ తెలుసుకొనేటట్టు చేసి, ఒక సాధారణ వ్యక్తిని ప్రభుత్వంతోనే చంపించాలని చూసేదే ఈ సినిమా. యాభై మిలియన్ల అమెరికన్ల వేలి ముద్రలతో కూడిన సమాచారం అమెరికా ఇంటెలిజెన్స్ వ్యవస్థ అయిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్.బి.ఐ) దగ్గర ఉండడం వలన అమాయక ప్రజల స్వేచ్ఛా జీవితాలపై జరిగే దాడిని ఈ సినిమా తెలియ చేస్తుంది.

మన దేశంలో కూడా ఇదే తరహాలో వేలిముద్రల సేకరణ, ఇతర సమాచార సేకరణ వ్యవస్థ ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికీ 'ఆధార్' (విశిష్ట గుర్తింపు సంఖ్య)ను 16 అంకెలతో జారీ చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కాబినెట్ మంత్రి హోదా కల్పించబడిన నందన్ నీలేకని అనే ఒక మాజీ కంప్యూటర్ కంపెనీ అధికారి (ఇన్ఫోసిస్) ఆధ్వర్యంలో నడిచే 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (యు.ఐ.డి.ఎ.ఐ.)కు ఈ పని అప్పగించబడింది. ఈ సంస్థ భారత ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తూ తన కార్యకలాపాలను దేశమంతటా కొనసాగిస్తుంది. ఈ సంస్థ 'ఆధార్'ను తయారు చేయడానికి కావల్సిన సమాచారాన్ని భారతీయ జనాభా గణన 2011లో భాగంగా జాతీయ జనాభా రిజిష్టరు తయారు చేయడం కోసం ప్రభుత్వం ప్రతి పౌరుని గురించి తీసుకుంటున్న సమాచారాన్ని తీసుకుంటుంది. ఈ సమాచారంతో పాటు తను నియమించిన కంప్యూటర్ కంపెనీల ద్వారా 15 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తి పది చేతివేళ్ల ముద్రలు (డెమోగ్రాఫిక్ విధానం ద్వారా), కనుపాపల ఫొటోలను (బయోమెట్రిక్ విధానం / ఐరిస్ పరిజ్ఞానం) సేకరించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి 'ఆధార్' (యు.ఐ.డి.) ను జారీ చేస్తుంది.

ఆధార్ జారీచేయడం కోసం ఈ సంస్థ ప్రజల దైనందిన జీవన విధానానికి సంబంధించిన అన్ని కోణాలలోని సమాచారాన్ని వివిధ ప్రభుత్వ శాఖలైన పౌరసరఫరాలు, రిజిస్ట్రేషన్, రవాణా, ఆదాయ పన్ను శాఖల నుండి తీసుకోవాలని ఒప్పందం చేసుకుంది. వీటితో పాటుగా 13,000 శాఖలు కలిగి 170 మిలియన్ల ఖాతాదారులున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోను, సంవత్సరానికి 3.88 కోట్ల పాలసీలు తీసుకొనే ప్రజలున్న జీవిత బీమా సంస్థ (ఎల్.ఐ.సి.)లతో ప్రస్తుతం వారి దగ్గరున్న సమాచారం తీసుకోవడంతోపాటు, ఖాతాదారుల పది చేతివేళ్ల ముద్రలు, ఐరిస్ టెక్నాలజీ ద్వారా కను పాపలను సేకరించడానికి ఒప్పందం చేసుకొంది. కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని నూతన పెన్షన్ విధానం, వస్తు సేవల పన్ను, జాతీయ ఖజానా నిర్వహణ సంస్థ, వ్యయ సమాచార నెట్‌వర్క్‌లలోని సమాచారాన్నంతటినీ అనుసంధానించి, ఐటి ఆధారిత సమీకరణ వ్యవస్థ ద్వారా ఈ సమాచారాన్ని ఒక చోటుకు చేర్చి కేంద్ర ఆర్థిక శాఖకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దే పనిని కూడా ఈ సంస్థకే కేంద్ర ప్రభుత్వం అప్పగించింది.

పలుకోణాలలో పౌరులకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ఈ సంస్థ కేంద్రీకృత సమాచార నిక్షిప్త వ్యవస్థలో ఉంచుతుంది. (సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీ). గుర్తింపు కార్డుల జారీకి, దారిద్ర్య రేఖకు

దేశ భవిష్యత్తు కోసమూ, తమ అస్తిత్వం కోసమూ పోరాడుతున్న ప్రజలపై పాలకవర్గాలు పాల్పడుతున్న ఇటువంటి హత్యాకాండలను ఖండించడం, దురాగతాలకు అడ్డుకట్టను వేసే ఉద్యమాలను చేపట్టడం ప్రజలు, ప్రజస్వామిక వాదుల కనీస బాధ్యత.

ప్రజలను పోరు మార్గాన్ని వీడేలా చేయడం కోసం పాలకవర్గాలు నిరాయుధ ప్రజలపై సైతం ఇటువంటి బీభత్స హత్యాకాండలను జరుపుతున్నాయి. అయితే సమస్యలు ఉన్నంత వరకూ ప్రజలు పోరు మార్గాన నడుస్తూనే ఉంటారు. నిర్బంధం మరింతగా ప్రతిఘటనను పెంచుతుందే తప్ప పోరాటాన్ని ఆపలేదు. ఇది చరిత్ర తేల్చిన సత్యం.

(రచయిత సామాజిక కార్యకర్త)

దిగువగా నున్న ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులోకి రావడం కోసం ఈ సమాచారాన్ని ఉపయోగిస్తామని నందన్ నీలేకని వివిధ సందర్భాలలో ఇచ్చిన ఇంటర్వ్యూలలో చెప్తుంటారు. ఈ సమాచారాన్నే వందల కొద్దీ ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ కంపెనీలకు వారు అమలు చేసే కార్యక్రమాలకు ఉపయోగపడడానికి, వారికి కావలసిన సమాచారాన్ని నిర్ధారణ చేసి ఈ సంస్థ ఆధ్వర్యంలోనే ఇస్తామని కూడా తెలిపారు.

కాని ఒక పక్క ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పెన్షన్ పథకంలోని లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వం 'స్మార్ట్ కార్డుల' జారీ పేరుతో బయోమెట్రిక్ పద్ధతి ద్వారా నిక్షిప్తం చేస్తుంది. ఇదే పద్ధతిలో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా పౌరసరఫరాల శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనైతే 1.88 కోట్ల తెల్లకార్డులు, 25 లక్షల గులాబీ కార్డులు జారీచేసే ప్రక్రియలో భాగంగా 4.30 కోట్ల ప్రజల కనుపాపలను నిక్షిప్తం చేసింది. ఈ ఐరిస్ టెక్నాలజీ ద్వారా ఒకే కనుపాప కలిగిన వారు రాష్ట్రంలో ఎక్కడైనా ఇంకో తెల్లకార్డు తీసుకొని ఉంటే వాటిని కనుక్కొనే విధానం ఇంటింటి సర్వేతో పాటు ఈ సమీకృత ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా సులభం కాబట్టి, దాదాపు 15 నుంచి 20 లక్షల బోగస్ తెల్లకార్డులు తొలగించడానికి పౌర సరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ రేషన్ కార్డుదారుల కనుపాపల సమాచారాన్ని తమ శాఖలకు కూడా అనుసంధానించాలని రవాణా, రిజిస్ట్రేషన్ శాఖలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వద్ద తమ ప్రతిపాదనను పెట్టాయి. ఈ శాఖలు ఈ సమాచారం సహాయంతో వాహనాల రిజిస్ట్రేషన్‌కు, లైసెన్సుల జారీకి, ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు తమ వద్దకు వచ్చే పౌరుల వేలిముద్రలను కేవలం 30 సెకన్లలోనే పరిశీలించి, వీరు తెల్లకార్డుదారులైతే, కార్డును పౌరసరఫరాల శాఖకు అప్పగించిన తరువాతే వాహన రిజిస్ట్రేషన్‌ను కాని, 750 చ.అ. పైనున్న స్థలాన్ని కాని, ఇంటిని కాని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతిస్తారు.

ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాల సక్రమ అమలుకు ఇన్ని రకాల జాగ్రత్తలు తీసుకొంటుంటే, కొత్తగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సక్రమ అమలు అనే పేరుతో ప్రతి వ్యక్తి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు – ఎవరిని పెళ్లి చేసుకున్నాడు? ఎవరితోనైనా వైవాహికేతర సంబంధం ఉందా? ఇంటి నుంచి ఎప్పుడు మారాడు, ఎక్కడకు మారాడు? ఏ ఉద్యోగం / వ్యాపారం చేస్తున్నాడు? ఎలా ఖర్చు పెడుతున్నాడు? డబ్బు లావాదేవీలు ఎవరితో చేస్తున్నాడు? ఫోన్ సంభాషణలలో ఎవరితో మాట్లాడుతున్నాడు? ఎవరితో కలిసి ప్రయాణిస్తున్నాడు? ఎక్కడికి ప్రయాణిస్తున్నాడు? లాంటి సమాచారం 'మౌస్' మీద ఒక్కసారి క్లిక్ చేస్తే తెలుసుకొనే వీలు ప్రైవేట్ కంపెనీ కంప్యూటర్ ఆపరేటర్ల దగ్గర ఉండడం, బాధ్యత కలిగిన ప్రభుత్వ నిర్దేశిత యంత్రాంగం దగ్గర ఉన్నంత పకడ్బందీగా ఉంటుందా? అంతే కాకుండా వీళ్లు ఈ సమాచారాన్ని తమ లాభం కోసం వ్యాపార సంస్థలకు, ప్రైవేట్ కంపెనీలకు, ఇన్సూరెన్స్ కంపెనీలకు, కన్సల్టెన్సీలకు, విదేశీ గూఢచార / రక్షణ సంస్థలకు అమ్మరని గ్యారంటీ ఏముంది?

అసాంఘిక శక్తులు, అధికారాన్ని తమ స్వప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే వాళ్లు ఈ సమాచారాన్ని తమకు కావలసిన రీతిలో వేరు చేయించుకొని తీసుకొనే అవకాశం పుష్కలంగా ఉంది. ఇలాంటి వారు ఇంతకు ముందు నాజీల పాలనలో యూదు జాతి మీద దాడులు జరిపినట్లుగా, ఒక మతం మీదో, కులం మీదో, జాతి మీదో, ప్రాంతం మీదో పథకం ప్రకారం దాడులు చేసే అవకాశం ఉంది. జర్మనీలో కూడా నాజీల పాలనకు ముందు 1933లో జనాభా లెక్కల సేకరణలో భాగంగా ఇంటర్నేషనల్ బిజినెస్ మెషిన్ సంస్థ (ఐ.బి.ఎం.) హొల్లెర్త్ డి-2 కార్డ్ సార్టింగ్ మెషిన్ సహాయంతో యూదుజాతి జనాభాను వేరుగా లెక్కించడమే కాకుండా, వారి ఆస్తులను, వారు ఎక్కెడెక్కడ నివసిస్తున్నారో కూడా గుర్తించి, ఆ సమాచారాన్ని వేరుగా తయారు చేసింది. ఈ ప్రైవేట్ కంపెనీ దగ్గరున్న సమాచారం తరువాత నాజీల చేతుల్లోకి వెళ్లి యూదు జాతినే సమూలంగా నాశనం చేయడం మొదలు పెట్టారు.

ఇప్పుడు మన దేశంలో పౌరుల స్వేచ్ఛను సమాచార సేకరణ పేరుతో ఎప్పటికప్పుడు సేకరించి, అందుబాటులో ఉంచడం వలన వీటిని తీసుకోగలిగేవాళ్లు, అధికారంలో ఉన్నవారు, తమకు శత్రువులైన వారి ఆర్థిక లావాదేవీలపై, వారి అభివృద్ధిపై, జీవన విధానంపై, చివరికి జీవించే హక్కును హరించడానికి కూడా ఉపయోగించుకుంటారు. కొంతమందికి వ్యక్తుల పట్లో, వర్గాల పట్లో ఉన్న ద్వేషంతో వారిని వేధించడానికి, మరికొంత మంది కళంకమైన తమ ప్రవర్తనను ఇతరులు కనుగొన్నారనో లేదా తెలుసుకుంటారనో, తద్వారా తమ మనుగడకు, ఎదుగుదలకు తమ స్వార్థ ప్రయోజనాలకు ఆటంకంగా మారుతారనే సంకల్పంతో తమ టార్గెట్ అయిన వారి వ్యక్తిగత, సాంఘిక జీవనంలోకి అనుక్షణం తొంగి చూసే వీలున్న సమాచారాన్ని తీసుకుంటారు. ఈ సేకరణను కేంద్ర ప్రభుత్వం తరఫున ఈ సంవత్సరం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి 2011 వరకు జరిగే జనాభా గణనకు అనుసంధానించి ముందుగా జాతీయ జనాభా రిజిష్టరును (ఎన్.పి.ఆర్.) తయారు చేయడంతోపాటు పది చేతివేళ్ల ముద్రలు, కనుపాపలను నిక్షిప్తం చేయడం ద్వారా మొదలుపెడతారు. భవిష్యత్తులో కూడా కొనసాగించడానికి ప్రతి మండలంలోను నిరంతరం 'ఆధార్' నంబర్ల జారీ ప్రక్రియతో పాటు, ఇతర సంస్థలకు సమాచారాన్ని అనుసంధానించడం, నిర్ధారించడం కూడా ఈ మాజీ కంప్యూటర్ కంపెనీ అధికారి ఆధ్వర్యంలో నడిచే ఈ సంస్థకే అప్పగించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం రు. 1900 కోట్ల నిధులను ప్రాథమికంగా ఈ సంస్థకు కేటాయించింది. ఈ నిధుల కేటాయింపు చూస్తే కనీసం 25 సంవత్సరాల భవిష్యత్తులో కంప్యూటర్ కంపెనీలకూ, వీటి అనుబంధ టెక్నాలజీ కంపెనీలకూ వేల కోట్ల వ్యాపారం జరిగే విధంగా ప్రణాళికను ఈ మాజీ కంప్యూటర్ కంపెనీ అధికారి రచించారని అర్థమవుతుంది.

వ్యాపార సంబంధ దృక్పథాన్ని పక్కకు పెడితే దేశ ప్రజలందరూ కూడా దేశ సమగ్రతకు భంగం కలిగించే ఉగ్రవాదులుగానో, నేరస్తులు గానో, దోషపూరిత మనస్తత్వంతోనో ఉండరు. ఈ మధ్య దేశ రక్షణకు సంబంధించిన మంత్రివర్గ కమిటీ సమావేశంలో నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం, ఉగ్రవాదానికి సంబంధించిన ముందస్తు సమాచారం తెలుసుకోవడానికి కావలసిన ప్రత్యేక సమాచార వ్యవస్థ లేకపోవడం వలన నెలల తరబడి సమయం వృథా అవుతుందనే చర్చలో భాగంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ఆధీనంలో ఉండే ఒక

కేంద్రీకృత సమాచార వ్యవస్థ – జాతీయ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (నిట్ గ్రిడ్) ను నెలకొల్పాల్సిన అవసరం ఉందని చెప్పింది. ఈ 'నిట్ గ్రిడ్' పౌరుల సమాచారాన్ని వివిధ శాఖల నుండి నిరంతరం సేకరించి తన కేంద్రీకృత సమాచార నిక్షిప్త వ్యవస్థలో ఉంచుతుంది. ఉదాహరణకు రవాణా (రైల్వే, బస్సు, విమాన టిక్కెట్లు, పెట్రోల్ బంకులు, టోల్‌గేట్, వివిధ లైసెన్సుల జారీ మొదలైనవి), ఆదాయ పన్ను, టెలిఫోన్ రంగం, బ్యాంకులు, రిజిస్ట్రేషన్ విభాగం, స్కూళ్లు, కాలేజీలు, ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, స్మార్ట్‌కార్డుల ద్వారా ప్రతి వ్యక్తి వివరాలను తన దగ్గర ఉంచి, ఈ సమాచారాన్నంతటినీ తనలో భాగమైన రాష్ట్ర పోలీస్ యంత్రాంగానికి, మిలిటరీ, విమాన, నౌకాదళ ఇంటెలిజెన్స్ విభాగాలకు, 'రా' (ఆర్.ఎ.డబ్ల్యు.)కు, ఐ.బి.కు, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకు, రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగానికి, కస్టమ్స్ యంత్రాంగానికి, నార్కోటిక్ బ్యూరోలకు నిరంతరం అందిస్తుంది. ఇందువలన భవిష్యత్తులో దేశ అంతర్గత భద్రతకు కలిగే ముప్పును, నేరాలను ముందుగానే గుర్తించడానికి వీలుంటుందనే దిశగా చర్చ కొనసాగింది. ముందుగానే చర్చించినట్లు తమకు ఇతరులపై ఉన్న ద్వేషం వలనో, తమకు వ్యతిరేకం కావొచ్చనే ఆలోచనలతోనో, అధికారంలో ఉన్న వారి ప్రాపకం కోసమో ఈ వ్యవస్థీకృత సమాచారంతో పోటీ రాజకీయ నాయకుల మీద, వ్యాపార సంస్థలపై, ప్రభుత్వ ఉద్యోగులపై, చివరికి ఒక సామాన్య వ్యక్తిని కూడా 'టార్గెట్'గా చేసుకొనే సందర్భాలు రావచ్చు.

నిర్ణీత కాలంపాటు అధికారంలో ఉండే రాజకీయ పార్టీలు, ఇందుకోసం నియమింపబడిన బాధ్యత కలిగిన ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కన పెట్టి, ప్రైవేట్ కంప్యూటర్ కంపెనీల చేతుల్లో దేశ పౌరులకు సంబంధించిన యావత్తు సమాచారం అంటే 'జాతి సంపద'ను పెట్టాలనుకోవడం 'జాతీయ జనాభా గణన చట్టం' 1948 సెక్షన్ 15 ప్రకారం నిషిద్ధం. ఈ సెక్షన్ ప్రకారం పౌరులకు సంబంధించిన సమాచారాన్ని తనిఖీకి ఒప్పుకోవడం కాని, ఏదైనా సాక్ష్యం కోసం తీసుకోవడంకాని చేయకూడదు. కాని జాతీయ జనాభా రిజిష్టరు రూపకల్పన జాతీయ పౌరసత్వ (పౌరుల నమోదు, జాతీయ గుర్తింపు కార్డుల జారీ) నిబంధనల చట్టం 2003 ద్వారా జరుగుతుంది. ఈ చట్టంలోని సెక్షన్ (18) సబ్ సెక్షన్ (3) ప్రకారం ఒక వ్యక్తిగాని, కుటుంబం కాని ఇచ్చిన సమాచారాన్ని పరిశీలన చేసే అధికారం, పరిశీలనలో ఇచ్చిన సమాచారం తప్పని తేలితే సంబంధిత వ్యక్తికి 3 నెలల జైలు శిక్ష, అపరాధ రుసుంతో పాటు కాని, లేకుండా కాని విధించవచ్చు. ఒక వ్యక్తి ప్రభుత్వం నుంచి తను పొందే ప్రతి సేవకూ మూల్యం చెల్లిస్తూ, తన వ్యక్తిగత జీవితంలోకి ఇతరులు చొరబడకుండా జీవిస్తూ ఉంటాడు. కాని ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి కంప్యూటర్ కంపెనీలు తొంగి చూడడమే కాకుండా, సరైన సమాచారం ఇవ్వలేదనే నెపంతో జైలుశిక్ష విధించే అవకాశం కూడా ఉంది. ప్రజల గురించిన అన్ని రకాల సమాచారాన్ని ఈ కంప్యూటర్ ఆపరేటర్లే నిర్ధారించి కూడా ఇస్తారు. పౌరులకు సంబంధించిన యావత్తు సమాచారాన్ని ఇప్పటి వరకూ ప్రభుత్వ యంత్రాంగంలోని వివిధ శాఖల విచారణ వ్యవస్థ ద్వారా ప్రజల మేలు కొరకు, వారి అవసరాల కొరకు మాత్రమే నిర్ధారణ చేసి కావలసినంత మేరకు సమాచారాన్ని మాత్రమే ఇస్తాయి. ఈ నిర్ధారణ చేసే వ్యక్తులు రకరకాల స్థాయిలలో జాతీయ, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణత పొంది, కావలసిన శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారు. నేషనల్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా బిల్ 2010 ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల యంత్రాంగాలు పూర్తిగా బలహీనం అవుతాయి. ఈ సమాచారాలను ఏయే అవసరాలకు ఎంత వరకూ ఇవ్వొచ్చో, ఎవరెవరికి ఇవ్వకూడదో లాంటి విధి విధానాల రూపకల్పన కొత్తగా విడుదలైన 'నేషనల్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా' బిల్ 2010లో సరిగ్గా నిర్ధారింపబడలేదు.

కానీ ఈ సమాచారానికి కావలసిన చట్ట భద్రత గురించి ప్రభుత్వ అధికారులు ఎలాంటి వేదికల మీద ప్రకటన చేయలేదు. కేవలం నందన్ నీలేకని, ఆర్.ఎస్. శర్మలు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాల సక్రమ అమలు కోసమని అన్ని సందర్భాలలో చెపుతున్నారు.

ఒకవైపు గ్రేట్ బ్రిటన్‌లోని సంకీర్ణ ప్రభుత్వం తమ 'జాతీయ గుర్తింపు కార్డు'ల చట్టం 2006 ద్వారా తయారు చేస్తున్న సమాచారం వలన ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛా జీవితంపై నిరంతరం నిఘా ఉంటుందని భావించి ఈ చట్టాన్ని తొలగించాలని నిర్ణయం తీసుకొంది. ఇంతే కాకుండా జాతీయ గుర్తింపు రిజిష్టరును భవిష్యత్తులో కొనసాగించ కూడదని, ఇందుకు సంబంధించిన కంప్యూటర్లు, రికార్డులలో దాచిన సమాచారాన్ని తొలగించాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఈ సమాచార సేకరణ ద్వారా ఎంతమంది వ్యక్తిగత స్వేచ్ఛను హరించి, పౌరులందరూ తమను అందరూ గమనిస్తున్నారనే నిరంతర భయపూరిత వాతావరణంలో నివసించే పరిస్థితి వస్తుందనేది అందరూ ఆలోచించాల్సిన సందర్భం ఇది.

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ అధికారి)

sarlareddy007@gmail.com

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - సెప్టెంబర్ 2010 : ఎక్సైజ్ విధానానికి ప్రత్యామ్నాయం లేదా?**
- **ఫోకస్ - అక్టోబర్ 2010 : రాజకీయ వ్యవస్థను బాగు చేయడం ఎలా?**
- **గనులను జాతీయం చేస్తే ? - ఇ.ఎస్. బ్రహ్మచారి**
- **వెనిజులాలో కమ్యూన్లు - కింది నుంచి సోషలిజం - ఆంటెనియా జిమెనెజ్**
- **ఎ**

ప్రపంచీకరణతో సహా ప్రస్తుత వ్యవసాయ సంక్షోభానికి ఉన్న వివిధ కారణాలను విశ్లేషించి, పరిష్కారాలను సూచిస్తున్నారు **కె.ఆర్. చౌదరి**

వ్యవసాయ సంక్షోభం రూపురేఖలు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయరంగ సంక్షోభం అనేక రూపాల్లో వ్యక్తమౌతోంది. అనేక విధాలుగా స్పష్టమౌతోంది. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అనుకూల విధానాలే. కార్పొరేట్ శక్తులు, సామ్రాజ్యవాద శక్తులు, మిలాఖత్‌దారులు, పాలకవర్గాలు వ్యవసాయ సంక్షోభానికి మూలం. ఈ సంక్షోభానికి మూలమైన కారణాలను విశ్లేషించుకుందాం.

1) ప్రభుత్వ విధానాలు : రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర సబ్జెక్టు అయినప్పటికీ, కేంద్రప్రభుత్వ విధానాలు రాష్ట్ర వ్యవసాయరంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కూడా వ్యవసాయరంగాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించి, అమలు చేస్తున్న విధానాలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాయి.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలు : వ్యవసాయ విద్య, పరిశోధన, సస్యరక్షణ, సాగునీరు; కౌలు, వ్యవసాయ భూమి బదిలీ, అన్యాక్రాంతం, భూమి అభివృద్ధి, భూమి శిస్తు, భూమి రికార్డుల నిర్వహణ; వ్యవసాయ రుణాలు, వడ్డీ వ్యాపారం, రుణభారాన్నుండి విముక్తి; వ్యవసాయ మార్కెటింగ్; పన్నులు – స్థానికంగా వస్తువులపై పన్ను. వీటన్నింటిపైన రాష్ట్ర ప్రభుత్వం చట్టాలు చేయొచ్చు.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలు : ద్రవ్య విధానాలు, విదేశాలతో ఒప్పందాలు, ఓడరేవుల రక్షణ, విదేశీ రుణాలు, విదేశాలతో వర్తక వాణిజ్యాలు, ఎగుమతి దిగుమతులు, రాష్ట్రాలమధ్య వ్యాపార వాణిజ్యాలు, బీమా, పేటెంట్లు, ట్రేడ్‌మార్కులు, మొదలగునవి; పరిశ్రమలు, ప్రత్యేక విద్యలను ప్రోత్సహించడం, పరిశోధన, విత్తనాలు, దిగుమతి సుంకాలు, ఎగుమతి పన్నులు, ఎక్సైజ్ పన్నులు; ఇవి కూడా వ్యవసారంగంపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం చూపుతాయి. ఈ విషయాలపై కేంద్రప్రభుత్వం మాత్రమే చట్టాలు చేయొచ్చును.

ఉమ్మడి జాబితా : కాంట్రాక్టులు, దివాళా, ఆహార పదార్థాల కల్తీ, ఆర్థిక సామాజిక ప్రణాళిక, ధరల నియంత్రణ, విద్యుత్తు, విత్తనాలు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ చట్టాలు చేయొచ్చు. ఇవన్నీ వ్యవసాయంపై ప్రభావాన్ని చూపుతాయి.

అమెరికన్ సామ్రాజ్యవాదం ఆదేశించిన మేరకు ఆర్థిక సంస్కరణలను 1991 నుండి రాజ్యం అమలు చేస్తోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థల ద్వారానూ, నేరుగానూ అమెరికా భారత ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి ఆర్థిక సంస్కరణలను అమలు చేయిస్తోంది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమెరికా మన నెత్తిపై రుద్దింది. ఈ విధానాలు రైతుల ప్రయోజనాలకు అనుకూలంకాదు. పెట్టుబడిదారులు, పారిశ్రామిక, వాణిజ్య కార్పొరేట్‌లు, బహుళజాతి సంస్థలు, సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలకు ప్రోత్సాహమివ్వడమే ఆర్థికసంస్కరణల లక్ష్యం. ఫలితంగా వ్యవసాయరంగంలో పెట్టుబడులు తగ్గాయి. ప్రణాళిక, బడ్జెట్‌లలో వ్యవసాయరంగానికి కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఉద్దేశపూర్వకంగా వ్యవసాయరంగానికి ప్రాధాన్యత తగ్గిస్తూ, నిర్లక్ష్యం చేస్తూ, వ్యవసాయంపై ఆధారపడిన అసంఖ్యాకమైన ప్రజలను దెబ్బతీస్తోంది ప్రభుత్వం.

సబ్సిడీలు : ఇతర దేశాలతో పోల్చుకుంటే, భారత ప్రభుత్వం వ్యవసాయ రంగానికిస్తున్న సబ్సిడీలు అత్యల్పం. ప్రపంచబ్యాంక్, ప్రపంచవాణిజ్య సంస్థ, అమెరికాలను తృప్తిపరచడానికి భారత్ వ్యవసాయ సబ్సిడీలను తగ్గించింది. వ్యవసాయానికి ప్రోత్సాహం కరవయింది.

సరళీకరణ విధానాలు : ప్రభుత్వం విత్తనాలు, మార్కెటింగ్ చట్టాలకు సవరణలు చేసింది. కార్పొరేట్ సంస్థలు సరఫరాచేసే విత్తనాలు, జన్యుమార్పిడి విత్తనాలతో సహా అధికంగా వాడాలని ప్రోత్సహిస్తోంది. కల్తీ, నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టే నియంత్రణా విధానాలు కఠినంగా లేకపోవడం, ఉన్నవాటిని అమలుచేయకపోవడం జరుగుతోంది. ప్రభుత్వ విధానాలు రైతు స్వావలంబనను ధ్వంసం చేశాయి. జన్యుమార్పిడి పంటలవల్ల మన జీవవైవిధ్యం, పర్యావరణం దెబ్బతింటాయి.

కార్పొరేట్‌లకు ఆహ్వానం : విధాన నిర్ణయాలమీద కార్పొరేట్ వ్యవసాయం అనే భావన రాజ్యం చేస్తోంది. కార్పొరేట్ పెట్టుబడికి తలుపులు బార్లా తెరిచి పెడుతోంది. భూపరిమితి చట్టాలకు సవరణచేసో, రద్దుచేసో, కార్పొరేట్లకు మార్గం సుగమం చేస్తోంది. రైతులు ఉత్పాదకాలను కొనడంలో, ఉత్పత్తులను అమ్మడంలో కార్పొరేట్లపైనే పూర్తిగా ఆధారపడేట్లు ప్రభుత్వం చేసింది.

ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టంచేసి వ్యవసాయ భూములను ఆక్రమించడానికి అవకాశం కల్పించింది. రైతాంగాన్ని తమ భూముల నుంచి చేదఖలు చేస్తోంది. ప్రభుత్వ ఆశీస్సులతో, ప్రోత్సాహంతో కొత్త జమీందారీలు తయారవుతున్నాయి.

ప్రభుత్వం అనుసరిస్తున్న దేశాంతర విధానాలు : గత దశాబ్దం మొదట్లో, ప్రభుత్వం తన హక్కులన్నింటినీ వదలుకుని వ్యవసాయ

సరుకుల దిగుమతులమీద ఉండిన ఆంక్షలు, నిషేధాలన్నింటిని ఉపసంహరించుకుంది. పరిమాణాత్మక ఆంక్షలను రద్దుచేసింది. దిగుమతి సుంకాలను బాగా తగ్గించినందువల్ల వ్యవసాయ ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి అయ్యాయి. అందువల్ల రైతులు బాగా దెబ్బతిన్నారు.

ప్రభుత్వం వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి విధానపరమైన నిర్ణయాలు చేయలేదు. అరకొర చర్యలు మాత్రమే చేపట్టింది. వ్యవసాయరంగానికి బడ్జెట్ కేటాయింపులు 4 శాతం మించలేదు. ఈ కేటాయింపులు ఏ మాత్రం చాలవు. విపరీతంగా పెరిగిపోతున్న ఉత్పత్తి ఖర్చులను తగ్గించలేదు. కల్తీ, నకిలీ విత్తనాలు, పురుగుమందుల అమ్మకాన్ని అరికట్టలేదు. ఉత్పాదకాలు కొనడంలో, ఉత్పత్తుల అమ్మకంలో దళారులపాత్ర తగ్గించలేదు. రైతుల రుణాలను, ముఖ్యంగా ప్రైవేట్ రుణాలను మాఫీ చేయలేదు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఇవ్వలేదు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెంచలేదు. మౌలిక సదుపాయాలను కల్పించ లేదు. కరెంట్ సరఫరా తగినంతగాలేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. మెట్ట వ్యవసాయానికి ప్రోత్సాహం లేదు. ఏవో కొన్ని అరకొర చర్యలు చేపట్టి, రైతాంగాన్ని మభ్యపెడుతోంది.

ప్రపంచీకరణ విధానాలు : మన సహజ వనరులైన భూమి, నీరు, అడవులు, గనులపైన సామ్రాజ్యవాద దేశాలు పట్టు సంపాదించుకుంటున్నాయి. వ్యవసాయ ఉత్పాదకాలపైన కూడా గట్టి పట్టును ఎప్పటి నుండో బిగించాయి. విత్తనాల వ్యాపారం దాదాపు 30 శాతం బహుళజాతి కంపెనీల స్వాధీనమయింది. రసాయనిక ఎరువులు, పురుగుమందుల ఉత్పత్తి, వ్యాపారం దాదాపు 90 శాతం బహుళజాతి కంపెనీల అధీనంలో వున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు బాగా పెరుగుతున్నాయి.

2) వ్యవసాయ ఉత్పత్తుల ధరలు : గిట్టుబాటుకాని ధరలు వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణమని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యవసాయోత్పత్తుల ధరలు తక్కువగా ఉండటమేకాక అస్థిరంగానూ ఉంటున్నాయి. పారిశ్రామిక, తయారీ రంగాల్లో ఉత్పత్తులకు ఉత్పత్తిదారులే ధరలను నిర్ణయిస్తున్నారు. వ్యవసాయోత్పత్తులకు ధరలు రైతులు నిర్ణయించడం లేదు. వ్యవసాయోత్పత్తుల ధరలను వ్యాపారవేత్తలు, మిల్లర్లు, పారిశ్రామికవేత్తలు నిర్ణయిస్తున్నారు. వాళ్ల లాభాలను దృష్టిలో ఉంచుకుని, వ్యవసాయోత్పత్తులకు తక్కువ ధరలను నిర్ణయిస్తున్నారు, ఆ ధరలతో మాత్రమే కొంటున్నారు. రైతాంగాన్ని దోపిడి చేస్తున్నారు. పెట్టుబడిదారీ, సరళీకరణ విధానాలే వ్యవసాయోత్పత్తుల ధరలను శాసిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఈ అగ్గికి ఆజ్యం పోస్తుంది.

పెట్టుబడిదారులు, వాణిజ్య, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన ప్రభుత్వం వ్యవసాయోత్పత్తుల ధరలను న్యాయంగా, గిట్టుబాటుగా ఇప్పించడంలో విఫలమయింది. అసలు రైతాంగానికి గిట్టుబాటు ధర ఇవ్వాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదు.

మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు, రైతులకు కనీస మద్దతు ధర నివ్వాలనే సదుద్దేశ్యంతో వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 25 వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను ప్రభుత్వానికి సూచిస్తుంది. ఈ కమిషన్ సూచించే ధర ఎప్పుడూ తక్కువగానే ఉంటోంది. కనీస మద్దతు ధరను నిర్ణయించడంలో అనేక లోపాలున్నాయి, అశాస్త్రీయంగా ఉన్నాయి. ఉత్పత్తి ఖర్చులు, మార్కెట్లో ఉన్న ప్రస్తుతధరలు, వ్యవసాయేతర వస్తువుల ధరలు, వినియోగదారుని ప్రయోజనాలు, అంతర్జాతీయ మార్కెట్లో వ్యవసాయోత్పత్తుల ధరలను పరిగణనలోకి తీసుకుంటున్నా మని చెబుతున్నారు. అసలు, ఉత్పత్తి ఖర్చులను అంచనా వేయడంలోనే తీవ్రమైన లోపాలున్నాయి. ఉత్పత్తి ఖర్చులను లెక్కించడానికి సేద్యపు ఖర్చులు, పంటల దిగుబడులు, మొదలైన వివరాలను వ్యవసాయ విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల ద్వారా సేకరించి, భారత ప్రభుత్వ శాఖ అయిన డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌కు పంపిస్తున్నారు.

వివరాలను సేకరించడానికి ఎన్నిక చేసుకున్న రైతుల సంఖ్య, అంటే శాంపిల్ సైజ్ తక్కువగా ఉంది. నమ్మదగిన సమాచారం రావాలంటే, శాంపిల్ సైజ్ పెద్దదిగా వుండాలి. పైగా ధరలను నిర్ణయించే కాలానికి, ఉత్పత్తి ఖర్చులు సేకరించే కాలానికి మధ్య తేడా చాలా ఉంది. వచ్చే సంవత్సరానికి ధరలు నిర్ణయించాలంటే గత సంవత్సరపు ఉత్పత్తి లెక్కల ఆధారంగా జరుగుతోంది. ఈ మధ్యకాలంలో ఉత్పాదకాల ధరలు పెరుగుతాయి. కూలీరేట్లు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం కూడా ఉంటుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా, కమిషన్ అప్పటికప్పుడు 4-5 శాతం అధికంగా కలిపి ధరలను సిఫారసు చేస్తుంది. కమిషన్ చేసిన సిఫారసులను కూడా ప్రభుత్వం యథాతథంగా ఆమోదించదు. అంతేకాదు, వ్యవసాయం ప్రకృతి వైపరీత్యాలకు గురి అవుతోంది. ధరల నిర్ణయంలో దీనికి వెసులుబాటు కల్పించే అంశమే లేదు. యాజమాన్యం తో పాటు, కుటుంబ కూలిని ఉత్పత్తి ఖర్చులలో కలపడంలేదు. మరో ముఖ్యమైన అంశం రాష్ట్రాల మధ్య తేడాలున్నాయి. భారతదేశం సువిశాలమైంది. రకరకాల నేలలు, విభిన్న వాతావరణ పరిస్థితులు, రకరకాల సేద్యపద్ధతులు, దిగుబడులలో తేడాలు ఉన్నాయి. అందువల్ల కొన్ని రాష్ట్రాల్లో ఉత్పత్తి ఖర్చులెక్కువ. కొన్ని రాష్ట్రాల్లో ఉత్పత్తి ఖర్చులు తక్కువ. కానీ, కనీస మద్దతు ధరను దేశాన్నంతా ఒకే యూనిట్‌గా తీసుకుని నిర్ణయిస్తున్నారు. ఇది కొన్ని రాష్ట్రాల రైతులకు అన్యాయం చేసినట్లే!

ప్రభుత్వం 25 పంటలకు కనీస మద్దతు ధరను నిర్ణయిస్తోంది. కానీ, వరి, గోధుమ పంటలకు తప్ప ఏ పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదు. వ్యాపారస్తులు ఇవ్వరు, ప్రభుత్వం ఇవ్వదు. అనేక సందర్భాల్లో వరికి కూడా కనీస మద్దతు ధర దొరకదు. ప్రభుత్వ జోక్యం అంతంత మాత్రమే. భారత ఆహారసంస్థ, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోళ్లు 10-15శాతానికి మించడం లేదు. పైగా, భారత ఆహారసంస్థ పంజాబ్‌లో రైతుల నుండే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తుంది. మన రాష్ట్రంలో మిల్లర్ల నుండి కొనుగోలు చేస్తోంది. అందువల్ల కూడా రైతులు నష్టపోతున్నారు.

గత కొన్నేళ్లుగా విదర్భలో రైతుల ఆత్మహత్యలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. ప్రధానమంత్రి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు రైతులు వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణం రైతులకు న్యాయమైన ధర దొరకకపోవడమేనని చెప్పారు. తమకు గిట్టుబాటు ధర ఇస్తేచాలు, మరేమీ అక్కరలేదని చెప్పారు.

3) వ్యవసాయ మార్కెటింగ్‌లో లోపాలు : రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారస్తులు వారిని మోసం, దగా, దోపిడీ చేస్తున్నారు. సరళీకరణ విధానమే దీనికి కారణం. వినియోగదారుడు చెల్లించే ధరలో రైతువాటా అత్యల్పంగా ఉందని అనేక మార్కెట్ సర్వేలు తెలుపుతున్నాయి.

వ్యవసాయ మార్కెటింగ్ పద్ధతుల్లో లోపాలను సవరించడానికీ, పద్ధతులను క్రమబద్ధం చేయడానికీ ప్రభుత్వం క్రమబద్ధ మార్కెట్లను ఏర్పాటు చేసింది. ఈ క్రమబద్ధ మార్కెట్లలో కూడా రైతులకు అన్యాయమే జరుగుతోంది. నిర్ణయించిన ప్రకారం కమిషన్ తీసుకోవడం లేదు. 2 నుండి 12 శాతం వరకు కమిషన్ ఏజెంట్లు కమిషన్ తీసుకుంటున్నారు. వ్యవసాయ సరుకులను గ్రేడింగ్ చేయడానికి సౌకర్యాలు లేవు. నాణ్యత బట్టి ధరలు ఇవ్వడం లేదు. రంగు వెలసిందనో, ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉందనో, ఏవో ఇతర నెపాలతో ధరలను తగ్గిస్తున్నారు. క్రమబద్ధ మార్కెట్లలో కొద్దిమందే వ్యాపారస్తులుంటారు. వారు సిండికేట్‌గా ఏర్పడి, కూడబలుక్కుని ధరలను నిర్ణయిస్తున్నారు. ఆ ధరలకే రైతులు అమ్ముకోవాలి. గత్యంతరం లేదు. ఈ లోపాలను ప్రభుత్వం సవరించకుండా, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ చట్టానికి సవరణ తెచ్చింది. ఈ సవరణ ప్రమాదమైనది. వ్యవసాయోత్పత్తుల వ్యాపారంలో ప్రైవేట్ మార్కెట్లను స్థాపించడానికి ఈ సవరణ అనుమతిస్తుంది. విదేశీ బహుళజాతి కంపెనీలు కూడా మార్కెట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్రైవేట్ మార్కెట్లపై ప్రభుత్వానికి ఏ నియంత్రణ ఉండదు. కంపెనీలు గుత్తాధిపత్యం సంపాదించుకోవడానికి ఎక్కువకాలం పట్టదు. అప్పుడు రైతులకు ఈ కంపెనీలిచ్చే ధరలు తప్ప గత్యంతరముండదు.

వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవడానికి ప్రధాన కారణం భవిష్య వాణిజ్యం (ఫార్వర్డ్ ట్రేడింగ్ లేదా ఫ్యూచర్ ట్రేడింగ్). ఇప్పటికే వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో 60 శాతం భవిష్య వాణిజ్యం కిందకు వచ్చింది. ఈ వాణిజ్యమంతా కాగితాల మీదనే జరుగుతుంది. ప్రత్యక్షంగా సరుకు ఉండదు. కమాడిటీ స్టాక్ ఎక్స్‌చేంజ్‌లలో ఈ వాణిజ్యం జరుగుతుంది. ఈ భవిష్య వాణిజ్యం 2000లో 5 బిలియన్ డాలర్లు ఉండగా, అది 2006లో 175 బిలియన్ డాలర్లకు పెరిగింది. బడా కార్పోరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలు మాత్రమే ఈ భవిష్య వాణిజ్యం చేయగలవు. రోజుకు 50-60 లక్షల రూపాయలు పెట్టగలిగినవారే ఈ వాణిజ్యం చేయగలరు. ఈ బడా వాణిజ్యంలో రైతుకు పాత్రలేదు. ప్రమేయం లేకుండానే నిండా మునిగిపోతారు. తక్కువ ధరతో వ్యవసాయోత్పత్తులు కంపెనీలు కొంటాయి. నిలువచేస్తాయి. ధరలు పెంచి అమ్ముకుంటాయి. రైతుకు మాత్రం సంకటస్థితి తప్పదు.

4) పెరిగిన ఉత్పత్తి ఖర్చులు: గత రెండు దశాబ్దాలుగా ఉత్పాదకాల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచబ్యాంక్, ప్రపంచవాణిజ్య సంస్థ, సామ్రాజ్యవాద శక్తుల ఆదేశాలకనుగుణంగా, వ్యవసాయరంగానికి రాయితీలు, సబ్సిడీలను కనిష్ఠ స్థాయిలో ప్రభుత్వం ఉంచింది. అందువల్ల, వీటి ధరలు పెరిగాయి. అందువల్ల ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. పెట్టుబడుల కోసం, ఉత్పత్తి ఖర్చుల కోసం, రైతులు అప్పులు చేయాల్సిందే అప్పులు లేనిదే రైతులు వ్యవసాయాన్ని కొనసాగించే స్థితిలో లేరు. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు రైతులను సంక్షోభంలో పడేశాయి.

5) నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం: నూతన సాంకేతికం కూడా వ్యవసాయ సంక్షోభానికి కారణమయింది. దీన్నే హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానం అని కూడా అంటారు. గతంలో సాంప్రదాయక వ్యవసాయంలో రైతు చాలా మట్టుకు స్వతంత్రుడు గానే ఉండేవాడు. ఆయనకు అవసరమైన విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను తానే తయారు చేసుకొనే వాడు. హరిత విప్లవ సాంకేతికంలో ఈ పరిస్థితి తారుమారయింది. తనకు కావాల్సిన విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కరెంట్, డీజిల్, పెట్రోల్, వ్యవసాయ పనిముట్లు మొదలైన ఉత్పాదకాలన్నింటిని మార్కెట్లో కొనాల్సి వచ్చింది. మార్కెట్ శక్తులపైన ఆధారపడడం జరుగుతోంది.

ఉత్పాదకాలన్నింటినీ మార్కెట్లో కొనాలి. ఈ వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నది. ఉత్పాదకాల ధరలు బాగా పెరిగాయి. ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ. పంటలకు నష్టం జరిగితే రిస్క్ ఎక్కువ ఉంటుంది. ఉత్పాదకాల కొరకు అప్పులు చేయాలి. అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు పడాలి.

నూతన సాంకేతికం భూమిని, నీటిని, గాలిని కలుషితం చేస్తుంది. మొత్తం పర్యావరణమే క్షీణిస్తుంది. అతిగా వాడుతున్నందువల్ల భూగర్భ జలాలు అడుగంటాయి. అతిగా రసాయనిక ఎరువులు వాడినందువల్ల దీర్ఘకాలంలో భూమి సారాన్ని కోల్పోతుంది. చౌడు, ఉప్పు భూములుగా మారిపోయి ఉత్పత్తిని బాగా దెబ్బతీస్తుంది.

గతంలో రైతు నానారకాల పంటలను, ముఖ్యంగా ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు పండించుకునేవాడు. ఇప్పుడు వాటి స్థానే మోనోకల్చర్ ఏక పంట విధానం వచ్చింది. అందువల్ల రైతు కుటుంబానికి ఆహార సమస్య వచ్చింది. పైగా ఏక పంటతో రిస్క్ పెరిగింది.

ఈ సాంకేతికం మాగాణి ప్రాంతాలు, మెట్ట ప్రాంతాల మధ్య అసమానతలను పెంచింది. పేద, ధనిక రైతుల మధ్య అసమానతలను పెంచింది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని, వాణిజ్య పంటలు పండిస్తున్న రైతులు అప్పుల పాలయ్యారు. సంక్షోభంలో పడిపోయారు.

6) రుణభారం: సంస్థాగతరుణాలు రైతులకు, ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతులకు, కౌలురైతులకు అందుబాటులో లేవు. 80 శాతం మంది రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, ఉత్పాదకాల సరఫరా చేస్తున్న వ్యాపారులు, వ్యవసాయోత్పత్తుల వ్యాపారం చేస్తున్నవారు, పెద్ద భూకామందులు, మొదలైన వారిపైన అప్పులకోసం ఆధారపడుతున్నారు. వడ్డీరేట్లు 24 నుండి 120 శాతం వరకు వసూలు చేస్తున్నారు. చక్రవడ్డీ కూడా వేస్తున్నారు. అసలూ, వడ్డీ కలిసి తడిసి మోపెడవుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేసేవారు కూడా అప్పులిస్తున్నారు. వారికే వ్యవసాయ ఉత్పత్తులు, వారు నిర్ణయించిన ధరకే అమ్మాలనే షరతులు కూడా పెడుతున్నారు. ఇవే షరతులతో వ్యాపారస్తులు కూడా అప్పులిస్తున్నారు. ఈ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, సంస్థలు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. రైతుల నుండి ఖాళీ కాగితాలపైన సంతకాలు తీసుకుంటున్నారు. రైతులకు వ్యతిరేకంగా ఈ కాగితాలనే వాడుకుంటున్నారు. రైతుల రుణభారం పెరగడానికి ప్రభుత్వం కూడా కారణమే. ప్రభుత్వ రుణ విధానం రైతాంగానికి అనుకూలంగా లేదు. బ్యాంకులు కూడా ముక్కుపిండి అప్పులను వసూలు చేస్తున్నాయి. చక్రవడ్డీ వేస్తున్నాయి. రీషెడ్యూల్ చేసి మరింతగా అప్పుల్లోకి రైతులను నెట్టివేస్తున్నాయి. రీషెడ్యూల్

కాబడిన కాలానికి కూడా వడ్డీ చెల్లించాలి. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వల్ల రైతాంగానికి పెద్ద ప్రయోజనం లేదనే వార్తలు నలుమూలల నుండి వస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో పడవేసి, రైతుల ఆత్మహత్యలకు రుణభారమే ప్రధాన కారణమయింది.

7) ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఎ) దెబ్బ: 1995 నుండి ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాలు అమల్లోకి వచ్చాయి. ఈ విధానాలు వ్యవసాయ రంగాన్ని బాగా దెబ్బతీశాయి. ఈ సంస్థ అన్ని వ్యవసాయ కార్యక్రమాలకు గండికొట్టింది. వ్యవసాయరంగానికి ఇస్తున్న రాయితీలను తగ్గించింది. దిగుమతి సుంకాలను తగ్గించింది. అందువల్ల, విదేశాల వ్యవసాయోత్పత్తులు మన మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. మన రైతులు పండించిన ఉత్పత్తులకు గిరాకీ లేదు. రైతులకు న్యాయమైన ధరలు రావడంలేదు. అంతర్జాతీయ మార్కెట్లో పోటీపడే సామర్థ్యం మనకు లేదు. మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు పెద్దగా పెరగలేదు. ప్రపంచ వాణిజ్యసంస్థ ఏ విధంగానూ సహాయ పడలేదు.

సంస్థ ఒప్పందాల అమలును గురించి 'దోహా సమావేశం' నుండి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల ప్రభుత్వాలు వ్యవసాయరంగానికి ఇస్తున్న సబ్సిడీలను తగ్గించమని చెబుతున్నాయి. బ్లూబాక్స్, గ్రీన్‌బాక్స్ కింద భారీ స్థాయిలో వ్యవసాయ రంగానికి అభివృద్ధి చెందిన దేశాలు సబ్సిడీలు ఇస్తున్నాయి. అందువల్ల వ్యవసాయ ఉత్పత్తులు, ఎగుమతులు భారీగా పెరిగాయి. అమెరికా, తదితర అభివృద్ధి చెందిన దేశాలు తమ ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీలను గణనీయంగా తగ్గించడానికి అంగీకరించడం లేదు. పైగా ఆదేశాల తయారీ వస్తువులకు అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ దేశాలు తెచ్చే ఒత్తిడిని నిరోధించాలి. లేకపోతే, భారతదేశం భారీగా నష్టపోతుంది.

8) భూమిసమస్య – వ్యవసాయ సంక్షోభం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 62 సంవత్సరాలయింది. అయినప్పటికీ దేశంలో కొన్ని ప్రాంతాల్లో భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, తదితర పేదవర్గాల ప్రజలను భూస్వామ్య, అర్ధభూస్వామ్య శక్తులు దోపిడీ, పీడన, అణచివేతలకు గురిచేస్తూనే ఉన్నాయి. భూమి, ఊరుమ్మడి వనరులు, చేపల పెంపకం, నీటిసౌకర్యాల కొరకు వున్న జలవనరులు, అటవీ ఉత్పత్తులు, న్యాయమైన కూలిరేట్లు, పేద ప్రజల హక్కులపై ఈ శక్తులు దాడులు కొనసాగిస్తున్నాయి.

ఉత్పత్తి సాధనాల్లో భూమి ప్రధానమయినది. కోట్లాదిమంది ప్రజల జీవనానికి ఆధారమైనది. భూమి అభివృద్ధికి పునాది. భూసంస్కరణలు అమలు చేశామని ప్రభుత్వం చెప్పుకొంటున్నప్పటికీ, అత్యధిక భాగం భూమి భూస్వామ్య, అర్ధభూస్వామ్య, వాణిజ్య పారిశ్రామికవేత్తల అధీనంలోనే ఉంది. గ్రామీణ కుటుంబాల్లో అగ్రభాగాన ఉన్న 5.2 శాతం కుటుంబాలు 56.6 శాతం భూమిని పొంది ఉన్నాయి. 41.6 గ్రామీణ కుటుంబాలకు భూమి అసలే లేదు. (జాతీయ శాంపిల్ సర్వే రిపోర్ట్ నంబర్ 4,90 ప్రకారం) ఈ గణాంక వివరాలు భూమికి సంబంధించిన అసమానతలను, భూమి కేంద్రీకరణను తెలుపుతున్నాయి.

భూస్వాములు లేదా భూకామందులు తమ భూములను కౌలుకు ఇస్తున్నారు. కౌలు రైతులను అనేక కష్టనష్టాలకు గురిచేస్తున్నారు. కౌలుకు గ్యారంటీ లేదు. కౌలు రైతులను భూమి నుండి ఎప్పుడైనా వెళ్లగొట్టచ్చు. కౌలు రేట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నారు. లేదా పండిన పంటలో 1/3 వంతు కానీ 2/3 వంతు కానీ తీసుకుంటున్నారు. పంట పండినా పండకపోయినా, పంటనష్టం జరిగినా కౌలు చెల్లించి తీరాలి. అందువల్ల రైతులు అప్పుల పాలవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కౌలు రైతులను కట్టుబానిసలుగా వాడుకుంటున్నారు. ఇటీవలి కాలంలో కౌలు వ్యవసాయం బాగా పెరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని గ్రామాల్లో జరిపిన సర్వే ప్రకారం కౌలు వ్యవసాయం 70 శాతం వరకు ఉన్నది. ప్రభుత్వం కౌలుదారుల హక్కులను, ప్రయోజనాలను కాపాడడంలేదు. వారికి అనుకూలంగా చట్టాలు లేవు. ఉన్న చట్టాలను అమలుచేయడం లేదు. కౌలురైతులకు సంస్థాగత రుణాలు ఇవ్వడం లేదు. వారికి ఏ రకమైన రాయితీలు అందడం లేదు.

రాష్ట్రంలో బంజరు భూములు భారీ మోతాదులోనే ఉన్నాయి. పేదలకు భూములను ప్రభుత్వం పంచలేదు. పంచిన భూములు కూడా స్వార్థపరుల దురాక్రమణల్లో ఉన్నాయి. దురాక్రమణలో ఉన్న భూములను క్రమబద్ధీకరించే నెపంతో, దురాక్రమణదారులకే ఆ భూములను ప్రభుత్వం కట్టబెడుతోంది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల నుండి రైతులను ప్రభుత్వం గెంటివేయడం జరుగుతోంది. ప్రభుత్వ భూములను పెట్టుబడిదారులకు, వ్యాపార వాణిజ్యవేత్తలకు, కార్పొరేట్లకు ప్రభుత్వం నజరానాగా సమర్పించుకుంటోంది. భూగరిష్ఠ పరిమితి చట్టాన్ని కచ్చితంగా అమలు చేయనందువల్ల, మిగులు భూమి తక్కువగానే ఉంది. భూమిలేని తనం వ్యవసాయ సంక్షోభానికి మూలకారణమని సామాజిక శాస్త్రజ్ఞులు విశ్లేషిస్తున్నారు.

9) భూసేకరణ: ప్రభుత్వం భూసేకరణను భారీ ఎత్తున చేస్తోంది. బ్రిటిషు వలస పాలకులు 1894లో చేసిన భూసేకరణ చట్టాన్ని ఉపయోగించుకుని రైతుల నుండి నిర్బంధంగా భూమిని సేకరిస్తోంది. ప్రభుత్వం గత 62 ఏళ్లలో దేశంలో దాదాపు 4 కోట్ల ఎకరాల భూమిని వ్యవసాయేతర పనులకు వినియోగించినట్లు అంచనా వేశారు. సాగునీటి, విద్యుత్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, నాలుగులైన్లు – ఆరులైన్లు ఎక్స్‌ప్రెస్‌హైవేలు, పట్టణీకరణ, ఇళ్లనిర్మాణం, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, కోస్తా కారిడార్ మొదలైన వాటికి రైతుల నుండి భూమిని నిర్బంధంగా ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రైవేట్ కంపెనీలు కూడా నేరుగా రైతుల నుండి భూములను సేకరిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కొరకు భూములను వాడుకుంటున్నారు.

మన రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా రైతులను, మత్స్యకారులను, ఆదివాసులను రెండు అంశాలు తీవ్రంగా కలవరపెట్టుతున్నాయి. మొదటిది: ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్‌లు). రెండోది: కోస్తా కారిడార్.

కార్పొరేటీకరణ : గనుల తవ్వకం; కల్తీ, నకిలీ విత్తనాలు, ఎరువుల సరఫరా; రైతాంగానికి అవసరమైన పరిశోధనలు లేకపోవడం, విఫలమైన వ్యవసాయ విస్తరణ; సామ్రాజ్యవాద ప్రపంచీకరణ; చిన్న నీటి వనరులకు కరువైన ప్రోత్సాహం, మెట్ట వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం, వ్యవసాయానుబంధ రంగాలను నిర్వీర్యం చేయడం, వ్యవసాయేతర రంగాలు కుంటుబడటం, విద్య, వైద్య, ఇతర సేవారంగాల ప్రైవేటీకరణ మొదలైనవి వ్యవసాయరంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి.

సంక్షోభ పరిష్కార విధానాలు : ఆహారభద్రత, జీవన భద్రత,

స్వావలంబన ఆశయాలతో, ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం పునాదిగా ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం రూపొందించాల్సిన అవసరముంది. మార్కెట్ కేంద్రబిందువుగా కాక రైతు కేంద్రబిందువుగా ఉండాలి. కార్పొరేట్, కాంట్రాక్ట్ విధానాలకు స్వస్తి చెప్పి, రైతాంగ వ్యవసాయాన్ని నిలబెట్టాలి. సన్నకారు, చిన్న రైతులు, కౌలురైతుల సంక్షేమాన్ని కాంక్షించి, వారి ప్రయోజనాలను, హక్కులను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలు అవసరం.

ఎ) రసాయనాల విషవలయంలో చిక్కుకున్న వ్యవసాయానికి స్వస్తి పలికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రత్యామ్నాయంగా అభివృద్ధి పరచాలి.

సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉత్పత్తి ఖర్చులను తగ్గించవచ్చును. అధిక దిగుబడులను సుస్థిరంగా సాధించవచ్చును. రైతులు మార్కెట్ శక్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. రైతులు తమకు కావాల్సిన విత్తనాలను తామే తయారుచేసుకోవడం అవసరం. వారికి కావాల్సిన పునాది (ఫౌండేషన్) విత్తనాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, రుణాలు, శాస్త్రజ్ఞుల పర్యవేక్షణ ప్రభుత్వమే సమకూర్చి, విత్తనగ్రామ పథకం ద్వారా విత్తనోత్పత్తికి తోడ్పడి, రైతుకు విత్తన రంగంలో స్వావలంబన కల్పించాలి. అలాగే, సేంద్రియ ఎరువులు, సేంద్రియ పురుగు మందుల తయారీని రైతులే చేపట్టాలి. రసాయనిక ఎరువులు, పురుగుమందులకు ఇస్తున్న సబ్సిడీలను సేంద్రియ ఉత్పాదకాలకు ఇస్తే, రైతులు లాభం పొందగలరు. పైగా, ఈ పనుల ద్వారా వారికి ఉపాధి సౌకర్యం పెరుగుతుంది. భూసారాన్ని పెంచడానికి, దాని సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి సేంద్రియ పద్ధతులే మేలు. స్థానికవనరులు, అవసరాలను బట్టి పంటల సరళిని రూపొందించాలి. పంటలతో పాటు పశుపోషణ, అంటే మిశ్రమసేద్యాన్ని రైతులు అవలంబించడం అవసరం. వ్యవసాయానికి అవసరమైన ఎరువులను సరఫరా చేసేదేకాక, రైతుల ఆదాయాన్ని పశుపోషణ పెంచుతుంది. జన్యుమార్పిడి పంటల నిషేధం అవసరం. మెరుగైన సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు, హానికరంకాని, లాభదాయకమైన నూతన శాస్త్ర సాంకేతిక వ్యవసాయ పద్ధతులను జోడించి, రైతులు ఆ పద్ధతులను క్షేత్రస్థాయిలో అవలంబించాల్సిన అగత్యముంది. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రభుత్వం రాయితీలు, తదితర సహాయకచర్యల ద్వారా భారీ ఎత్తున ప్రోత్సహించాలి. అప్పుడే ప్రజలందరికీ ఆరోగ్యప్రదమైన ఆహారాన్ని అందించగలం. పర్యావరణాన్ని కాపాడుకోగలం, ప్రైవేటీకరణ విధానాలకు వీడ్కోలు పలికి వ్యవసాయ మార్కెటింగ్‌ను అభివృద్ధిపరచినప్పుడే రైతుల దోపిడీ తగ్గుతుంది. మధ్యదళారుల వ్యవస్థను ధ్వంసం చేయాలి. వినియోగదారుడు చెల్లించే ధరలో రైతువాటా పెరగాలి. మార్కెట్ కమిటీలను బలోపేతం చేయాలి. ప్రైవేట్ మార్కెట్లను నిషేధించాలి. భవిష్య వాణిజ్యాన్ని కూడా నిషేధించటం అవసరం.

బి) గిట్టుబాటు ధరలు : స్వామినాథన్ కమిషన్ సిఫారసుచేసినట్లు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను శాస్త్రీయంగా అంచనావేసి, ఉత్పత్తి ఖర్చులపై కనీసం 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరను నిర్ణయించాలి. అన్ని పంటలకు ఇది వర్తించాలి. నిర్ణయించిన ధరలను ఆచరణలో పెట్టడం అవసరం. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వ్యవసాయోత్పత్తులను రైతుల నుండి నేరుగా కొనుగోలు చేసినప్పుడే రైతుకు మద్దతుధర లభిస్తుంది. మద్దతుధరను గిట్టుబాటు ధరగా మార్చాలి.

సి) ఉత్పత్తిదారుల సంఘాలు : రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పాదకాలు, రుణాలను సంఘం సభ్యులకు అందించాలి. ప్రాసెసింగ్‌ను ఈ సంఘాలే చేపట్టి, ఉత్పత్తులకు అదనపు విలువ చేకూర్చుకోవాలి. మార్కెటింగ్ కూడా ఈ సంఘాలే చేపట్టాలి. దళారీల దోపిడీ తగ్గుతుంది. ఈ సంఘాలకు బేరసారాలు ఆడే శక్తి వుంటుంది.

డి) రుణ సదుపాయం, వ్యవసాయ పంటల బీమా : రైతులందరికీ, అవసరమైనమేరకు సంస్థాగత రుణాలను పావలా వడ్డీకి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రస్తుతం అమల్లోవున్న బీమా పథకంలోని లోపాలను సరిదిద్ది, రైతులందరికీ బీమా వర్తించేట్లు చేయాలి. రైతులు, ముఖ్యంగా సన్నరైతులు కట్టాల్సిన ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి.

ఇ) కమిషన్ల సిఫారసులు : జస్టిస్ పి.ఎ.చౌదరి కమిషన్, రైతు సంక్షేమ కమిషన్ (జయతీఘోష్) కమిషన్, స్వామినాథన్ కమిషన్, రాధాకృష్ణ కమిషన్, కోనేరురంగారావు కమిషన్ మొదలైన కమిషన్ల సిఫారసులను ప్రభుత్వం వెంటనే అమలుచేస్తే రైతాంగ సంకటస్థితికి పరిష్కారం లభిస్తుంది.

ఎఫ్) భూపంపకాలు : రైతాంగం అభివృద్ధికి భూమి కీలకం. భూమిలేని కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి కనీసం మూడు ఎకరాల భూమిని ఇవ్వాలి. భూసంస్కరణ చట్టాలు పేద ప్రజలకు అనుకూలంగా చేసి, అమలు చేయాలి. బంజరు భూములు, దేవాలయాల భూములను, పేదలకు పంచినప్పుడే భూసమస్యకు పరిష్కారం దొరకుతుంది. ప్రభుత్వం పంచిన భూములకు గ్యారంటీ ఇవ్వాలి. సాగునీటితో పాటు అన్ని సదుపాయాలు కల్పించినప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. పాలకులకు చిత్తశుద్ధి ఉన్నప్పుడే భూపంపకాలు విజయవంతం అవుతాయి. రైతుల భూములను లాక్కుని, పెట్టుబడిదారులకు ధారాధత్తం చేసే దుర్మార్గపు కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలి.

జి) వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత : ప్రణాళిక, బడ్జెట్ కేటాయింపులు వ్యవసాయ రంగానికి కనీసం 25 శాతానికి పెంచాలి. రైతాంగ అనుకూల విధానాలు అవసరం. సామ్రాజ్యవాద శక్తులనుండి, దేశీయ పెట్టుబడిదారీ వర్గాలనుండి వ్యవసాయరంగాన్ని రక్షించుకోవాలి. రైతాంగాన్ని అప్పుడే కాపాడుకో గలుగుతాం. వ్యవసాయ కూలీలు, చేతివృత్తులవారు, తదితర గ్రామీణ పేద ప్రజలకు వెసులుబాటు కలుగుతుంది.

ఎచ్) రైతుసంఘాల బాధ్యత : ఉద్యమాలు, పోరాటాల ద్వారానే రైతాంగ సమస్యలు పరిష్కారమవుతాయి. రైతులను సంఘటితపరచి, ఐకమత్యంతో ఉద్యమాలను ముందుకు తీసికెళ్లినప్పుడే వ్యవసాయరంగం సంక్షోభం నుండి గట్టెక్కుతుంది. రైతుసంఘాలు ఈ బాధ్యతను తీసుకోవాలి. రైతులు చైతన్యంతో, పోరాట పటిమతో సమరశీల ఉద్యమాల్లో పాల్గొన్నప్పుడే రైతుల సంక్షేమాన్ని సాధించుకోగలరు.

(రచయిత వ్యవసాయ అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యారు)

స్వయం సమృద్ధిగా ఉన్న వ్యవసాయ రంగం నూతన ఆర్థిక విధానాల వల్ల సంక్షోభంలో కూరుకుపోయి, జీవన స్థితిగతులు దిగజారుతున్న నేపథ్యంలో రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అంటున్నారు **ఎన్. భగవాన్ రెడ్డి**

వ్యవసాయ సంక్షోభానికి పరాకాష్ట

వ్యవసాయరంగం బహుళ ప్రయోజనం కలది. మన సామాజిక వ్యవస్థలోని 70 శాతం మంది ప్రజలకు జీవనోపాధి కలిగించడమే కాక, సామాజిక, ఆర్థిక రంగాల్లో ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చింది. ప్రజల జీవనావసరాలైన ఆహార ధాన్యాల్ని, ఇతర ఉత్పత్తుల్ని అందిస్తుంది. పది మందికి పట్టెడన్నం అందించిన రైతు నేడు అన్నమో రామచంద్రా అంటున్నాడు. పంటల పరిరక్షణకు తెచ్చుకున్న పురుగుల మందును పెరుగన్నంగా తీసుకుంటూ తనువు చాలిస్తున్నాడు. పంట పొలాల్లో చెమటోడ్చినపుడు సేదతీరే చెట్టుకు ఉరితాడేసుకొని వేలాడుతుండు. మన సామాజిక వ్యవస్థలోని అధిక సంఖ్యాక ప్రజలైన రైతులు, ఇతర వ్యవసాయానుబంధ వృత్తుల ప్రజలకు జీవనాధారమవుతూ వస్తున్న వ్యవసాయం నేడు రోజు రోజుకూ సంక్షోభం ఎదుర్కొంటుంది.

ఆధునిక పరిజ్ఞానం, అధికోత్పత్తి, ప్రపంచీకరణల పేరిట అమలవుతున్న విధానాల వల్ల ఒకప్పుడు స్వయం పోషక సమాజాల్ని నిర్మించుకున్న వ్యవసాయ రంగం నేడు పరాధీనమై ఆ రంగం నుండి దూరం చేస్తున్న పరిస్థితి. ప్రత్యామ్నాయ రంగం కనిపించక నమ్ముకున్న వ్యవసాయం దెబ్బతీస్తున్నందున ఎటూ దిక్కు తోచని పరిస్థితిని నేటి రైతాంగం ఎదుర్కొంటుంది. ఒకప్పుడు భద్రతనిచ్చిన రంగంలో నేడు అభద్రతనిస్తుంది. అలాంటి వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్ని ఓసారి పరిశీలిద్దాం.

ప్రస్తుత వ్యవసాయ రంగంలో విత్తనాలు, సాగునీటి విధానాలు, పెట్టుబడి, భూ యాజమాన్యాలు, ఎరువులు, పంటల పద్ధతి, పంటల సంరక్షణ, విద్యుత్, మార్కెట్ తదితర అంశాలన్నీ సమస్యాత్మకంగానే మారుతున్నాయి. గ్రామీణ వ్యవసాయ విధానంలో రైతులు పండించే పంటలోంచి నాణ్యమైన ధాన్యాన్ని సేకరించి విత్తనాలుగా కాపాడుకునేవారు. ఇవి స్థానిక స్థలకాలాదుల భౌగోళిక వాతావరణ పరిస్థితుల్ని తట్టుకునేది. నేడు అందుకు భిన్నంగా బహుళజాతి కంపెనీల హైబ్రిడ్, టెర్మినేటర్ విత్తనాలపై ఆధారపడడం వల్ల ప్రతి ఏటా విత్తనాల్ని కొనే స్థితి రావడంతో ఖర్చు పెరగడమే కాక ఇవి స్థానిక పరిస్థితుల్ని తట్టుకోలేక పోతున్నాయి. నకిలీ, కల్తీ విత్తనాల వల్ల సరిగా మొలకెత్తక పోవడం, మొలకెత్తి ఏపుగా పంట వచ్చినా మొత్తానికే ఉత్పత్తి లేకపోవడం జరుగుతుంది. నకిలీ విత్తనాలతో మొక్క జొన్న, పత్తి, మిర్చి తదితర పంట చేలు బాగా పెరిగినా పంట పండని పరిస్థితితో రైతులు మోసానికి గురవుతున్నారు. విత్తనాలు మొలకెత్తక లబోదిబోమంటున్నారు. విత్తనాలు కూడా తగినంతగా సరఫరా లేక ఇబ్బందులెదుర్కొంటున్నారు. ప్రభుత్వమిచ్చే సబ్సిడీ విత్తనాలు సైతం సకాలంలో సరిపోయేన్ని విత్తనాల్ని సరఫరా చేయలేకపోవడంతో ప్రైవేట్ కంపెనీల చేతుల్లో నకిలీ విత్తనాలతో మోసాలకు గురికాబడుతున్నారు. గతంలో ఏయే కాలంలో ఏ రకమైన భూముల్లో ఏయే పంట విత్తనాలు వేయాలో రైతులకు తెలిసేది. నేడు ఆ పరిస్థితి లేక విత్తనాల ఎంపిక నుండే సమస్య మొదలవుతుంది.

వ్యవసాయంలో సాగునీటి విధానం ముఖ్యమే. గతంలో గొలుసుకట్టు చెరువులు, కుంటలు, బావుల ద్వారా కాల్వలు, మోటలు, ఏతాలతో పొలాలు పారించి వరి పండించేవారు. వర్షాధారంతో జొన్న, పెసర, కంది, నువ్వులు, సజ్జ, ఆముదాలు తదితర మెట్ట పంటలు పండించేవారు. చెరువులు, కుంటలు, కాల్వలు నిర్లక్ష్యం చేయడం, బోరు బావుల తవ్వకం లాంటి చర్యలతో సాగునీటి విధానంలో వచ్చిన మార్పుల వల్ల ప్రాజెక్టులు గల ప్రాంతాల్లో తప్ప మిగతా ప్రాంతాల్లో బోరు బావుల వినియోగం విపరీతంగా పెరిగింది. బోరు బావుల సంఖ్య పెరగడం, అనావృష్టి లాంటి పరిస్థితుల్లో భూగర్భ జలాలు రోజు రోజుకూ అడుగంటి పోవడంతో బోర్లు వేయడం రైతులకు భారమైపోయింది. సకాలంలో వర్షాలు కురియక, వ్యవసాయాన్ని విడిచి బతకలేక బోరుబావుల తవ్వకమనేది రైతులకు అనివార్యమైపోతుంది. బోర్లు వేయడం, నీరు పడక అప్పుల పాలవడం, ఏమీ తోచక ఆత్మహత్యలకు పాల్పడడమనేది నేటి వ్యవసాయ దీన స్థితిని తెలియజేస్తుంది. మచ్చుకు కొన్ని కేసులు చూస్తే పరిస్థితి తీవ్రత తెలుస్తుంది. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ధర్పల్లిలో మెంతంగారి నర్సింలు మూడెకరాల్లో ఆరు నెలల కాలంలో ఐదు బోర్లు, కొండపాక మండలం ఎర్రవల్లిలో గౌరీలింగం నాలుగెకరాల్లో నాలుగు బోర్లు, తొగుట మండలం కాన్గల్‌కు చెందిన ముడికె ఆగయ్య పది పైన బోర్లు వేసినా నీరు లేక పంటలు పండక అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇలాంటివి మెట్ట ప్రాంతాలలో వందలు, వేల కేసులున్నాయంటే సాగునీటి విధాన వైఫల్యం ప్రభావం ఎంత ఉందో తెలుసుకోవచ్చు.

మొత్తంగా వ్యవసాయరంగానికి పెట్టుబడులు (ఖర్చు) పెరుగుతూ వస్తున్నాయి. విత్తనాల్ని కాపాడుకోవడం నుండి కొనుగోలు చేయడం వల్ల విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, బోరు బావుల తవ్వకం, విద్యుత్ సౌకర్యాలు, కూలీల ఖర్చు లాంటి అంశాలకు పెట్టుబడి పెరగడంతో రైతుకు అప్పులు తడిసి మోపెడై భరించలేనంత భారమై

పోతుంది. రసాయన ఎరువుల వాడకానికి, బోర్లు వేయడానికి, విద్యుత్ పంపుల ఏర్పాటుకు రైతులు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రైతుల జీవనాధారమైన వ్యవసాయాన్ని, భూమిని వదలి జీవించలేని స్థితిలో రెండు, మూడెకరాలున్న కమతాల్లో సైతం బోర్లు వేయడం అనివార్యమైపోతుంది. వ్యవసాయంలో ఎవరి భూమిలో వారొక్కరే సకాలంలో దున్నడం, విత్తడం, కలుపు, నూర్పిళ్లు చేసుకోలేక కూలీల ఖర్చు కూడా పెరుగుతూ వస్తోంది. పశువుల్ని పోషించుకోలేక ట్రాక్టర్, హార్వెస్టర్ల వంటి యంత్రాలపై ఆధారపడడమనేది జరిగి సరైన సమయంలో అవి దొరక్క నష్టాలకు గురయ్యే పరిస్థితి. ఇలా ప్రతి విషయంలో రైతుల పెట్టుబడుల ఖర్చు పెరుగుతూ వస్తోంది.

పెద్ద రైతులు నిర్వహించే తోటలు, డ్రిప్ సౌకర్యాల్లో ప్రభుత్వం నుండి సబ్సిడీ లభిస్తుంది. కాని, ఈ తోటల వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఇక చిన్న, సన్నకారు రైతులు సైతం ఆహార ధాన్యాల సాగు లాభసాటి కావడం లేదని పత్తి, పొద్దుతిరుగుడు, చెరకు లాంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇవి కూడ నకిలీ, కల్తీ విత్తనాలు, ఎరువులు, మందుల వల్ల మోసాలకు బలవుతూ రైతులు నష్టాల పాలవుతున్నారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం సరఫరా చేస్తున్నప్పటికీ ఆశించిన లాభాలు రావడం లేదంటూ వ్యవసాయం పట్ల నిరాశ వ్యక్తమవుతుంది.

గతంలో రైతులు పశువుల పేడ, వేప, కానుగ తదితర ఆకుల్ని, సేంద్రియ ఎరువులుగా చెరువుల్లోని ఒండ్రు మట్టిని పంట భూముల్లో వేసి ఉపయోగించేవారు. అందుకు భిన్నంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, హైబ్రిడ్ విత్తనాల వినియోగం వల్ల చీడ పీడల తెగుళ్లు ఎక్కువై పెట్టుబడి ఖర్చులు ఎక్కువైపోతున్నాయి. కొన్ని మార్లు అధికోత్పత్తి సాధించినా మరికొన్ని సందర్భాల్లో నష్టాలు ఎదుర్కొంటున్నారు. నకిలీ, కల్తీ ఎరువుల, క్రిమిసంహారక మందుల బారిన పడిన రైతులు మోసపోతున్నారు. ఎరువులు లేనిదే పంటలు పండించే పరిస్థితి లేదు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగంతో చీడపీడలతో పాటు మేలు చేసే కీటకాల వంటివి నిర్మూలించబడుతున్నాయి. దాంతో కొత్త రకాల తెగుళ్లు సోకుతున్నాయి. సస్య రక్షణకు రకరకాల మందుల వాడకం పెరిగి పోతుంది.

ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి బోర్లు వేసి సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ సరఫరా సమస్య పెద్దదిగా మారింది. గతంలో వ్యవసాయ బావులు వైశాల్యంలో పెద్దవిగా ఉండడం వల్ల ఊరిన నీరు రెండు, మూడు గంటల్లో మోటారు పంపులు పొలాలకు అందించేవి. నేడు బావుల స్థానంలో బోర్లు రావడం వల్ల నిరంతరం విద్యుత్ సరఫరా జరిగితేనే పొలాలు పారే పరిస్థితి. కానీ, కరెంట్ నిరాటంకంగా అందే అవకాశం లేదు. రోజులో 6, 7 గంటలకు మించి కరెంట్ వచ్చే పరిస్థితి లేదు. అదీ కోత లేకుండా సరఫరా అవడం లేదు. లో-వోల్టేజీ, కోత, ట్రిప్ కావడం లాంటి సమస్యలతో మోటార్లు, అధిక భారంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో రైతులకు నిత్య సమస్యగా, ఆర్థిక భారంగా మారింది. విద్యుత్ సరఫరా విషయంలో పరిశ్రమల మాదిరిగా రైతులకు అవకాశం కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. విద్యుత్ లేనిదే వ్యవసాయం కొనసాగే పరిస్థితి లేదు.

వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న మరో సమస్య మార్కెట్. విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు నుండి కష్టించి పండించిన పంటలు (ఉత్పత్తులు) అమ్మకాల వరకు మార్కెట్లో జరిగే మాయాజాలం రైతాంగానికి పెద్ద సమస్యనే. కల్తీ, నకిలీ విత్తనాలు, ఎరువుల కోసం ఆందోళనే. పండిన పంట అమ్మకానికీ ఆందోళన చేయాల్సి వస్తోంది. ఏ వస్తువైనా ఉత్పత్తిపై అయ్యే ఖర్చు, లాభాన్ని కలిపి ధర నిర్ణయించి అమ్ముతారు. కాని ఒక్క రైతాంగం విషయంలో మాత్రం రైతులు పెట్టుబడి, లాభం కలిపి ఎంత ధరకు అమ్మాలో నిర్ణయించే అధికారం, రైతులకు లేదు. అందుకోసం మార్కెట్లో గిట్టుబాటు ధర కావాలంటూ ప్రతిసారీ రైతాంగం ఆందోళన చేయాల్సి వస్తోంది. పండించిన పంటను అమ్మడానికి సైతం తగిన మార్కెట్ సౌకర్యం లభించడం లేదు. ప్రభుత్వం మొత్తం ధాన్యం కొనుగోలు చేయక, ఒకవేళ కొనుగోలు చేసినా నాణ్యత లేదంటూ గిట్టుబాటు ధర చెల్లించకపోవడం జరుగుతుంది. మరికొందరు రైతులు ముందుగానే వ్యాపారసుల వద్ద అప్పు చేయడం వల్ల వ్యాపారస్తుల ధరకే అమ్మాల్సి వస్తోంది. రైతుల చేతుల్లోంచి వ్యాపారస్తుల వద్దకు చేరిన తర్వాత ధర పెరుగుతుంది. రైతులు పంటధాన్యాన్ని గిట్టుబాటుధర వచ్చేవరకు నిల్వ ఉంచుకోలేని పరిస్థితులే ఎక్కువైనందున ఏదో ఓ ధరకు అమ్మేస్తున్నారు. చెమటోడ్చిన రైతులకు గిట్టుబాటు కానివి మధ్య దళారులకు లాభసాటివిగా మారుతున్నవి.

చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులకు వ్యవసాయం చేయడం భారంగా మారింది. వ్యవసాయం వదిలి ఇతర పనుల వైపు వెళ్తున్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో కూలీలతో పాటు రైతులు సైతం జాతీయ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. గిట్టుబాటుకాని వ్యవసాయం వల్ల అనుబంధ వృత్తులకు ప్రమాద మేర్పడింది. ఆహార ధాన్యాల కొరత మొదలైంది. ప్రాజెక్టు కాల్వల కింద జరిగే సాగు తప్ప మిగతా ప్రాంతాల్లోని వ్యవసాయం కష్టతరంగా మారింది. రోజు రోజుకు వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లడం వల్ల దిక్కుతోచని స్థితిలో మార్గం కానరాక ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

సంక్షోభానికి పరాకాష్టగా జరుగుతున్న ఆత్మహత్యలు నేటి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. గత దశాబ్దకాలంగా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నా పాలకుల్లో స్పందన లేదు. నామమాత్రపు స్పందనలతో పరిష్కారం లభించడం లేదు. ప్రత్యామ్నాయాలపై, ఆత్మహత్యల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై విధానాల రూపకల్పన లేదు.

ప్రాజెక్టుల కింద కాల్వల ద్వారా సాగయ్యే ప్రాంతాల్లో తప్ప మిగతా ప్రాంతాల్లోని వ్యవసాయ పరిస్థితిలో దాదాపుగా పెద్ద తేడా కనిపించదు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్న మొదట్లో ప్రజలు, సంఘాలు, పత్రికలు, పార్టీలు స్పందించేవి. నేడు అవి నిత్యకృత్యాలైనట్లుగా స్పందనే కరువైంది. కాని మానవత్వం, స్పందించే మనస్సు ఉన్న ఎవరినైనా కలచివేసే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పాతికేళ్ల వయసున్న యువరైతుల నుండి అరవై ఏళ్ల రైతుల వరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బతుకుల్ని తెల్లగా చేస్తుందనుకున్న పత్తి పంట, నకిలీ, కల్తీ విత్తనాలతో పత్తినివ్వని పంట చేనును తగులబెట్టి బావురుమంటున్నాడు. జీవితంలో తీపినిస్తుంద

నూతన ఆర్థిక విధానాలు మొదలైన తరువాత వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు

1. విదేశీ వాణిజ్య రంగం :

ఎ) ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు లోబడి 1997 తరువాత దేశంలోని వ్యవసాయ ఉత్పత్తులన్నిటినీ జనరలైజ్డ్ సిస్టం ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జి.ఎస్.పి.) కిందికి తెచ్చారు. దీని వల్ల అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులపై ఆంక్షలన్నీ రద్దయిపోయాయి.

బి) ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలలో భాగమైన మేధో ఆస్తి హక్కుల పరిరక్షణలో భాగంగా విత్తనాలను, నిర్దిష్ట ప్రాంతాలలో దొరికే జీవజాతులను పరిరక్షించాలనే నిబంధన రద్దయిపోయింది.

సి) 1998లో 470 వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై ఉండిన పరిమాణాత్మక ఆంక్షలన్నిటినీ రద్దు చేశారు. 1999లో మరొక 1400 వ్యవసాయోత్పత్తులను ఓపెన్ జనరల్ లైసెన్సింగ్ (ఒ.జి.ఎల్.) కిందికి తెచ్చారు. వ్యవసాయంలో విదేశీ వాణిజ్యాన్ని నియంత్రించే అన్ని విధానాలను తొలగించారు.

డి) వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై సగటు సుంకాలను 1990లో వంద శాతంగా ఉన్నవల్ల 1997లో 30 శాతానికి తగ్గించారు.

ఇ) దేశీయ మార్కెట్‌లో కనీస ఉమ్మడి ప్రవేశానికి విదేశాలకు అవకాశం కల్పించాలనే సూత్రాన్ని భారత ప్రభుత్వం సూత్ర రీత్యా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇప్పటికే మొత్తం దేశపు ఆహార అవసరాలలో 2 శాతాన్ని దిగుమతి చేసుకుంటోంది.

ఎఫ్) విత్తనాల దిగుమతిని మరింతగా సరళీకరించారు.

ఈ మార్పుల వల్ల భారత రైతాంగం, వ్యవసాయ రంగం ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయి. విదేశాలలో రైతులకూ, వ్యవసాయ రంగానికీ అందే విపరీతమైన సబ్సిడీ వల్ల అవి మార్కెట్‌లో చాలా చవకగా దొరికే అవకాశం ఉంది. అటువంటి చవక వ్యవసాయ ఉత్పత్తులతో పోటీ పడడంలో భారతీయ రైతులు నష్టపోక తప్పదు. అలాగే ఎగుమతి కోసమే పండించాలనే కోరికతో రెండు ప్రమాదాలు ఉన్నాయి. ఒకటి, దేశంలో ఆహార భద్రతకు అవసరమైన తిండి గింజల ఉత్పత్తి తగ్గిపోవడం. రెండు, అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులకు భారతీయ రైతులు బలి అయ్యే పరిస్థితి రావడం. భారత పేటెంట్‌ల చట్టం సవరణ ద్వారా ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ద్వారా రైతు తన విత్తనాలను తానే తయారు చేసుకొనే స్థితి గానీ, మార్కెట్‌లో ఒకసారి విత్తనాలు కొనుక్కొని వాటిని పునరుత్పత్తి చేసుకొనే అవకాశం గానీ రద్దయిపోయాయి. రైతు పూర్తిగా విదేశీ, బహుళజాతి విత్తన వ్యాపార సంస్థల మీద ఆధారపడవలసిన స్థితి వచ్చింది.

నుకున్న చెరుకు పంటను కొనేవారులేక తగులబెడుతూ తనువు చాలిస్తున్నాడు. బోర్లు వేస్తే బాగుపడతామనుకున్న రైతుల్నే మింగేస్తున్న సంఘటనలెన్నో.

2006లో మెదక్ జిల్లా నంగునూరు మండలం ఓబులాపురంలో బెక్కం దుర్గయ్య (45) అప్పులు, అవమానాల పాలై కుటుంబ కలహాలతో విరక్తి చెంది గ్రామస్తులకు, బంధువులకు భారం కావొద్దని చితి పేర్చుకొని తానే నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

2008లో దౌల్తాబాద్ మండలం బాగన్నగారి నర్సాగౌడ్ (40) రెండు ఎకరాల్లో మూడు బోర్లు వేశాడు. బెండ పాదులకు పిచికారి మందు కొట్టాడు. అయినా బెండ సాగు ఎండిపోయిందని కలత చెంది తనకు సరిపడా బొంద తీసుకొని పిచికారి మందు తాగి పడుకొని కన్నుమూశాడు. బావుల వద్ద చెట్లకు ఉరివేసుకోవడం, పంట పొలాల్లో, బోర్ల వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలెన్నో జరుగుతున్నవి. అయితే రైతు కుటుంబాలు అప్పుల పాలుకావడం, దిక్కుతోచక మద్యం తాగి ఈ సంఘటనలకు పాల్పడితే మద్యం తాగే కేసులుగానే పరిగణిస్తున్నారు.

'ఈ ఎవుసంతో ఏగలేక సచ్చిపోతున్నరా! నా పిల్లల వైపు చూడురా' అంటూ మిత్రున్ని వేడుకుంటూ ఓ రైతు, ఈ బోర్లు, అప్పులతో విసుగు చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు జర పిల్లల్ని చూసుకోరా అంటూ బావమరిదికి ఫోన్ చేసి మరో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతు కుటుంబాల్లోని పిల్లల వేదన చెప్పనలవి కానిది. వ్యక్తిగత కారణాలతో చనిపోయారంటూ ఆరోపణలు చేస్తూ అవహేళన చేయడం దారుణం.

మొత్తంగా నేటి వ్యవసాయరంగం సంక్షోభంలోంచి బయటపడే మార్గాలపై రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరమెంతో ఉంది. ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనాల్సి ఉంది. ప్రతి మనిషికి ప్రాణం పట్ల మమకారమే ఉంటుంది తప్ప కావాలని ఊరకే చావుల్ని కోరుకోరు.

సమాజ నిర్మాణంలో, అభివృద్ధి సాధించడంలో ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చిన వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడు కోవాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉంది. అన్నదాతల ఆత్మహత్యల్ని నివారించే చర్యలు చేపట్టకపోతే సమాజం క్షమించదు. ప్రత్యామ్నాయ విధానాలు చేపట్టకుండా, నూతన విధానాల అమలు వల్ల ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించాలి. వ్యవసాయరంగ సంక్షోభ నివారణకు గాను వివిధ కమిటీల సిఫారసుల్ని అమలు చేసే చర్యలు చేపట్టాలి. అన్నం పెట్టే అన్నదాతల్ని కాపాడుకోవాలి. ఆ బాధ్యత పాలకులపై ఎంతగానో ఉంది.

(రచయిత ఉపాధ్యాయులు)

2. దేశీయ మార్కెట్ సరళీకరణ

విత్తనాలు :

ఎ) 1991 నుంచి విత్తనాల పరిశ్రమలో నూటికి నూరు శాతం విదేశీ భాగస్వామ్యానికి అనుమతించారు. విత్తనాల విషయంలో అప్పటికి ఉండిన ప్రభుత్వ రంగ, ప్రైవేట్ రంగ దేశీయ సంస్థల ప్రాధాన్యం తగ్గిపోయి, రైతాంగం విత్తనాల కోసం అత్యంత శక్తిమంతులైన బహుళజాతి సంస్థల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడవలసిన స్థితి వచ్చింది.

ఎరువులు :

ఎ) 1991 నుంచి క్రమ క్రమంగా ఎరువులపై సబ్సిడీని తగ్గిస్తూ వచ్చారు. దీనితో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి, పంటల ఉత్పత్తి వ్యయం పెరిగిపోయింది. దానితో సమానంగా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వ్యవసాయం మనుగడకు కూడా సరిపోని స్థితి వచ్చింది.

విద్యుచ్ఛక్తి :

ఎ) 1997 తరువాత విద్యుచ్ఛక్తి రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టారు. బి) వ్యవసాయంపై విద్యుత్తు చార్జీలు పెంచారు. దీనిపై రైతుల నుంచి తీవ్రమైన ప్రతిఘటన రావడంతో ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించారు. దేశంలో సాగయ్యే భూమిలో అతి ఎక్కువ భాగం బావుల మీద, విద్యుచ్ఛక్తి మీద ఆధారపడవలసి రావడంతో విద్యుచ్ఛక్తి ఛార్జీలలో చిన్న మార్పయినా వ్యవసాయం మీద పెద్ద ప్రభావం వేసింది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ లాంటి చోట్ల ఉచిత విద్యుత్ అనే నినాదం వచ్చినప్పటికీ ఆచరణలో అతి తక్కువ గంటలు విద్యుత్తు అందడం, రైతులకు అనుకూలం కాని సమయాలలో విద్యుత్తు రావడం, లోడ్ హెచ్చు తగ్గుల వల్ల మోటర్లు తగలబడిపోవడం, విద్యుత్తు నాణ్యత కోసం బిగించుకోవలసిన కెపాసిటర్ల ద్వారా మళ్లీ బహుళజాతి సంస్థల మార్కెట్టే పెరగడం వంటి ఎన్నో లొసుగులు ఉన్నాయి.

నీటి పారుదల :

ఎ) చాలా రాష్ట్రాలలో నీటి తీరువా పెంచారు.

బి) నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేసి నీటి పారుదల నిర్వహణ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడం ప్రారంభించింది. సి) ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో భారీ నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించాలంటే ఆ నీటిని వినియోగించుకునే రైతులు పెట్టుబడి పెట్టాలని నిబంధనలు విధించారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఈ నిబంధనలను తొలగించింది. ఈ ఇరవై ఏళ్లలో వాస్తవికంగా ప్రభుత్వం కల్పించిన కొత్త నీటి పారుదల సౌకర్యాలు అతి తక్కువ. పాత సౌకర్యాల మరమ్మత్తులకు కూడా తగిన నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకునే మార్గంలో నీటిపారుదల రంగం మీద చిన్నచూపు పెరిగిపోయింది. జలయజ్ఞం లాంటి ఆడంబరమైన విధానాలు ప్రకటించినప్పటికీ అవి కాంట్రాక్టర్లకు ఉపయోగపడినంతగా వ్యవసాయరంగానికి ఉపయోగపడలేదు.

వ్యవస్థాత్మక రుణ, పరపతి సౌకర్యాలు :

ఎ) 1992లో వేసిన ఖుస్రో కమిటీ, నర్సింహం కమిటీ రెండూ కూడా వాణిజ్య బ్యాంకులు ప్రాధ్యానతా రంగాలకు, వ్యవసాయ రంగానికి రుణ సౌకర్యం కల్పించనక్కరలేదని సిఫారసు చేశాయి. వ్యవసాయ రంగానికి ఎంత రుణ, పరపతి సౌకర్యం కల్పించాలో అంతకు ముందు ఉన్న లక్ష్యాలను తగ్గించవచ్చునని సిఫారసు చేశాయి. బి) గ్రామీణ ప్రాంతాలలోని బ్యాంకుల శాఖలెన్నిటినో మూసి వేశారు. సి) ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల లక్ష్యాలలో ఒకటిగా ఉండిన గ్రామీణ ప్రాంతాల బలహీన వర్గాలకు ప్రాధాన్యతా రుణాలు కల్పించాలనే సూత్రాన్ని 1997 నుంచి పలుచబారుస్తూ వచ్చారు. గ్రామీణ బ్యాంకులను కూడా వ్యాపార, లాభ నష్టాల ప్రాతిపదికపైనే నడపాలని పునర్నిర్మించారు.

వ్యవసాయ మార్కెటింగ్ :

ఎ) నిత్యావసర వస్తువుల చట్టం నిబంధనలలో మార్పులు చేశారు. బి) వ్యవసాయోత్పత్తులను ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి తరలించడంపై ఉన్న ఆంక్షలను సడలించారు. సి) వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని కొత్తగా తయారు చేశారు. డి) కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిని ప్రోత్సహించడం మొదలుపెట్టారు. మార్కెట్ అనుకూల పంటలను ప్రోత్సహించడం అనే పేరుతో ఆహార భద్రతతో సంబంధంలేని, విదేశీ మార్కెట్‌లను దృష్టిలో పెట్టుకొనే గెర్కిన్, చిన్న మక్క, ఎక్కువ రసపు టమాట, పూలు, వగైరా పంటలను ప్రోత్సహించారు. ఈ పంటలకు ఎక్కువ పెట్టుబడులు అవసరం కాబట్టి చిన్న రైతులు వాటిని పండించ లేరు గనక కాంట్రాక్ట్, కార్పొరేట్ వ్యవసాయం అవసరమని ప్రచారం చేశారు. ఆ సంస్థలయితే మార్కెట్‌లలో ప్రవేశించడం సులభమని, రైతులకు లాభసాటి వాటాలు ఇవ్వగలవని అన్నారు. అన్ని రాష్ట్రాలలోనూ ఈ కాంట్రాక్ట్, కార్పొరేట్ వ్యవసాయ పద్ధతి చిన్న, మధ్యతరగతి రైతాంగాన్ని ధ్వంసం చేసింది. రిలయన్స్ వంటి కొద్ది కంపెనీలు మాత్రమే లాభపడ్డాయి. ఇ) వ్యవసాయోత్పత్తులను సరుకులుగా మార్చి, ముందస్తు మార్కెట్‌లను ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఏ పంట ఎంత రాబోతుందో దానికి ఎంత ధర కట్టి ఇవ్వగలరో అంచనాలు వేసి దాని మీద వ్యాపారం చేయడాన్ని ముందస్తు మార్కెట్ అంటారు. మామూలు మాటల్లో చెప్పాలంటే ఇది జూదం. స్టాక్ మార్కెట్‌లాగే పని చేసే ఈ మార్కెట్‌లో లాభపడేది మధ్య దళారులూ, బ్రోకర్లూ, ఫ్యూచర్స్ మార్కెట్ నిర్వాహకులూ మాత్రమే గానీ, రైతులకు అందేదేమీ లేదు.

ద్రవ్య సంస్కరణలు :

ఎ) బడ్జెట్‌లో ద్రవ్య లోటును తగ్గించడమే ఏకైక లక్ష్యంగా పన్నుల తగ్గింపును, ప్రజోపయోగ వ్యయం తగ్గింపును ప్రవేశపెట్టారు. దానితో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు, వ్యవసాయ రంగానికి ప్రభుత్వ పెట్టుబడులు విపరీతంగా తగ్గిపోయాయి.

(ఆధారం : డి. నరసింహారెడ్డి, శ్రీజిత్ మిశ్రా సంపాదకులుగా వెలువడిన 'అగ్రేరియన్ క్రైసిస్ ఇన్ ఇండియా', ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 2009) ☐

వీక్షణం వ్యాస రచనా తరగతి

వీక్షణంకు వస్తున్న వ్యాసాలు రాశిలో ఎక్కువగానే ఉంటున్నప్పటికీ వాసిలో అంత సంతృప్తికరంగా ఉండడం లేదనే ఆలోచనతో 'వ్యాస రచన' పై వర్క్‌షాప్ పెట్టాలని మూడు నాలుగేళ్లుగా వీక్షణం అనుకుంటోంది. విశ్వవిద్యాలయాల సామాజిక శాస్త్రాల విద్యార్థులతో నిర్వహించాలని అనుకున్న ఈ వర్క్‌షాప్‌ల ఆలోచన అనేక కారణాల వల్ల సాధ్యం కాలేదు. చివరికి ఒక ప్రయోగంగా వ్యాస రచనపై ఆసక్తి ఉన్న కొద్దిమందితో వీక్షణం కార్యాలయంలోనే 'వ్యాస రచన' వర్క్‌షాప్ జూలై 3న జరిగింది. ఈ అధ్యయన తరగతికి బి.ఎస్.రాజు, ఆర్. సుబ్బారావు, ఎ. నర్సింహారెడ్డి, వై. వేణుగోపాల్‌రెడ్డి, ఎస్. సరళా వందనం, ఎన్. తిరుమల దేవి, డా. మంజుల, ఎల్. సంతోష, డి.విజయ్‌భాస్కర్, కె. వేణుగోపాల్, బి. వేణుగోపాల్ రెడ్డి, ఎస్. చంద్రయ్య, డి. ఉదయ్‌భాను, క్రాంతి, వై. నర్సింలు హాజరయ్యారు. తరగతి ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నడిచింది.

'వ్యాస రచన మీద జరగవలసినంత ప్రయత్నం జరగడం లేదు. చర్చ జరగడం లేదు. వ్యాసాలు చాలానే వస్తున్నాయి. కాని వ్యాసం ఎలా రాయాలి అనే విషయం చాలా మందికి ఇంకా తెలియవలసింది ఉంది. బహుశా దానికి కారణం తెలుగులో వ్యాస రచన నేర్చుకోవడానికి అవసరమైన పుస్తకాలు గానీ, పరికరాలు గానీ, బోధన గానీ లేకపోవడం కావచ్చు. తెలుగులో వ్యాసానికి 160 ఏళ్ల చరిత్ర ఉంది. కాని వ్యాసం మీద వచ్చిన పుస్తకాలు ఎక్కువగా లేవు. కవిత్వం, కథ, నాటకం, పాట లాంటి ప్రక్రియల మీద చాలా పుస్తకాలు వచ్చాయి.

వీక్షణం అనుభవమే చూస్తే ఈ ఎనిమిది సంవత్సరాలలో 1538 వ్యాసాలు వచ్చాయి. సగటున సంవత్సరానికి రెండు వందల పైన వ్యాసాలు వచ్చాయి. రెండు వందల సంపాదకీయాలు ఉన్నాయి. ఇందులో ఏడు వందల వ్యాసాలు ఇంతకు ముందు నుంచే రాస్తున్న రచయితలవి. మిగతా వెయ్యి వ్యాసాలు కొత్త రచయితలవి. ఈ వెయ్యిలో కనీసం మూడు వందల మంది మొదటిసారిగా వ్యాసం రాశారు. వ్యాస రచయితల సంఖ్య పెరుగుతోంది. ఇక వాళ్లు రాసే వ్యాసాల నాణ్యత ఎలా పెంచాలి అనే దాని మీద దృష్టి పెట్టాల్సి ఉంది.

వ్యాస రచనా ప్రక్రియ తరగతిలో పన్నెండు భాగాలు ఉన్నాయి. అవి ఉపోద్ఘాతం, తెలుగులో వ్యాస ప్రక్రియ చరిత్ర, వ్యాస రచనకు ప్రేరణ, వ్యాస రచనా ప్రణాళిక, వ్యాసాల రకాలు, వ్యాసం ఉపోద్ఘాతం, వ్యాసంలో భాగాలు, వ్యాసాలలో సాధారణంగా దొర్లే తప్పులు, వ్యాసంలో తార్కిక వాదనల పాత్ర, అవసరమైన భాషా పరికరాలు, అవసరమైన విరామ చిహ్నాలు, చదవవలసిన పుస్తకాలు.

తెలుగులో తొలి వ్యాసాలు పందొమ్మిదో శతాబ్ది నుంచే ప్రారంభమయ్యాయి. ఇంత చరిత్ర ఉన్నప్పటికీ ఏడాదికి కనీసం అరవై వేల వ్యాసాలు అచ్చవుతున్నప్పటికీ కొత్త రచయితల వ్యాసాల దగ్గర నుంచి నిష్ణాతులైన రచయితల వ్యాసాల దాకా ఏదో ఒక లోపం ఉంటూనే ఉంది.

అసలు వ్యాసం ఎందుకు రాస్తారు? సమాజంలో, ప్రకృతిలో అనేక పరిణామాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలను ఎట్లా అర్థం చేసుకోవాలి, ఆ పరిణామం మీద వైఖరులు ఏమిటి, ఆ వైఖరులు ఎట్లా ఉండాలి అనేది చెప్పడానికే వ్యాసాలు రాస్తారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిణామాల గురించి వ్యాసం ద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతాం. వ్యాసం ద్వారా విశ్లేషణ అందుతుంది. వ్యాసానికి ఇప్పుడు ఇస్తున్న ప్రాధాన్యత కన్న ఇంకా ఎక్కువ ప్రాధాన్యత ఉంది.

వ్యాసం రాసే వారు పాఠకులకు తెలియని విషయం చెబుతున్నాం అని, తెలిసిన విషయానికే మరో కోణం, మరో వివరణ చెపుతున్నాం అని గుర్తుంచుకోవాలి. కాబట్టి విషయం సులువుగా, అర్థమయ్యేలా వ్యాసం రాయాలి.

వ్యాసం ప్రతి విషయం మీద, ప్రతి సంఘటన మీద రాయవచ్చు. పరిణామాలు, భిన్నాభిప్రాయాలు, అధ్యయనాలు, వదంతులు, ఆలోచనలు, చర్చలు, కొత్త ప్రతిపాదనలు, ప్రకటనలు ఇలా ఏ విషయం మీదైనా వ్యాసాలు రాయవచ్చు.

వ్యాసం రాయడానికి ముఖ్యంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. వ్యాసం రాసే ముందు ఆలోచించాలి. ప్రారంభం, విషయంపై వాదనలు, ముగింపు ఉండాలి. వ్యాసంలో వివరణ ఉండాలి. భిన్నాభిప్రాయాలపై వాదన, నిర్ధారణ ఉండాలి. ఏదైనా విషయంపై పరిచయం, వివరణ, దానిపై ఆలోచనకు ప్రేరణ కలిగించాలి.

స్వానుభవం, జీవిత చరిత్రలు, వ్యంగ్యం, చర్చ, సమాచారం, వివరణ, సూచన, ఊహ, విమర్శ, ప్రతిపాదనలు ఇలా అనేకరకాల వ్యాసాలుంటాయి.


వ్యాసాలలో సాధారణంగా దొర్లే తప్పులు కొన్ని ఉన్నాయి. ఆలోచనలో స్పష్టత లేకపోవడం, వాక్య నిర్మాణ లోపం, పదాల వాడకంలో లోపం, విరామ చిహ్నాల వాడకంలో లోపం, వాదనలు గజిబిజిగా ఉండడం, ఉటంకింపులలో లోపాలు లాంటి లోపాలు ఒకటికి రెండుసార్లు సరిచూసుకుంటూ తగ్గించుకోవచ్చు.

వ్యాసంలో సాధారణంగా తర్కం ఉంటుంది. రచయిత చెప్పదల్చుకున్న విషయాన్ని పాఠకులకు చేర్చడానికి వాదనలు ఉపయోగిస్తారు. వాదనలు ఒక క్రమంలో సాగుతాయి. వాటిని బలపరచడానికి ఉదాహరణలు, పోలికలు, చారిత్రక వివరణలు ఉంటాయి. వ్యతిరేకంగా రాగల వాదనలకు జవాబులు ఉంటాయి.

వ్యాసాలలో చాలా ముఖ్యం విరామ చిహ్నాల వాడకం. చాలా మంది రచయితలు విరామ చిహ్నాల వాడకంలో తప్పులు చేస్తుంటారు. వాటిని ఎక్కడ ఉపయోగించాలో తెలుసుకోవడం ముఖ్యం.

తరగతికి వచ్చిన వారు ప్రశ్నలు, కొన్ని సందేహాలను వ్యక్తం చేసి నివృత్తి చేసుకోవడంతో, తమ అభిప్రాయాలు చెప్పడంతో వర్క్‌షాప్ ముగిసింది.

వ్యాసరచనా అభివృద్ధి కోసం చదవాల్సిన పుస్తకాలు : గొబ్బూరి వెంకటానంద రాఘవరావు – ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర, 1923 (2001); తిరుమల రామచంద్ర, తదితరులు – తెలుగు వ్యాసం – నూరు సంవత్సరాలు, 1974; కొలకలూరి ఇనాక్ – తెలుగు వ్యాస పరిణామం, 2001; వి. చెంచయ్య – వ్యాస రచనా శిల్పం, 2009. వీ



దేశంలోని మావోయిస్టు ఉద్యమ సైద్ధాంతిక రాజకీయ వైఖరులను, పోరాట రూపాల పట్ల అవగాహనలను ఒక చర్చకు జవాబుగా వివరిస్తున్నారు **ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్)**

మావోయిస్టులు కోరేదేమిటి?

(ముంబయి నుంచి వెలువడే సుప్రసిద్ధ రాజకీయ, ఆర్థిక వార పత్రిక 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' 2006 జూలై 22 సంచిక 'భారత దేశంలో మావోయిస్టులు' అనే అంశం మీద ప్రత్యేక సంచికగా వెలువడింది. ఆ సంచికలో సుమంతా బెనర్జీ, మనోరంజన్ మొహంతీ, సీతారాం ఏచూరి, తిలక్ డి. గుప్తా, సాగర్, బేలాభాటియా, కె. బాలగోపాల్, నందిని సుందర్ మావోయిస్టు ఉద్యమం గురించి తమ విశ్లేషణలు రాశారు. ఆ సంచిక మీద తన ప్రతిస్పందనగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆజాద్ 'భారత దేశంలో మావోయిస్టులు – ఒక ప్రతిస్పందన' అనే వ్యాసం రాశారు. ఆ వ్యాసం ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ 2006 అక్టోబర్ 14 సంచికలో అచ్చయింది. 2010 జూలై 2న జోగాపూర్ 'ఎన్‌కౌంటర్'లో ఆజాద్ మృతిచెందిన సందర్భంగా ఆ వ్యాసపు ప్రాముఖ్యత దృష్ట్యా అనువదించి ప్రచురిస్తున్నాం. – సం.)

భారతదేశంలో మావోయిస్టుల గురించి ఒక ప్రత్యేక సంచిక వెలువరించడం అంటేనే మావోయిస్టుల నాయకత్వాన నడుస్తున్న ఉద్యమానికి దేశంలోని రాజకీయాలలోనూ, ఆర్థిక వ్యవస్థలోనూ ప్రాముఖ్యత పెరుగుతున్నదని గుర్తించడమే. అయితే, నిరుత్సాహకరమైన అంశమేమంటే మావోయిస్టుల పైననే కేంద్రీకరించిన ఒక ప్రత్యేక సంచికలో మావోయిస్టులు స్వయంగా రాసిన వ్యాసం ఒక్కటి కూడా లేకపోవడం. అచ్చయిన వ్యాసాలలో అత్యధిక భాగం హింసా సమస్యలోనే తలమునకలైనట్టు కనబడుతుంది కానీ, ఈ దేశ ప్రజానీకం అనుభవిస్తున్న దుర్భర పరిస్థితుల గురించి గానీ, వాటినుంచి బయట పడే మార్గాల గురించి గానీ ఆలోచించినట్టు లేదు. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ విస్తృతమైన పరిధిలోని అభిప్రాయాలకు చోటు కల్పించింది. కాని, ఆ వ్యాసాలు మన ప్రజల దుర్భర స్థితుల నుంచి బయటికి లాగడం ఎలా అనే సమస్యతో ముడిపడి ఉంటే బాగుండేది. మరీ ప్రత్యేకించి, ప్రస్తుత ప్రపంచీకరణ దశలో ఆ పరిస్థితి మరింత దిగజారి ఉన్నప్పుడు ఆ విషయం చర్చించడం అవసరం. హింసా సమస్యను కూడా ఈ నేపథ్యంలోనే పరిశీలించవలసి ఉండింది. మా ఈ ప్రతిస్పందనలో మేం భారత సామాజిక వ్యవస్థ గురించి మా అవగాహన ఏమిటో మొదట క్లుప్తంగా వివరించదలిచాం. ఆ తరువాత ఆయా రచయితలు లేవనెత్తిన అంశాలను ఏ చట్రంలో పరిశీలించవలసి ఉంటుందో, మా లక్ష్యాలు ఏమిటో వివరించి, చివరిగా ఆయా అభిప్రాయాలతో ఎక్కడ మేం విభేదిస్తున్నామో ప్రధాన అంశాలు చెప్పడానికి ప్రయత్నిస్తాం. ఉద్యమ శ్రేయోభిలాషులను ఆందోళనపరుస్తున్న వాదనలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడానికి ప్రయత్నిస్తాం.

అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ

మన ప్రియమైన మాతృభూమి, ప్రకృతి సంపదలో, మానవ శక్తిలో, మానవ మేధలో అతి సంపన్నమైన మన దేశం ఇవాళ ఏ స్థితికి కుదించ బడిందంటే, కొన్ని ప్రమాణాలలో అది ఆఫ్రికా, సహారా ఎడారిలోని దేశాల కన్నా అధ్వాన్నమైన స్థితిలో ఉంది. స్వాతంత్ర్యం అనబడేది వచ్చిన అరవై సంవత్సరాలలో పరిస్థితి గణనీయంగా మెరుగు పడలేదు. కనీసం సాధారణ ప్రజలకు బ్రిటిష్ పాలనా కాలం నాటి పరిస్థితులే కొనసాగుతున్నాయి. నెహ్రూ పాలనా కాలంలో అభివృద్ధి నమూనా 'బొట్లు బొట్లుగా కిందికి జారే' భావన పైన ఆధారపడింది. ప్రస్తుతం ప్రపంచీకరణ దశలో కనీసం ఆ ముసుగు కూడా తొలగిపోయింది. గత పది సంవత్సరాలలో గ్రామీణ భారత దేశంలో లక్ష మంది ఆత్మహత్యలు చేసుకున్నారనే అధికారిక అంకె ఈ దేశంలోని దారిద్ర్య మహా సముద్రంలో పైకి లేచిన చిన్న మంచు గడ్డ మాత్రమే. ఈ సంచికలోని రచయితలలో ఒక్కరు కూడా ఆ విషయమే ప్రస్తావించలేదు. అశేష ప్రజానీకపు దారిద్ర్యం, నిరాదరణ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచీకరణ దశలో మరింత పెరిగిపోయాయి. ఈ స్థితిలో నక్సలైట్లు మాత్రమే కాదు, మామూలు ప్రజలైనా సరే న్యాయం కోసం గొంతెత్తే సాహసం చేస్తే వారిని ఎదుర్కొంటున్నవి రాజ్యాంగ యంత్రపు లాఠీలు, తుపాకులు మాత్రమే. రాజ్యాంగ యంత్రపు అసహనం రోజు రోజుకూ పెరిగిపోతూ ఉంది.

అది గుర్‌గావ్‌లోని కార్మికుల పోరాటం గానీ, కళింగనగర్‌లోని ఆదివాసీ ప్రజాపోరాటం గానీ, ముంబయి, ఢిల్లీలలో మురికివాడల నివాసుల ప్రతిఘటన గానీ, నర్మదాలో నిర్వాసితులైన ప్రజల పోరాటాలు గానీ, రాజస్థాన్‌లోని రైతుల పోరాటాలు గానీ, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లలోని విద్యుచ్ఛక్తి ఉద్యోగుల పోరాటాలలు గానీ, చివరికి తమిళనాడులోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పోరాటం గానీ మాత్రమే కాదు. ఆ అసహనం ఎంత దూరం పోయిందంటే, ఢిల్లీలో ఇటీవల మధ్యతరగతి నివసించే వాడలలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా వారు నిరసన తెలిపితే ప్రభుత్వ యంత్రాంగం వారి మీద కూడా ఆ అసహనాన్నే ప్రదర్శించింది. ఈ అన్ని పోరాటాలలోను ప్రజల మీద నిర్దాక్షిణ్యమైన అణచివేత సాగింది.

ఆ ప్రజలకు రాజ్యపు కర్కశ దాడిని ఎదుర్కొని నిలిచే శక్తి లేదు. అందువల్ల వాళ్ల పరిస్థితులు అంతకు ముందు పెనం మీద ఉన్నవి,

ఇప్పుడు పొయ్యిలోకి వచ్చాయి. భారత దేశంలోని మావోయిస్టు ఉద్యమం మీద ఇ.పి.డబ్ల్యు. ప్రత్యేక సంచికకు రాసిన ఈ రచయితలందరూ పోరాడుతున్న ఈ విభిన్న ప్రజాసమూహాల మీద ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ ఆగిపోవడానికి ఏమార్గం చూపుతారు? ఈ ప్రజలు తమ బతుకులను మెరుగుపర్చుకోవడానికి ఏ రకంగా సంఘటితం కావాలంటారు? ఏ పద్ధతిలో వారు ప్రభుత్వ దమనకాండను ఎదుర్కోవాలంటారు? మావోయిస్టులు సాయుధ పోరాట మార్గం చేపట్టిన ప్రాంతాలలో, కనీసం ఏదో ఒక స్థాయిలో విజయం సాధించిన మావోయిస్టు మార్గాన్ని వ్యతిరేకించడం అంటే, అది కూడా ఏ ప్రత్యామ్నాయాన్ని చూపకుండా వ్యతిరేకించడం అంటే, ఈ ప్రజలను మరింత మరింత నిరాశ లోతులలోకి, అంటే, దారిద్ర్యపు లోతులలోకి నెట్టడమే అవుతుంది. సరిగ్గా అదే సమయంలో ఈ దేశపు సంపన్నులు విచ్చలవిడిగా పెరిగిపోతున్న తమ సంపదను ప్రదర్శిస్తూ ఊరేగుతున్నారు.

ప్రజలమీద రాజ్య హింస పెరిగిపోతూ ఉండడం, దానితో పాటే దేశంలో పేదరికం పెరిగిపోతూ ఉండడం యాదృచ్ఛికంగా జరుగుతున్న విడివిడి సంఘటనలు కావు. అవి, ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవస్థలో అంతర్భాగాలు. ఆ వ్యవస్థను మేం మావోయిస్టులం స్థూలంగా అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ అని పిలుస్తాం. ఇది ఎందుకు అర్ధ వలస అంటే, బడా వ్యాపారవేత్తలు, అత్యున్నత అధికార యంత్రాంగం, ప్రధాన రాజకీయవేత్తలు వంటి వారితో కూడిన భారత పాలకవర్గాలు కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అధికారం చెలాయిస్తూ, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అంటకాగుతున్నాయి. ఎందుకు అర్ధ భూస్వామ్య అంటే, కాలం చెల్లిన భూస్వామ్య సంబంధాలు ఇంకా రద్దయిపోలేదు. ఆ భూస్వామ్య సంబంధాలను అలాగే ఉంచి, కొద్దిపాటి పెట్టుబడిదారీ అభివృద్ధిని వాటి మీద అంటుగట్టడం జరిగింది. అందువల్ల ఈ దేశంలో ఉన్న పార్లమెంట్ ఒక ప్రజాస్వామిక నిర్మాణంగా లేదు. అది ప్రజాస్వామిక విప్లవాలు జరిగిన దేశాలలో ఏర్పడిన బూర్జువా ప్రజాస్వామికంగా లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న అతి నిరంకుశ రాజ్యంపైనా, అర్ధభూస్వామ్య నిర్మాణాలపైనా కేవలం ప్రజలను మోసగించే ఒక సాధనంగా మాత్రమే దాన్ని నెలకొల్పడం జరిగింది.

ఇక మనం ప్రస్తుతం చూస్తున్న భారత ఆర్థిక వ్యవస్థలో మోసగాళ్లు, నిర్దాక్షిణ్యమైన మాఫియా, దురాశ నిండిన గనుల పరిశ్రమ, భారీ సట్టా వ్యాపారులు విచ్చలవిడి కార్యకలాపాలు సాగిస్తున్నారు. వారందరూ నేరస్వభావం నిండిన రాజకీయాలతో కలగలసి ఉన్నారు. ఈ దిగజారుడు ఎంత లోతైనదంటే, ఈ కుళ్లు ఎంత తీవ్రమైనదంటే ఈ డబ్బున్న ఆసాములే వేలాది ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను తయారు చేసి ఈ వ్యవస్థలోని చెడుగుల గురించి పలుచబారిన వ్యాఖ్యానాలు చేయిస్తున్నారు. తద్వారా ప్రజలు ఈ వ్యవస్థలో అంతర్భాగంగా ఉన్న నిజమైన సమస్యలను చూడలేని ఒక వక్రీకరణ సాగుతోంది. ఈ ఎన్.జి.ఒ.ల కార్యకలాపాల వల్ల వ్యవస్థలోని సమస్యలు కొంతమంది వ్యక్తులకో, కొన్ని విధానాలకో మాత్రమే సంబంధించినవనే తప్పుడు భావాలు వ్యాపిస్తున్నాయి.

ప్రస్తుత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ సామాజిక విభజనను తీవ్రతరం చేస్తుంది. పునరుత్పత్తి చేస్తుంది. కొద్దిమంది ధనికులు, వారి ఆశ్రితులు ఒకవైపు, అంతకంతకూ పెరిగిపోతున్న అశేష దరిద్ర జనబాహుళ్యం మరొకవైపు విభజించబడుతోంది. మధ్యతరగతి లోని ఒక చిన్న బృందం పైకి జరిగి ధనిక వర్గంలో చేరిపోతోంది. బడా సంపన్నుల ఆహారపు బల్ల దగ్గర రాలిపడుతున్న ఎంగిలి తునకలను ఏరుకుంటోంది. కాగా, కోట్లాది మంది ప్రజానీకం పేదరికంలోకి, నిరుద్యోగంలోకి, వ్యవసాయ సంక్షోభంలోకి, వ్యాపారాల దివాలాలోకి, ఆర్థిక విధ్వంసంలోకి నెట్టివేయబడుతున్నారు. చిన్నపాటి స్థానిక పెట్టుబడిదారులు, చిన్న వ్యాపారులు కూడా అంతకంతకూ ఎక్కువగా పీల్చిపిప్పి చేయబడుతున్నారు. ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలోకి బడా కంపెనీలు ప్రవేశిస్తున్నాయి.

ఒకవైపు సంపద, మరోవైపు పేదరికం ఇంత తీవ్ర స్థితిలో ఉండగా, ధనికుల, శక్తిమంతుల ద్వీపాలను పరిరక్షించడం కొరకు రాజ్యాంగ యంత్రం ప్రజల మీద, వారి సంస్థల మీద ఇంకా ఇంకా ఎక్కువగా అణచివేత విధానాలను అమలు చేయక తప్పదు. మావోయిస్టులే 'అంతర్గత భద్రత'కు మొట్టమొదటి శత్రువులని హోంమంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనను ఈ అవగాహన నుంచే అర్థం చేసుకోవాలి. మావోయిస్టులుగా మేం ఒక న్యాయమైన, సమానత్వంతో కూడిన సామాజిక వ్యవస్థను కోరుకుంటున్నాం. ప్రజల మీద పాశవికంగా అణచివేతను ప్రయోగిస్తున్న అత్యంత నిర్బంధపూరితమైన భారత రాజ్యాంగ యంత్రాన్ని ఎలా ఎదుర్కోవడం అన్నదే మా ఈ ప్రయత్నంలో ప్రధానమైన సమస్య. ఈ రాజ్యాంగ యంత్రం ఈ దేశంలోని సంపన్నులను రక్షించడానికి, వారికి అన్ని సౌకర్యాలు కల్పించడానికి మాత్రమే పనిచేస్తోంది. సరే, ఆ విషయంలోకి వెళ్లేముందు అసలు మా అవగాహన ఏమిటో తెలుసుకుందాం.

మావోయిస్టు అభివృద్ధి నమూనా

మావోయిస్టులుగా మేం ప్రజా దృక్పథం కలిగిన, స్వావలంబనతో కూడిన అభివృద్ధి నమూనాను అవలంబిస్తాం. మా నమూనాలో ప్రజలదే ప్రధాన పాత్ర. వారి సృజనాత్మక చొరవను సంపూర్ణ స్థాయికి విడుదల చేయడమే మా ఆకాంక్ష. ఈ దేశంలో ఉత్పత్తి అయిన సంపద సమస్తమూ ఇక్కడే ఉండాలని, బయటి దేశాలకు తరలిపోకూడదని మా అభిప్రాయం. భారతదేశం అత్యంత సంపన్నమైన దేశం. అపారమైన మానవ శక్తి, నైపుణ్యం ఇక్కడ ఉన్నాయి. అద్భుతమైన సహజ సంపదల పునాది ఇక్కడ ఉంది. ఈ అనంతమైన సంపదను సామ్రాజ్యవాదులూ, భూస్వామ్య శక్తులూ, దళారీలూ అక్రమంగానూ, అనైతికంగానూ తమ హక్కు భుక్తం చేసుకున్నారు. ఆ సంపదనంతా స్వాధీనం చేసుకోవలసి ఉంది. దాన్ని ఈ దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఉపయోగించవలసి ఉంది. అన్నిటికన్నా ముందు మొట్టమొదట మన దేశంలోని అత్యధిక ప్రజానీకం నివసించే గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఆ సంపదను ఉపయోగించవలసి ఉంది.

అశేష ప్రజానీకపు కొనుగోలు శక్తిని విస్తృతంగా పెంచడమే మా అభివృద్ధి నమూనా లక్ష్యం. ఆ కొనుగోలు శక్తి పెరిగినందు వల్ల దేశం లోపలనే ఒక విశాలమైన స్థానిక మార్కెట్ తయారవుతుంది. ఆ మార్కెట్ దేశంలో పరిశ్రమల పెరుగుదలకు ప్రధానమైన చోదక శక్తి అవుతుంది. ఇదంతా జరగాలంటే ప్రారంభించవలసినది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం. ఆ గ్రామాలలోనే మన ప్రజానీకంలో 70

శాతం నివసిస్తున్నారు. అందువల్ల ఆ గ్రామీణ ప్రాంతాలలో 'దున్నేవాడిదే భూమి' పునాదిపై భూమి పునఃపంపిణీ చేయాలని, భూసంస్కరణలు అమలు జరపాలని మేం భావిస్తాం.

ఇ.పి.డబ్ల్యు. సంచికలో తన వ్యాసంలో తిలక్ డి. గుప్తా ఈ భూసంస్కరణలు ఇక ఎంతమాత్రం సాధ్యం కావని, అసలు దేశంలో తగినంత మిగులు భూమి లేనే లేదని రాశారు. పునఃపంపిణీకి సరిపోయినంత భూమి లేదని నిర్ధారించే ముందు ఒక కమతానికి ఎంత పరిమితి విధిస్తే సరిపోతుందో ఆయన ఖరారు చేశారా? ప్రభుత్వం దగ్గర, పంచాయితీల దగ్గర ఎంత భూమి ఉందో ఆయన తేల్చుకున్నారా? మత సంస్థల దగ్గర, మఠాల దగ్గర ఎంత భూమి ఉన్నదో ఆయన లెక్క వేశారా? భూమితో సంబంధం లేని భూస్వాముల పేరు మీద ఎంత భూమి ఉందో ఆయన తేల్చుకున్నారా? (ఎంతో మంది ప్రభుత్వాధికారులు, సైనికాధికారులు ఇంకా భూస్వాములు గానే ఉన్నారు. అంతే కాదు నిజానికి ఇప్పుడు ఎక్కువగా భూములు కొంటున్నది వారే.) ప్రైవేట్ కార్పొరేట్ రంగం దగ్గర, విలాసవంతమైన రిసార్ట్‌లలో, గోల్ఫ్ క్లబ్‌లలో వగైరాలలో ఎంత భూమి ఉందో ఆయన తేల్చుకున్నారా?

భూసంస్కరణలు విడిగా సాగవలసినవి కావు. వాటితోపాటు వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలి. హరిత విప్లవం వల్ల పాడుపడిపోయిన నేల సారాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేయాలి. అడవులను పెంచాలి. కోళ్ల పెంపకం, మేకల పెంపకం, మత్స్య సంపద, వగైరా వ్యవసాయ సంబంధ కార్యకలాపాలన్నీ చేపట్టాలి. ఇవన్నీ జరిగినప్పుడు గ్రామీణ ప్రజానీకపు కొనుగోలుశక్తి విపరీతంగా పెరిగిపోతుంది. దాని వల్ల నిత్య జీవితపు మౌలిక అవసరాల మార్కెట్ సృష్టించబడుతుంది. దానితో స్థానిక పరిశ్రమలు పుట్టుకు రావడానికి అవకాశం వస్తుంది. దానితో ఉపాధి కల్పన పెద్ద ఎత్తున సాగుతుంది. ఈ ఉపాధి కల్పనతో కొనుగోలు శక్తి మరింత పెరుగుతుంది. అది మరిన్ని పరిశ్రమలకు దారితీస్తుంది. ఈ వలయాకార అభివృద్ధి నిరంతరంగా సాగిపోయే అభివృద్ధికి దారితీస్తుంది. ఈ అభివృద్ధి నమూనాలో వృద్ధి, స్థానిక మార్కెట్ విస్తరణ అనేవి ప్రజల సంక్షేమంతో సన్నిహితంగా ముడిపడి ఉంటాయి. అంతేకాదు, ప్రజల సంక్షేమం మీదనే ఆధారపడి ఉంటాయి.

పట్టణ ప్రాంతాలలో కూడా పారిశ్రామిక ఉత్పత్తి ప్రజల దృక్కోణం నుంచే జరగాలని మేం భావిస్తాం. తెగ బలిసిన సంపన్నుల విలాసాల ఖర్చులు ఆగిపోతాయి. వారి అదనపు సంపాదనా, అక్రమ సంపాదనా జప్తు చేయబడుతుంది. విశాలమైన మురికివాడల ప్రజలందరికీ పునరావాసం కల్పించబడుతుంది. ప్రతి ఒక్కరికీ బతకడానికి సరిపోయిన వేతనంతో ఉద్యోగ భద్రత హామీ దొరుకుతుంది. ఏ ఒక్కరికీ తమ పూర్వీకుల భూమి మీద అదే ఏకైక భద్రతా వనరుగా వేలాడే దుస్థితి ఉండదు. ఇందువల్ల గ్రామీణ ప్రజానీకంలోని నిరుపేదలకు పంపిణీ చేయడానికి మరికొంత భూమి విడుదల అవుతుంది.

సాంస్కృతిక, క్రీడా, వినోద కార్యకలాపాలన్నీ ప్రజలందరినీ సమ్మిళితం చేసేలా జరుగుతాయి. విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వస్తుంది. అన్ని రకాల కుల, పితృస్వామిక పీడనా వివక్షా రూపాల మీద పోరాడడం జరుగుతుంది. అన్నిటినీ నిషేధించడం జరుగుతుంది. అస్పృశ్యతను రద్దు చేయడం మాత్రమే కాదు, పాటించిన వారిని తీవ్రంగా శిక్షించడం జరుగుతుంది. అన్ని రకాల క్షీణ, భూస్వామ్య భావాల మీద నిరంతర పోరాటం సాగుతుంది. విప్లవ విజయం తరువాత కూడా అనేక సాంస్కృతిక విప్లవాల ద్వారా ఈ పనులు కొనసాగుతాయి. ప్రజలందరికీ ఆరోగ్య సేవలు ఉచితంగా అందుతాయి. వ్యాధులు రాకుండా ముందే తీసుకొనే జాగ్రత్తల మీద, పారిశుధ్యం మీద ఎక్కువ శ్రద్ధ ఉంటుంది.

క్లుప్తంగా చెప్పాలంటే, మావోయిస్టులుగా మేం ప్రకటించే అభివృద్ధి నమూనా ఇది. ఇదంతా మా పార్టీ కార్యక్రమంలోను, ఎప్పటికప్పుడు విడుదల చేసే రాజకీయ తీర్మానాల్లోను ప్రకటిస్తూనే ఉన్నాం. ఇందులో అస్పష్టత ఏమీ లేదు. బస్తర్‌లో ప్రస్తుత సాల్వాజుడుం రూపంలో ప్రభుత్వ దాడి పెద్ద ఎత్తున సాగకముందు, పైన చెప్పిన పద్ధతిలోనే విస్తారమైన అభివృద్ధి పథకాలు చేపట్టాం. ఆ వివరాలన్నీ మేం 2000లో అచ్చు వేసిన 'న్యూ పీపుల్స్ పవర్ ఇన్ దండకారణ్య' పుస్తకంలో వివరంగానే పొందుపరిచాం. ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, బీహార్‌లలో మావోయిస్టు నాయకత్వం కింద రైతాంగం జరిపిన న్యాయమైన పోరాటాలలో పెద్ద భూస్వాముల నుంచి భూములను స్వాధీనం చేసుకున్నాం. ఆ భూమిని భూమి లేని నిరుపేదలకూ, చిన్న రైతులకూ పంపిణీ చేశాం.

మేం ప్రతిపాదిస్తున్నదంతా భూసంస్కరణలు, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ ఇరుసుగా రూపొందే నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ నమూనా. రాజ్యాధికారం చేపట్టిన తరువాత అమలు చేయబోయే ఈ నూతన ప్రజాస్వామిక నమూనానే మేం మా గెరిల్లా ప్రాంతాలలోను, ఆ తరువాత స్థావర ప్రాంతాలలోను బీజ రూపంలో అమలు చేస్తున్నాం. అందువల్లనే దండకారణ్యంలో సైనిక చర్యలు ఇప్పటంత తీవ్రంగా లేకముందు మేం ప్రజానుకూల పథకాలను అమలు చేయడం మాత్రమే కాదు, బైలదిల్లా గనుల నుంచి జపాన్ కొల్లగొట్టుకుపోతున్న మన సంపన్నమైన ఇనుప ఖనిజపు నిలువల తరలింపును ఆపివేశాం. అలాగే ప్రభుత్వ విధానాల వల్ల మూతపడిపోతున్న నాలుగు వందలకు పైగా స్థానికుల చిన్న తరహా రోలింగ్ మిల్లులను కాపాడాం.

ఈ నమూనా హింసాత్మకమైనదా? ఈ నమూనా అప్రజాస్వామిక మైనదా? నిజం చెప్పాలంటే ఈ నమూనానే అత్యంత మానవీయమైన, శాంతికాముకమైన అభివృద్ధి నమూనా. కాని, మేం దీన్ని అమలు చేయడానికి ప్రయత్నించినప్పుడు రాజ్యాంగయంత్రం మా మీద, మమ్మల్ని సమర్థించే ప్రజానీకం మీద పెద్దఎత్తున విరుచుకుపడుతున్నది. ఇక్కడ హింసకు దిగుతున్నది మేం కాదు. వాస్తవంగా చెప్పాలంటే ఒక దశాబ్దానికి పైగా దండకారణ్యంలోనూ, జార్ఖండ్‌లోనూ ప్రభుత్వ సైనిక చర్యలు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు మేం విస్తృతమైన అభివృద్ధి పథకాలను చేపట్టగలిగాం. పైన వివరించిన అభివృద్ధి నమూనాను అమలులో పెట్టడానికి ప్రయత్నించాం. ఆ పని శాంతియుతంగా జరుపుకోనిస్తే అంతకంటే కావలసింది లేదు. కాని, సంపన్నులు, వారి రాజకీయ ప్రతినిధులు అటువంటి శాంతియుత పరిణామపు ఆలోచననైనా సహించలేరని చరిత్ర మాకు నేర్పుతోంది.

హింసా సమస్య

అన్ని వ్యాసాలలోను పూసల్లో దారంలా సాగిన ఒకే ఒక ముఖ్యమైన సమస్య హింస గురించి. నిజమైన కమ్యూనిస్టులు ఎవరూ

హింసావాదులు కారు. కమ్యూనిస్టులు కోరుకునేదల్లా సమానత్వం, న్యాయం పునాదిగా నిర్మాణమయ్యే శాంతియుత సామాజిక వ్యవస్థను. కాని, వారు అటువంటి వ్యవస్థకోసం ప్రయత్నాలు ప్రారంభించినప్పుడల్లా వారి మీద అత్యంత పాశవికమైన దాడులు జరుగుతాయి. కమ్యూనిస్టు ఉద్యమం పుట్టినప్పటి నుంచి ఇలాగే జరుగుతూ వస్తోంది. పారిస్ కమ్యూన్ రోజుల నుంచి కూడా కమ్యూనిస్టులను పాలకులు ఊచకోత కోశారు. దేశాల నుంచి బహిష్కరించారు. అటువంటప్పుడు, పీడిత ప్రజానీకం మీద హింసాకాండను అమలు చేయడంలో అతి సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత పాలకవర్గాలు మరొకరకంగా ప్రవర్తిస్తాయని ఆశించడం అత్యాశే అవుతుంది. అంతేకాదు, భారత ప్రజానీకం ఎదుర్కొనేది కేవలం ర్యాజ్యాంగ యంత్రపు హింసను మాత్రమే కాదు. భారతదేశం వంటి వర్గ సమాజంలో హింస వ్యవస్థలో అంతర్గర్భితంగా ఉంటుంది. పీడిత ప్రజానీకం తమ నిత్య జీవితంలో ఆ హింసను అనుభవిస్తూ ఉంటారు. భూస్వామ్య అధికారం కింద, కార్ఖానాల యాజమాన్యాల కింద మాత్రమే కాదు, అస్పృశ్యత ఫలితంగాను, పితృస్వామ్యం ఫలితంగాను కూడా ప్రజలు హింసను అనుభవిస్తూ ఉంటారు.

సొంత ఆస్తి పుట్టిన నాటి నుంచి, వర్గాలు ఏర్పడిన నాటి నుంచి మానవ జాతి సుదీర్ఘమైన, కష్టతరమైన పోరాటాల క్రమంలోనే ముందుకు కదిలింది. పాలక వర్గాల హింసను ఎదుర్కొంటూనే ముందుకు కదిలింది. అటువంటప్పుడు ఇవాళ్టి పాలకవర్గాలు మాత్రం ఒక కొత్త అభివృద్ధికర సామాజిక వ్యవస్థను కోరే వాళ్లను ఆమోదిస్తాయని, వారిపట్ల ఆదరణతో ఉంటాయని అనుకోవడం చరిత్ర నేర్పుతున్న పాఠాలను విస్మరించడమే అవుతుంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్ హత్యలు మొదలయిన తర్వాత కూడా మావోయిస్టులు చేపట్టవలసి ఉండిన ఒక ప్రత్యామ్నాయ ప్రతిస్పందన గురించి కె. బాలగోపాల్ ఊహా ప్రతిపాదనలు చేశారు. బాలగోపాల్ ఊహిస్తున్నట్టు ప్రస్తుత అభివృద్ధి నమూనా పేదప్రజలకు వ్యతిరేకమైనదని ఎత్తిచూపే పనికి మాత్రమే మావోయిస్టులు పరిమితమై ఉంటే, ప్రభుత్వం అనుమతించేదేనా? ఈ పనిద్వారా మావోయిస్టులు తమ ప్రజా కార్యకలాపాలను విస్తరించుకో వచ్చుననీ, క్రమక్రమంగా రాజ్యాధికార ఆకాంక్షలకు తగినంత బలమైన ప్రజా పునాదిని రూపొందించుకోవచ్చుననీ బాలగోపాల్ సలహా ఇస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం అనుమతించేదేనా? అటువంటి అవకాశమే ఉన్నట్టయితే మొట్టమొదట కరీంనగర్, ఆదిలాబాద్ లలోని చట్టబద్ధమైన ఉద్యమం మీద పాలకవర్గాలు ఎందుకు దాడిచేశాయి? 1978లో చెన్నారెడ్డి ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాల చట్టాన్ని ప్రకటించి, విరుచుకుపడినప్పుడు మాకు సాయుధ కార్యాచరణ ఏమీ లేదు. అలాగే, భూస్వాములు, పోలీసులు దాడి చేస్తూ ఉంటే, వాటిని ప్రజలు ఎలా ఎదుర్కోవాలి? ప్రభుత్వం గనక సానుకూలమైన ప్రతిస్పందనను చూపి ఉన్నట్టయితే, విప్లవ హింసకు అనుకూలమైన వాదనకు తావు ఉండేది కాదని బాలగోపాల్ నొక్కి చెబుతున్నారు. రాజ్యాంగ యంత్రం స్వభావం గురించి మన మేధావులలో ఉన్న భ్రమలకు ఈ ఊహ అద్దం పడుతోంది. ఇవాళ కావలిసింది వాస్తవ పరిస్థితుల వాస్తవికమైన మదింపు.

మావోయిస్టుల హింస గురించి ఇంతగా కేంద్రీకరించడం అసలు సమస్యను పక్కదారి పట్టించడానికేననిపిస్తుంది. ఎందుకంటే, ప్రస్తుత వ్యవస్థలో ప్రజానీకం తమ రోజువారీ జీవితాలలో ఎంతో హింసను అనుభవిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది ఆకలి చావులు జరుగుతున్నాయి. దారిద్ర్యంతో, అతి సులభంగా చికిత్స చేయగలిగిన రోగాలతో వందలాది మంది చనిపోతున్నారు. గ్రామాలలో అర్ధ భూస్వామ్య పెత్తందారీ అధికారం ప్రజలను తన అదుపులో ఉంచడానికి ప్రధాన సాధనంగా బలప్రయోగాన్నే వాడుతోంది. దేశంలోని చిన్నా, పెద్దా పరిశ్రమలన్నిటిలోను కార్మికులు ప్రతిరోజూ యాజమాన్యం పెంచి పోషించే గూండాల చేతుల్లో, చివరికి పోలీసుల చేతుల్లో హింసను అనుభవించవలసి వస్తూనే ఉంది. ఈ దేశంలోని అసంఖ్యాక స్త్రీలు ప్రతిరోజూ పితృస్వామిక హింసను అనుభవిస్తూనే ఉన్నారు. ఏటేటా వేలాది వరకట్నపు మరణాలు అనబడేవి జరుగుతూనే ఉన్నాయి. హింసను, అవమానాన్ని, దూషణను భరించకుండా దళితులకు ఒక్కరోజు గడవడంలేదు. వీటన్నిటికి పైన రాజ్యాంగ యంత్రం, హిందుత్వ ఫాసిస్టు శక్తులు, ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలకు చెందిన హంతక ముఠాలు, బడా వ్యాపారవేత్తలు వగైరాలు సాగిస్తున్న హింసాకాండ ఉండనే ఉంది.

మావోయిస్టుల హింస అనేదేదైనా ఉంటే అది ఈ పీడకుల హింసకు జవాబుగా వస్తున్నదే. ఆ హింస రెచ్చగొట్టినందు వల్ల వస్తున్నదే. కనుక, హింస ప్రధాన సమస్యకాదు. న్యాయం అనేదే ప్రధాన సమస్య. ఒకవేళ నక్సలైటు హింసను ఎవరైనా చర్చించదలచినా మన వ్యవస్థలోని ప్రతి రంగంలోనూ వ్యాపించి ఉన్న హింస నేపథ్యంలోనే ఆ చర్చ జరగాలి. నక్సలైటు హింసను గనక ఈ చట్రంలో పెట్టి చూడకపోతే అతి సులభంగా 'హింస హింసకు దారి తీస్తుంది' అనే అమూర్తమైన బూర్జువా భావనకు బలి అయిపోక తప్పదు. హింసకు గల వ్యవస్థాగత కారణాలను అర్థం చేసుకోవడంలో విఫలం కాక తప్పదు.

తిరుగుబాటు ఉద్యమాల మీద ఇవాళ్టి అణచివేత చర్యలలో ఒక ముఖ్యమైన అంశం ఉంది. అది ఆ ఉద్యమాలను ధ్వంసం చేయడానికి ఒక ఇన్‌ఫార్మర్ / గూఢచారి యంత్రాంగాన్ని విస్తృతంగా వాడడం. అది కూడా బయటి నుంచి మాత్రమే కాదు, లోపలి నుంచి కూడా ఆ ప్రయత్నం చేయడం. భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగానే తిరుగుబాటు ఉద్యమాలను అణచివేసే వ్యూహాలలో ఇది ప్రధాన ఆయుధాలలో ఒకటిగా ఉంది. ఈ చర్యలు గ్రామస్థాయి నుంచి, ప్రజా సంఘాల స్థాయి నుంచి పార్టీ లోపలనే సాగే కోవర్ట్ చర్యల దాకా విస్తరించి ఉన్నాయి. ఈ లక్ష్యం కొరకు పెద్దఎత్తున రహస్య నిధులు ఖర్చు పెడుతున్నారు. ఈ ఇన్‌ఫార్మర్‌లలో చాలామంది 'సాధారణ ప్రజల' లాగానే కనబడతారు. వాళ్లలో చాలామంది పేదవర్గాల నుంచి వచ్చిన వాళ్లుకూడా అయి ఉండవచ్చు. కాని, వారి ఉనికివల్ల ప్రపంచ వ్యాప్తం గానే వేలాదిమంది అత్యుత్తమ విప్లవకారులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ యంత్రాంగంతోపాటు గానే సమాచారం రాబట్టడానికి అత్యంత పాశవికమైన చిత్రహింసలు కూడా జరుగుతున్నాయి. గతంలో ఈ చిత్రహింసల నుండి బయటపడి ప్రజలకు సమాచారం తెలిసేది. ఇప్పుడు పాలకవర్గాలు ఈ సమాచారం బయటపడకుండా ఉండే జాగ్రత్త తీసుకుంటున్నాయి. అంటే, చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తులను చంపివేస్తున్నారు. పైగా, చిత్రహింసలకు 'తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగే యుద్ధం'లో భాగంగా సాధికారత కల్పిస్తున్నారు.

రాజ్యపు బహిరంగ హింసా రూపాల గురించి ప్రపంచానికి తెలుసు గాని, ఈ రహస్య హింసా రూపాల గురించి తెలియదు. ఈ చర్యలను ఎదుర్కోవడానికి ఉన్న ఒకే ఒక దీర్ఘకాలిక మార్గం పార్టీకి ఉండే ప్రజా పునాదిని (కేవలం ప్రజా మద్దతును మాత్రమే కాదు) లోతుగా పెంపొందించుకోవడం, రాజకీయ చైతన్య స్థాయిని పెంచుకోవడం. అయితే అది దీర్ఘకాలిక మార్గం కాగా, ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం కనిపెట్టవలసిన అవసరం కూడా ఉంది. అది జరగకపోతే మా శ్రేణులలో అత్యుత్తమ కామ్రేడ్స్‌ను కోల్పోవలసి వస్తుంది. ఒక గ్రామంలో ఉన్న ప్రజలందరూ పటిష్టంగా సంఘటితం అయినట్టయితే అంటే ప్రజా సంఘాల లోనో, ప్రజా సైన్యంలోనో, పార్టీ శాఖలలోనో ఉన్నట్టయితే ఆ గ్రామంలో ఒక ఇన్‌ఫార్మర్ బయట పడకుండా మనుగడ సాగించడం చాలా కష్టం. కాని, అటువంటి పటిష్టమైన సంఘ నిర్మాణానికి చాలా సమయం పడుతుంది. పెద్ద గ్రామాలలోను, పట్టణాలలోని బస్తీలలోను అది అంత సులభం కాదు. ఈలోగా రాజ్యాంగయంత్రం ఇన్‌ఫార్మర్‌లను నియమించుకుంటూనే ఉంటుంది. ఇలా నియామకమయ్యే వారిలో చాలామంది సాధారణ నేపథ్యాల నుంచి వచ్చినవాళ్లే కావచ్చు. కాని, వారిలో చాలామంది లంపెన్ శక్తులు, దిగజారిన విలువలు కలిగిన వాళ్లు అయి ఉంటారు. వారిని పోలీసు శాఖలో, సైన్యంలో కోవర్ట్ చర్యల కోసం నియమించుకుంటారు. వారి పట్ల ఎటువంటి సానుభూతినీ, సహనాన్నీ చూపడమైనా అత్యుత్తమైన మా కామ్రేడ్స్‌ను పోగొట్టుకోవడమే అయింది, అవుతుంది. అందువల్ల ఇటువంటి శక్తుల మీద తీసుకునే చర్యలను సాధారణ పౌరుల మీద హింసగా చూడడానికి వీలులేదు. ఆ చర్యలు పోలీసులలో, పారా మిలిటరీ దళాలలో చేరిన వారి మీద తీసుకునే చర్యలుగానే చూడవలసి ఉంటుంది. తక్కువ స్థాయి ఘర్షణ అనే ఒక కొత్త అణచివేత చర్యల రూపాన్ని బ్రిటన్‌లోని ఎం.ఐ.–5, అమెరికాలోని సి.ఐ.ఎ. రూపొందించి, ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా వాడుతున్నారు. ఈ రూపపు నేపథ్యంలోనే ఇటువంటి చర్యలను చూడవలసి ఉంటుంది.

ప్రధానమైన తప్పుడు అవగాహన

మరొక ప్రధానమైన తప్పుడు అవగాహన ఉంది. నక్సలైట్లకు, పోలీసులకు మధ్య జరిగే ఘర్షణలో 'అమాయక' ప్రజలు నలిగి పోతున్నారని ఈ అవగాహన భావిస్తుంది. మొట్టమొదట, ఇది వాస్తవం కాదు. రెండవది, 'ప్రజలు' అనేది ఒక ఏకశిలా సదృశమైన ముద్ద కాదు. పాలక పెత్తందారులూ, వారి ఆశ్రితులూ రాజ్యాంగ యంత్రంతో ఉన్నారు. అశేష పీడిత ప్రజానీకం నక్సలైట్లతో ఉన్నారు. మొదటి బృందం రాజ్యాంగయంత్రాన్ని, సల్వాజుడుం హింసను సమర్థిస్తుంది. రెండవ బృందం ఈ హింసను ప్రతిఘటించడానికి మావోయిస్టులతో కలిసి పనిచేస్తుంది. కాని, ప్రజలందరినీ ఒకే ముద్దగా చూసే తప్పుడు అవగాహనకు మూలం 'పౌరసమాజం' అనబడే పోస్ట్ మాడర్నిస్ట్ ఆలోచనలో ఉంది. ఈ పౌరసమాజం అనే ఆలోచన సమాజంలోని వర్గ విభజనను విస్మరిస్తుంది. అయితే ఇదంతా చెప్పినప్పటికీ రాజ్యాంగ యంత్రపు హింసకూ, దానికి వ్యతిరేకంగా ప్రజల ప్రతిఘటనకూ మధ్య జరిగే ఘర్షణలో అటు పక్షానికి గానీ, ఇటు పక్షానికి గానీ చెందని కొన్ని బృందాలు ఉంటాయి. కాని, అత్యధిక సంఖ్యాకులు ఏదో ఒక శిబిరం కింద విడిపోయి ఉంటారు. ఒక అత్యల్ప సంఖ్యాక వర్గం రాజ్యాంగ యంత్రంతో ఉంటుంది. అశేష ప్రజానీకం నక్సలైట్లకు మద్దతు ఇస్తూ ఉంటుంది.

ప్రజలను ఒకే ముద్దగా చూసే తప్పుడు అవగాహన ఇ.పి.డబ్ల్యు. సంచికలోని అన్ని వ్యాసాలలోను ఉమ్మడిగా ఉంది. ఒక ఉదాహరణగా సుమంతా బెనర్జీ వ్యాసం నుంచి చెప్పాలంటే : 'వారికి ఓపికగా రాజకీయ అవగాహన ఇచ్చే బదులు, వారిని బెదిరించడం ద్వారా మావోయిస్టు గెరిల్లాల అపరిణత మానసిక స్థితి బయటపడుతుంది'. మా దృష్టిలో గ్రామస్థాయిలో ప్రజలు మూడు బృందాలుగా చీలిపోయి ఉంటారు : కరుడుగట్టిన అభివృద్ధి నిరోధకులు, పరస్పరం సంఘర్షించే రెండు శక్తుల మధ్య ఊగిసలాడుతూ ఉండే మధ్యంతర శక్తులు, మావోయిస్టుల చేత ప్రభావితులైన ప్రజలు. సుమంతా బెనర్జీ వ్యాఖ్య ఆ మధ్యంతర శక్తులకు సరిపోతుంది. అయితే, వాస్తవం ఏమంటే మావోయిస్టులు తీసుకున్న చర్యలలో అతి ఎక్కువ భాగం కరుడుగట్టిన అభివృద్ధి నిరోధకుల మీద మాత్రమే. ఆ చర్యలలో పొరపాట్లు జరిగి ఉండవచ్చు. అలాగే ఒకరు మొదటి బృందానికి చెందుతారా, రెండో బృందానికి చెందుతారా అనే అవగాహనలో భేదాలు ఉండవచ్చు. ఈ విషయాలు చర్చనీయమే అయినప్పటికీ, ప్రజలలో మూడు బృందాలు ఉన్నాయని స్పష్టంగా గుర్తించవలసి ఉంది. ఎందుకంటే, అట్టడుగు స్థాయిలో అధికారం కోసం సాగుతున్న వర్గపోరాటాన్ని అర్థం చేసుకోవడానికి ఈ విభజనను అర్థం చేసుకోవడం అవసరం. కరుడుగట్టిన అభివృద్ధి నిరోధకులను తప్పనిసరిగా లొంగదీయవలసిందే. మిగిలిన వారందరికీ ఓపికగా రాజకీయ చైతన్యం కల్పించవలసిందే. వర్గ విభజనకు సంబంధించిన సమస్యలు, కొంతమంది కార్యకర్తల అనుభవరాహిత్యం వల్ల ప్రజలలో వైరుధ్యాలతో వ్యవహరించడంలో లోపాలు ఉన్న మాట నిజమే. అయితే ఈ లోపాలు అక్కడక్కడా జరిగే మినహాయింపులే తప్ప అవే ప్రధానాంశం కాదు. కాని, రాజ్యాంగయంత్రం ఈ పొరపాట్లనే భూతద్దంలో చూపించడానికి ప్రయత్నిస్తోంది. వాస్తవాన్ని చూడడానికి నిరాకరించే మేధావులు ఈ ప్రభుత్వ కుట్రకు బలి అయిపోయి, విప్లవ హింసకు వ్యతిరేకమైన బృందగానంలో తమ గొంతు కలుపుతున్నారు.

ఇదే ధోరణిలో ఇంకా ముందుకు సాగి సుమంతా బెనర్జీ ఏమంటారంటే : 'రాజ్యాంగ యంత్రం, కమ్యూనిస్టు విప్లవకారులు అనే ఈ రెండు శక్తులలో పేదల, పీడితుల సంక్షేమమే తమ లక్ష్యంగా ప్రకటించే కమ్యూనిస్టు విప్లవకారులు తాము చేపడుతున్న ఎత్తుగడలలో ఎక్కువ మానవీయంగా ఉండాలని, తమ ఆచరణకు ప్రజా మద్దతు సంపాదించడంలో నిజంగా ప్రజాస్వామికంగా ఉండాలని ఆశిస్తాం. మరీ ముఖ్యంగా వారి ఎత్తుగడలు ఏ సంబంధం లేని పౌరుల మీద పెద్దఎత్తున ప్రభావం చూపినప్పుడు ఈ జాగ్రత్త తీసుకోవాలి. ప్రతీకారం తీర్చుకోవాలనే వాంఛతో వారు పోలీసుల స్థాయికి, భద్రతా బలగాల స్థాయికి దిగజారితే, సులభంగా దొరికే లక్ష్యాల మీద విచక్షణారహితమైన దాడులకు దిగితే...'

పీడితుల పక్షాన బేషరతుగా నిలబడడమే నిజమైన మానవత్వం. అంతేకాని, అందరినీ కలుపుకుపోయే మానవత్వమేదీ లేదు. వర్గ సమాజంలో పీడితుల మీద పాలకవర్గాలు అడుగడుగునా క్రూరమైన అణచివేతకు పాల్పడుతున్నప్పుడు నిజమైన మానవత్వమంటే పీడకుల

మీద సుదృఢమైన ద్వేషం కలిగి ఉండడమే. ద్వేషం లేకుండా ప్రేమ లేదు. అందరినీ కలగలపే ప్రేమ లేదు. మావోయిస్టులు కొన్ని చర్యలలో పొరపాట్లు పడి ఉండవచ్చు. వాటినుంచి మేం తప్పకుండా గుణపాఠాలు నేర్చుకుంటాం. కాని, 'ఇంకా ఎక్కువ మానవీయంగా ఉండడం' అనేదాన్ని మా ఎత్తుగడలలో శత్రువుతోనూ, శత్రువు ఏజెంట్లతోనూ ప్రవర్తనకు సంబంధించిన విషయంగా చూడలేం. ఇదంతా చెబుతూనే, సుమంతా బెనర్జీ సరిగ్గా ఎత్తిచూపినట్టు, సులభంగా దొరికే లక్ష్యాల మీద దాడి జరగకూడదు. అయితే, ఉద్యమానికి సంబంధించిన తక్షణ, దీర్ఘకాలిక, రాజకీయ – సైనిక లక్ష్యాల చట్రంలోనే లక్ష్యాలను అంచనా వేసుకోవాలి. సుమంతా బెనర్జీ దృష్టిలో పారా మిలిటరీ దళాలకు ఆశ్రయం ఇస్తున్న పాఠశాల భవనమో, సమాచార సంబంధాల టవరో సులభంగా దొరికే లక్ష్యం కావచ్చు. కాని, మావోయిస్టుల దృష్టిలో శత్రు బలగాలను ప్రతిఘటించే దీర్ఘకాలిక లక్ష్యాలలో అవి భాగమే.

మావోయిస్టు హింసను, ఇస్లామిక్ ఛాందస వాదుల హింసను సుమంతా బెనర్జీ ఒక్క గాటన కట్టడం అన్యాయం. ఎందుకంటే, ఒక్క చోట కూడా మావోయిస్టులు ఉద్దేశపూర్వకంగా సాధారణ పౌరుల మీద దాడి చేయలేదు. సల్వాజుడుంకు సంబంధించి సాధారణ పౌరులు అని చెప్పబడుతున్న వాళ్లు మౌలికంగా స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్.పి.ఒ.). లేదా, మావోయిస్టులను ఎదిరించడానికి చంపుతూ, గూడాలు తగలబెడుతూ, లూటీ చేస్తూ ఆదివాసీ జీవితాన్ని అల్లకల్లోలం చేస్తున్న సాయుధ ముఠాలకు చెందిన, రాజ్యం చేత నడపబడుతున్న లంపెన్ శక్తులు. అనవసరమైన నష్టాలు తప్పకుండా నివారించవలసినవే. ఉదాహరణకు, ఎర్రబోరు క్యాంపు మీద దాడిలో ఇద్దరు చిన్నపిల్లలు చనిపోయారు. కాని, ప్రజాయుద్ధం అన్నప్పుడు అంత కచ్చితంగా, సాధారణ పౌరులు ఒక్కరికి కూడా నష్టం జరగనంత, సునిశితంగా ఉండడం సాధ్యంకాదు. ఇక్కడ గుర్తించవలసినదల్లా సాధారణ పౌరులకు నష్టం జరగకుండా చూడడంలో వీలైనంత జాగ్రత్త తీసుకున్నారా, లేదా అనేదే. మావోయిస్టులు తమ ఎత్తుగడలలో తీసుకునే సూత్రబద్ధ వైఖరి ఇది. కాని, పోలీసులు, పారా మిలిటరీ బలగాలు ఈ సూత్రబద్ధ వైఖరినే మావోయిస్టుల మీద దాడిచేయడానికి ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు, వాళ్లు మామూలు ప్రజల కోసం ఉన్న పబ్లిక్ రవాణా బస్సులలో సాధారణ పౌరులతో పాటు ఎక్కి, మావోయిస్టు కంచుకోటలైన ప్రాంతాలలో ప్రవేశించి ఆ సాధారణ ప్రజానీకాన్ని మానవ కవచాలుగా వాడుకుంటున్నారు. మామూలు ప్రజల భద్రత ఇమిడి ఉన్నప్పుడు మావోయిస్టులు దాడి చేయరని పోలీసు బలగాలకు స్పష్టంగా తెలుసు. అలాగే, నక్సలైటు ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల సమాచారం సేకరించడం కొరకు నిరాయుధులైన పోలీసులను, హోంగార్డులను పంపుతున్నారు. చివరికి స్త్రీలను కూడా ఇన్‌ఫార్మర్లుగా వాడుతున్నారు. ఇటువంటి వ్యక్తులను మావోయిస్టులు సులభంగా లక్ష్యంగా చేసుకోరని వాళ్లకు తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలనే 1500 మంది ఎస్.పి.ఒ.లతో సహా మూడు వేల మంది హోంగార్డులను నియమించారు. ఈ మాట ఈ సంవత్సరం సెప్టెంబర్ 5న తీవ్రవాదం, వామపక్ష అతివాదం పైన జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో స్వయంగా ముఖ్యమంత్రియే చెప్పాడు. అలాగే రాష్ట్రంలోని ఐదు వందలకు పైగా పోలీసు స్టేషన్‌లలో పోలీసులకు తాము ఉద్దేశపూర్వకంగానే రైఫిళ్లు ఇవ్వలేదని, నిరాయుధ పోలీసుల మీద మావోయిస్టులు దాడి చేయరని తమకు తెలుసునని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి, డి.జి.పి. కూడా చెప్పారు.

అంటే, సారాంశంలో చెప్పాలంటే, ఈ క్రూర వ్యవస్థలో హింస అనేది అంతర్భాగం. రాజ్యాంగ యంత్రపు ఫాసిస్టు స్వభావాన్ని, రాజ్య బలగాల క్రూరత్వాన్ని, చిత్రహింసలను, బూటకపు ఎన్‌కౌంటర్లను, శాంతియుత సమావేశాలపై నిషేధాన్ని, ప్రజల ప్రజాస్వామిక హక్కుల పట్ల రాజ్య ఉల్లంఘనలను అర్థం చేసుకోకపోతే ఎవరైనా విప్లవ హింస అవసరాన్ని అర్థం చేసుకోజాలరు. మావోయిస్టు ఉద్యమ కార్యాచరణ ఉన్న అన్ని ప్రాంతాలలోను మనకు కనబడుతున్నదేమంటే, శక్తిమంతమైన ప్రజా ఉద్యమాలు తనను ఎదుర్కొన్నప్పుడు రాజ్యపు ఫాసిస్టు స్వభావం బహిర్గతమవుతుంది. నిజానికి మావోయిస్టు హింస అనేది కేవలం ఈ కుళ్లిపోయిన వ్యవస్థలోని హింసకంతటికీ ముగింపు పలకడానికి మాత్రమే. ఈ దేశానికీ, ఈ దేశ ప్రజానీకానికీ శాంతిని కొనితేవడానికి మాత్రమే. ఇటువంటి పాశవికమైన, నిర్దాక్షిణ్యమైన వ్యవస్థలో మరొక మార్గం లేదు. ఈ సంచికలో రాసిన రచయితలందరినీ మేం సవినయంగా ఒక ప్రశ్న అడగదలచుకున్నాం. పీడకుల హింసను, వారి తరఫున పనిచేస్తున్న రాజ్యాంగ యంత్రపు హింసను ఆపడం ఎట్లాగో దయచేసి ఒక సూచన ఇస్తారా? పీడిత ప్రజానీకం న్యాయం పొందడానికి మార్గం ఏమిటో చెప్తారా?

చివరిగా మేం మరొక్క మాట చెప్ప దలిచాం. విప్లవోద్యమ క్రమంలో మేం పొరపాట్లు చేస్తున్నాం. కాని, అటువంటి పొరపాటు ఎక్కడ, ఎప్పుడు జరిగినా దానిని దాచడానికి మేం ఎప్పుడూ ప్రయత్నించలేదు. బహిరంగ క్షమాపణ కోరుకున్నాం. మా లోపాల నుంచి నేర్చుకోవడానికీ, ఆ పాఠాలను అమలులో పెట్టడానికీ మేం ఎల్లవేళలా ప్రయత్నిస్తూనే ఉంటాం. అయితే, వర్గ యుద్ధం అనేది అతి సునిశితమైన కచ్చితత్వంతో నడపడం సాధ్యం కాదని కూడా గుర్తించవలసి ఉంది. వర్గ యుద్ధమనేది అత్యంత కష్టతరమైన, వేదనామయమైన క్రమం. మన జనాభాలో అత్యధిక సంఖ్యాకుల దైనందిన జీవనం కూడా అంతే కష్టతరంగా, అంతే వేదనామయంగా ఉంది.

ఇక మరికొన్ని ప్రధానాంశాలను చర్చించి మిగిలిన చర్చను భవిష్యత్తు కోసం వదిలేస్తాం.

నేపాల్ మావోయిస్టులతో పోలికలు

నేపాల్‌లోనూ, భారతదేశంలోనూ జరుగుతున్న మావోయిస్టు ఉద్యమాలను పోల్చి చూడడం, నేపాల్ మావోయిస్టుల ప్రస్తుత ఎత్తుగడలను శాంతియుత ప్రత్యామ్నాయంగానూ, భారతీయ మావోయిస్టుల ఎత్తుగడలు హింసాత్మక పద్ధతులుగానూ చూపి ఒకదానికి వ్యతిరేకంగా మరొకదాన్ని నిలపడం బాగా అలవాటు అయిపోయింది. అయితే ఇక్కడ ఎవరైనా మరచిపోకూడని అంశమేమంటే, రాజరికానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ఇవాళ నేపాల్ మావోయిస్టుల విజయాలు ప్రాథమికంగా అక్కడి ప్రజా విముక్తి సైన్యం సాగించిన రాజకీయ, సైనిక యుద్ధ విజయాల ఫలితం, రాజు సైన్యాల దాడులను తిప్పి కొట్టగల శక్తి మాత్రమే. వాళ్ల విజయాలు ముప్పై వేల మందితో కూడిన పి.ఎల్.ఎ., ఒక లక్షమంది ప్రజాసైన్యం పునాదిగా పన్నెండు వేల మంది అమరుల త్యాగాల పైన నిర్మాణమయ్యాయి. ఇటీవలనే హిందీ పత్రిక 'ఫిల్హాల్'కు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు)

చైర్మన్ కామ్రేడ్ ప్రచండ ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం స్పష్టం చేశాడు : 'మేం సాయుధులం కానట్టయితే పన్నెండు అంశాల ఒడంబడిక కుదిరేదే కాదని, మిగిలిన రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడేటప్పుడు మేం చెబుతూ ఉంటాం. మే సాయుధులం కానట్టయితే దేవుబా జైలు నుంచి విడుదల అయ్యే వాడే కాదు. మేం సాయుధులం కానట్టయితే ఈ భూస్వామ్య రాచరికం కింద మీలో చాలా మంది హత్యకు గురయి ఉండేవారే. రాజరికం చివరికి తన రక్త బంధువులను కూడా అంతఃపురంలోనే చంపివేసింది... మేం వాళ్లతో ఇంకొక మాట కూడా చెప్పాం. మా ఆయుధాలే మీ పార్లమెంట్‌ను పునరుద్ధరించడానికి అవకాశం ఇచ్చాయి. మీ వల్ల పార్లమెంట్ పునరుద్ధరణ జరగలేదు. అది ప్రజా విముక్తి సైన్యం వల్ల జరిగింది...'

అలాగే, ఎత్తుగడలలో మార్పు అనేది ఆయా దేశాలలోని నిర్దిష్ట పరిస్థితి మీద, ఎదురు బొదురుగా ఉన్న శక్తులమీద ఆధారపడి ఉంటుంది. ప్రత్యేకించి సీతారాం ఏచూరి నేపాల్ మావోయిస్టులకు వ్యతిరేకంగా భారత మావోయిస్టులను నిలపడానికి ప్రయత్నించాడు. పశ్చిమ బెంగాల్‌లో మావోయిస్టులను దుర్మార్గంగా అణచివేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నేపాల్ మావోయిస్టులను ప్రశంసిస్తూ మాట్లాడడం కన్న కపటత్వం మరొకటి లేదు. ఒక విప్లవానికి వ్యతిరేకంగా మరొక విప్లవాన్ని నిలబెట్టే బదులు, ఇతర విప్లవాలలోని అనుకూలమైన అనుభవాలను గ్రహించడం, భారత విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆ అనుభవాలు నిర్దిష్టంగా ఎట్లా వర్తింపజేయవచ్చునో చూడడం ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రశ్న నుంచే మేం విప్లవ మార్గం గురించిన చర్చలోకి వెళ్లదలచాం.

విప్లవ మార్గం గురించి

అసలు విప్లవ మార్గాన్నే సూటిగా ప్రశ్నించిన రచయిత తిలక్ డి. గుప్తా. 'భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సైద్ధాంతిక, రాజకీయ మార్గాన్ని, వ్యూహాన్ని, ఎత్తుగడలను పునరాలోచించుకోవలసిన అవసరం చాలా ఎక్కువగా ఉంది. ఎందుకంటే, అంతర్జాతీయ పరిస్థితిలో మార్పు వచ్చింది. అన్నిటికన్నా మిన్నగా ప్రపంచ వ్యాప్తంగానే సోషలిజం అపజయాన్ని ఎదుర్కొంటోంది' అని ఆయన రాశారు. ఆ వ్యాసంలోనే తొలుత ఆయన మావోయిజం అనే మాట వాడడం మీద సందేహాలు వ్యక్తం చేశారు. సి.పి.ఐ (మావోయిస్టు) మౌలిక అవగాహనలనే ఆయన ప్రశ్నిస్తున్నారు. అలాగే, సాగర్ కూడా ఎత్తుగడలకు సంబంధించిన ఎన్నో అంశాల మీద ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికలను ఆదర్శీకరించడం, సాయుధ పోరాటానికీ, ప్రజా కార్యచరణకూ పోటీ ఉన్నట్టు చూపడం, ఆదివాసీ సంస్కృతిని ప్రజాస్వామికం చేయడాన్ని వ్యతిరేకించడం, అందులో విజయాలను చిన్న చూపు చూడడం, ఆ విజయాలు అన్ని చోట్లా లేవనే విషయం మీద కేంద్రీకరించడం లాంటి విమర్శలన్నీ చేసి, చివరికి ఆయన 'వామపక్షం' అనే ఒక విశాలమైన పదం కింద పార్లమెంటరీ సి.పి.ఐ., సి.పి.ఐ. (ఎం)లను మావోయిస్టు పార్టీని ఒకే గాటన కట్టి, 'విభిన్న వామపక్ష సంస్థల నిజమైన సమాఖ్య' ఒకటి ఏర్పడాలని పిలుపు ఇచ్చారు. పార్లమెంటరీ పద్ధతిలో ఉన్నవారిని, సాయుధ పోరాటం నడుపుతున్న వారిని సమానం చేసి, ఆయన ఏమంటున్నారంటే : 'భారత రాజకీయాల స్థూల నేపథ్యంలో చూసినప్పుడు ఎవరికైనా కనబడేదేమంటే, ఎంత వైవిధ్యం ఉన్నప్పటికీ వామపక్షమంతా వాస్తవంగా ఒకే పరివారం కిందికి వస్తాయి. అందులో ఒక ముక్క పార్లమెంటరీ పని తప్ప మరొక పని చేయదు. ఇంకొక ముక్క సాయుధ పోరాటం మీద కేంద్రీకరిస్తుంది. ఇంకొక ముక్క ఈ రెండు అతివాదాలను వేరు వేరు పాళ్లలో కలపడానికి ప్రయత్నిస్తుంది'. ఇక మనోరంజన్ మొహంతి చిన్న చిన్న వాస్తవాల మీద కూడా పొరపాట్లు (అన్ని మావోయిస్టు-లెనినిస్టు గ్రూపులు సమానమైన బలంతో ఉన్నాయని ఉద్యమ శత్రువులు కూడా అనని మాట ఆయన అంటున్నారు) చేశారు. సిపిఐ (మావోయిస్టు)ను లిబరేషన్, కానూ సన్యాల్ గ్రూపుల వంటి రివిజనిస్టులతో సమానం చేశారు. కొందరు రచయితలు ఉద్యమంలో కొన్ని లోపాలను ఎత్తిచూపుతూ అసలు మొత్తం మార్గాన్నే కొట్టి పారేయడానికి ప్రయత్నించారు. కొందరు 'మారిన పరిస్థితి'ని చూపి మార్గాన్ని కొట్టివేయదలిచారు. మరికొందరు మార్క్సిజానికీ రివిజనిజానికీ మధ్య ఉన్న విభజన రేఖను చెరిపేయడం ద్వారా విప్లవ మార్గాన్ని కొట్టి వేయదలిచారు.

ఈ వాదనలలో కొన్నిటి విషయం చూద్దాం. తిలక్ అంటున్నట్టుగా అంతర్జాతీయ పరిస్థితిలో కొన్ని మార్పులు వచ్చాయనే మాట నిజమే. కాని, సామ్రాజ్యవాదపు మౌలిక సారాంశం మారలేదు. అయితే, ఆర్థిక సంక్షోభంతో, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదం, మొత్తంగా సామ్రాజ్యవాదం చూపుతున్న ఇతోధిక ఉద్ధృతితో ముడిపడిన మార్పులు కొన్ని ఉన్నాయి. ఆ మార్పులన్నీ కూడా ఇవాళ మనం ప్రదర్శిస్తున్న ప్రతిఘటన కన్న ఎక్కువ విస్తారమైన, ఎక్కువ లోతైన సాయుధ ప్రతిఘటనను కోరుతున్నాయి. ఇరాక్‌లో ఏం జరిగిందో చూడండి. లెబనాన్‌లో, పాలస్తీనాలో ఇజ్రాయిల్ ప్రదర్శిస్తున్న అహంకారాన్ని చూడండి. లాటిన్ అమెరికాలో కమ్యూనిస్టుల మీదా, చివరికి ఉదారవాద ప్రతిపక్ష నాయకుల మీదా సాగుతున్న ఊచకోతలను చూడండి. ఫిలిప్పైన్స్‌లో వందలాది మంది ప్రజానాయకులను ఎలా మట్టు బెడుతున్నారో చూడండి. అటువంటి ఉదాహరణలు ఎన్నని! విప్లవకారులకూ, ప్రజాస్వామికవాదులకూ ఉందని చాలామంది చెప్పుకునే 'స్థలం' నానాటికీ కుంచించుకుపోతోంది. ఆ కుంచించుకు పోవడం మావోయిస్టుల సాయుధ కార్యకలాపాల వల్ల కాదు. సామ్రాజ్యవాదమూ, దాని దళారులూ ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న ఫాసిస్టు స్వభావం పెరిగిపోతున్నందువల్ల. ఇది భారత దేశంలో మరింత స్పష్టంగా కనబడుతోంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఉన్న ప్రభుత్వాలన్నీ కనీ వినీ ఎరగని స్థితిలో తమ సాయుధ శక్తిని పెంచుకుంటున్నాయి. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఇంత ఉద్ధృతంగా అమలు చేస్తూ పోతే పెద్ద ఎత్తున ప్రజల తిరుగుబాట్లు వస్తాయనీ, వాటిని అడ్డుకోవడానికి సాయుధ బలగాలు తప్ప మరొక గతి లేదనీ పాలకులకు తెలుసు. మరి ఇటువంటి స్థితిలో సి.పి.ఐ. (మావోయిస్టు) తన సైద్ధాంతిక రాజకీయ వైఖరిని, వ్యూహాన్ని, ఎత్తుగడలను పునరాలోచించుకోవలసిన అవసరం ఉందని తిలక్ ఎలా సూచిస్తున్నారో తెలియడం లేదు. ఇటువంటి గంభీరమైన ప్రకటనలు చేసే ముందు మరింత విశాలమైన, లోతైన విశ్లేషణ చేసుకోవలసిన అవసరం ఉంది.

ఇవాళ దేశంలోని అనేక ప్రాంతాలలో మా ఉద్యమం బలహీనంగా ఉంది. దాన్ని ఇంకా బలోపేతం చేసుకోవలసిన అవసరం ఉంది. అంతే గాని, మార్గం మార్చుకొని, ఏదో అస్పష్టమైన 'విభిన్న వామపక్ష సంస్థల

నిజమైన సమాఖ్య' ఏర్పర్చడానికి ప్రయత్నించడం కాదు. ఇవాళ కావలసింది అటువంటి అస్పష్టమైన కలగూర గంప కాదు. ఇవాళ కావలసింది కార్మికులు, రైతులు, మధ్యతరగతి, జాతీయ బూర్జువా వర్గం అనే నాలుగు వర్గాలు కలిసిన నిజమైన ఐక్య సంఘటన. దేశంలోని సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక శక్తులన్నిటినీ సమీకరించ గలిగిన శక్తిమంతమైన ఐక్య సంఘటనను నిర్మించడం ఇవాళ్టి అవసరం. విభిన్న వర్గశక్తుల మధ్య మౌలిక విభజనను చెరిపివేసే వివిధ వామపక్ష సంస్థల సమాఖ్య కాదు. అన్ని రూపాల రివిజనిజానికి వ్యతిరేకంగా రాజీలేని సైద్ధాంతిక, రాజకీయ పోరాటం జరపడం ద్వారా మాత్రమే విజయం సాధ్యమవుతుందని అన్ని విప్లవాల చరిత్ర, ప్రత్యేకించి రష్యా, చైనా విప్లవాల చరిత్రలు చూపుతున్నాయి. ఎక్కడెక్కడ అయితే రాజీ మార్గాన్ని అనుసరించడం జరిగిందో, అక్కడల్లా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా వంటి చోట్ల సైనిక విజయాలు సాధించినప్పటికీ సోషలిస్టు లక్ష్యమే కనుమరుగయింది.

ఆదివాసీ సమస్య – కుల సమస్య

కె. బాలగోపాల్ వ్యాసంలో చేసినట్టుగా అస్తిత్వ వాద రాజకీయాల మీద కేంద్రీకరించే ధోరణి ఒకటుంది. లేదా, సాగర్, నందినీ సుందర్‌ల వ్యాసాలలో ఉన్నట్టుగా వెనుకబడిన ఆదివాసీ సమాజాలను ఆదర్శీకరించే ధోరణి మరొకటుంది. ఈ రెండు వైఖరులు కూడా ఎన్.జి.ఒ.లు ముమ్మరంగా ప్రచారంచేసే పోస్ట్‌మాడర్నిస్ట్ దృక్పథానికి సంబంధించినవి.

కె. బాలగోపాల్ అస్తిత్వ రాజకీయాల గురించి మాట్లాడడం మాత్రమే కాదు, విప్లవ పోరాట ఫలితంగా అతి ఎక్కువగా నష్టపోయినది పీడిత ప్రజలే అని అంటారు. దానికి ఆయన 'అంతర్గత నాయకుల విధ్వంసం' అని పేరు పెట్టారు. మా ఉద్యమం అత్యధికంగా పీడితులైన సమూహాల నుంచి వందలాది మంది మేధావులను తయారు చేసిందనే మాట నిజమే. అయినా, బాలగోపాల్ ఈ విప్లవ క్రమాన్ని వ్యతిరేకిస్తూ తన వ్యాసం ముగింపులో 'అటువంటి వ్యక్తులు రోజు రోజూ చనిపోవడం, పీడిత ప్రజలు అంతం లేకుండా సాగిస్తూ ఉండవలసిన త్యాగం అని కోరడానికి వీలు లేదు' అని రాశారు. ఇది చాలా అస్పష్టమైన ముగింపు. దీనికి చాలా అర్థాలు ఉండవచ్చు. ఒక అర్థం ఏమంటే, ఆయనకు ఈ మార్గం అర్థరహితమైన మార్గంగా కనబడుతుంది గనుక పీడిత ప్రజలు కూడా ఈ మార్గాన్ని వదిలెయ్యాలని కావచ్చు. ఒకవేళ మితిమీరిన నష్టాలు ఉంటే, అందుకు కారణాలు ఏమిటో కనిపెట్టాలి. అవసరమైన చోట్ల సవరించుకోవాలి. కాని, త్యాగమే లేకుండా విప్లవాన్ని ఆశించడం భ్రమ మాత్రమే.

ఇక 'అస్తిత్వ రాజకీయాలు' విషయానికి వస్తే ఈ రాజకీయాలు ప్రజానీకాన్ని విభజిస్తాయి. కావలసింది పీడిత ప్రజలందరినీ ఏకం చేసే వర్గ దృక్పథం. తప్పనిసరిగా అగ్రవర్ణ పీడనకు ముగింపు పలకాలని, బ్రాహ్మణ భావజాలానికి ముగింపు పలకాలని, దుర్మార్గమైన కుల వ్యవస్థను అస్పృశ్యతతో సహా రద్దు చేయాలని వర్గ దృక్పథం ప్రకటిస్తుంది. కాని, అస్తిత్వ రాజకీయాలు కులం మీద మాత్రమే శ్రద్ధ పెడతాయి. కుల విభజనను మరింత శిలాసదృశం చేయడానికి ఉపయోగపడతాయి.

ఇక ఎన్.జి.ఒ. తరహా ఆదివాసీ సంస్కృతిని సంరక్షించడం విషయానికి వస్తే సాగర్, నందినీ సుందర్ వంటి రచయితలు బస్తర్ మహిళలతో మాట్లాడితే బాగుంటుంది. ఆదివాసీ సంస్కృతి మహిళలకు ఏమిచ్చిందో వారు చెబుతారు. బలవంతపు పెళ్లిళ్లు, మంత్ర తంత్రాలు, మూఢనమ్మకాలు, నిర్బంధపు చాకిరీ, వగైరా వగైరా. ఆదివాసీ సంస్కృతి హిందూ పితృస్వామిక వ్యవస్థతో సమానమైనంత దుర్మార్గమైనది కాకపోవచ్చు. కాని, అది కూడా ఆదర్శవంతమైనదేమీ కాదు. మావోయిస్టులు నిజంగా ఆదివాసీ ప్రజానీకం నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నించారు. ఆదివాసీ సంస్కృతిలో ఉన్న మంచి అంశాలన్నిటినీ గ్రహించారు. దానిలో ఉన్న చెడును పారదోలడానికి ప్రయత్నిస్తున్నారు. గోండీ, సంథాలీ వంటి అనేక ఆదివాసీ భాషలను మేం పరిరక్షించడం మాత్రమే కాదు, వాటిని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించాం. ఆదివాసీ ప్రజల జానపద గాథలను, నృత్య రూపాలను మేం సంరక్షించాం. వాటిలో సామాజిక సారాంశాన్ని కలగలిపి వాటిని మా ఉద్యమంలో సంలీనం చేసుకున్నాం. ఆదివాసీ సంస్కృతిలో సహజ భాగమైన సామూహిక ఉమ్మడి జీవన విధానంలోని అంశాలను మేం ప్రోత్సహించాం. వాటిని మరింతగా విస్తరించాం. మేం అడవులను సంరక్షిస్తున్నాం. అడవి కొట్టిన చోట మళ్లీ కొత్త అడవులను పెంచే ప్రచార కార్యక్రమం చేపట్టాం. వీటితో పాటుగా ఆదివాసీ ప్రజానీకానికి మేం విద్యను, ఆధునిక విజ్ఞానాన్ని అందించాం. విద్య, ఆధునిక విజ్ఞానం ఇంకెంత మాత్రమూ వ్యవస్థీకృత మేధో బృందపు ఉన్నత వర్గాల గుత్త సొమ్ము కాజాలదు.

ముగింపు

భారత దేశం ఒక విశాలమైన, అతి సంక్లిష్టమైన సమాజం. ఇది చాలా అసమానంగా, వైవిధ్యభరితంగా అభివృద్ధి చెంది ఉంది. దీనికి సార్వత్రిక లక్షణాలుగా అర్ధవలస, అర్ధ భూస్వామ్య సమాజ లక్షణాలు ఉన్నాయి. ఇది ద్రవ్యపెట్టుబడి కబంధహస్తాలలో ఉంది. ఈ సార్వత్రిక లక్షణాలతో పాటే దీనికి ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. ఆ ప్రత్యేకతలను ఇంకా లోతుగా అధ్యయనం చేయవలసి ఉంది. విశ్లేషించుకోవలసి ఉంది. ఇటువంటి సమాజంలో విప్లవం తేవడం సులభమైన కర్తవ్యమేమీ కాదు. సాయుధ వ్యవసాయక విప్లవం అనే ఇరుసు మీద కేంద్రీకరిస్తూనే, మన సామాజిక రాజకీయ వ్యవస్థ గురవుతున్న ఎన్నో అదనపు లెక్కలేనన్ని వైవిధ్యభరితమైన వ్యాధులతో పని చేయవలసి ఉంది. వాటికి చికిత్స చేయవలసి ఉంది. వాటిని మార్చవలసి ఉంది. నూతన ప్రజాస్వామిక విప్లవం అనేది యావత్తు వ్యవస్థను సంపూర్ణంగా ప్రజాస్వామికీ కరించడానికి ఉద్దేశించింది. అది రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విద్య, వినోద తదితర జీవన రంగాలన్నిటినీ ప్రజాస్వామికీ కరిస్తుంది. జీవన ప్రమాణం మెరుగుపరచవలసి ఉంది. అది కేవలం భౌతిక అర్థంలో మాత్రమే కాదు. ఒక మనిషికి ఉండే దృక్పథం, విలువలు వంటి రంగాలలో కూడా జీవన ప్రమాణం ఉన్నతీకరణ జరగాలి. ఈ విప్లవ క్రమపు మార్గంలో ఒక నూతన సామాజిక మానవజీవి ఉదయించాలి.

కమ్యూనిస్టులుగా మేం మా తప్పులను సరిదిద్దుకోవడానికి ఇతరులు చెప్పినవి వినడానికి ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటాం. ప్రజల ప్రయోజనాలు తప్ప మా హృదయంలో మరేమీ లేదు. అయితే, మా మీద వచ్చే విమర్శలు నిర్దిష్టమైనవయితే అవి మాకు ఉపయోగపడతాయి. వాటిని మేం ఇష్టపూర్వకంగా అంగీకరిస్తాం. మా ఆచరణను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నిస్తాం. ఒకవేళ ఆ విమర్శలను మేం అంగీకరించకపోతే స్వేచ్ఛగా, బహిరంగంగా అవి చర్చిస్తూనే ఉంటాం. వీ

అగ్రకుల, పితృస్వామ్య దురహంకారంతో, కులపిచ్చితో భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరువు హత్యలు, వాటికి వత్తాసు పాడుతున్న పాలకవర్గాలను ఎండగడుతున్నారు **డా. జీయల్**

కుల (ఖాప్) పంచాయితీలు - పరువు హత్యలు

ఈ మధ్యన జాతీయ ఆంగ్ల దినపత్రికలలో ఖాప్ పంచాయితీలచే జరుపబడుతున్న 'పరువు హత్యల'కు సంబంధించిన వార్తలు తరచుగా చూస్తున్నాం. ఉత్తర భారత దేశంలో, ముఖ్యంగా హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో జాట్ కులస్తులు అత్యధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కుల పంచాయితీలు రాజ్యాంగానికి అతీతంగా పనిచేస్తున్నాయి. వీరి నిబంధనల ప్రకారం ఒకే గోత్రానికి చెందిన వ్యక్తుల మధ్య, ఒకే గ్రామానికి సంబంధించిన వ్యక్తుల మధ్య జరిగే పెళ్లిళ్లు నిషేధం. తరతరాలుగా కొనసాగుతున్న సాంఘిక దురాచారమిది. దీన్ని ఎదిరించే సత్తా ఈ ప్రాంతంలోని ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదు. ఎక్కడ ఓటు బ్యాంక్ దెబ్బతింటుందోనని, జాట్ కులస్తులకు తలొగ్గి ఇక్కడి రాజకీయాలు పనిచేస్తాయి. పాలకపక్షానికి చెందిన కాంగ్రెస్ యువ ఎం.పి. నవీన్ జిందాల్ ఈ ఖాప్ పంచాయితీ అధికారాలను సమర్థించడమే దీనికి ఉదాహరణ.

పత్రికల్లో వస్తున్న వార్తా కథనాల ప్రకారం జరుగుతున్న యువ జంటల హత్యలన్నీ ఒకే గోత్రానికి చెందినవో, ఒకే గ్రామానికి చెందినవో కావని తెలుస్తోంది. కులాంతర వివాహాలు చేసుకున్నా, పక్క గ్రామాల వారి మధ్యన జరిగిన పెళ్లిళ్లైనా ఖాప్ పంచాయితీ ధిక్కారంగా భావిస్తోంది. కులాచారాలన్ని మంటగలుపుతున్నారని, హిందూ ధర్మాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ మారణ కాండను సాగిస్తున్నారు. గత సంవత్సరం జింద్ జిల్లాకు చెందిన వేద్‌పాల్ మోన్ అనే యువకుడు పక్క గ్రామానికి చెందిన ఇతర గోత్రపు అమ్మాయిని పెళ్లి చేసుకున్నా, ఖాప్ పంచాయితీ వేద్‌పాల్‌కు మరణశిక్షను విధించింది. తన భార్య కనపడడం లేదని, సింగ్‌వాల్ గ్రామంలో తల్లిదండ్రుల వద్ద బందీగా ఉందని వేద్‌పాల్ చేసిన ఫిర్యాదుకు స్పందించిన కోర్టు పోలీసు ఎస్కార్ట్‌తో హైకోర్టుకు సంబంధించిన ఒక వారెంట్ అధికారిని ఆ గ్రామానికి పంపించింది. దీన్ని తీవ్రంగా భావించిన ఖాప్ పంచాయితీ సభ్యులు మార్చ్ 2009లో సమావేశమై ప్రజల సమక్షంలోనే వేద్‌పాల్‌కు మరణశిక్షను విధించింది. ఈ మరణశిక్షను జూన్ 2009లో బాహాటంగానే అమలు చేశారు. పక్క గ్రామాల యువతీ, యువకులు మధ్యన కూడా అన్నా చెల్లెళ్ల సంబంధాలే ఉంటాయని వీరి వాదన.

తల్లిదండ్రులనెదిరించి ప్రేమ వివాహాలు చేసుకోవడం ఖాప్ పంచాయితీల కుల కట్టుబాటుకు వ్యతిరేకమని తీర్పులు చెబుతూ, మరణశిక్షలను విధిస్తున్నారు. హర్యానాలోని జాఉంది, అసందా, ధరానా, సింగ్‌వాల్, హదావుది, మహంకేషరి, లదూనా తదితర గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా హత్యలు సర్వసాధారణం.

మాజీ హర్యానా డిజిపి ఒకరు స్వయంగా ఈ ఖాప్ పంచాయితీలకు నాయకత్వం వహించి, దీనికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని సాంఘిక బహిష్కరణకు గురిచేయడమే కాకుండా, ఎలాంటి సాంఘిక, దైవిక కార్యక్రమాలకు సంబంధిత కుటుంబ సభ్యులను అనుమతించకుండా ఫత్వాలు జారీ చేయడం జరుగుతోంది. అయినా ఆయన నెల నెలా ప్రజల సొమ్మును పెన్షన్‌గా పొందుతూనే ఉన్నాడు.

ఇలాంటి హత్యలు కేవలం హర్యానాలోనో, లేదా రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ లాంటి తదితర వెనకబడిన ప్రాంతాలలో పరిమితం కాదని ఈ మధ్యన జరిగిన, జరుగుతున్న సంఘటనలు తెలియ జేస్తున్నాయి. కోల్‌కతాలో సెప్టెంబర్ 21, 2007న జరిగిన రిజ్వాన్ రహమాన్ అనే కంప్యూటర్ గ్రాఫిక్ ఇంజనీర్ హత్య పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని కుదిపివేసింది. ప్రియాంక తోడి అనే ఓ ఉన్నత హిందూ కులస్తురాలైన అమ్మాయిని ఆగస్ట్ 18, 2007న పెళ్లి చేసుకోవడమే ఈ యువకుడు చేసిన నేరం. పెళ్లిని గుర్తిస్తామని మభ్యపెట్టి కూతుర్ని ఇంటికి తీసుకెళ్లిన తోడి కుటుంబ సభ్యులు, భార్యను తిరిగి పంపకపోవడంతో స్థానికంగా గల ఓ స్వచ్ఛంద సంస్థతో తనను పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సెప్టెంబర్ 19న ఓ పిటిషన్ పెట్టుకున్నాడు. కోల్‌కతా దగ్గరలోని ఓ రైల్వేట్రాక్‌పై సెప్టెంబర్ 21న రిజ్వాన్ శవమై తేలాడు. ఈ విషయంగా ఆయన తల్లి ఒంటరి పోరాటం చేస్తూనే ఉంది.

దేశ రాజధాని ఢిల్లీ ఇలాంటి సంఘటనలకు అతీతంగా ఏమీ లేదు. ఫిబ్రవరి 17, 2002న నితీష్ కత్రా (24) అనే ఓ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఓ ఉన్నతస్థాయి పోలీసు అధికారి డిపి యాదవ్ కుమారుడైన వికాస్ యాదవ్‌చే అపహరించబడి చంపబడ్డాడు. తన చెల్లెలు భారతితో స్నేహాన్ని వదిలిపెట్టాలనేది ఈ హత్యకు కారణం. దాదాపు ఎనిమిది సంవత్సరాలు అనేక వాదనల తర్వాత దీన్నో పరువుహత్యగా గుర్తించి కోర్టు తీర్పు చెప్పడం గమనార్హం. కోర్టుల నిర్వాకానికి మరో తాజా ఉదాహరణ, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బ్రాహ్మణ అమ్మాయి సుష్మా తివారి కేరళకు చెందిన కిందిస్థాయి కులస్తుడైన ఓ మలయాళిని 2004లో ప్రేమించి పెళ్లి చేసుకుంది. దీన్ని తీవ్రంగా పరిగణించి సుష్మా అన్న దిలీప్ తివారి మరో ఇద్దరితో కలిసి అతి దారుణంగా సుష్మా అత్తమామల్ని, భర్తను, మరో కుటుంబ సభ్యున్ని చంపేశారు. కేసు ముంబయి హైకోర్టులో నడిచింది. కోర్టు నిందితులకు మరణశిక్షను విధించగా, దిలీప్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. కేసునంతా తిరగదోడిన సుప్రీంకోర్టు డిసెంబర్ 2009లో దీన్ని పరువు హత్యగా

అభివర్ణిస్తూ, జస్టిస్ వి.ఎస్. సర్‌పుర్కర్ 'కుటుంబ గౌరవాన్ని కాదని చెల్లెలు రహస్యంగా కులాంతర వివాహాన్ని చేసుకోవడాన్ని నివారించాల్సిన బాధ్యత అన్నగా దిలీప్‌కు ఉంటుంద'ని వ్యాఖ్యానిస్తూ, మరణశిక్షను యావజ్జీవ శిక్షగా మారుస్తూ ఏప్రిల్‌లో తీర్పు చెప్పారు. తన అన్న ద్వారా జరిగిన అన్యాయానికి, కోర్టు తీర్పుకు కలత చెందిన సుష్మ మళ్లీ పై బెంచికి కేసును అప్పీలు చేస్తానని ప్రకటించింది.

మారుతున్న జీవనశైలి, సామాజిక మార్పులు యువతపై తీవ్ర ప్రభావాన్ని చూపడంతోపాటు, తమ భావాలకు అనుగుణంగా ఉన్న వారిని పెళ్లి చేసుకుందామంటే పెద్దలు ఒప్పుకోకపోవడంతో స్నేహితుల సహకారంతో పెళ్లి చేసుకొని వారి మానాన వారు జీవిస్తుంటే, కుటుంబ గౌరవం మంటగలిసిందని, ఇంటికి దూరంగా జంటలు ఉన్నా, వెంటాడి, వేటాడి చంపడం ఈ మధ్యన సర్వ సాధారణమైంది. ఈ ఖాప్ పంచాయితీలు ఏ పల్లె ప్రాంతానికో, వెనకబడిన ప్రాంతానికో కాక మహా నగరాలలో కూడా జరుగుతున్నాయి.

ఇలాంటి దారుణాలు ఉత్తర భారతదేశానికే పరిమితం లేవు. ఈ మధ్యన మన రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. రెడ్డి కులస్తురాలైన అమ్మాయి, పెళ్లై పిల్లలు గల ఓ దళిత అబ్బాయిని పెళ్లి చేసుకున్నందుకు స్వయంగా అమ్మాయి తండ్రి ఇద్దరిని హత్య చేసాడు. యు.పి. అయినా ఎ.పి. అయినా కుల పిచ్చి అంతటా ఒకటేనని ఇలాంటి సంఘటనలు రుజువు చేస్తాయి. ఆర్థికంగా, విద్యాపరంగా ఎదిగినా, సామాజికంగా మన సమాజం ఇంకా మధ్యయుగాల నాడున్నట్లే ఉంది.

ఈ మధ్యన వచ్చిన పరిశోధనల్లో దక్షిణ ఢిల్లీ ప్రాంతంలో ఆడ, మగ నిష్పత్తి మధ్యన అత్యధిక వ్యత్యాసం ఉందని, దీనికి కారణం అన్నివర్గాల ఆడ శిశువుల హత్యలు జరగడమేనని, కొన్ని వర్గాలలో అమ్మాయిలు దొరకడం కష్టంగా ఉందని, దీంతో బీహారు వంటి ప్రాంతాల నుంచి అమ్మాయిలని కొనుక్కొని పెళ్లి చేసుకోవడం జరుగుతోందని తేలింది.

వీటికి తోడు మహిళలపై జరుగుతున్న నేరాల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉన్నాయి. 2006లో 1,64,765 మహిళలపై దాడులు జరగగా, 2007లో 12.5 శాతం పెరిగి 1,85,312కు చెరుకుంది. అలాగే 2008-09లో జరిగిన కులాంతర, మతాంతర వివాహాల్లో దళితుల ప్రమేయమున్న వారి సంఖ్య 4,750గా నమోదయింది. వీటిలో ఖాప్ పంచాయితీల ఆగ్రహానికి గురైన కథనాలే అత్యధికంగా ఉన్నాయి. విద్యావంతులైన వివిధ వర్గాల యువతీ యువకులు, సాంఘిక ఆచారాలను, కుల కట్టుబాట్లను కాదని నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఈ మధ్యన బాగా పెరిగింది. అర్థరహితమైన గోత్రాల పేరుతో హత్యాకాండను సాగిస్తున్నాయి. రాజకీయాలను, చట్టాలను శాసిస్తున్నాయి.

ఈ కులగోత్రాలకు అసలు శాస్త్రీయత లేదని తెలిసినా, చదువుకున్న కుటుంబాలే వీటికై పాకులాడడం ఎక్కువైంది. ఈ ఆచారం దాదాపుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లోని సంపన్న వర్గాలలో ఉంది. ఆర్థికంగా ఎదుగుతున్న కింది వర్గాలు కూడా ఈ సాంప్రదాయాల్లో పడి గింజుకొంటున్నాయి. ఈ గోత్రాల పుట్టుకకు అనేక కథనాలున్నాయి. 'మను' సంస్కృతిలోని కుటిల ధర్మమే దీనికి కారణం. బ్రాహ్మణ వర్గీయులు ఈ గోత్రాల పుట్టుకకు ప్రధాన కారణంగా ఉన్నారు. ప్రముఖ జర్మన్ పరిశోధకుడు మాక్స్ ముల్లర్ ఈ గోత్రాల గురించి వ్యాఖ్యానిస్తూ ఇవి ఎనిమిది తరాలకు చెందిన వివిధ కుటుంబాలలో శాఖలుగా వ్యాపించాయని తెలిపారు.

ఖాప్ పంచాయితీలు ఏ ప్రాంతంలోనైతే స్వగోత్ర వివాహాలను నిషేధించాయో ఆ ప్రాంతాల్లోనే ఒకనాడు సతీ సహగమనాలు జరిగేవి. ఈ దుర్మార్గాలన్నింటికి మన రాజకీయ వ్యవస్థ, విద్యా వ్యవస్థలే కారణం. విద్యాధిక కుటుంబాలలోనే ఈ దురాచారాలు చోటు చేసుకొంటున్నాయి. తలసరి ఆదాయంలో దేశంలోనే రెండోస్థానంలో ఉన్న హర్యానా ఆడమగ నిష్పత్తిలో అత్యధిక తేడాగల రాష్ట్రంగా ఉంది.

ఈ కుల పంచాయితీల తీరు ఎంత దారుణంగా ఉంటుందంటే, ఒకే గ్రామానికి చెందిన విభిన్న గోత్రాల వారుగాని, పక్క పక్క గ్రామాలకు చెందిన విభిన్న గోత్రాల మధ్యన పెళ్లిళు కూడా అన్నా చెల్లెల సంబంధాన్ని కలిగి ఉంటాయని, వాటినివిధిగా నిషేధించాలని డిమాండ్ చేస్తుంటాయి. ఈ ఆలోచనలు రోజురోజుకూ బలోపేతమవుతూ, ఈ పరిధిలోకి వచ్చే జంటల్ని కూడా చంపడానికి సాహసిస్తున్నాయి. ఈ దుర్మార్గపు ఆలోచనతోనే చట్ట సభల్ని కూడా శాసించాలని ఈ ఖాప్ పంచాయితీలు చూస్తున్నాయి.

ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం ఇలాంటి పరువు హత్యలు దక్షిణ ఆసియా, మధ్య తూర్పు దేశాల్లో దాదాపు ఐదు వేలకు పైగా ఉంటున్నాయని, ఇందులో భారతదేశం వాటానే అధికంగా ఉందని తెలుపుతున్నాయి.

దేశవ్యాప్తంగా జరుగుతున్న పరువు హత్యలతో పరువుపోతోందని భావించిన కేంద్ర ప్రభుత్వం మంత్రులతో కూడిన ఒక బృందాన్ని జూలై 8న ఏర్పాటు చేసింది. ఈ బృందం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి, భారత శిక్షా స్మృతికి, నేర శిక్షాస్మృతికి సవరణలు చేపట్టాలని, ఈ సవరణలను వర్షాకాలపు సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఖాప్ పంచాయితీలుగాని, ఇతర కుల సంఘాలు గాని ఇలాంటి హత్యలు చేసిన సందర్భంగా, తామే నిర్దోషులుగా నిరూపించు కునే విధంగా చట్టాల్ని సవరించాలని పి. చిదంబరం కోరారు. ఏ చట్టమైనా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదనేది మన అనుభవం చెబుతున్న పాఠం.

మరోవైపు కేంద్ర ప్రభుత్వం తలపెడుతున్న చట్ట సవరణలను తాము వ్యతిరేకిస్తున్నామని, రాష్ట్రపతిని కలిసి చట్ట సవరణ చేయకుండా, 1955 నాటి హిందూ వివాహ చట్టాన్ని సవరించి, స్వగోత్రీకుల మధ్యన వివాహాలు నిషేధించేలా చూడాలని కోరుతామని, జూలై 12న ముజఫర్ నగర్ జిల్లాలోని షమ్మీ పట్టణంలో సమావేశమైన ఖాపం పంచాయితీ సభ్యులు ప్రకటించారు.

ఎన్‌కౌంటర్ హత్యల సందర్భంగా, లాకప్‌డెత్‌ల సందర్భంగా పోలీసులే తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనే చట్టాలున్నా అవి ఎంత మేరకు నెరవేరుతున్నాయో అందరికీ తెలుసు. అరెస్టు చేసిన 24 గంటల లోపు కోర్టుకు నిందితుల్ని అప్పజెప్పాలన్న నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

బలమైన ఉద్యమాలు లేకుండా, చైతన్యవంతమైన సమాజం రూపు దిద్దుకోకుండా చట్టాల సవరణతో సమాజాన్ని ప్రభావితం చేయడం సాధ్యం కాదు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

రాజ్యాంగంలో లొసుగులు, పాలకపక్షాల అవినీతి, అలసత్వం తోడుగా ఉన్నప్పుడు ప్రజలను మోసం చేసి, వారి కష్టార్జితాన్ని ఎలా లూటీ చేయవచ్చునో ఉదాహరణగా సత్యం కంప్యూటర్స్ కుంభకోణం పైనాన్ని వివరిస్తున్నారు **వై. వేణుగోపాల్‌రెడ్డి**

అవినీతి పింఛపు బంగారు నెమలి

'సత్యం కంప్యూటర్స్' ఈ పేరు వింటేనే ఐ.టి. రంగమంతా పులకరించిపోయేది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మన దేశ కీర్తి పతాకను ఎగరేస్తున్న ఆ కంపెనీని చూసి గర్వపడేవి. మంత్రులూ, రాజకీయ నాయకులూ ఆ కంపెనీ అధిపతి స్నేహం కోసం అర్రులు చాచేవారు. ఆరు ఖండాలలో, 65 దేశాలకు తమ వ్యాపారాన్ని విస్తరించి, సంవత్సరానికి 10 వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తోందని భావిస్తున్న తరుణంలో 'బ్రేకింగ్ న్యూస్' - సత్యం కంపెనీలో ఏడు వేల కోట్ల రూపాయలకు పైగా కుంభకోణం. వెంటనే సత్యం మేనేజింగ్ డైరెక్టర్ రామలింగరాజు వాటాదారులను, మిగతావారినుద్దేశించి ఒక బహిరంగ లేఖ మీడియాకు విడుదల చేశారు. అందులో తన నేరాన్ని ఒప్పుకున్నారు.

దాని సారాంశమేమిటంటే, 'తానొక విధిలేని భారాన్ని మోస్తున్నానని, ఆస్తి - అప్పుల పట్టీలో ఉనికిలో లేని రు.5,040 కోట్ల నిల్వలను చూపించానని (నిజానికి ఉన్నవి రు.640 కోట్లే), ఉనికిలో లేని రు. 376 కోట్ల వడ్డీని చూపించానని, రు. 1230 కోట్ల అప్పులకు నిధులు సమకూర్చినట్లు, రు.490 కోట్లకు అప్పుదారులు ఉన్నట్లు ఇలా అన్ని లేనివి ఉన్నట్లు చూపించి వాటాదారులను మోసం చేసినట్లు, ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు తన కుటుంబానికే చెందిన 'మేటాస్' కంపెనీని కొనడానికి నిశ్చయించినట్లు దరిమిలా పైన చెప్పిన ఊహాజనిత లాభాలను వాస్తవం చెయ్యవచ్చునని భావించాననీ, ఈ విషయాలేవీ బోర్డు మెంబర్లకు గానీ, కనీసం సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు గానీ తెలియనివ్వలేదనీ, అంతేకాక, 53,000 మందికి ఉద్యోగాలిచ్చి, ప్రపంచ 500 ఫార్చ్యూన్ కంపెనీలలో 185 కంపెనీలు తమ కష్టమర్లే కాబట్టి అమెరికాలోని 'మెరిల్ లించ్' (ఈ కంపెనీ తర్వాత కొద్దిరోజులకే దివాలా తీసిందనుకోండి) ఈ విపత్కర పరిస్థితుల నుండి తమను గట్టెక్కిస్తుందనీ, వాటాదారులూ, డైరెక్టర్లూ, ఇందుకు తనను క్షమించాలని' విన్నవించాడు.

పరిస్థితిని గమనించిన వాటాదారులకూ, మిగతా కార్పొరేట్ ప్రపంచానికి మతిపోయినంత పనయింది. ఏడు సంవత్సరాల నుండి ఆస్తి-అప్పుల పట్టీలో లేనివి ఉన్నట్లుగా చూపించి వాటా విలువను పెంచుకొని తర్వాత తన పుత్ర రత్నాలకే చెందిన కంపెనీ మేటాస్‌ను కొనుగోలు చేయబూనడం ఎవరికీ మింగుడు పడలేదు సరిగదా, ఏ మాత్రం జంకూ, గొంకూ లేకుండా తప్పును ఒప్పుకుంటూ బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేయడం ఈ దేశ చట్టాలు తననేమీ చేయలేవనే ధీమానే తప్ప మరొకటి కాదు. ఈ విషయం బయటకు రాగానే ఎస్.ఇ.బి.ఐ. మేల్కొని ఈ కంపెనీలో జరిగిన అవకతవకలపై విచారణ చేయడానికి సన్నద్ధమవుతుండగానే, రాజుగారు చటుక్కున పోలీసులకు లొంగిపోయారు. కారణం తనను సెబి (ఎస్.ఇ.బి.ఐ.) ప్రశ్నించకుండా చూసుకోవడం. కానీ పరిస్థితి తర్వాత మారిపోయింది. కంపెనీ డైరెక్టర్‌లలో ఒకరైన రామ్ మైనంపాటి అమెరికాకు పారిపోయాడు. (పోయాడు అనడం కన్నా పోనిచ్చారు అనడం బాగుంటుంది. ఎందుకంటే ఇతను 60 శాతం వ్యాపారాన్ని చూసుకుంటారు. ఆ విషయం అన్ని పరిశోధక సంస్థలకు తెలుసు.) సత్యం కంపెనీ వాటా ధర రు. 77 కంటే తక్కువ ధరకు పడిపోయింది. నిఫ్టీ 192 పాయింట్లకు, సెన్సెక్స్ 749 పాయింట్లకు పడిపోయింది.

ఈ తరహా కార్పొరేట్ కుంభకోణానికి ప్రపంచ దేశాలు నివ్వెరపోయాయి. రామలింగరాజు ఇంకో కుడి భుజం, సత్యం కంప్యూటర్స్ సి.ఎఫ్.ఒ. వడ్లమాని శ్రీనివాస్ కూడా అరెస్టయ్యారు. ఐ.పి.సి.లోని సెక్షన్లు 120 (నేరపూరిత కుట్ర), 420 (మోసం), 406, 467, 427 (నమ్మక ద్రోహం, ఫోర్జరీ, ఫోర్జరీ పత్రాల వినియోగం) వంటి సెక్షన్ల కింద కేసులు పెట్టారు. కేసు సి.ఐ.డి.కి ట్రాన్స్‌ఫర్ అయింది.

ఈ కుంభకోణం బయటికి రాకముందు కొద్దిరోజుల కిందట సదరు సత్యం రామలింగరాజును ప్రభుత్వం 'బంగారు నెమలి' (గోల్డెన్ పీకాక్) అవార్డుతో సత్కరించింది. ఎందుకంటే ఆయనగారు కార్పొరేట్ గవర్నెన్స్ నియమాలు చక్కగా పాటించినందుకట. కార్పొరేట్ గవర్నెన్స్ అంటే 'న్యాయబద్ధమైన, వాస్తవ చట్రంలో ఉండే మేనేజ్‌మెంట్ నిర్వహణలో కంపెనీ పాలన సాగడం'. ఇటీవల సి.బి.ఐ. కి డిప్యూటేషన్ మీద వచ్చి ఈ కేసు వివరాలు చూసిన రిజర్వ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వెల్లడించిన విషయాలను మరికొన్నిటిని గమనిస్తే కంపెనీ ఎంత న్యాయబద్ధ, వాస్తవ నిర్వహణతో నడిచిందో చక్కగా అర్థమవుతుంది. వారి ఆస్తి-అప్పుల పట్టీలో

- 1230 కోట్ల రూపాయల బకాయిలను తగ్గించి, 490 కోట్ల రూపాయల అప్పును హెచ్చించి చూపారు.
- 1991లో 18.78 శాతంగా ఉన్న ప్రమోటర్ల వాటా అంటే రామలింగరాజు వగైరాల వాటా 2.18 శాతానికి తగ్గింది. బినామీ లావాదేవీల ద్వారా షేర్లను అమ్ముకుని రు. 767.73 కోట్ల రూపాయలను జేబులో వేసుకున్నారు.
- 1999 నుండి 2008 మధ్య 3,454.9 కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులను వీరు కూడబెట్టారు. వీటి వైశాల్యం 5757.30 ఎకరాలు.

- 327 కంపెనీలను సృష్టించి వీటి ద్వారా తమ భూభాగోతం నడిపించారు.
- పద్దుల్లో ఎక్కడా కనిపించని 1230 కోట్ల రూపాయలను ఈ కంపెనీల నుంచే సత్యం కంపెనీ తీసుకుంది.
- 2003 నుంచి 2008 మధ్య 7,561 బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించారు.
- సెలెనెట్, ఇకీర్, సినోని, నార్త్‌సీ, ఆటోటెక్, హర్‌గ్రీవ్స్ వంటి అడ్రస్ లేని కంపెనీలను సృష్టించి ప్రాజెక్టులు చేపట్టారు.
- మార్కెట్ ధర వాటా 500 రూపాయలుగా ఉన్న సమయంలో స్టాక్ ఆప్షన్ కింద డైరెక్టర్లకు అంటే తమకే కేవలం రెండు రూపాయలకే షేర్లను కేటాయించుకున్నారు.
- 2007-08, 2008-09 మధ్యకాలంలో 27.08 కోట్ల రూపాయల డివిడెండ్లు భోం చేశారు.

53 వేలమంది ఉద్యోగస్తులున్నట్లు తమ ఖాతాలలో చూపించుకున్నారు. ఉన్నది 40 వేల మంది మాత్రమే. మరి మిగతా 13 వేల మంది జీతాలు ఎవరి జేబుల్లోకి వెళ్లుంటాయి అనేది చెప్పక్కర్లేదు.

2001, 2002లలో ఈ కంపెనీ నిర్వహణ, దాని అవకతవకల నిర్వాకాల మీద సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు కి ఫిర్యాదులందాయి. కానీ ఉద్దేశపూర్వకంగానో, మరే కారణం చేతనో వారు ఆ ఫిర్యాదులపై ఆసక్తి చూపలేదు. 2003లో సాక్షాత్తూ ఒక ఎం.పి. గారే సెబికి ఈ కంపెనీపై ఫిర్యాదు చేశారు. దాన్నీ తొక్కిపెట్టారు. ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ 2002లోనే సత్యం కంపెనీ తన నగదును చట్ట విరుద్ధంగా బదలాయించడంపై కొరడా ఝుళిపించబోయింది. కానీ సదరు కొరడా పట్టుకున్న అధికారిని బదిలీ పేరుతో కొరడాతో సహా ఎక్కడికో గిరాటు వేసేశారు. ఈ కంపెనీ పైన అనేక ఫిర్యాదులందుతున్న ప్పటికీ మన కార్పొరేట్ సంస్థలు సెబి, సి.ఎల్.బి., ఆర్.బి.క్యూ., ఐ.సి.ఎ.ఐ. మొదలైనవి తమకున్న విచక్షణాధికారాలను (?!) ఉపయోగించి తమ వంతు నిర్లక్ష్యాన్ని తమ బాధ్యతగా ప్రదర్శించాయి. దరిమిలా దేశ ఆర్థిక వ్యవస్థనే వణికించేటంత కుంభకోణం సాధ్యమైంది. అసలు ఈ కంపెనీలో ఈ రకం మోసాలు జరిగేందుకు అనుమతించిన అంతర్గత ఆడిటర్లు, వారి విదేశీ భాగస్తుల గురించి ఎవరూ పెద్దగా పట్టించుకొన్నట్లు లేదు. ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఇతరుల జేబుల్లోకి వెళ్తుంటే 'కాపలా కుక్క'ల్లాగ (ఆడిటింగ్ పరిభాషలో వారిని వాచ్‌డాగ్స్ అంటారులెండి) ఉండాల్సిన వారు గాడిదల్లాగ నిద్రపోవడం ఏమిటి? ఐ.సి.ఎ.ఐ. సంస్థ ఈ కుంభకోణంలో భాగస్తులైన ప్రైస్‌వాటర్ కూపర్‌పై కనీస చర్య తీసుకోవాలి. అలాంటిదేమీ ఎందుకు జరగలేదంటే పి.డబ్ల్యు.సి.లోని ఇద్దరు సభ్యులు ఐ.సి.ఎ.ఐ. క్రమశిక్షణా సంఘంలో కూడా సభ్యులే.

మన దేశంలో ఆడిటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించినా, మరే అవకతవకలకు పాల్పడ్డా కేవలం పది వేల రూపాయల జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్షతో సరిపుచ్చవచ్చు. అదే పి.డబ్ల్యు.సి. పుట్టినిల్లయిన అమెరికాలో ఇలాంటి తప్పులకు సార్‌బన్స్ - ఆక్స్‌లీ యాక్ట్ ప్రకారం జైలు శిక్ష ఇరవై ఏళ్లు ఉంటుంది. (అదీ ఇటీవల ఎన్‌రాన్ వంటి కార్పొరేట్ మోసాల నేపథ్యంలో ఈ శిక్షను పెంచారు) ఇంత స్థాయిలో అక్రమాలు జరుగుతూ ఉన్నా ప్రముఖులైన బోర్డు డైరెక్టర్లు కేవలం రబ్బరు స్టాంపుల్లాగ వ్యవహరించారని సి.బి.ఐ. వ్యాఖ్యానించింది. హైటెక్‌గా నడిచే పద్దు నమోదు చేతితో కూడా జరిగినా ఆడిటర్లు బయట పెట్టలేదంటే వారు ఏ స్థాయిలో కుమ్మక్కయ్యారనేది తెలుస్తూనే ఉంది. అలాగే నిందితులు రాత్రి వేళల్లో కార్యాలయాలకు వచ్చినట్లు స్వైప్ మెషిన్లో డాటా ద్వారా తెలుసుకున్నామని, ఆ సమయంలోనే దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించినట్లు తమ దగ్గర సాక్ష్యం ఉందని సి.బి.ఐ. వెల్లడించింది. ఈ కేసును పరిశోధించడానికి నలభై మంది ఇన్వెస్టిగేటర్ల బృందం పనిచేస్తోందని చెబుతూ, సి.బి.ఐ. వారు అనుబంధ చార్జిషీటును కోర్టులో దాఖలు చేశారు. ఇంకా అసలు చార్జిషీటు దాఖలు చేయాల్సి ఉంది. అయితే సి.బి.ఐ. రాజు తన ఆస్తులు ఎక్కడెక్కడ దాచారో తెలుసుకొనేందుకు పాలిగ్రాఫ్ టెస్టుకు అనుమతించమని కోర్టుకు విన్నవించుకున్నారు. సుప్రీంకోర్టు ఇటీవల నార్కో ఎనాలిసిస్ టెస్టును రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించిన నేపథ్యంలో రాజు తన లాయర్ల ద్వారా సి.బి.ఐ.ని గట్టిగా ఎదుర్కోనున్నారు. రామలింగరాజు బృందంపై పెట్టిన కేసులు చూస్తే ఐ.పి.సి. 420 (మోసం)కు ఏడు సంవత్సరాలు, నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం వంటి నేరాలకు మూడు సంవత్సరాలు, మోసం, ఫోర్జరీ వంటి నేరాలకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష ఉంది. అయితే ఈ కేసులన్నీ ఫస్టుక్లాసు మెజిస్ట్రేట్ చేత విచారింపబడే నేరాలే. ఈ ఆరోపణలన్నీ సాక్ష్యాధారాలతో నిరూపితం కావాలసి ఉంది. ఇక అప్పీళ్లు ఉండనే ఉన్నాయి.

ఇదంతా చూస్తుంటే ప్రజల సొమ్మును కళ్లముందే దోచుకొని, దేశ ఆర్థిక వ్యవస్థనే వణికింపజేసి, 'అవును, నేను చేశాను' అని మీడియా ముందు ధైర్యంగా చెప్పిన మనిషికి, ఈ దేశ చట్టాలు ఎలాంటి శిక్ష వేస్తాయో చూడాలి. దొంగతనం, బందిపోటు నేరాలకు కనీసం పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష ఉంటే, ఇంత సొమ్ము పబ్లిక్‌గా దోచుకుంటే ఎలాంటి శిక్ష ఉండాలి?

ఈ రామాయణంలో ఇంకో పిడకల వేట ఏమిటంటే ప్రపంచ బ్యాంక్ సత్యం సేవలను ఉపయోగించడంపై నిషేధం విధించింది. ఫాక్స్ న్యూస్ సంస్థ వెలువరించిన సమాచారం ప్రకారం ప్రపంచ బ్యాంక్ ముఖ్య సమాచారమంతా తెలియని ప్రదేశానికి బదలాయించబడుతోందని వారి ఫోరెన్సిక్ నిపుణులు నిర్ధారించారు. ఇదంతా కూడా 'కీ స్ట్రోక్ లాగింగ్' అనే పద్ధతిలో అంటే కీబోర్డుపై టైపు చేస్తుండగానే సమాచారం తెలియని ప్రదేశానికి ఇంటర్నెట్ ద్వారా వెళ్తోంది. ఈ విషయం పసిగట్టిన బ్యాంక్ అధికారులు వాషింగ్టన్, చెన్నై మధ్య ఉన్న డాటా లింకును మూసివేశారు. ఈ సేవలకు గాను 2003లో సత్యం పది మిలియన్ డాలర్లు వసూలు చేసింది. 2007కల్లా ఆ మొత్తాన్ని వంద మిలియన్ డాలర్లకు పెంచింది. అయితే ఎంత సమాచారం ప్రపంచ బ్యాంక్ నుండి దొంగిలించబడిందనేది ఇంకా తేలాల్సి ఉంది. దాదాపు 40 సర్వర్లు బ్యాంక్ సమాచార వ్యవస్థలోకి చొరబడ్డాయని సమాచారం.

తాజా కలం : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈయనతో పాటు అరెస్టయిన వారిని బెయిల్‌పై విడిచిపెట్టింది.

(రచయిత హైకోర్టు న్యాయవాది)

తెలుగు భాష ప్రాముఖ్యతను, తెలుగును బోధిస్తున్న పండితుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న పక్షపాత ధోరణులను వివరిస్తున్నారు **ఎస్. నీలాదేవి, సి.ఎచ్. శ్రీమన్నారాయణ**

భాషాభిమానం నాకు కద్దని...

'దేశ భాషలందు తెలుగు లెస్స' అంటూ దేశభాషలన్నింటిలో ప్రత్యేకత పొంది ఎందరి మన్ననలనో పొందిన మన తెలుగు భాష అంతరించే సమయం ఎంతో దూరంలో లేదు. ఇది తెలుగు భాషాభిమానులందరికీ ఎంతో మనోవేదనను కలిగించే అంశం.

మొన్న కడప జిల్లా మైదుకూరులో ఒక 'ఇంగ్లిష్' మీడియం పాఠశాలలో తెలుగుభాషకు జరిగిన అన్యాయం, అవమానంపై ఎంతో మంది తమ తీవ్ర నిరసనను తెలియజేయడం భాషాభిమానులందరికీ ఎంతో కొంత ఊరటను, ఆనందాన్ని కలిగించిందని చెప్పవచ్చు.

కానీ ఒక నిముషం వాస్తవంగా తెలుగు భాషకున్న పరిస్థితి అర్థం చేసుకుంటే ఏదో ఒక ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో తెలుగుకు జరిగిన అవమానాన్ని గురించి ఆలోచించడం, నిరసన తెలపడం భాషాభిమానులుగా మన కనీస కర్తవ్యం. కానీ తెలుగుపై ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, భాషోపాధ్యాయులపట్ల అవలంబిస్తున్న పక్షపాత వైఖరే నిదర్శనం. భాషపట్ల, భాషోపాధ్యాయుల పట్ల చిన్నచూపు మొదటి నుండీ ఉంది. 'బతుకలేక బడిపంతులు' అనే నానుడి తెలుగు భాషాపోధ్యాయులకు ఇప్పుడు వర్తించే అంశం.

తెలుగు భాషోపాధ్యాయులుగా నియమించేందుకు అర్హతలుగా తెలుగులో స్పెషల్ డిగ్రీ, తెలుగు పండిట్ శిక్షణ పూర్తిచేసిన వారికి తెలుగు భాషాబోధకులుగా నియామకం చేస్తున్నారు. కానీ ఉన్నత పాఠశాల స్థాయికి తగిన అర్హతలున్నా కూడా వారిని గ్రేడ్ - 2 గానే పరిగణిస్తూ విద్యార్థులకు బోధన కొనసాగేలా చేస్తున్నారు.

ఉపాధ్యాయ నియామకాల్లోనూ గ్రేడ్ - 2లను ఎక్కువగా నియామకం చేస్తూ గ్రేడ్ - 1లను అతి తక్కువగా ఐదు, పదులలో, ఒక్కొక్క జిల్లాలో ఒకటి, రెండుల్లో నియామకం చేస్తున్నారు. పదోన్నతి పొందే సమయంలో సెకండరీ గ్రేడ్ టీచర్లను గ్రేడ్ - 1 తెలుగు భాషా పండితులుగా పదోన్నతులు ఇస్తున్నారు. మిగతా విషయ బోధకులకు తమకంటే ఎంతో తొందరగా పదోన్నతులు పొందితే తెలుగు భాషాబోధకులు రిటైర్‌మెంట్ వరకు గ్రేడ్ - 2లోనే ఉండవలసిన పరిస్థితులు నేడు నెలకొన్నాయి.

నియామకాల్లో గ్రేడ్ - 1 తెలుగు భాషా బోధకులను స్కూలు అసిస్టెంట్‌లతో సమానంగా భర్తీ చేయడం లేదు. పదోన్నతులలో అయినా గ్రేడ్ - 1 స్థాయిని పొందుదామంటే సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోటీగా వస్తున్నారు.

'తెలుగుదేశంలో తెలుగులో డిగ్రీ పొంది, తెలుగు పండిత శిక్షణ పూర్తి చేసుకొని తెలుగు పాఠ్యపుస్తకాలనన్నీ చదివి, తెలుగు భాషోపాధ్యాయులుగా నియామకం పొంది, కొద్ది సంవత్సరాలుగా విద్యార్థులకు తెలుగు బోధిస్తూ ఉన్న తెలుగు భాషా పండితుడు పదోన్నతి పొందక ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ తెలుగు భాషోపాధ్యాయుడు గ్రేడ్-1గా పదోన్నతి పొందడం ఎంతవరకు సమంజసం? వారు విద్యార్థులకు ఏరకమైన భాషా బోధన చేయగలరు? చేయగలిగితే మరి ఈ తెలుగు డిగ్రీలు, పండిత శిక్షణలు, నియామకాలు ఇవన్నీ ఎందుకు?

అదీగాక ప్రతీ పాఠశాలలో ప్రతీ సబ్జెక్ట్‌కు స్కూల్ అసిస్టెంట్లు (విద్యార్థుల సంఖ్యను బట్టి) ఇద్దరున్న చోట ఒక్కో గ్రేడ్ - 2ను, ఒక్క గ్రేడ్ - 1 ను ఇస్తారు. లేనిదగ్గర ఎవరన్నా ఒక్కరే ఉంటున్నారు. ఎక్కువ ప్రాథమికోన్నత పాఠశాలల్లో అసలెవరూ లేరు. ఎక్కువమంది విద్యార్థులున్నా తెలుగు బోధనకు ఒక్కర్నే నియామకం చేస్తారు. ఇప్పుడున్న అనేక పాఠశాలల్లో ఈ స్థితిని మనం చూడవచ్చు.

తెలుగు భాషాభిమానం అందరికీ ఎక్కువే. అయితే తెలుగుకు, తెలుగును చదువుకొని తెలుగు బోధించే భాషోపాధ్యాయులకు ఇంత అన్యాయం ఎందుకు జరుగుతోంది?

ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం (సక్సెస్) పాఠశాలల్లో నియామకాలన్నీ స్కూల్ అసిస్టెంట్లను నియమించి తెలుగుకు ఎక్కడో ఒక్కచోట గ్రేడ్-2 నియామకాలు చేపట్టారు. వారికి బోధించే తెలుగు భాషోపాధ్యాయులు తక్కువ విద్యార్హతలు కలవారా? తెలుగు మీడియం చదివిన వారిని ఇంగ్లిష్ మీడియం స్కూల్ అసిస్టెంట్లుగా నియమించడానికి లేని అభ్యంతరం తెలుగు మీడియం చదివి అన్ని తెలుగు విద్యార్హతలున్న భాషోపాధ్యాయులను గ్రేడ్-1గా నియమించడానికి ఎందుకు అభ్యంతరం?

6, 7 తరగతులకు బోధించే అన్ని సబ్జెక్టులవారు స్కూలు అసిస్టెంట్‌లు. తెలుగు బోధించేవారు మాత్రం గ్రేడ్ - 2 పండితులు. సమాన విద్యార్హతలు కలిగి ఉన్న భాషోపాధ్యాయులు ఎందులో తక్కువ? ఎందుకీ తేడాలు?

తెలుగు భాషకు, భాషోపాధ్యాయులకు ఎన్నో సంవత్సరాలుగా తీరని అన్యాయం జరుగుతూనే ఉంది. భాషాభివృద్ధి భాషోపాధ్యాయుల వల్లనే జరుగుతుంది. ఈ విషయాన్ని భాషాభిమానులందరూ గుర్తించాలి.

తెలుగు మాష్టారు పద్యం చెప్పినా, పాటపాడినా, నీతి కథలు చెప్పి మానవత్వపు విలువలు బోధించి జీవితసారాన్ని తెలియజెప్పినా మా మంచి మాష్టారు తెలుగు భాషోపాధ్యాయుడే.

విద్యార్థుల గుండెల్లో జీవితాంతం నిలియిపోయే తీయని తెలుగులాంటి గురుతూ - మా గురువుగారు.

(రచయితలు ఉపాధ్యాయులు)

పోలీసులే భక్షకులుగా మారినప్పుడు, అండగా ఉండాల్సిన చట్టాలూ, న్యాయస్థానాలూ భరోసా ఇవ్వనప్పుడు ప్రజలే సమస్యను పరిష్కరించుకోవాల్సిన సమయం వచ్చిందని అంటున్నారు **డా. జి. లచ్చయ్య**

పోలీసులా! కీచకులా!

(... గత సంచిక తరువాయి)

గుజరాత్‌లోని వడోదర జిల్లా మోక్షి గ్రామ నివాసి అయిన పదమూడు సంవత్సరాల దళిత అమ్మాయి తల్లిదండ్రులు విడిపోవడంతో తాత వాశ్‌రాం వంకర్ దగ్గర ఉంటోంది. హోళి పండుగ తర్వాత గుజరాతీయులు జరుపుకునే దులేటి అనే పండగ సందర్భంగా 13 మార్చ్ 1998 నాటి రాత్రి అపహరణకు గురైంది. ఎం.ఎల్.ఎ. కుమాన్ సిన్హా చౌహాన్ అనుచరుడైన రమేష్ బరియా తన సహచరులతో కలిసి అతి దారుణంగా ఆ అమ్మాయిని మానభంగం చేసి గ్రామం దగ్గరలోని ఓ మడుగు దగ్గర పడేసారు. రాత్రంతా అమ్మాయి కనపడక పోవడంతో ఆందోళనకు గురైన తాత వాశ్‌రాం తెల్లవారక ముందే అమ్మాయి కోసం వెతకగా రక్తస్రావంతో జీవచ్ఛవంలా పడి ఉండగా చూసాడు. స్థానికుల సహాయంతో సమీప పోలీస్ అవుట్‌పోస్ట్‌కు అమ్మాయిని తీసుకొని వెళ్లగా వారు ఎలాంటి కేసును నమోదు చేసుకోకుండా, దగ్గరలోని బధర్వ పోలీస్ స్టేషన్‌కు వెళ్లమన్నారు. వీరు కూడా కేసు నమోదు చేసుకోకుండానే వడోదరలోని ఎస్.ఎస్.జి. ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లమన్నారు. అక్కడి డాక్టర్లు రక్తస్రావంతో ఉన్న అమ్మాయిని కనీసం చూడకుండానే, మానసిక కేసుగా భావించి వడోదర పిచ్చాసుపత్రికి పొమ్మని సలహా ఇచ్చారు. ప్రజల సొమ్ముచే చదువుకున్న కొంతమంది డాక్టర్లు వైద్య వృత్తికే కళంకం తెచ్చే కథనాలు కూడా ఈ మధ్యన అనేకం చోటు చేసుకుంటున్నాయి.

పిచ్చాసుపత్రి డాక్టర్లు అత్యాచారానికి గురైన అమ్మాయిని పరీక్షించి, జరిగిన సంఘటనకు షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిందని, ఆమెకు వెంటనే వైద్య సహాయం కావాలని తిరిగి ఎస్ ఎస్ జి ఆసుపత్రికి పంపించారు. అప్పటికి గాని ఆ డాక్టర్లకు తెలివి రాలేదు. నాలుగు రోజుల తర్వాత గాని పోలీసులు కేసును నమోదు చేయలేక పోయారు.

ఈ తతంగమంతా జరుగుతుండగానే, పోలీసులు తన మనవరాలికి జరిగిన అన్యాయాన్ని కేసుగా నమోదు చేసుకోకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని వడోదర పోలీసు సూపరింటెండెంట్ (ఎస్.పి.)ను కలవగా, డబ్బును ఆశించి అత్యాచార ఆరోపణలు చేస్తున్నాడని బెదిరించినట్లు వాశ్‌రాం వాపోయాడు.

కేసును నమోదు చేసుకోకపోవడానికి జరిగిన కారణాలను చూస్తే అనేక ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. అమ్మాయి అపస్మారక స్థితిలో మార్చ్ 14, 1998న పోలీసుస్టేషన్‌కు బాధితులు పోకముందే స్థానిక ఎం.ఎల్.ఎ. కుమాన్ సిన్హా తన లెటర్‌హెడ్‌పై ఎలాంటి కేసును నమోదు చేసుకోవద్దని తెలుపుతూ ఓ లేఖను రాసి విరేంద్ర బి సోలంకి అనే అనుచరునితో పంపాడు. 'ఈ లేఖను తీసుకొని వచ్చిన వ్యక్తి మీతో అన్ని విషయాలు మాట్లాడుతారని, సమస్యను అర్థం చేసుకొని తగు సహాయం చేస్తారని ఆశిస్తున్నా' నని ఆ లేఖలో చౌహాన్ పేర్కొన్నారు. ఈ విధంగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆ లేఖ పని చేయడంతో, చేసేది లేక వాశ్‌రాం గుజరాత్ హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. హైకోర్టు ఆదేశం మేరకు కేసును నమోదు చేసుకోన్నారు.

ఇంత తీవ్రమైన అత్యాచార కేసులకు సంబంధించి తాను ఎలాంటి సిఫారసు ఉత్తరాలు రాయనని, సంతకాలు చేసిన లెటర్ హెడ్స్‌ను సాధారణంగా కార్యకర్తలకు ఇస్తూ ఉంటానని, ఎవరో తన పేరు మీద సిఫారసు లేఖ రాసి ఉంటారని చౌహాన్ తర్వాత మాట మార్చారు. ఈ అత్యాచార కేసును పరిశీలుస్తున్న సాంఘిక న్యాయసంబంధ కౌన్సిల్ (కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్) వల్జీబాయి పటేల్ మాట్లాడుతూ, చౌహాన్ నిజం చెప్పడం లేదని, అత్యాచారం చేసిన నిందితుడు ఎం.ఎల్.ఎ.కు బంధువని, ఆయననే ఆ లేఖ రాశాడని వ్యాఖ్యానించాడు.

ఇక ఈ కేసు నడిచిన, నడుస్తున్న తీరు కూడా ఆశ్చర్యకరంగానే ఉంది. హైకోర్టు ఆదేశం తర్వాత కూడా చార్జిషీటు తయారు చేయడానికి పోలీసులకు నెలరోజులు పట్టింది. ఏప్రిల్ 25, 1998న దాఖలు చేసిన చార్జిషీటులో కూడా నిందితుడి పేరును రమేష్ బరియాకు బదులుగా రమేష్ వాంకర్‌గా రాశారు. సంవత్సరం తర్వాత, కేసు నడుస్తున్న సందర్భంగా అమ్మాయి మైనర్ బాలిక కాబట్టి లోక్ అదాలత్‌లో సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని ఎడిషనల్ స్పెషల్ జడ్జ్ ఏప్రిల్ 14, 1999న ఉచిత సలహా ఇచ్చారు. దీనికి వాశ్‌రాం తిరస్కరించాడు.

అనేక మలుపులు తిరుగుతూ, ట్రయల్ కోర్టులో విచారణ పూర్తి అయిన తర్వాత మే 30, 2007న ఈ కేసుకు సంబంధించి మరొక కోర్టు ఎదురు చూస్తోందని భావించి, కేసుకు సంబంధించిన పేపర్లన్నింటినీ విచారణ అధికారికి పంపగా, ఆ విచారణ అధికారి ఆ పేపర్లను జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌కు పంపాలని సూచించారు. ఈ విధంగా ఎనిమిది సంవత్సరాలకు కేసు ముగిసి, నిందితుడికి ఏదో ఒక శిక్ష పడుతుందని భావించగా, అయిదు నెలలకు గాని కేసుకు సంబంధించిన పేపర్లను జుడిషియల్ మెజిస్ట్రేట్‌కు అక్టోబర్ 9, 2007న

పోలీసులు పంపలేక పోయారు. ఆ రోజు నుంచి ఈ కేసుకు సంబంధించిన విచారణ అలాగే కొనసాగుతున్నది.

ఈ కేసు ఎలా ముగుస్తుందో, నిందితుడికి ఎలాంటి శిక్ష పడుతుందో వేచి చూడాల్సిందే.

పైన ఉదహరించిన సంఘటనలను, కాలయాపన చేస్తున్న ప్రభుత్వ, పోలీసు, కోర్టుల వ్యవహారాలను చూస్తుంటే, విచారణ పేరున నిందితుల్ని రక్షించడమే ఏకైక లక్ష్యంగా కనపడుతోంది. అలాగే ఎఫ్.ఐ.ఆర్. నమోదు, సరియైన చట్టం కింద, సెక్షన్ల కింద కేసులను నమోదు చేయకుండా, నిందితులకు సులభంగా బెయిల్ దొరికే విధంగా చార్జిషీట్లను ప్రవేశపెట్టడం లాంటి తదితర కారణాలతో పాటు, దశాబ్దాల తరబడి కోర్టుల చుట్టూ బాధితులు, కుటుంబ సభ్యులు తిరగలేక, వాటికి తోడు ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సమస్యలు, ఇతర కుటుంబ సభ్యుల సహకారం లేకపోవడం, ఇలాంటి సంఘటనలతో కుటుంబాల పరువు పోతుందనే భావనతో బాధితులు కేసులు విరమించుకుంటారనే దుర్మార్గపు ఆలోచన పోలీసులకు, కోర్టులకు కూడా ఉండడంతో ఈ కేసులు తీవ్ర జాప్యానికి గురవుతున్నాయి.

దేశవ్యాప్తంగా అత్యాచారానికి గురైన వారు ఫిర్యాదు చేయడానికి వెనకాడడానికి కారణం వారిని నిందితుల బెదిరింపులేనని ఒక జాతీయ స్థాయి సర్వేలో తేలింది. 2001-09 మధ్యకాలంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో మహిళలపై జరిగిన అత్యాచార కేసులను పరిశీలించి, 72 కుటుంబాలను ఇంటర్వ్యూ చేయగా, దాదాపు 85 శాతం కుటుంబాలకు నిందితుల నుంచి, పోలీసు, రాజకీయ నాయకుల నుంచి బెదిరింపులు వచ్చాయని తెలిసింది. అందులో 76 శాతం మంది తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదని తెలపడం గమనార్హం.

నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్.సి.ఆర్.బి.) 2007 ప్రకారం దేశంలో జరుగుతున్న ప్రతి పది నేరాలలో ఏడు నేరాలు మహిళల పైననే జరుగుతున్నాయని తెలిపింది. వరకట్న హత్యలు, కుటుంబ హింస, మహిళలను, ఆడపిల్లల్ని కిడ్నాప్ చేయడం, బయటి దేశాలకు ఎగుమతి చేయడం, లైంగిక వేధింపులు, మానభంగాలు, అత్యాచారాలు ఇలా ఎన్నో రకాలుగా మహిళలపై నేరాలు జరుగుతున్నాయి.

రాథోడ్‌కు పెరిగిన శిక్ష కాలం

గత డిసెంబర్ 2009లో అతి స్వల్ప శిక్షతో (6 నెలలు) తీర్పు పొందిన మానవ మృగమైన హర్యానా మాజీ డిజిపి రాథోడ్, ఆ తీర్పును కూడా రద్దు చేయాలని జిల్లా సెషన్ కోర్టును ఆశ్రయించగా, ప్రజాగ్రహాన్ని గుర్తించిన కోర్టు ట్రయల్ కోర్టు విధించిన 6నెలల శిక్షను 18నెలల శిక్షగా మార్చడం కొసమెరుపు. ప్రస్తుతం రాథోర్ బురాలీ జైల్‌లో శిక్షను అనుభవిస్తున్నాడు. ఒకప్పుడు రాచ మర్యాదలు చేసి మెడల్‌తో సత్కరించిన ప్రభుత్వం కూడా రాథోడ్ నెలానెలా పొందుతున్న పెన్షనును నిలుపుదల చేయడం జరిగింది.

68 సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో బాధపడుతున్న రాథోడ్ శిక్షను పూర్తిగా రద్దు చేయాలని ఆయన పక్షాన వాదిస్తున్న ఆయన భార్య అభా తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే గత ఫిబ్రవరి 15న కేసును ఏప్రిల్ 5వరకు వాయిదా వేశారు. అలాగే రాథోర్‌పై అభియోగించబడిన మరో మూడు ఎఫ్ఐఆర్‌లను (సెక్షన్ 306 కింద) కూడా తొందరగా పరిశీలించాలని భావించిన కోర్టు జూలై 7 నుంచి ప్రతిరోజు వాదనలను వింటున్నది.

గత 20 సంవత్సరాలుగా తాను కోరుకున్నట్లుగా నడిచిన కేసు ఒక్కసారి తిరగ బడడంతో, కంగుతిన్న రాథోడ్ లొసుగులతో కూడుకున్న నార్కో పరీక్షలకు సిద్ధపడడం గమనార్హం. ఒకవైపు సుప్రీం కోర్టు నార్కో పరీక్షలు చట్టబద్ధం కావని ప్రకటించగా అదే పరీక్షకు రాథోర్ సిద్ధపడడంలోని ఆంతర్యాన్ని గుర్తించ వచ్చు! తాను తప్పు చేయలేదని నార్కో పరీక్షలో చెప్పి నిర్దోషిగా తప్పించుకోవాలనే ఆ పరీక్షకు రాథోర్ సిద్ధపడడం గమనార్హం.

కనీసం ఈ కేసైనా న్యాయబద్ధంగా నడిచి నిందితునికి తగిన శిక్షపడితే, మహిళలకు కొంత ఊరట కలుగుతుందని భావిద్దాం. 20 సంవత్సరాలుగా అనేక ఇబ్బందులనెదుర్కొంటూ కూడా ఈ కేసును నడిపిస్తున్న రుచికా స్నేహితురాలైన ఆరాధనా కుటుంబ సభ్యులకు ఇది ఘన విజయమే అవుతుంది.

(అయిపోయింది)

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు)

తమ పాలన తమ ఇష్ట ప్రకారమే జరగాలని కోరుకుంటున్నందుకు దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న కాశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని అంగీకరించడమే పరిష్కారమని అంటున్నారు **ఆకుల భూమయ్య**

స్వయం నిర్ణయాధికారమే పరిష్కారం

మళ్లీ ఒక నెలరోజులకు పైగా కాశ్మీర్ కల్లోలభరితమైంది. ప్రతీరోజూ కాల్పులు, చావులు, బంద్‌లు జరుగుతున్నాయి. జూన్ 11న సి.ఆర్.పి.ఎఫ్. బలగాలు నిరసన తెలుపుతున్న ప్రజలపై భాష్ప వాయుగోళం ప్రయోగించగా ఒక వ్యక్తి మరణించాడు. దానిపై న్యాయ విచారణకు డిమాండ్ చేసిన ప్రజా సమూహంపై లాఠీఛార్జిలు, కేసులు, అత్యాచారాలు మామూలుగానే చోటు చేసుకున్నాయి. ఈ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం రోడ్ల మీదకు రావడం నిత్యకృత్యమైంది. గత రెండేళ్లకు పైగా కేంద్రం, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వాలు కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, దానికి తమ ప్రభుత్వాల పనితీరే కారణమని, ఇక పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా చొరబాట్లు అరికట్టినట్లయితే కాశ్మీర్ మళ్లీ భూతల స్వర్గమవుతుందని గొప్పలు చెప్పుకున్నారు. కాని కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యాకాంక్షలు, జాతి స్వయం నిర్ణయాధికారం కోసం వాళ్లు అరవై ఏళ్లుగా చేస్తున్న పోరాటం నివురుగప్పిన నిప్పులా ఉందని పాలకులు అంచనా వేయలేకపోయారు. ముఖ్యంగా కేంద్ర రక్షణ బలగాలు జరిపే ఆకృత్యాలు, అత్యాచారాలు తాజాగా కాశ్మీర్ కల్లోలానికి కారణమైనాయి. చివరికి మళ్లీ సైన్యాన్ని దించాల్సి వచ్చింది. కాశ్మీర్ ప్రజల ఆక్రోశం వెల్లువెత్తింది. నిత్యం పోలీసు, పారా మిలిటరీ బలగాల నీడలో జీవించాల్సి రావడం జమ్మూకాశ్మీర్ ప్రజలు అంతులేని విషాదంగా భావిస్తున్నారు.

ఈ సంవత్సరం ప్రారంభంలో సరిహద్దు రేఖ వద్ద గల షోఫియాన్‌లో ఇద్దరు మైనర్ బాలికలను సి.ఆర్.పి.ఎఫ్ బలగాలు అత్యాచారం జరిపి హత్య చేశాయని వార్తలు వచ్చాయి. ఆ తరువాత ముగ్గురు యువకులను ఎన్‌కౌంటర్‌లో చంపి, చొరబాటుదార్లుగా, తీవ్రవాదులుగా ముద్రవేశారు. ఒక యువకున్ని కాల్చి చంపమని పారా మిలిటరీ పోలీసు బలగాల అధికారి తన కింది అధికారికి ఉత్తర్వులిచ్చినట్లు తేలింది. ఇవన్నీ కూడా కాశ్మీర్ అంతటా తాజాగా అల్లర్లకు కారణమయ్యాయి. సహజ రీతిలోనే ప్రభుత్వం ఎంక్వైరీకి వేశామని చెప్పి తప్పించుకోచూసింది. కాని ఎక్కడికక్కడ పోలీసు, సి.ఆర్.పి.ఎఫ్., పారా మిలిటరీ బలగాలు క్యాంపులు వేసి ఉండగా యుద్ధభూమిని తలపించడమే కాక, ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఈ విషయంలో ఇపుడు జరుగుతున్న విషయాలు విశ్లేషించే ముందు 1999లో మా బృందం శ్రీనగర్‌తో సహా కాశ్మీర్‌లో ఎన్నికల సందర్భంగా పర్యటించినపుడు అక్కడి ప్రజలతో మేం మాట్లాడినపుడు సమస్య పరిష్కారానికి వాళ్లు చూపించిన మార్గాలు అందర్నీ ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా వాటిని జ్ఞాపకం చేసుకోవడం సందర్భోచితంగా ఉంటుందని భావిస్తున్నాను.

కాశ్మీర్‌లో 30 రూపాయలకు డబ్బా ఆపిల్స్ కొని ఢిల్లీలో 250 రూపాయలకు అమ్ముతున్నారు. లెదర్ జాకెట్లు, శాలువాలు మొదలైన వాటిని అతి చవకగా శ్రీనగర్‌లో కొని దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముకొని లాభాలు గడిస్తున్నారు. ఇక్కడ పుష్కలంగా లభించే నాణ్యమైన దేవదారు లాంటి కలపను స్మగ్లింగ్ చేసి మా వనరులను దోచుకుపోతున్నారు. ఈ పై వ్యాపారాల్లో ఢిల్లీ తదితర ప్రాంతాల వాళ్లు మాత్రమే గుత్తాధిపత్యం వహిస్తున్నారు. కాశ్మీర్‌లోగల పేదల బతుకులు బాగు పడాలంటే ఈ వనరుల దోపిడీ తక్షణమే ఆపి రాజకీయ పరిష్కారం కనుగొనాల్సి ఉంటుందని అన్నారు.

శ్రీనగర్‌కు 10 కిలోమీటర్ల దూరంలో గల ఒక గ్రామంలో ఒక డాక్టర్‌తో మాట్లాడినపుడు ఆయన సూటిగా ఒక ప్రశ్న భారత ప్రభుత్వానికి వేశాడు. కాశ్మీర్‌ను భారతదేశంలో భాగమని ప్రభుత్వం చెబుతోంది. ఆ మాటల్లో నిజాయితీ ఉన్నట్లయితే సరిహద్దుల్లో సైన్యాన్ని ఉంచాలిగాని దేశ పౌరుల మధ్య ఇంత సంఖ్యలో రక్షణ బలగాలను ఎందుకు ఉంచాలి. కాశ్మీర్‌లో ఆయన చెప్పిందాని ప్రకారం పోలీసులు, ప్రజలు 1:8లో ఉన్నారు. మేం భారత్‌లో భాగం అనుకుంటే మమ్మల్ని రక్షించడానికి చర్యలు తీసుకుంటారు గాని అణచివేత పై ఇంత ఖర్చులెందుకు పెడ్తారు? కాశ్మీర్‌కు కేటాయించే బడ్జెట్ రక్షణకే 80 శాతం పోతుంది. 20 శాతం దళారీల జేబుల్లోకి పోతుంది. నిరుద్యోగం పెరిగిపోయింది. విద్య, వైద్య సౌకర్యాలు ఏమాత్రం పెరగలేదు. జీవన ప్రమాణాలు గణనీయంగా తగ్గాయి. ఆత్మగౌరవం దెబ్బతిన్నది. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగ యువత తప్పక ప్రత్యామ్నాయం ఎంచుకుంటుంది గదా! దానికి ఎవరిది బాధ్యత అని అడిగాడు.

ఆ డాక్టర్ తండ్రి ఒక కాలేజీ ప్రిన్సిపాల్. డాక్టర్ తమ్ముడిని 1994 ప్రాంతంలో హిజ్బుల్ ముజాహుదీన్‌లో సభ్యుడిగా పని చేస్తున్నాడని ఇంటికొచ్చి పోలీసులు బెదిరించేవారట. తర్వాత అతన్ని అరెస్ట్ చేశామని చెప్పారట. చూపించమని తండ్రి అడిగితే తిప్పి తిప్పి చివరకు ముఖం చాటేశారట. ఆ తండ్రి ఎందరికి మొరబెట్టుకున్నా ఏమీ కాలేదు. ఆ బెంగతో తండ్రి చనిపోయాడు. వాస్తవానికి భారత రాజకీయ నాయకులు కాశ్మీర్‌ను అభివృద్ధి చేసి ఉంటే, లేదా కనీస మానవ హక్కులు హరించకుండా ఉంటే, 1950–60 దశకాల మధ్యలో

రెఫరెండం పెట్టి ఉంటే పాకిస్తాన్ కన్నా భారత్‌లోనే ఉండడానికి అత్యధికులు అంగీకరించేవారు. ఈ అణచివేత కారణంగా, చిత్రహింసల కారణంగా, నిరుద్యోగం – పేదరికం కారణంగా భారత్ అంటే అసహ్యం ఏర్పడిందని బాధతో చెప్పాడు. అలా అని పాకిస్తాన్ అంటే ఎవరికీ పెద్దగా అభిమానం గాని, ఆశలు గాని లేవన్నాడు. అంటే పెచ్చు పెరిగిన దమనకాండ, విచక్షణారహిత దోపిడీ కాశ్మీర్ ప్రజలను భారత్‌కు దూరం చేసిందనేది ఆ డాక్టర్ గారి ప్రగాఢ విశ్వాసం. ఆనాటికే కాశ్మీర్‌లో సగటున కుటుంబానికొక్కరు చొప్పున రక్షణ బలగాల చేతుల్లో హతమయ్యారని చెప్పాడు.

చాలా గ్రామాల్లోనయితే ఇప్పటికీ 'రాయిసమర్' (ప్లెబిసైట్) కావాలంటున్నారు. ఆజాదీ తప్ప వేరే మార్గం లేదని కాశ్మీర్ ప్రజలు జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ఎలుగెత్తి చాటుతున్నారు. 1999 లోక్‌సభల ఎన్నికల పోలింగ్ రోజు హురియత్ కాన్ఫరెన్స్ బంద్‌కు పిలుపునిచ్చింది. సోపోర్ దగ్గరి ఒక గ్రామంలో జావెద్‌మీర అనే 17 ఏళ్ల జూనియర్ ఇంటర్ విద్యార్థి పొరపాటున ఇంటిలో నుండి వీథిలోకొచ్చాడు. పోలీసులు అతన్ని ఓటు వేస్తావా అని అడిగారు. తనకు ఓటు హక్కు లేదని అతని సమాధానం – అయితే ఇంట్లోకి వెళ్లమని పోలీసుల ఆజ్ఞ – ఆ విద్యార్థి వెనుతిరిగి ఇంటికి పోతుండగా వెనుక నుంచి కాల్పులు – ఆ యువకుని మరణం. దీనికి కారణమెవరు? ప్రజలంతా రోడ్ల మీదకు రావడంతో పోలీసులు, పారా మిలిటరీ బలగాలు ఎన్నికల డ్యూటీని వదిలి ఫరార్. ఇదీ పరిస్థితి. హురియత్ కాన్ఫరెన్స్ బందుకు పిలుపిచ్చింది గాని పోలీసులు మాత్రం కర్ఫ్యూను ఆ యువకుడు ధిక్కరించినట్లు భావించారు. ఎన్నికల రోజు ఓటర్లు తప్ప ఇతరులు తిరగకూడదా? అంటూ ప్రజలు వేసిన ప్రశ్నలకు నాటి ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా వద్ద జవాబు లేదు. అంతకు ముందే స్వయంగా ఫరూక్ అబ్దుల్లా గారే మిలిటెంట్ల భయానికి ఎవరూ ఓటు వేయడం లేదని తెలుస్తున్నది, అలా అయితే ఓటు వేయించుకోవడానికి తాము కూడా బల ప్రయోగం చేస్తామని బాహాటంగా ప్రకటించాడు. అందులో భాగంగానే జావెద్‌మీర్ లాంటి యువకుల హత్య అంటూ ఆనాడు ప్రజలు తీవ్రంగా నిరసన తెలిపారు.

పదకొండు సంవత్సరాల తరువాత కూడా కాశ్మీర్‌లో పరిస్థితి ఏమీ మారలేదనే అనిపిస్తుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పరిస్థితులు ఎంతో మెరుగు పడ్డాయని చెప్పడం హాస్యాస్పదం. 2008 ఎన్నికల్లో 60 శాతం పైగా పోల్ అయిందనేది పరిస్థితులు మెరుగు పడ్డాయనడానికి ప్రభుత్వం చూపే తార్కాణం. ప్రజలు గత రెండు సంవత్సరాలుగా సాపేక్షికంగా శాంతితోనే ఉన్నారని ప్రభుత్వమే చెపుతున్నప్పుడు మరి షోఫియన్ ఘటనలు జరగడానికి రక్షణ బలగాలు కారణమైనపుడు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వాని కేమొచ్చింది. అంటే ప్రభుత్వాన్ని రక్షణ బలగాలు నడుపుతున్నాయా? ఉమర్ అబ్దుల్లా నడుపుతున్నాడా?

కాశ్మీర్‌లో స్త్రీలపై అత్యాచారాలు చేసేది పోలీసు బలగాలు. దానికి నిరసన తెలిపితే కాల్పులు – అందులో కొందరి మరణాలు. సరిహద్దు రేఖ వద్ద ముగ్గురు యువకుల ఎన్‌కౌంటర్, వారు మామూలు పౌరులేనని తేలిం తర్వాత ప్రజలు నిరసన తెలిపితే కాల్పులు లేదా కర్ఫ్యూలు. కర్ఫ్యూ సమయంలో కూడా నివాసాల్లో కాల్పులు – దానికి నిరసన తెలిపితే మళ్లీ కాల్పులు. ప్రభుత్వం మాత్రం ఎల్లప్పుడూ రక్షణ బలగాల కొమ్ముకాయడమే. గత నెల రోజులకు పైగా ఇప్పటికే ఇరవై మందికి పైగా చనిపోయారు. అందులో ఒక తొమ్మిది సంవత్సరాల ఆసిఫ్ అనే బాలుడు కూడా చనిపోయాడు. దూరం నుండి చూస్తున్న ఒక మహిళను గురి చూసి కాల్చారని ఆరోపణ. మరొక బాలుడు పోలీసులు వెంట పడితే పోయి కాల్వలో పడి మరణించాడు. దానికి ప్రజలు నిరసన తెలిపితే మళ్లీ కాల్పులు, కర్ఫ్యూలు. ప్రభుత్వం ప్రజల్ని సంయనం పాటించమంటుంది. కేంద్ర ప్రభుత్వం, హోంమంత్రి చిదంబరం బయటి శక్తుల ప్రమేయంతోనే ఇదంతా జరుగుతోందంటాడు. పాకిస్తాన్ హస్తాన్ని తోసివేయలేమని మన్మోహన్‌సింగ్ అంటాడు. ఇదీ మన పాలకుల ధోరణి. పోలీసు, పారా మిలిటరీతో పని కావడం లేదు కాబట్టి మళ్లీ సైన్యం కవాతులు. ఇవాళ కాశ్మీర్‌లోని సోపోర్, శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్ లాంటి ముఖ్య పట్టణాలలో సైన్యం కవాతు చేస్తోంది. త్వరలోనే సైన్యాన్ని ఉపసంహరించగలమని ఉమర్ అబ్దుల్లా అంటున్నా ఆయన చేతిలో ఏమీ లేదని తెలుస్తూనే ఉంది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్‌ను సవరించడానికి జనరల్ వి.కె. సింగ్ ఒప్పుకోడు. అంటే వారికి అరవై సంవత్సరాల తర్వాత కూడా సైనిక పరిపాలన జరిపేటట్టయితే ప్రజాస్వామ్యమనే పేరెందుకు మన రాజ్య వ్యవస్థకు. పాకిస్తాన్‌ను దారి తెచ్చేందుకు అక్కడి ప్రధాని కాదు జనరల్ ఫర్వేజ్ కయానితో మాట్లాడాలని మన మధ్యతరగతి మేధావులు అంటుంటే ఇక రెండు దేశాల సైనికాధికారులు మన దేశ భవిష్యత్తుని నిర్ణయించాలన్న మాట. ఇదీ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే మన పాలకుల నీతి, రీతి. ప్రధాని మన్మోహన్ సింగ్‌కు గ్రోత్‌రేట్ తప్ప ఏమీ కనపడదు. రాహుల్‌ను ప్రధాని చేయడమనే మిగిలిన ఆశయాన్ని పూర్తి చేయడమే ఆయన పని.

1947 అక్టోబర్‌లో కాశ్మీర్ లోని భారత సైన్యాలు ప్రవేశించినపుడు శాంతి పునరుద్ధరణ తర్వాత ప్లెబిసైటు పెట్టి ప్రజాభిప్రాయం మేరకు వ్యవహరిస్తామని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హామీనిచ్చాడు. ఆ మేరకు నెహ్రూ యు.ఎన్.ఒ.లో కూడా ప్రకటన చేశాడు. అది ఐక్య రాజ్య సమితి పరిశీలనలో ఉండగానే షేక్ అబ్దుల్లాతో ఒప్పందం కుదుర్చుకొని కాశ్మీర్ ప్రధానిగా గుర్తించాడు. తర్వాత ఆ ఒప్పందాన్ని కాలరాయడానికి ప్రయత్నాలు ప్రారంభించి బక్షి గులాం మహ్మద్‌ను ఎగదోశారు. అలా కాశ్మీర్‌లో అనవసర, అనుచిత జోక్యం చేసుకుంటూ పెత్తందారీగా వ్యవహరించిన నెహ్రూ ప్రభుత్వం – తర్వాత ఇందిరాగాంధీ ఆధ్వర్యం

ఆదిమ సమాజంలో మతం సామూహిక భావనగా ఉండేదనీ, అవి వారి జీవితాల్లో చాలా ముఖ్యమైన పాత్ర వహించేదనీ అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

ఆదిమ మతాల లక్షణాలు

తొలి మానవజాతులు తెగలుగా, చిన్నచిన్న ముఠాలుగా జీవించేవారని మనకు తెలుసు. అప్పటి సామాజిక జీవితం ఎలా ఉండేది? అందరికీ వర్తించే తాత్వికభావాలు ఎప్పుడు, ఎలా మొదలై ఉంటాయి? ఇలాంటి ప్రశ్నలకు మాత్రం స్పష్టమైన జవాబులు దొరకవు. అక్కడా, ఇక్కడా అరుదుగా దొరికే కొన్ని శిలాజాలూ, అప్పటి ప్రజలు వాడి, వదిలి వెళ్లిన వస్తువుల అవశేషాలూ, గుహల గోడల మీద వారు గీసిన బొమ్మలూ, ఇటువంటి ఆధారాలతో అప్పటి ప్రజల జీవితాల భౌతిక లక్షణాలు కొంతవరకూ తెలుస్తాయి. వారి మేధోజీవితాల గురించి తెలిపేవన్నీ పరోక్షమైన ఆధారాలే. ఇవికాక, నేటికీ ప్రాచీన పద్ధతుల్లోనే జీవితాలు గడుపుతున్న కొన్ని ఆదిమ తెగలు అక్కడక్కడా కనిపిస్తాయి. వారి ఆచారాలూ, వారు జరిపే తంతులూ వారి మనోభావాలనే కాక, తొలి మానవసముదాయాల్లో మొదలైన కొన్ని ధోరణులను కూడా ప్రతిఫలిస్తాయని పరిశీలకులు భావిస్తారు.



ఒడిశా తెగ స్త్రీల సామూహిక నృత్యం

లోని ప్రభుత్వాలు కాశ్మీర్ సమస్యను జటిలం చేశాయి. కాశ్మీర్ ప్రజల అభిప్రాయాలు ప్రతిబింబించే నాయకులను కాకుండా ఢిల్లీ నుండి నాయకుల నియామకాలు, తొలగింపులు ప్రారంభించారు. అలాంటి చదరంగపు పావుల కదలికలో భాగంగా చివరికి ఫరూఖ్ అబ్దుల్లా ముఖ్యమంత్రయ్యాడు.

1989 ఎన్నికల సందర్భంగా జరిగిన రిగ్గింగ్ – ఫలితాలు తారుమారు చేసిన తర్వాత కాశ్మీర్ యువత సాయుధ పోరాటానికి దిగింది. జె.కె.ఎల్.ఎఫ్. నాయకత్వంలో ప్రారంభమైన పోరు ప్రజల భాగస్వామ్యంతో, మద్దతుతో లోయ అంతటికీ పాకింది. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై భారత్, పాకిస్తాన్‌ల జోక్యం లేకుండా జమ్మూకాశ్మీర్ ప్రజలు తమ స్వయం నిర్ణయాధికారం కోసం పోరాటం జరుపుతూ వచ్చారు. ఆ క్రమంలోనే జె.కె.ఎల్.ఎఫ్. నాయకుడు మఖ్బుల్ భట్‌ని ఇందిరాగాంధీ ప్రభుత్వం ఉరి తీయించింది. కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కావాలని ఫరూఖ్ అబ్దుల్లా ఇప్పటికీ అంటుంటాడు అధికారంలో లేనపుడు. 2000లో ఎన్.డి.ఎ. ముందు ఈ ప్రతిపాదన పెట్టి కాశ్మీర్ ప్రజల, రాజకీయ పార్టీల మద్దతు కోరాడు.

ఆజాదీ కోసం, రాయ్‌సుమర్‌ను డిమాండ్ చేసే పార్టీలు, సంస్థలు కలిసి ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్‌గా ఏర్పడి స్వయం నిర్ణయాధికారం రెండు దశాబ్దాలుగా పోరాడుతున్న కాశ్మీర్ ప్రజలకు భారతదేశంలోని సిసలైన ప్రజాస్వామికవాదులు మద్దతు తెలుపుతున్నారు.

నేడు కాశ్మీర్ ప్రజలు ఏం కోరుతున్నారనేది చాలా ముఖ్యం. కాశ్మీర్ ప్రజల అభిప్రాయాలు, మనోభావాల కోసం ఇప్పటికైనా ప్లెబిసైట్ పెట్టడం వలన సరియైన నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుంది. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ నుండి పాకిస్తాన్, భారత్ ఆక్రమిత కాశ్మీర్ నుండి భారత్ తమ రక్షణ బలగాలను వెనక్కు తీసుకొని తమ జాతి స్వయం నిర్ణయాధికారం తమకు దఖలు పరచాలని, రెండు దేశాలకు మధ్య బఫర్ స్టేట్‌గా తాము ఉంటామని కాశ్మీర్ ప్రజలు తెలుపుతున్నారు. సరిహద్దుల రక్షణకు అవసరమైతే దామాషా సంఖ్యలో పాకిస్తాన్, భారత్ సైన్యాలు అఫ్ఘాన్, చైనా తదితర మధ్య అసియా దేశాల హద్దుల్లో కాపలా కాయవచ్చునని, కాశ్మీరీలు కోరుకుంటున్నారు. తక్షణమే భారత్ తన పారా మిలిటరీ బలగాలను, సైన్యాలను కాశ్మీర్ నుండి ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

జాతులకు స్వయం నిర్ణయాధికారం అనే భావన గత రెండు శతాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ నాగరిక సహజ న్యాయ సూత్రం. దాన్ని పాటించకుంటే కాశ్మీర్‌తోపాటు మన దేశం కూడా నిత్యం కల్లోల భరితం కావాల్సిందే.

ఇప్పటికైనా పాలకులు బుద్ధితెచ్చు కోవాలని, కాశ్మీర్ ప్రజలు స్వయం నిర్ణయాధికారం చేస్తున్న పోరాటాలు విజయవంతం కావాలని ఆశిద్దాం.

(రచయిత తెలంగాణ ఉద్యమ నాయకులు) వీ

ఆదిమ మానవ సముదాయాల్లో మొదలైన మతభావనలు ప్రాథమికమైనవనే అభిప్రాయం ఉంది. అయితే ఇది నిజం కాకపోవచ్చునని పసిఫిక్ దీవులలోనూ, అమెరికాలోనూ, సహారా ఎడారికి దక్షిణానా కొన్ని తెగలపై జరిపిన పరిశీలనలవల్ల తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే ప్రాచీన మతాల్లోని కొన్ని అంశాలు జటిలంగా ఉండేవనీ, ప్రజల జీవితాల్లో ముఖ్యపాత్ర వహించేవనీ అంటున్నారు. ఇటువంటి పరిశీలనలు యూరప్‌కు దూరంగా ఉన్న ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అమెరికా, దక్షిణ పసిఫిక్ తదితర ప్రాంతాల్లో పదిహేడో శతాబ్దంలోనే మొదలయాయి. వీటిద్వారా వేల సంవత్సరాల క్రితం మనుషులకు ఎటువంటి తాత్విక దృక్పథం ఉండేదో ఊహించే ప్రయత్నాలు జరిగాయి.



ఆఫ్రికా ఆదిమతెగలు యువకుడిపై జరిపే తంతు

ఆ కాలపు ప్రజలకు వస్తుగత, వ్యక్తిగత యథార్థాల మధ్య వ్యత్యాసం తెలిసేది కాదనే ఒక దృక్పథం టైలర్ (1832-1917) తదితర శాస్త్రవేత్తలకు ఉండేది. వారి లెక్కన తొలి మానవజాతులకు ప్రకృతిశక్తుల 'అదృశ్యహస్తం' మీదా, గారడీలోనూ తప్పుడు నమ్మకం ఉండేది. నిద్రలో కన్న కలలవల్లనో ఏమోగాని అప్పటివారు శరీరాలకు అతీతమైన ఆత్మవంటిదేదో ఉందని భావించసాగారు. జంతువులను ఆరాధించడం, కళ్లకు కనబడే చెట్లూ, పుట్టలూ, రాళ్లలాగే అతీతశక్తులుకూడా వాస్తవమైనవేనని నమ్మడం ఆ రోజుల్లో మొదలైందని కొందరు శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. మరొకవంక కాడ్రింగ్టన్ (1830-1922)వంటి పరిశీలకులు దక్షిణపసిఫిక్ ప్రాంతంలో అధ్యయనాలు జరిపి, ఆదిమ మత భావనలకు కారణం అప్పటి మనుషుల మనస్తత్వాన్ని ప్రకృతిశక్తులు బలంగా ప్రభావితం చెయ్యడమేనని అన్నారు. ఇటువంటి భావాలు ప్రస్తుతకాలంలో తర్కబద్ధంగా అనిపించనప్పటికీ అప్పటి ప్రజల మానసికపరిస్థితి ఇప్పటితో పోలిస్తే భిన్నంగా ఉండేదని వీరు భావించారు. మరొకరకం విశ్లేషణ చేసినవారు ఆదిమయుగంలో మొత్తం సమాజాన్నీ, దాని నిర్మాణాన్నీ ఆరాధించే వైఖరి ఉండేదని అభిప్రాయపడ్డారు. ఆదిమ మత చిహ్నాలన్నీ అప్పటి ప్రజల సామూహిక వ్యవస్థకు ప్రతిబింబాలేననీ, వారందరినీ కలిపి ఉంచేందుకు పనికివచ్చిన సాధనాలనీ భావించారు. ఇలా అనేకమంది విశ్లేషకులు ఆదిమ మతాల పరిణామాలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు.

ఏది ఏమైనప్పటికీ ఆదిమయుగపు ప్రజలు తమ జీవితానుభవాలకు ఇప్పటికన్నా భిన్నమైన పద్ధతుల్లో స్పందించేవారనేది స్పష్టమే. వారికి తెలివితేటలు తక్కువగా ఉండేవనిమటుకు అనుకోరాదు. తెలివి



ఆస్ట్రేలియా ఆదిమతెగ యువకులతో జరిపే తంతులు

విషయంలో అప్పటికీ, ఇప్పటికీ చెప్పుకోదగిన తేడాలేవీ లేవనీ, రోజువారీ జీవితంలో ఎదురయే వస్తువుల, సంఘటనలతో మాత్రం వారి సంబంధాలు వేరుగా ఉండేవనీ అందరూ అంగీకరిస్తారు. అప్పటి తంతులూ, ఊహాపోహలూ, వ్యక్తుల మధ్య సంబంధాలూ అన్నీ ఈ భిన్నమైన ధోరణులనే సూచిస్తాయి. ఆదిమసంస్కృతులు ప్రకృతి విశేషాలను ఇప్పటికన్నా సులువుగా, నేరుగా అనుభవించి, ఆమోదించే వైఖరి కలిగి ఉండేవి. ప్రకృతి అనేది వారికి ఒక పవిత్రమైన వాస్తవికతగా కనిపించేది. ప్రపంచపు వింతలన్నీ దీన్నే ద్యోతకం చేసినట్టుగా అప్పటి ప్రజలు భావించారు. అటువంటి పరిపూర్ణమైన అనుభవంలో తర్కానికీ, మానసిక భ్రాంతి గురించిన సందేహాలకూ చోటుండదు.

ప్రకృతి విశేషాలకు తమదైన పద్ధతిలో స్పందించిన ఆదిమ జాతి వారు కొన్ని అభూతకల్పనలను సృష్టించుకున్నారు. వీటిలో వారి మతవిశ్వాసాల ప్రతీకలు అనేకం కలిసి, ఒక సమాహారంగా ఉండేవి. అవన్నీ అప్పటి తంతుల్లో భాగాలు. ఈ తంతులు ఎక్కువగా దేవతల శ్రేయస్సును కోరేవిగానో, చెడును సామూహికంగా నివారించేవి గానో, ప్రజల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రయత్నాలుగానో ఉండేవి. ఈ తంతుల్లో కొన్ని ప్రత్యేక సందర్భాలతో ప్రమేయం కలిగినటు వంటివి. పిల్లలు పుట్టడం, యుక్త వయస్సుకు చేరుకోవడం, పెళ్లిళ్లూ, చావులూ ఇలా జీవితంలోని ముఖ్యఘట్టాలకు సంబంధించిన అనేక తంతులను



ఆస్ట్రేలియా ఆదిమతెగ యువతుల తంతులు

అప్పటివారు జరిపేవారు. తెగలనుబట్టి వీటి ప్రాముఖ్యతలో హెచ్చు తగ్గులుండేవి. ఉదాహరణకు ఈనాటికీ న్యూగినీ, ఇండోనేషియా తదితర ప్రాంతాల్లో చావుకూ, అంత్యక్రియలకూ ఉన్నంత ప్రాధాన్యం పుట్టినప్పుడు చేసే తంతులకు ఉండదు. పసిఫిక్ తెగల్లో మటుకు చావుకన్నా పుట్టుకలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

ఆదిమతెగలన్నిటిలోనూ పిల్లలు యుక్తవయస్సుకు వచ్చిన సందర్భాల్లో ప్రత్యేకతంతులు జరుపుతారు. ముఖ్యంగా యువకుల విషయంలో సున్తీవంటివి జరపడం వీటిలో భాగంగా ఉంటుంది. ఇతర సందర్భాల్లో వేటాడి, ఏరుకుతినే తెగల్లో ఒక రకం తంతులూ, వ్యవసాయం చేసుకునే తెగల్లో మరొకరకం తంతులూ కనిపిస్తాయి. కొత్త ఏడాది మొదలైనప్పుడూ, నాట్లు వేసే తరుణంలోనూ 'నేలతల్లి' సారవంతం కావాలని ఆకాంక్షించే తంతులు జరుపుతారు. అలాగే క్షామమూ, యుద్ధాలూ, కొట్లాటల సమయంలో కొన్ని ప్రత్యేకంగా జరిపే తంతులుంటాయి. దైవికశక్తులను శాంతపరిచేవీ, సంతోషపెట్టేవీ, ఏ శక్తి ఎటువంటి చర్యలకు పాల్పడుతోందో తెలుసుకోగోరేవీ ఇలా వేరువేరు తంతులుంటాయి. ఈ తంతులన్నీ నిర్దిష్టమైన పద్ధతుల్లో నిర్వహించబడతాయి. అందరూ సామూహికంగా పాల్గొనేవి ఉంటాయి కాని కొన్ని మాత్రం కొందరికే పరిమితం. ఉదాహరణకు యుక్తవయస్సు వచ్చినప్పుడు యువకులకూ, యువతులకూ వేరువేరు తంతులుంటాయి. అలాగే వేటగాళ్లూ, యోధులూ, కమ్మరులూ, గారడీవారూ ఎవరికివారుగా పాల్గొనే ప్రత్యేక తంతులు కనిపిస్తాయి.

అప్పటి సమాజంలో వ్యక్తులకు ఈనాటి పద్ధతిలా ఏకాంత భావన ఉండేది కాదేమో. సమాజ శ్రేయస్సు పూర్తిగా సామూహిక భావనల మీద ఆధారపడి ఉండేది. మన దేశపు బస్తర్, లంబాడీ, ఈశాన్య ప్రాంతాల తెగలూ ఇలా ఎక్కడ చూసినా స్త్రీలూ, పురుషులూ అక్షరాలా చేతులు కలిపి చేసే నృత్యాలు కనిపిస్తాయి. ఐకమత్యం అనేది ఒక ఆదర్శవంతమైన భావనగా కాక మనుగడకు అత్యవసరమైన ఒక సాధనంగా ఆదిమతెగలకు పనికొచ్చి ఉంటుంది. తొలి మతవిశ్వాసాలు కూడా ఈ సామూహిక శ్రేయస్సునే ఆకాంక్షించేవిగా ఉండేవి. సమాజంలో భాగం కానటువంటి వ్యక్తుల మనుగడే ప్రశ్నార్థకంగా ఉండేది. వెలి వెయ్యడమనేది చావుకు కారణం అయేది. అందువల్ల అప్పటి తాత్వికధోరణి కూడా స్వార్థపూరితమైన వ్యక్తిగత పద్ధతిలో కాక, మొత్తం సమాజాన్నీ, దాని మంచినీ పరిగణించే వైఖరి కలిగి ఉండేదని సులువుగా ఊహించవచ్చు.


రష్యాలో షామాన్ విధులను నిర్వర్తిస్తున్న స్త్రీ (1908నాటి ఫోటో ఆధారం)

ప్రాణికోటిలో మానవజాతి స్పష్టంగా రూపుదిద్దుకుని, తనదైన ప్రత్యేక పద్ధతిలో మేధో జీవితాన్నీ, సామూహిక జీవనాన్నీ అవలంబించిన తరవాత ఆదిమానవులకు ప్రకృతిని పరిశీలించడం, తద్వారా ఒక తాత్విక చింతన రూపొందడం వగైరాలన్నీ జరిగాయి. మనుషులకు అతీతమైన దైవికశక్తుల గురించిన భావనలు కూడా తలెత్తాయి. ఈ దేవతలు ఎటువంటివారనేది స్థలాన్నిబట్టీ, కాలాన్నిబట్టీ ఉండేది. అన్ని చోట్లా ఒకేరకమైన ఆరాధన జరగలేదు.

మనుషులకు నిత్యమూ కనిపించే భూమీ, ఆకాశాల్లో వారికి అందనిది ఆకాశమే కనక మొదటి నుంచీ ఆకాశం అనేదేదో లోకోత్తరమైనదీ, అందుకోలేనంత శ్రేష్ఠమైనదీ అనే భావనలు ఏర్పడ్డాయి. దైవిక శక్తులంటూ ఉంటే అవి అలవికానంత ఎత్తున ఆకాశంలోనే ఉండి ఉండాలనే భావం సహజంగా తలెత్తింది. అలాగే సూర్యచంద్రులను దేవతలుగా ఆరాధించడం కూడా మొదలయింది. వీటిలో సూర్యుడు సృష్టికీ, ఎదుగుదలకూ కారకుడుగా గుర్తింపును పొందాడు. శక్తికీ, బలానికీ ప్రతీక అనిపించే సూర్యుడితో పోలిస్తే చంద్రుడి గురించిన భావనల్లో స్త్రీ లక్షణాలను ఆపాదించడం ఉండేది. నిత్యమూ పెరిగి, తరుగుతూ ఉండే కళల కారణంగా చంద్రుడు జీవితంలోని ఎత్తుపల్లాలను ప్రతిబింబిస్తున్నట్టుగా అనిపించేదేమో.


ఫ్రాన్స్‌లోని లాస్కో గుహలోని చిత్రం

ఆకాశంకాక ప్రకృతిలోని ఇతర విశేషాలు కూడా మనుషులకు అతీతశక్తులకు ఆధారంగా అనిపించాయి. వీటిలో వానలూ, కార్చిచ్చూ, నీరూ, వృక్షాలూ, శిలలూ, పర్వతాలూ, నదులూ, వ్యవసాయానికి సంబంధించినవీ, లైంగిక సంబంధం కలిగినవీ అనేకం ఉండేవి. వేట, ఏరుకు తినడం ఆధారంగా జీవించిన తెగల తంతుల్లో అటువంటి జీవితపు ప్రతీకలే ఉండేవి. ఆఫ్రికాలోని పిగ్మీలూ, కలహారీ ఎడారి ప్రాంతపు తెగలూ, ఆస్ట్రేలియా ఆదిమజాతులూ, ఎస్కిమోలూ మొదలైనవారు ఇప్పటికీ ఈ వైఖరిని ప్రదర్శిస్తారు. వేటతో ప్రమేయం ఉన్న దేవీదేవతలు మనుషులనూ, జంతువులనూ సృష్టించి, వాటిని కాపాడుతూ, మనుషులకు వేటమృగాలను సరఫరా చేస్తారనే నమ్మకం వీరిలో కనబడుతుంది.

తొలి వ్యవసాయ సమాజాల్లో మటుకు మరికాస్త సంక్లిష్టమైన మతధోరణి కనిపిస్తుంది. ఇందులో మాతృస్వామ్య లక్షణాలుండేవి. లోకానికి ఉండే పవిత్రత అంతా స్త్రీల సంతాన సాఫల్యంలో ప్రతిఫలిస్తున్నట్టుగా వారు భావించారు. పంటచేలకు సంబంధించిన తంతులన్నీ మొలకెత్తడం, పెరిగి ఫలవంతం కావడం, చచ్చిపోవడం మొదలైన దశలన్నిటినీ బలవత్తరంగా ప్రతిబింబించేవి. ప్రతిచోటా మాతృస్వామ్యమే ఉండేది కాదు. అయితే పురుషులకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ స్త్రీ అంశం తప్పనిసరిగా ఉండేది. పశ్చిమ ఆఫ్రికా తెగలవంటివాటి మతతత్వంలో మూడు రకాల అంశాలు కనబడ్డాయి. వీటిలో అన్నిటి కన్నా ప్రాచీనమైన అమ్మతల్లి, లేదా రాజమాత అంశనూ, దానితోబాటుగా ఆ తరవాతిదైన రాజుల చిహ్నాలనూ, ప్రపంచసృష్టికి కారణమైన అండపు ప్రతీకనూ పరిశీలకులు గమనించారు.

మతాలకు సంబంధించిన తంతుల కారణంగా తొలి సమాజాల్లోని కొందరు వ్యక్తులకు కూడా ప్రత్యేకత కలగసాగింది. వారే షామాన్లు అనబడే తొలి మతాధికారులు. నిత్యజీవితానికి కొన్ని తంతులు అవసరమని భావిస్తున్నకొద్దీ వీరి ప్రాముఖ్యత పెరిగింది. గణాచార్లూ,

పూజారులూ, షామాన్లూ ఈ తంతులను నిర్వహించేందుకు ఏర్పాటయారు. వీరిని యువకుల నుంచే ఎంపిక చేసేవారు. తక్కిన వారితో పోలిస్తే ప్రత్యేక మనస్తత్వాన్నీ, వైఖరినీ కనబరుస్తూ, ప్రకృతి విశేషాల్లోని ప్రత్యేక, ప్రతీకాత్మక లక్షణాలకు స్పందిస్తూ ఇతరులకన్నా భిన్నంగా ప్రవర్తించేవారిని యువదశలోనే తెగల్లోని పెద్దలు గుర్తించి, సుదీర్ఘమైన శిక్షణనిచ్చేవారు. రోగనివారణకూ, అతీతశక్తుల ఆవాహనకూ అవసరమైన పవిత్ర తంతులన్నీ వారికి నేర్పేవారు. అయితే ఇటువంటి వారికేకాక అప్పటి సమాజంలోని ప్రతివ్యక్తికీ పుడమి తల్లిద్వారా లభించే రక్తమూ, ఆకాశంలోని దైవికశక్తులనుంచి లభించే మానసికవైఖరీ ఉంటాయనే నమ్మకం ఆఫ్రికాలోని ఘానావంటి ప్రాంతాల తెగల్లో ఇప్పటికీ కనిపిస్తుందట.



ఆఫ్రికా దక్షిణాగ్రపు పశ్చిమాన కనబడిన మనుషుల చిత్రాలు

పరలోకాలకు సంబంధించిన శక్తులూ, ప్రేతాత్మలూ మనుషులకు మంచినీ, చెడునూకూడా చెయ్యగలవనే నమ్మకం తెగల్లో ఉండేది. షామాన్లు భౌతికప్రపంచానికీ, అలౌకికప్రపంచానికీ వారధివంటి వారు. ఖచ్చితంగా తెలియదుగాని బహుశా షామాన్ అనేది సైబీరియా, మంగోల్, టర్కీ భాషలనుంచి వచ్చిన పదం. తగిన సందర్భం వచ్చినప్పుడు షామాన్లకు పూనకం వచ్చేది. అప్పుడు వారికి కంటికి కనబడని అతీతశక్తులతో సంపర్కం ఏర్పడుతూ ఉండేది. రోగాలను నయం చెయ్యడానికీ, తెగలోనివారి బాగోగులను చూడడానికీ ఈ విధంగా వారు ప్రయత్నించేవారు. మామూలు ప్రపంచాన్ని నడిపించే శక్తులను ఈ పద్ధతిలో మంచి చేసుకోవటానికి షామాన్లు రకరకాల తంతులు నిర్వహించేవారు.

బలులివ్వడం, సంప్రదాయాలను కొనసాగించడం, గాథలు వినిపించడం, జోస్యం చెప్పడం, చనిపోయినవారి ప్రేతాత్మలను ఆవాహన చెయ్యడం, రోగాలను నయంచెయ్యడం, కలలకు అర్థాలు చెప్పడం మొదలైన పనులన్నీ షామాన్లు నిర్వర్తించేవారు. వారికి ఇతర రోజువారీ బాధ్యతలేవీ ఉండేవి కావు. సైబీరియాలోనూ, దక్షిణఅమెరికా అమెజాన్ తెగల్లోనూ కొన్ని నీటిపక్షులకూ, సముద్ర పక్షులకూ, జాగ్వార్ పులులవంటి జంతువులకూ అతీతశక్తులు ఆపాదించబడేవి. షామాన్లు అప్పుడప్పుడూ వాటి రూపాలు ధరించగలరనే నమ్మకం ఉండేది. తూర్పుదేశాల తెగల్లో కొన్ని చెట్లకూ, అడవులకూ షామాన్లతో ప్రమేయం ఉండేదని నమ్మేవారు. వేటజంతువుల లేమికి వారు తోడ్పడగలరనీ, నిస్సంతు స్త్రీలకు వారు చికిత్స చెయ్యగలరనీ నమ్మకం ఉండేది.



మధ్యప్రదేశ్‌లోని భీం బేట్కా ప్రాంతపు గుహాచిత్రం

ఫ్రాన్స్, స్పెయిన్ తదితర దేశాల్లో దాదాపు 350 గుహల్లో ప్రాచీనయుగంలో మనుషులు గోడలమీద గీసిన చిత్రాలు కనిపించాయి. వీటిలో అన్నిటికన్నా పాతది 32 వేల ఏళ్లనాటిది కాగా, ఇటీవలిది 10 వేల ఏళ్ల క్రితపుది. వీటిలో గుర్రాలూ, ఎద్దులూ మొదలైన జంతువుల బొమ్మలు అద్భుతంగా, వాస్తవికత ఉట్టిపడేట్టు గీశారు. మనుషుల రూపాలు మాత్రం అతి సీదాగా, చిన్నపిల్లలు గీసినట్టుగా అనిపిస్తాయి. ఈ కుడ్యచిత్రాలకు ఆదిమజాతులు నిర్వహించిన పూజలతో ప్రమేయం ఉండేదనీ, వాటిలో మనుషులను సవివరంగా చిత్రీకరించడం నిషిద్ధం అయిఉంటుందనీ కొందరు పరిశీలకులు భావిస్తున్నారు. ఈ గుహల్లోకి ప్రవేశించడమే కష్టం. బొమ్మలు ఇరుకైన ప్రదేశాల్లో గీసినట్టుగా అనిపిస్తాయి. అక్కడ ఏదైనా చప్పుడు చేస్తే ప్రతిధ్వనులు వినబడతాయి. వీటన్నిటినీబట్టి ఇవి ప్రాథమికమైన ఆరాధనా స్థలాలయి ఉంటాయని కొందరి అభిప్రాయం. ఈ బొమ్మలన్నీ వేటమృగాలవి కనక వాటి సంఖ్య పెరగాలనే ఉద్దేశంతో అప్పటి షామాన్లు వీటిని గీసి ఉంటారనే ప్రతిపాదన ఉంది. పూనకం వంటిది వచ్చినప్పుడు తమ మనసులో మెదిలే జంతువుల రూపాలను వారు చిత్రీకరించారేమో. ఇటువంటివి ఆఫ్రికా, తూర్పు ఆసియా, ఆస్ట్రేలియా మొదలైన అనేక ప్రదేశాల్లో కనిపించాయి.

మతభావనలు రూపరహితమైనవి కనక వాటికి స్పష్టమైన సాక్ష్యాలూ, ఆధారాలూ దొరకవు. పాత అలవాట్లను వదిలించుకోని ఈనాటి కొన్ని తెగలను పరిశీలిస్తే, ఇక్కడా అక్కడా దొరికిన ప్రాచీన అవశేషాలను పరిశోధిస్తే తరవాత రూపుదిద్దుకున్న మతాలకు ప్రాథమికస్వరూపాలు ఎలా ఉండేవో మనం ఊహించుకోవచ్చు. ఆ కాలపు గణాచార్లూ, షామాన్లూ తరవాతి యుగాల్లో పూజారులుగానూ, మతాధికారులుగానూ రూపాంతరం చెంది ఆధ్యాత్మిక వ్యవహారాల్లో పెత్తనం సంపాదించుకున్నారు. మొదట్లో సమాజశ్రేయస్సుకై ఒళ్లువంచి కష్టపడకుండా ప్రత్యేకబాధ్యతలు చేపట్టిన ఈ వర్గం రానురాను శ్రమ చెయ్యకుండా ఎగగొట్టగలిగిన కులపెద్దల సమాఖ్యగా తయారయింది. క్రీ.పూ. 3000 నాటికే ఈజిప్ట్ తదితర నాగరికతలలో పూజారులు ఉన్నత వర్గంగా ఏర్పడ్డారు. అప్పటికే సమాజంలో తలెత్తిన మార్పులను ఇటువంటి పరిణామాలు ప్రతిఫలిస్తాయి.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త)

పెట్రో ధరల పెంపు

దేశవ్యాప్తంగా పెట్రో ధరలను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ రు. 3.50, డీజిల్ రు.2, కిరోసిన్ రు.3, గ్యాస్ సిలెండర్ రు. 35లు పెంచారు. జూన్ 26 అర్ధరాత్రి నుంచి ధరలు పెరిగాయి. పెట్రోల్ ధరలపై కేంద్రం ప్రభుత్వ నియంత్రణ ఎత్తివేసింది. డీజిల్‌పై కూడా త్వరలో ఎత్తివేయనుంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పెట్రో ఉత్పత్తుల ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఈ ఏడాదిలో పెట్రో ధరలు పెరగడం ఇది మూడోసారి. పెంపునకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు జూలై 5న భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. చాలా చోట్ల జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. ఎన్.డి.ఎ., లెఫ్ట్‌పాలిత రాష్ట్రాలలో బంద్ సంపూర్ణంగా జరిగింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో పాక్షికంగా జరిగింది.

కాశ్మీర్ అల్లకల్లోలం

కాశ్మీర్‌లో భద్రతా బలగాలు సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపడం వల్ల ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. శ్రీనగర్‌లో బారాముల్లా, బాటామలూ ప్రాంతాలలో కాల్పులకు వ్యతిరేకంగా పౌరులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసనకారులపై సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లు కాల్పులు జరపగా ఆరుగురికిపైగా మరణించారు. 70 మందికి పైగా గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో నిరవధిక కర్ఫ్యూ విధించారు. దీంతో కేంద్రం మళ్లీ సైన్యాన్ని దించింది. నాలుగు రోజుల అనంతరం పరిస్థితులు కొద్దిగా కుదుటపడడంతో కర్ఫ్యూను విడతల వారీగా సడలించారు.

జనశక్తి అమర్ అరెస్ట్

సి.పి.ఐ. (ఎం.ఎల్.) జనశక్తి మాజీ కార్యదర్శి కూర దేవేందర్ (అమర్)ను జూలై 12న గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. చట్ట వ్యతిరేక చర్యల నిరోధక చట్టం కింద అమర్‌పై ఫిబ్రవరి 25న గుజరాత్‌లోని సూరత్ జిల్లా కామ్రేజ్ పోలీసు స్టేషన్‌లో కుట్ర కేసు నమోదయింది. ఈ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో గుజరాత్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు హైదరాబాద్ వచ్చి అమర్‌ను మల్కాజ్‌గిరి పోలీసు స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. 2008లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమర్‌ను మహారాష్ట్రలోని పూణేలో అరెస్టు చేశారు. 2009 జూలైలో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గుజరాత్ పోలీసులు అమర్‌ను అరెస్ట్ చేసి రాత్రి 10 గంటలకు నాచారం పోలీసు స్టేషన్‌లో హాజరుపరిచారు. అక్కడి జనరల్ డైరీలో నమోదు చేసి గుజరాత్‌కు తీసుకెళ్లిపోయారు.

నక్సల్స్‌పై ఉమ్మడి పోరు

నక్సల్స్‌పై సమైక్యంగా పోరాడేందుకు ఏకీకృత కమాండ్ వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఢిల్లీలో జూలై 14న నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. కేంద్రం చేసిన ఈ ప్రతిపాదనకు పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ ముఖ్యమంత్రులు ఇలాంటి కమాండ్ తమకవసరం లేదని చెప్పారు.

ఖైర్లాంజీ దోషులకు యావజ్జీవం

మహారాష్ట్రలోని ఖైర్లాంజిలో నాలుగేళ్ల క్రితం దళితుల ఊచకోత కేసులో ఆరుగురు దోషుల ఉరిశిక్షను బాంబే హైకోర్టు యావజ్జీవ శిక్షగా మారుస్తూ తీర్పు ఇచ్చింది. దోషులకు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సెప్టెంబర్ 29, 2009న సురేఖ భైయాలాల్ భూత్‌మాంగే, ఆమె కూతురు ప్రియాంక, కుమారులు సుధీర్, రోషన్‌లను భూవివాదంలో అగ్రవర్ణాలకు చెందిన వారు అతి దారుణంగా హత్య చేశారు. 2008 సెప్టెంబర్‌లో విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు ఆరుగురు దోషులకు ఉరిశిక్ష విధించింది. కోర్టు తీర్పును సవాల్ చేస్తూ దోషులు బాంబే కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చింది.

బిజెపిలోకి జస్వంత్

పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహ్మద్ అలీ జిన్నాను పొగుడుతూ వివాదాస్పద పుస్తకాన్ని రాసినందుకు గాను ఆగస్ట్ 2009లో భారతీయ జనతా పార్టీ (బిజెపి) నుంచి బహిష్కరణకు గురైన జస్వంత్‌సింగ్ తిరిగి బిజెపిలో చేరారు. బిజెపి అధ్యక్షుడు నితిన్ గడ్కారీ, సీనియర్ నేత ఎల్.కె. అద్వానీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్‌ల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిన్నాను పొగుడుతూ తాను రాసిన పుస్తకంపై ఇప్పటికీ తాను ఏమాత్రం విచారించడం లేదన్నారు. తిరిగి పార్టీలో చేరడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు.

మరో ఏడాది రిజర్వేషన్ పొడిగింపు

తమిళనాడులో వెనుకబడ్డ వర్గాలకు ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల్లో కల్పిస్తున్న 69 శాతం రిజర్వేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించేందుకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. వారికి 50 శాతం మించి కోటా ఇచ్చుకునేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా తమిళనాడుతో సహా కర్ణాటకను కూడా ఆదేశించింది. వెనకబడ్డ తరగతులకు తమిళనాడు 69 శాతం, కర్ణాటక 73 శాతం కోటా కల్పిస్తూ చేసిన చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి ఎన్.ఎచ్. కపాడియా, న్యాయమూర్తులు కె.ఎస్. రాధాకృష్ణన్, స్వతంత్రకుమార్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. రిజర్వేషన్‌లు 50 శాతానికి మించి ఖరారు చేయడంపై మండల్ కమిషన్ కేసు తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు పొందుపరిచిన నిర్దేశకాల ఆధారంగా కమిషన్‌లు నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

సమాచారం అడిగే హక్కు ఉందా?

సమాచార హక్కు చట్టంలో సమాచారం అడిగే వారిపై, ఆ చట్టం కార్యకర్తలపై నిత్యం బెదిరింపులూ, దాడులూ జరుగుతున్నాయి. దేశంలో ప్రతి చోటా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా గుజరాత్‌లో అమిత్ జేథవ అనే కార్యకర్తను గుర్తు తెలియని వ్యక్తులు గుజరాత్ హైకోర్టు ఎదురుగా జూలై 20న రాత్రి హత్య చేశారు. అతను ఇటీవలే అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గుజరాత్ హైకోర్టులో కేసు వేశాడు. దీంతో ప్రభుత్వం అక్రమ మైనింగ్‌పై ఆంక్షలు విధించింది. అక్రమ మైనింగ్‌కి సంబంధించిన సమాచారం కోసం అమిత్ సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించాడు. కక్ష సాధింపుగా అతన్ని హైకోర్టు ముందే రాత్రిపూట హత్య చేశారు. ఈ

ఆస్ట్రేలియా కొత్త ప్రధాని

ఆస్ట్రేలియా తొలి మహిళా ప్రధానిగా జూలియా గిలార్డ్ ఎన్నికయ్యారు. ప్రధాని కెవిన్ రుడ్‌పై తిరుగుపాటు ఆయన తన ప్రధాని పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ప్రధాని పదవీలో ఉన్న జూలియా జూన్ 24న ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆరోగ్య, విద్యా రంగాల్లో, పర్యావరణ మార్పులపైన రుడ్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ అధికార లేబర్ పార్టీలో తీవ్ర అసమ్మతికి దారితీసింది. దీనికి నాయకత్వం వహించిన జూలియా పదవీ బాధ్యతలు స్వీకరిస్తూ సుదృఢమైన, బాధ్యతాయుతమైన పరిపాలన అందిస్తానని అన్నారు.

జర్నలిస్టులపై దాడులు

ప్రపంచ వ్యాప్తంగా మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతున్నాయి. తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని విలేకరులపై ఘాతుక దాడులకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో 59 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని జెనీవాకు చెందిన మీడియా హక్కుల సంస్థ వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో 53 మంది మరణించారు. పాత్రికేయులు హత్యకు గురైన దేశాల్లో మెక్సికో మొదటి స్థానంలో ఉంది. జూన్ నాటికి మెక్సికోలో 10 మంది హత్యకు గురయ్యారు. హోండురాస్ (8), పాకిస్తాన్ (6), నైజీరియా (4), ఫిలిప్పైన్స్ (4), రష్యా (3), కొలంబియా (3), ఇరాక్, నేపాల్, థాయ్‌లాండ్, వెనిజూలాలలో ఇద్దరు చొప్పున హత్య చేయబడ్డారు. అఫ్ఘనిస్తాన్, అంగోలా, బంగ్లాదేశ్, బ్రెజిల్, బల్గేరియా, కామెరూన్ తదితర దేశాలలో ఒకరి చొప్పున హత్యకు గురయ్యారు. వీరంతా వృత్తి నిర్వహణలో భాగంగా నేరాలను వెలికితీసే క్రమంలో ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. మీడియా ప్రతినిధుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు సూచించింది.

నేపాల్ ప్రధాని రాజీనామా

నేపాల్ ప్రధాని మాధవ్ కుమార్ నేపాల్ జూలై 10న తన పదవికి రాజీనామా చేశారు. దేశంలో నెలకొన్న అనిశ్చితిని తొలగించి, ఏకాభిప్రాయ సాధనకు వీలు కల్పించాలనే లక్ష్యంతో రాజీనామా చేశానని చెప్పారు. ప్రతిపక్ష మావోయిస్టు పార్టీ నుంచి తీవ్రమైన ఒవత్తిడి రావడంతో మాధవ్ రాజీనామా చేశారు. ఆయన ప్రధాని పదవిలో 13 నెలల పాటు ఉన్నారు.

పోలెండ్‌కు నూతన అధ్యక్షుడు

పోలెండ్ అధ్యక్ష ఎన్నికల్లో లిబరల్ పార్టీ విజయం సాధించింది. లిబరల్ పార్టీ నేత, పార్లమెంట్ స్పీకర్ బ్రోనిస్లావ్ కొమరోవ్‌స్కీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జూలై 4న ఎన్నికలు జరిగాయి. జూలై 5న ఫలితాలు వెలువడ్డాయి. ఆయన తన ప్రత్యర్థి, మాజీ ప్రధాని జరోస్లాకజిన్‌స్కీని ఐదు శాతానికి పైగా ఓట్ల తేడాతో ఓడించారు. కొమరోవ్‌స్కీకి 52.63 శాతం, జరోస్లాకు 47.37 శాతం ఓట్లు వచ్చాయి. దేశాధ్యక్షుడు లెక్ కజిన్‌స్కీ ఏప్రిల్‌లో రష్యాలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించడంతో ముందస్తు ఎన్నికలు జరిగాయి.

పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడులు

పాకిస్తాన్ సరిహద్దు గిరిజన ప్రాంతమైన మొహమండ్‌లోని యాకఘుంద్ గ్రామంలో జూలై 9న మానవ బాంబు పేలుళ్లు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దానికి దగ్గరగా రద్దీగా ఉండే మార్కెట్‌లో ఈ పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్ల వల్ల 65 మందికి పైగా మరణించారు. 110 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో, క్షతగాత్రుల్లో మహిళలు, పిల్లలు ఉన్నారు. పేలుళ్ల ధాటికి పక్కనే ఉన్న జైలు, కొన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంస మయ్యాయి. ఈ దాడులు చేసింది మేమే అని తెహ్రీకే తాలిబన్ పాకిస్తాన్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. రాజకీయ యంత్రాంగం, స్థానిక శాంతి కమిటీ తమకు వ్యతిరేకంగా గిరిజన సమావేశం (జిర్గా) ఏర్పాటు చేసాయని, అందుకే వారిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపినట్లు తెలిపింది.

హమాస్ నేతతో భేటీ

టర్కీ విదేశాంగ మంత్రి అహ్మద్ దెవుతొగ్లు నిషేధిత హమాస్ సంస్థ నేత ఖలీద్ మెషాల్‌తో జూలై 18న భేటి అయ్యారు. సిరియా పర్యటన సందర్భంగా ఖలీద్‌ను కలిసినట్టుగా టర్కీ అధికార ప్రతినిధి తెలిపారు. ఒకప్పటి ఇజ్రాయిల్ ఏకైక ముస్లీం మిత్రదేశం టర్కీని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఖలీద్ మెషాల్‌ను 2006లో అధికారికంగా ఆహ్వానించడాన్ని ఖండించింది. ఈ భేటి వల్ల హమాస్ చర్యలలో ఎలాంటి తేడా రాదని ఇజ్రాయిల్ ప్రతినిధి యిగాల్ పాల్మోర్ అన్నారు. హమాస్ భూభాగంలోని గాజా పై ఇజ్రాయిల్ సైనిక దాడుల నేపథ్యంలో గత రెండేళ్లుగా టర్కీ, ఇజ్రాయిల్ మధ్య అంతర్గత సంబంధాలు దెబ్బతిన్నాయి. గత మేలలో టర్కీ నౌకపై ఇజ్రాయిల్ కమాండోల దాడిలో ఎనిమిది మంది టర్కీ పౌరులు మరణించారు.

కిర్గిజిస్తాన్‌లో కొత్త రాజ్యాంగం

కిర్గిజిస్తాన్ పార్లమెంట్ ప్రజాస్వామ్యాన్ని కాంక్షిస్తూ జూన్ 27న కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించింది. మైనారిటీ ఉజ్బెక్‌లు, మెజారిటీ కిర్గిజ్‌ల మధ్య రాజ్యాంగ మార్పు కోసం జరిగిన అల్లర్లలో వందలాది మంది చనిపోయారు. రాజ్యాంగ మార్పుకు జరిగిన రెఫరెండం (ప్రజాభిప్రాయ) ఓటింగ్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. వీ

వీక్షణం పత్రికను ప్రతి నెల 29-30 తేదీల్లో పోస్టు చేస్తాం. పత్రిక 7వ తేదీలోగా అందకపోతే మాకు తెలియపర్చండి. చందా రెన్యువల్ చేసుకున్న వారికే పత్రికను పంపించడం జరుగుతుంది.

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 జూన్ 2010 నుండి 20 జూలై 2010 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1499)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**	**(20)**	**(21)**	**(22)**
ఆదిలాబాద్	–	4	–	23	26	12	13	14	2	3	5	6	3	3	21	–	1	1	–	3	12
హైదరాబాద్	–	–	–	12	16	–	–	–	1	6	9	9	–	–	53	21	–	–	–	11	–
కరీంనగర్	1	–	1	25	39	15	18	3	4	3	3	5	1	12	17	24	–	–	–	4	–
ఖమ్మం	–	–	–	6	4	8	6	5	1	3	3	2	–	8	20	9	2	1	–	–	3
మెదక్	–	7	–	5	4	8	–	6	–	5	3	2	1	4	29	29	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	9	10	2	2	4	1	4	1	2	4	–	13	10	–	–	–	–	4
రంగారెడ్డి		వివరాలు అందలేదు																			
వరంగల్	–	–	1	–	2	–	1	–	–	1	1	–	–	–	18	2	–	–	–	–	1
అనంతపురం	–	4	2	14	12	–	11	–	–	7	1	7	5	–	23	6	–	–	–	–	–
చిత్తూరు	–	1	–	12	17	21	12	–	–	–	6	5	–	–	26	12	–	–	–	–	–
కడప		వివరాలు అందలేదు																			
కర్నూలు	–	2	–	12	17	6	6	5	–	7	1	16	4	7	18	24	–	–	–	–	–
తూర్పు గోదావరి		వివరాలు అందలేదు																			
గుంటూరు	–	–	–	14	10	1	2	3	1	2	7	8	3	8	28	12	–	–	–	3	4
కృష్ణా	1	–	–	8	10	2	3	5	1	3	3	6	3	3	18	6	–	–	–	–	2
నెల్లూరు	–	–	–	4	9	1	5	–	3	7	4	3	4	8	32	10	–	–	–	–	–
పశ్చిమ గోదావరి		వివరాలు అందలేదు																			
శ్రీకాకుళం	–	–	–	4	4	3	6	5	–	–	3	6	–	2	20	2	–	2	–	–	–
విశాఖపట్నం	–	–	–	3	6	–	1	–	–	2	–	1	2	2	15	9	–	–	–	–	2
విజయనగరం	–	–	–	4	6	3	–	2	2	3	3	2	2	2	23	9	–	–	–	–	1
మొత్తం	**2**	**18**	**4**	**155**	**192**	**82**	**86**	**52**	**16**	**56**	**53**	**80**	**32**	**55**	**374**	**185**	**3**	**4**	**–**	**21**	**29**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – సుమలత; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; నెల్లూరు – కె. సుబ్బనాచారి; పశ్చిమ గోదావరి – టి. హేమలత; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. అరుణ; విజయనగరం – డి. సుధాకర్

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 109 - August 2010
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 29/07/2010 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

వీక్షణం విస్తరించడానికి సహకరించండి!
మీ మిత్రులందరికీ పరిచయం చేయండి!!
మీ వంతుగా చందాలు చేర్పించండి!!

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికకు ఎనిమిది సంవత్సరాలుగా మీరు అందిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు. మీ నిత్యజీవితంలో, కుటుంబ సభ్యులతో, పని స్థలంలో, స్నేహితులతో, భిన్నాభిప్రాయాలున్న వారితో మాట్లాడుతున్న ప్రతి సంధర్భంలోనూ వీక్షణంలోని వ్యాసాలు, అభిప్రాయాలు మీకు ఉపయోగపడతూనే ఉన్నాయి. ఈ పత్రిక నిలదొక్కుకుని పది కాలాలపాటు నిలబడాలని మీరు కోరుకుంటున్నారని మాకు తెలుసు. తెలుగు సమాజానికి అవసరమయిన విభిన్న ఆలోచనలను అందించే పత్రికగా వీక్షణం ఇంకా విస్తరించాలని కూడా మీరు కోరుకుంటూ ఉంటారు. కాని, వీక్షణం ఆర్థిక పరిస్థితి సుస్థిరంగా లేదు. వీక్షణంను నిలబెట్టడానికి మీరు తక్షణమే పూనుకుని చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి.

- ❖ మీ బంధుమిత్రుల దగ్గర, మీ పనిస్థలంలో, మీరు మాట్లాడే ప్రతిచోటా, సామాజిక రాజకీయ విషయాల చర్చ వచ్చిన ప్రతిచోట ఆ విషయాల మీద వీక్షణం అవగాహన కలిగిస్తుందని ప్రస్తావించండి. వీక్షణం చదవడం ఎంత అవసరమో చెప్పండి.
- ❖ మీ చందా చెల్లించడంతోపాటు, మీ మిత్రుల కొరకు కానుకగా చందా చెల్లించండి. వారిని చందా చెల్లించమని కోరండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న గ్రంథాలయానికి వీక్షణం వస్తుందో లేదో కనుక్కుని తెప్పించడానికి ప్రయత్నాలు చేయండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న విద్యాలయాలలో, కళాశాలలో, ముఖ్యమైన ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలలో, స్వచ్ఛంద సంస్థల, యువజన సంస్థల కార్యాలయాలలో వీక్షణం వస్తుందో లేదో కనుక్కుని వారిచేత చందాలు కట్టించండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న వీక్షణం శ్రేయోభిలాషులు, విద్యా సంస్థల నిర్వాహకులు, వ్యాపారవేత్తల దగ్గర వీక్షణంకు ప్రకటనలు సేకరించండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న పత్రికల ఏజెంటు వీక్షణం తెప్పిస్తున్నారో లేదో కనుక్కుని తెప్పించేలా చూడండి.

చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
మూడు సంవత్సరాల చందా	రు.	350
ఐదు సంవత్సరాల చందా	రు.	550
పది సంవత్సరాల చందా	రు.	1000

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao